
'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 15 | సంచిక: 197

SUNDAY Special

ఆదివారం 2-4-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | BANGALORE | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



లక్నో విజయం

ఢిల్లీ క్యాపిటల్స్‌పై 50 పరుగుల తేడాతో గెలుపు. కైల్ మేయర్స్ మెరుపు అర్ధ సెంచరీ.. ఐదు వికెట్లతో చెలరేగిన మార్క్ వుడ్. మరో మ్యాచ్‌లో కోల్‌కతాపై ఏడు పరుగులతో నెగ్గిన పంజాబ్ కింగ్స్.


- వివరాలు 12లో



ఏప్రిల్- జూన్‌లో హీట్‌వేవ్

వాయవ్య ప్రాంతం మినహా దాదాపు దేశమంతటా ఈ ఏప్రిల్ నుంచి జూన్ నెల వరకు సాధారణం కంటే కాస్త ఎక్కువగానే ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది.

- వివరాలు 6లో



నా పరువు మంటగలిపేందుకు..

తన ప్రతిష్టను నాశనం చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌ను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

వివరాలు 6లో ▸



'హస్తినకొస్తే అంతం చేస్తాం'

ఢిల్లీలో కనిపిస్తే చంపేస్తామని ఓ గ్యాంగ్‌స్టర్ బృందం తనను బెదిరించిందని ఎంపీ సంజయ్ రౌత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వివరాలు 6లో ▸



విమానంలో అసభ్య ప్రవర్తన

బ్యాంకాక్ నుంచి ముంబై వస్తున్న ఇండిగో విమానంలో సిబ్బందితో అసభ్యంగా ప్రవర్తించిన స్వీడన్ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు.

వివరాలు 6లో ▸



అమెరికాలో టోర్నడో బీభత్సం

అమెరికాలోని వివిధ ప్రాంతాల్లో టోర్నడో విధ్వంసం సృష్టించింది. దీని ధాటికి 18 మందికి పైగా మరణించారు.

వివరాలు 6లో ▸

మారుమూలైనా నిశ్చింత

ప్రసవానంతరం తల్లీబిడ్డను క్షేమంగా ఇంటికి చేరుస్తున్న ప్రభుత్వం

- 'వైఎస్సార్ తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్' సమర్థవంతంగా అమలు
- టీడీపీ ప్రభుత్వ హయాంలో అరకొర సేవలతో ఇక్కట్లు
- గత ఏడాది ఏప్రిల్ నుంచి 500 వాహనాలతో సేవల విస్తరణ
- ఏడాదిలో 2.30 లక్షల మంది బాలింతలకు సేవలు.. ఉచిత వైద్యంతోపాటు రవాణా ఖర్చులు ఆదా
- వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద రూ.5 వేల సాయం..
- సేవలందిన తీరుపై ఫోన్ ద్వారా ఫీడ్ బ్యాక్
- 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్



విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి కృష్ణా జిల్లా మాదలవారిగూడెంలోని ఇంటికి వెళ్లేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం ఎక్కుతున్న బాలింత తేజస్విని

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న సీఎం వైఎస్ జగన్.. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కునారిల్లిన 108, 104 సేవలకు ఊపిరిలూదినట్టుగానే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను మరింతగా మెరుగు పరిచారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 500 కొత్త వాహనాలతో 'డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్' సేవలను విస్తరించడమే కాక, సమర్థవంతంగా అమలు చేయిస్తున్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యానికి మరింత భరోసా కల్పిస్తూ వారికి రక్షగా నిలిచారు.

సాక్షి, అమరావతి: పశ్చిమగోదావరి జిల్లా బొబ్బరపాలెంకు చెందిన మాండ్రుమాక రాణి అనే గర్భిణి మార్చి 26వ తేదీన విజయవాడ జీజీహెచ్‌లో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. కొద్ది రోజుల విశ్రాంతి అనంతరం బుధవారం ఆస్పత్రి నుంచి వైద్యులు ఆమెను డిశ్చార్జి చేశారు. సిజేరియన్ ప్రసవం కావడంతో 150 కిలోమీటర్ల దూరంలోని ఊరికి బస్సు, రైలులో పసికందుతో పాటు ఆమెను తీసుకెళ్లడం కష్టం. ప్రత్యేకంగా ఆటో లేదా ట్యాక్సీ కిరాయికి తీసుకుని వెళితే రూ.నాలుగైదు వేలు ఖర్చు అవుతుంది. కూలి పని చేసుకుని జీవనం సాగించే ఈమె కుటుంబం అంత మొత్తం వెచ్చించలేదు. ఈ క్రమంలో ఆందోళన చెందుతున్న కుటుంబ సభ్యులకు ఆస్పత్రి సిబ్బంది ధైర్యం చెప్పారు. ప్రభుత్వం వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో ఉచితంగా బాలింతను, బిడ్డను ఇంటికి చేరుస్తుందని తెలిపారు. సిబ్బంది చెప్పినట్టుగానే బుధవారం సాయంత్రం 5.33 గంటలకు రాణి, ఆమె సహాయకులను విజయవాడ జీజీహెచ్‌లో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో ఎక్కించుకుని రాత్రి 9.20 గంటలకు సొంత ఊరిలో వదిలి పెట్టారు. ఈ సందర్భంగా

మిగతా 2వ పేజీలో ▶

రేపటి నుంచి ఒంటి పూట బడులు



- విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు
- ప్రైవేట్ స్కూళ్లు కూడా అమలు చేయాల్సిందే
- మధ్యాహ్న భోజనం తర్వాత పిల్లలు నేరుగా ఇళ్లకు
- టెన్త్ పరీక్ష కేంద్రాలున్న స్కూళ్లకు పూర్తిగా సెలవులు
- ఈ నెల 3 నుంచి 18 వరకు టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి
- 3,349 కేంద్రాల్లో 6,64,152 మంది విద్యార్థులకు పరీక్షలు
- అంధ విద్యార్థులకు డిజిటల్ విధానంలో పరీక్ష

పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు: 6,09,070 మంది

బాలురు:	బాలికలు:
3,11,329 మంది	2,97,741 మంది

పది సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్నవారు: 53,410 మంది

ఓపెన్ స్కూల్ నుంచి హాజరయ్యేవారు:	ఓఎస్ఎస్‌సీ సప్లిమెంటరీ
1,525 మంది	విద్యార్థులు: 147

మొత్తం పరీక్షా కేంద్రాలు : 3,349

ప్రతి గదికి విద్యార్థులు : 24

పరీక్షలు పకడ్బందీగా నిర్వహణకు స్క్వాడ్‌లు: 838

ఇందులో సిట్టింగ్ స్క్వాడ్లు : 682

ఫ్లయింగ్ స్క్వాడ్లు: 156

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 3వ తేదీ నుంచి ఒంటి పూట బడులు నిర్వహిస్తున్నామని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు అన్ని జిల్లాలకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలు కూడా ఒంటి పూట బడులు నిర్వహించాలని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. ఒంటి పూట బడులు ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించాలని, మధ్యాహ్న భోజనం తర్వాత పిల్లలు నేరుగా ఇళ్లకు వెళ్లాలని తెలిపారు. పదవ తరగతి పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసిన స్కూళ్లకు పూర్తిగా సెలవులు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో ఈ నెల 3వ తేదీ నుంచి 18 వరకు ప్రశాంత వాతావరణంలో పదవ తరగతి పరీక్షలు నిర్వహించేందుకు

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

లోకేశ్ డైరెక్షన్.. 'పల్లె' ఓవరాక్షన్



పుట్టపర్తిలో టీడీపీ నేత, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తన అనుచరులతో కలిసి అలజడి సృష్టించారు. అల్లరి మూకతో కలిసి పుట్టపర్తిలో హల్‌చల్ చేశారు. చర్చకు సిద్ధమన్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిపై రాళ్లతో దాడి చేశారు.

వివరాలు 3లో ▸

హంస వాహనంపై రాములోరి విహారం



వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో వెలిసిన శ్రీ కోదండ రామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. కోదండ రాముడు హంస వాహనంపై భక్తులకు అభయం ఇచ్చారు.

వివరాలు 5లో ▸

'కొంప'ముంచిన 'కార్తికేయ'



కాకినాడలోని కార్తికేయ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ తమ డబ్బులు తిరిగి ఇవ్వకుండా దాటవేస్తుండటంపై డిపాజిటర్లు లబోదిబోమంటున్నారు. తమ డబ్బులను పక్క దారి పట్టించారని అనుమానం వ్యక్తం చేస్తూ దాదాపు 100 మంది డిపాజిటర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వివరాలు 14లో ▸

రాజస్తాన్‌లో ఆరోగ్య పరీక్ష




ఎమర్జెన్సీ సమయాల్లో రోగులు ముందుగా డబ్బులు చెల్లించకపోయినా ప్రైవేటు ఆస్పత్రులు, వైద్యులు విధిగా చికిత్స చేసి తీరాలంటూ రాజస్తాన్ ప్రభుత్వం తెచ్చిన చట్టంపై ప్రైవేటు వైద్యులు చేస్తున్న ఆందోళనలు మిన్నంటాయి.

వివరాలు 6లో ▸

నీటి లెక్కలు తేల్చకుండా వాడుకోవద్దని ఎలా అంటారు?

కృష్ణా బోర్డుపై రాష్ట్ర జలవనరుల శాఖ అధికారుల అసహనం

- రాష్ట్ర కోటాలో ఇంకా 199.31 టీఎంసీలు మిగిలే ఉన్నాయి
- కోటాకంటే అదనంగా 73.56 టీఎంసీలు వాడుకున్న తెలంగాణ
- ఎడమ కాలువ కింద రాష్ట్ర కోటాలో 13 టీఎంసీలు రావాలి
- వాటిని విడుదల చేయని తెలంగాణ
- తెలంగాణపై చర్యలు తీసుకోవడంలో బోర్డు విఫలం
- కోటా నీటిని తాగు నీటి అవసరాలకు తీసుకుంటున్నట్లు స్పష్టీకరణ
- రేపు అధికారికంగా బోర్డుకు లేఖ



సాక్షి, అమరావతి: నాగార్జున సాగర్ ఎడమ కాలువ కింద ఆయకట్టుకు నీళ్లందించడానికి సాగర్ కుడి కాలువ ద్వారా నీటిని వాడుకోవద్దంటూ కృష్ణా బోర్డు ఆదేశించడంపై రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కోటా నీటిని తాగు నీటి అవసరాల కోసం వాడుకుంటున్నామని, దాన్ని ఆపేయాలని ఆదేశించడమేమిటని మండిపడుతున్నారు. సాగర్ ఎడమ కాలువలో రాష్ట్ర కోటా కింద మిగిలిన 13 టీఎంసీలను విడుదల చేసేలా తెలంగాణ అధికారులను

మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి



... ఇంకా నయం! నేను హైకమాండ్ నిర్ణయిస్తుందేమోనని అనుకున్నాన్సార్!!

త్వరలో తిరుపతి నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు



- సత్ఫలితాలను ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ఏపీఏడీసీఎల్ ప్రయత్నాలు
- కేంద్ర ప్రభుత్వంతో, విమానయాన సంస్థలతో సంప్రదింపులు
- తొలుత ఓపెన్ స్కై పాలసీ కింద కువైట్ సర్వీసులకు అవకాశం
- ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ నుంచి సానుకూల స్పందన

- వివరాలు 3లో



కొత్త జిల్లాల పేర్లతో అడ్రస్ సర్టిఫికెట్లు

- రాష్ట్రంలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో కొత్త జిల్లాల పేర్లతో అడ్రస్ సర్టిఫికెట్లు జారీ చేయడానికి ఆ శాఖ ఏర్పాట్లు చేసింది. ఆధార్ కార్డుల్లో కొత్త జిల్లాల పేర్లను చేర్చుకోవడానికి వీలుగా ఈ నిర్ణయం తీసుకుంది. సోమవారం నుంచే అడ్రస్ సర్టిఫికెట్లు జారీ చేయనున్నారు.

- వివరాలు 2లో

'తుంగభద్ర' కలుషితం

- సీడబ్ల్యూసీ–సీపీసీబీ సంయుక్త అధ్యయనంలో వెల్లడి
- కర్ణాటకలో మురుగు, పారిశ్రామిక వ్యర్థ జలాలు, ఇతర వ్యర్థాలు నదిలోకే
- లీటర్ నీటిలో బీఓడీ గరిష్టంగా 7 నుంచి కనిష్టంగా 6 మిల్లీ గ్రాములు
- జాతీయ ప్రమాణాల ప్రకారం లీటర్ నీటిలో ఉండాల్సింది రెండు మిల్లీగ్రాములే
- ఆ జలాలను శుద్ధిచేశాకే నదిలోకి వదలాలని కేంద్రానికి సీడబ్ల్యూసీ, సీపీసీబీ సూచన

2లో

సీలేరు పంప్డ్ ప్రాజెక్ట్‌కు జనామోదం

ప్రజాభిప్రాయ సేకరణలో స్వాగతించిన స్థానికులు



మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసరావు, సబ్ కలెక్టర్ అభిషేక్

సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): రాష్ట్ర ప్రభుత్వం సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లో పంప్డ్ స్టోరేజీ ద్వారా నిర్మించనున్న కొత్త ప్రాజెక్ట్‌కు ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, ప్రజలు తమ అంగీకారం తెలిపారు. స్థానిక విద్యుత్ కాంప్లెక్స్‌లో కొత్త ప్రాజెక్ట్ నిర్మాణంపై ప్రభుత్వం, జెన్‌కో సంయుక్త ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారి సుదర్శన్ అధ్యక్షతన శనివారం ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. అధికారులు ప్రాజెక్ట్ విధివిధానాలను ప్రజలకు వివరించారు. సీలేరుకు కొత్త ప్రాజెక్టు రావడం ఆనందంగా ఉందని, దీని ద్వారా అభివృద్ధి చెందడమే కాకుండా తమకు మేలు కలుగుతుందని ప్రజలు ఆమోదం తెలిపారు. సుమారు 21 గ్రామాల ప్రజలు, పది శాఖల అధికారులు పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరావు, సబ్ కలెక్టర్ అభిషేక్ మాట్లాడుతూ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల ఇబ్బందులేమీ ఉండబోవని చెప్పారు. ప్రజలకు అన్ని సదుపాయాలు కల్పించేలా ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు. అదనపు ఎస్పీ ప్రశాంత్ శివకిశోర్ నేతృత్వంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. కాగా, సీలేరులో నూతనంగా నిర్మించనున్న పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్‌కు 15 రోజుల్లో కేంద్ర ప్రభుత్వం, అటవీశాఖ నుంచి అనుమతులు లభించనున్నాయని జెన్‌కో హైడల్ డైరెక్టర్ ఎంవీవీ సత్యనారాయణ విలేకరుల సమావేశంలో చెప్పారు. జెన్‌కో హెచ్‌పీసీ చీఫ్ ఇంజనీర్లు సుజయ్‌కుమార్, శేషారెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

6న రాష్ట్రవ్యాప్తంగా 'ఫ్యామిలీ డాక్టర్' ప్రారంభం

మంత్రి విడదల రజిని వెల్లడి



చిలకలూరిపేట: ఇప్పటి వరకు ట్రయల్ రన్‌లో ఉన్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఈ నెల 6 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా ప్రారంభించనున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో సీఎం వైఎస్ జగన్ పర్యటనపై శనివారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం దేశానికే దిక్సూచిగా మారనుందన్నారు. ట్రయల్ రన్‌లో వేలాది మంది ఈ విధానం ద్వారా నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా పొందారని వెల్లడించారు. ప్రతి 2,000 జనాభాకు ఒక విలేజ్ క్లినిక్ కేంద్రంగా ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం అమలవుతుందని వివరించారు. ప్రతి మండలానికి రెండు పీహెచ్‌సీలు, ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉండేలా బృహత్తర వైద్య వ్యవస్థను గ్రామ స్థాయిలో తీసుకువచ్చామని వెల్లడించారు. ఈ ఇద్దరు వైద్యుల్లో ఒకరు పీహెచ్‌సీలోనే ఉంటూ వైద్య సేవలు అందిస్తారని, మరొకరు 104 వాహనం ద్వారా ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఓపీ సేవలతో పాటు గర్భిణులు, నవజాత శిశువులు, బాలింతలు, రక్తహీనతతో పాటు వివిధ సమస్యలున్న రోగులకు అవసరమైన వైద్య పరీక్షలను ఉచితంగా చేస్తారన్నారు. నెలలో రెండు సార్లు వైద్యులు ఒక్కో గ్రామాన్ని సందర్శించి ఈ వైద్య సేవలను అందిస్తారని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను పరీక్షించి వారికి అవసరమైన వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. మంచం మీద నుంచి లేవలేని స్థితిలో ఉన్న రోగులకు సంబంధించి వారి ఇళ్ల వద్దకే వెళ్లి డాక్టర్లు ఉచితంగా వైద్యం, మందులు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి, వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, ఏపీఎంఎస్ ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ సీఈవో హరీంధరప్రసాద్, జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.


విశాఖ పోర్టుకు యూకే షిప్ హెచ్‌ఎంఎస్ తమర్



హెచ్‌ఎంఎస్ తమర్ నౌక

దొండపర్తి(విశాఖ దక్షిణ): యూకే రాయల్ నేవీకి చెందిన ఆఫ్‌షోర్ పెట్రోలింగ్ నౌక హెచ్‌ఎంఎస్ తమర్ విశాఖ పోర్టుకు శనివారం చేరుకుంది. ఈ నౌకకు చెందిన 17 మంది సిబ్బంది విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కొత్త కొప్పెర్లలోని విభిన్న ప్రతిభావంతుల ఎన్జీఓ క్యాంపస్‌ను సందర్శించారు. అక్కడ దివ్యాంగ పిల్లలు, యువతతో ముచ్చటించారు. వారితో క్రికెట్, బాస్కెట్‌బాల్ వంటి క్రీడలు ఆడారు. మొక్కలు నాటి వసతి గృహాలకు రంగులు వేశారు. ఇండో–పసిఫిక్‌లో పూర్తి స్థాయి పెట్రోలింగ్ విధులు నిర్వర్తించే రాయల్ నేవీ నౌకల్లో హెచ్‌ఎంఎస్ తమర్ ఒకటి. ఇరు దేశాల నావికాదళ సంబంధాలు మరింత బలోపేతమయ్యేందుకు ఈ పర్యటన దోహదపడుతుందని నావికాదళ వర్గాలు పేర్కొంటున్నాయి. హెచ్‌ఎంఎస్ తమర్ విశాఖ పర్యటన భారత్‌లో రక్షణ, భద్రతా సంబంధానికి తమ దేశం ఇస్తున్న ప్రాముఖ్యతకు నిదర్శనమని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ పేర్కొన్నారు.

దివ్యదర్శనం టోకెన్ల జారీ పునఃప్రారంభం



దివ్యదర్శన టికెట్లు మంజూరుచేస్తున్న సిబ్బంది

తిరుమల: తిరుమల నడకమార్గాల్లో దివ్య దర్శనం టోకెన్ల జారీని టీటీడీ శనివారం ఉదయం నుంచి పునః ప్రారంభించింది. కోవిడ్ నేపథ్యంలో మూడు సంవత్సరాలుగా టీటీడీ దివ్యదర్శనం టోకెన్ల జారీని నిలిపివేసింది. అయితే భక్తుల కోరిక మేరకు అలిపిరి నడక మార్గంలో గాలిగోపురం వద్ద 10 వేలు, శ్రీవారి మెట్టు మార్గంలో ఐదు వేల దివ్యదర్శనం టోకెన్లను శనివారం నుంచి కేటాయిస్తున్నారు. భక్తులు నేరుగా తమ ఆధార్ కార్డుతో హాజరైతేనే టోకెన్లు జారీ చేస్తారు. టీటీడీ కొద్దిరోజులపాటు ప్రయోగాత్మకంగా దివ్యదర్శనం టోకెన్ల జారీని పరిశీలించనుంది.

3 నుంచి తిరుమల శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు

శ్రీవారి ఆలయంలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు సాలకట్ల వసంతోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ పౌర్ణమికి ముగిసేటట్లుగా ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. 3న శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ మలయప్పస్వామివారు నాలుగు మాడవీధుల్లో ఊరేగుతారు. వసంతోత్సవ అభిషేక నివేదనలు పూర్తయిన అనంతరం తిరిగి ఆలయానికి చేరుకుంటారు. 4న స్వామివారు బంగారు రథంపై భక్తులకు దర్శనమిస్తారు. 5న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారితో పాటు శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులు, శ్రీ రుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులు వసంతోత్సవ వేడుకల్లో పాల్గొని తిరిగి సాయంత్రం ఆలయానికి చేరుకుంటారు. వసంతోత్సవాన్ని పురస్కరించుకొని 4న అష్టదళ పాదపద్మారాధన, 3 నుంచి 5వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

'తుంగభద్ర' కలుషితం

సీడబ్ల్యూసీ–సీపీసీబీ సంయుక్త అధ్యయనంలో వెల్లడి



సాక్షి, అమరావతి : తుంగే పానే.. గంగే స్నానే అన్నది ఆర్యోక్తి. గంగా నదిలో స్నానంచేస్తే ఎంత పుణ్యం వస్తుందో తుంగభద్ర నీటిని తాగితే అంతే పుణ్యం వస్తుందన్నది దీని అర్థం. కానీ.. ఇప్పుడు తుంగభద్ర నదీ జలాలను శుద్ధిచేయకుండా నేరుగా తాగితే పుణ్యం మాట ఏమోగానీ వ్యాధుల బారినపడే ప్రమాదం అధికంగా ఉందని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ), కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) నివేదిక తేల్చిచెబుతోంది. కర్ణాటక పరిధిలో తుంగభద్ర నదీ పరివాహక ప్రాంతంలో నగరాలు, పట్టణాలు, గ్రామాల్లోని మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థ జలాలు, వ్యర్థాలను యథేచ్ఛగా నదిలోకి వదిలేయడంవల్ల నదీ జలాలు కలుషితమయ్యాయి. జాతీయ ప్రమాణాల ప్రకారం లీటర్ నీటికి బీఓడీ (బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్) రెండు మిల్లీగ్రాములలోపు ఉండాలి. కానీ.. కర్ణాటక పరిధిలోని తుంగభద్ర జలాల్లో లీటర్ నీటికి గరిష్టంగా 7 మిల్లీగ్రాముల నుంచి కనిష్టంగా 6.2 మిల్లీగ్రాములు ఉండటాన్ని బట్టి చూస్తే కాలుష్యం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. రాష్ట్ర పరిధిలో మంత్రాలయం, బావపురం మధ్య తుంగభద్ర జలాల్లో లీటర్ నీటికి బీఓడీ గరిష్టంగా 6.2 మిల్లీ గ్రాముల నుంచి కనిష్టంగా 3 మిల్లీ గ్రాములు ఉండటం గమనార్హం.

నాడు స్వచ్ఛతకు.. నేడు కాలుష్యానికి..

కర్ణాటక పరిధిలోని పశ్చిమ కనుమల్లో కుద్రేముఖ్ పర్వత శ్రేణుల్లో సముద్ర మట్టానికి 1,196 మీటర్ల ఎత్తులో తుంగ ఒకవైపు.. భద్ర మరోవైపు జన్మించి.. 147 కి.మీ. దూరం తుంగ నది, 171 కి.మీ. దూరం భద్ర నది పయనించాక కూడలి వద్ద రెండు నదులూ సంగమించి.. ఒకటిగా 547 కి.మీ. దూరం ప్రవహించి తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా ఆలంపూర్‌కు సమీపంలో గొందిమల్ల వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది. నిజానికి... కృష్ణాకు ప్రధాన ఉపనది అయిన తుంగభద్ర ఒకప్పుడు స్వచ్ఛతకు పెట్టింది పేరు. కర్ణాటక పరిధిలోని తుంగభద్ర పరివాహక ప్రాంతంలో నది పరిసర ప్రాంతాల్లోని నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థ జలాలు, ఇతర వ్యర్థాలను యథేచ్ఛగా వదిలేయడంవల్ల కాలుష్య కాసారంగా మారింది. గతేడాది నవంబర్‌లో తుంగభద్ర జలాల స్వచ్ఛతపై సీడబ్ల్యూసీ, సీపీసీబీ సంయుక్తంగా అధ్యయనం చేసి నవంబర్‌లో కేంద్ర జల్‌శక్తి శాఖకు నివేదిక ఇచ్చాయి.

ప్రమాదకర స్థాయిలో కాలుష్యం..

- కర్ణాటకలో శివమొగ్గ వద్ద తుంగ నదీ జలాల్లో లీటర్ నీటికి 6 మిల్లీగ్రాముల బీఓడీ ఉన్నట్లు సీడబ్ల్యూసీ–సీపీసీబీ తేల్చాయి.
- కర్ణాటక పరిధిలోని భద్రావతి నుంచి హోలెహొన్నూరు వరకూ భద్ర నదీ జలాల్లో లీటర్ నీటికి 7 మిల్లీగ్రాముల బీఓడీ ఉన్నట్లు అవి గుర్తించాయి.
- తుంగ, భద్ర కలిసి తుంగభద్రగా రూపాంతరం చెందే ప్రాంతం కూడలి నుంచి మైలార, ఉల్లనూరు నుంచి హొకినేహళ్లి వరకూ నదీ జలాల్లో లీటర్ నీటికి బీఓడీ 6.2 మిల్లీగ్రాములు ఉంది.
- కర్ణాటకలో వ్యర్థాలతో కలుషితమైన ఈ జలాలు రాష్ట్రంలోకి ప్రవేశించాక మంత్రాలయం నుంచి బావపురం మధ్య ప్రాంతంలోనూ లీటర్ నీటికి బీఓడీ గరిష్టంగా 6.2 మిల్లీగ్రాముల నుంచి కనిష్టంగా 3 మిల్లీగ్రాములు ఉంది.
- తుంగభద్ర నదిలో కాలుష్య ప్రభావం అధికంగా ఉన్న శివమొగ్గ, భద్రావతి–హోలెహొన్నూరు, కూడలి–మైలార, ఉల్లనూరు–హొకినేహళ్లి ప్రాంతాల్లో మురుగు, పారిశ్రామిక వ్యర్థ జలాలను శుద్ధిచేశాకే నదిలోకి వదలాలని కేంద్రానికి సీడబ్ల్యూసీ–సీపీసీబీ నివేదిక ఇచ్చింది.

మారుమూలాలైనా నిశ్చింత

▶ మొదటి పేజీ తరువాయి

రాణి మాట్లాడుతూ.. '108 అంబులెన్స్‌లో ఉచితంగా ఆస్పత్రికి తీసుకుని వచ్చారు. ఏ ఇబ్బంది లేకుండా మంచి వైద్య సేవలు అందించి ఆస్పత్రిలో కాన్పు చేశారు. డిశ్చార్జి అయిన నన్ను, నా బిడ్డను క్షేమంగా ఇంటి వద్దకు చేర్చారు. ప్రభుత్వం మాలాంటి వారి ఆరోగ్యం పట్ల ఇంత శ్రద్ధ తీసుకోవడం చూస్తుంటే ఎంతో ఆశ్చర్యంగా ఉంది. ఇంత సాయం అందుతుందని నేను ఊహించలేదు. నిరుపేదలమైన మాపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది' అని సంతోషం వ్యక్తం చేసింది. రాణి తరహాలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించిన మహిళలకు రాష్ట్రంలో వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు అండగా నిలుస్తున్నాయని 'సాక్షి' గ్రౌండ్ రిపోర్టులో స్పష్టమైంది.

రోజుకు సగటున 631 మందికి సాయం

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బోధనాస్పత్రుల్లో 183, జిల్లా ఆస్పత్రుల్లో 107, ఏరియా ఆస్పత్రుల్లో 98, సీహెచ్‌సీల్లో 67, పీహెచ్‌సీల్లో 45 తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ఈ వాహనాలు ఆయా ఆస్పత్రుల్లో ప్రసవించిన బాలింతల్లో రోజుకు సగటున 631 మంది చొప్పున ఏడాదిగా క్షేమంగా ఇంటికి చేర్చాయి. ఈ లెక్కన ఏడాదిలో 2,30,505 మంది బాలింతలు సేవలు పొందారు. అత్యధికంగా కర్నూలు జిల్లాలో 22,315 మంది లబ్ధి పొందారు. కాకినాడలో 15,881, విశాఖపట్నంలో 13,320, అనంతపురంలో 11,646 మంది బాలింతలు ఉన్నారు.

రూపాయి ఖర్చు లేకుండా ఇంటికి..

గత ఏడాది ఏప్రిల్‌కు ముందు కేవలం 279 వాహనాలు మాత్రమే అందుబాటులో ఉండేవి. దీంతో డిశ్చార్జిలకు అనుగుణంగా వాహనాలు అందుబాటులో ఉండేవి కాదు. బాలింతలు సొంత డబ్బులతో బస్సు, ఆటోలు, ట్యాక్సీల్లో ఇళ్లకు వెళ్లేవారు. ఈ అంశాన్ని గమనించిన ప్రభుత్వం పేదలపై రవాణా ఖర్చుల భారం పడకుండా చర్యలు తీసుకుంది. అప్పటి వరకు ఉన్న పాత వాహనాలను పూర్తిగా తొలగించి, 500 ఎయిర్ కండీషన్డ్ బ్రాండ్ కొత్త వాహనాలతో సేవలను విస్తరించింది.

సురక్షిత ప్రయాణం

గతంలో ఒక్కో వాహనంలో ఇద్దరు, ముగ్గురు బాలింతలు, వారి సహాయకులను తరలించేవారు. దీంతో వాహనంలో స్థలం సరిపోక తీవ్ర అవస్థలు పడేవారు. ప్రస్తుతం ఒక్కో ట్రిప్‌లో ఒకే బాలింతను తరలిస్తున్నారు. 400, 500 కి.మీ సుదూర ప్రాంతాల్లో సొంతూళ్లు ఉన్న బాలింతలను సైతం ఉచితంగా తరలిస్తున్నారు. ఆస్పత్రి నుంచి తల్లీ బిడ్డను ఇంటికి తరలించే సమయంలో భద్రత, రక్షణ విషయంలో ప్రభుత్వం అత్యంత శ్రద్ధ కనబరుస్తోంది. ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ ఉంటుంది. ఒక ప్రత్యేక యాప్ సైతం తయారు చేశారు. ఈ యాప్‌లో డ్రైవర్ లాగిన్ అయ్యి, ఆస్పత్రి వద్ద బాలింతను ఎక్కించుకునే సమయంలో, సొంత ఊరిలో దించిన తర్వాత ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. సంబంధిత డ్రైవర్ డబ్బులు డిమాండ్ చేశాడా? గమ్య స్థానంలోనే వదిలాడా? లేదా? ప్రవర్తన లోపాలపై ఇళ్లకు చేరిన బాలింతలకు ఫోన్ చేసి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను సమర్థవంతంగా అమలు చేయడం కోసం క్షేత్ర స్థాయిలో తలెత్తే సమస్యలు, ఇబ్బందులపై వైద్య శాఖ టోల్ ఫ్రీ నంబర్ 104 ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తోంది.



విజయవాడ జీజీహెచ్‌లో డెలివరీ అయిన తర్వాత తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పశ్చిమగోదావరి జిల్లా బొబ్బరపాలెంలోని తన ఇంటికి వెళ్లేందుకు వచ్చిన మాండ్రుపాక రాణి

తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవల్లో మార్పులు

నాడు (2022 ఏప్రిల్‌కు ముందు వరకు)

- 279 వాహనాలు
- ఇరుకైన మారుతీ ఓమినీ వాహనం
- ఏసీ సౌకర్యం ఉండదు
- ట్రిప్‌కు ఇద్దరు ముగ్గురు బాలింతల తరలింపు

నేడు (2022 ఏప్రిల్ తర్వాత)

- 500 వాహనాలు
- విశాలమైన మారుతీ ఈకో వాహనం
- ఏసీ సౌకర్యం ఉంటుంది
- ట్రిప్‌కు ఒక బాలింత మాత్రమే తరలింపు

గర్భిణులకు అన్ని విధాలా భరోసా

మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి పండంటి బిడ్డకు జన్మనిచ్చి, ఆస్పత్రి నుంచి ఇంటికి చేరుకునేంత వరకు అన్ని దశల్లో ప్రభుత్వం అండగా నిలుస్తోంది. నెల నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించడం, పౌష్టికాహారం అందించడం వంటి చర్యలు చేపడుతోంది. నెలలు నిండిన గర్భిణులను ఇంటి నుంచి 108 వాహనంలో తీసుకెళ్లి కాన్పుకు ఆసుపత్రిలో చేరుస్తున్నారు. ఆస్పత్రిలో నాణ్యమైన వైద్య సేవలు, డబ్ల్యూహెచ్‌వో ప్రమాణాలు కలిగిన మందులు ఉచితంగా అందిస్తున్నారు. ప్రసవానంతరం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద తల్లికి విశ్రాంతి సమయానికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నారు.

క్షేమంగా తీసుకొచ్చి.. తీసుకెళ్తున్నారు

గత నెల 22న నాకు పురిటి నొప్పులు వచ్చాయి. ఇంట్లో వాళ్లు 108కు ఫోన్ చేశారు. నిమిషాల్లో అంబులెన్స్ వచ్చింది. నన్ను హుటాహుటిన విజయవాడ ఆస్పత్రికి తీసుకువచ్చి అడ్మిట్ చేశారు. అదే రోజు వైద్యులు నాకు కాన్పు చేశారు. బాబు పుట్టాడు. డిశ్చార్జి అయిన నన్ను ప్రత్యేక వాహనంలో ఇంటికి తీసుకెళ్లారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా క్షేమంగా ఆస్పత్రికి తీసుకుని రావడం.. ఉచితంగా వైద్యం అందించడం.. తిరిగి ఇంటికి తీసుకు వెళ్లడం గొప్ప విషయం.

– వి.తేజస్విని, బాలింత, మాదలవారిగూడెం, కృష్ణా జిల్లా

రూ.నాలుగు వేలు ఆదా

ఇటీవల గుంటూరు జీజీహెచ్‌లో బిడ్డకు జన్మనిచ్చాను. మా ఊరు గుంటూరు నుంచి 100 కి.మీ పైనే ఉంటుంది. డిశ్చార్జి అయ్యాక ప్రత్యేక వాహనంలో నన్ను, నా వెంట ఉన్న వారిని ఎక్కించుకుని ఇంటికి చేర్చారు. మేం ప్రత్యేక వాహనం మాట్లాడుకుని వెళ్లుంటే రూ.నాలుగు వేల వరకు ఖర్చయ్యేది. ఆ మొత్తం మాకు ఆదా అయింది.

– వి.సుజాత, బాలింత, మిరియాల, పల్నాడు జిల్లా

కొత్త జిల్లాల పేర్లతో అడ్రస్ సర్టిఫికెట్లు

- ఆధార్ కార్డుల్లో చేర్చుకోవడానికి వీలుగా నిర్ణయం
- సచివాలయాల్లో రేపటి నుంచే అందుబాటులోకి...
- గ్రామ, వార్డు సచివాలయ శాఖ వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో కొత్త జిల్లాల పేర్లతో చిరునామా సర్టిఫికెట్లు జారీ చేయడానికి ఆ శాఖ ఏర్పాట్లు చేసింది. ఆధార్ కార్డుల్లో కొత్త జిల్లాల పేర్లను చేర్చుకోవడానికి వీలుగా ఈ నిర్ణయం తీసుకుంది. ఆధార్‌కార్డు జారీ సంస్థ యూఐడీఏఐ సూచించిన ఫార్మాట్‌లో సోమవారం నుంచే అడ్రస్ సర్టిఫికెట్లు జారీ చేయనున్నారు. రాష్ట్రంలో అంతకు ముందు 13 జిల్లాలు ఉండగా.. వైఎస్ జగన్ ప్రభుత్వం ఆ సంఖ్యను 26కు పెంచింది. ఈ నేపథ్యంలో ప్రజలు తమ ఆధార్ కార్డులో కొత్త జిల్లా పేరుతో చిరునామా మార్చుకోవాలంటే.. ఆ వివరాలతో కూడిన ఏదో ఒక ధ్రువీకరణ పత్రం దాఖలు చేయాల్సి ఉంటుంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడకుండా.. కొత్త జిల్లాల పేర్లతో కూడిన అడ్రస్ సర్టిఫికెట్లను సచివాలయాల ద్వారా జారీ చేసేందుకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఏర్పాట్లు చేసింది. అడ్రస్ సర్టిఫికెట్ల జారీ బాధ్యతను సంబంధిత గ్రామ, వార్డు సచివాలయ రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఇందుకనుగుణంగా సచివాలయాల సేవలకు సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో కొత్తగా ఈ సేవను కూడా చేర్చారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా క్యూఆర్ కోడ్‌తో కూడిన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని నిర్ణయించారు. ఈ ధ్రువీకరణ పత్రాల పై సంబంధిత వ్యక్తి ఫోటో.. దానిపై గ్రామ, వార్డు రెవెన్యూ అధికారుల సంతకం, సచివాలయ స్టాంప్ ముద్ర వేసి అందజేయనున్నట్టు గ్రామ, వార్డు సచివాలయ శాఖ అధికారులు వెల్లడించారు. కాగా, ఆధార్ జారీకి ఉద్దేశించిన పోర్టల్‌లో కొత్త జిల్లాల పేర్లను చేర్చినట్టు యూఐడీఏఐ హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ పి.సంగీత మార్చి 16న సీఎస్ జవహర్‌రెడ్డికి లేఖ రాశారు. కొత్త జిల్లాల పేర్లను ఎవరికి వారు తమ ఆధార్‌లో అప్‌డేట్ చేసుకునేందుకు అడ్రస్ సర్టిఫికెట్లు అవసరముంటుందని అందులో పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో శనివారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు(డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
అనంతపురం	41.1	22.4
కర్నూలు	39.7	27.3
కడప	38.1	26.1
కనిగిరి	37.0	24.0
నెల్లూరు	36.3	27.0
ఆముదాలవలస	35.0	24.0
శ్రీకాకుళం	34.0	23.0
ఏలూరు	34.0	26.0
విశాఖపట్నం	33.8	27.2
రాజమహేంద్రవరం	33.2	26.0
తెలంగాణలో..		
ఆదిలాబాద్	37.3	21.7
హైదరాబాద్	35.7	23.6
రామగుండం	36.6	25.6

రేపటి నుంచి ఒంటి పూట బడులు

▶ మొదటి పేజీ తరువాయి

ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు ఉదయం 8.45 నుంచి 9.30 లోపు పరీక్ష కేంద్రం వద్దకు చేరుకోవాలని సూచించారు. 9.30 గంటల తర్వాత పరీక్ష కేంద్రంలోకి అనుమతించేది లేదన్నారు. ఈ ఏడాది 6 సబ్జెక్టులకు 6 రోజులు పరీక్షలు నిర్వహిస్తున్నామని.. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో కేవలం ప్రభుత్వ ఉపాధ్యాయులు మాత్రమే ఇన్విజిలేషన్ విధులు నిర్వహిస్తారని తెలిపారు. ప్రైవేట్ స్కూళ్ల కేంద్రాల్లో ఇతర సిబ్బంది కూడా ప్రభుత్వ ఉద్యోగులే ఉంటారన్నారు. మొత్తంగా 3,349 కేంద్రాల్లో 6,64,152 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు.

విద్యా కానుకలో నాణ్యతకు పెద్దపీట

రాబోయే విద్యా సంవత్సరంలో జగనన్న విద్యా కానుకలో భాగంగా అందించే స్కూల్ బ్యాగ్, బూట్లు, యూనిఫాం తదితర వస్తువులకు సంబంధించి నాణ్యతకు పెద్దపీట వేశామని మంత్రి బొత్స తెలిపారు. 'గతంలో మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు నాణ్యమైన వస్తువులను అందిస్తున్నాం. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే నాటికి ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక అందిస్తాం. జగనన్న గోరుముద్ద పథకం దేశంలోనే ప్రత్యేకం. బాలికల్లో రక్తహీనత నివారణకు వారానికి మూడు రోజులు రాగి జావ, మూడు రోజులు చిక్కి అందిస్తున్నాం. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 1,000 స్కూళ్లలో సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశ పెడుతున్నాం. టీచర్ల ఖాళీలు ఎన్ని ఉన్నాయో లెక్క తేల్చాక డీఎస్సీ నిర్వహిస్తాం. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున తీర్పు వచ్చాక అమలు చేస్తాం' అని చెప్పారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్, సమగ్ర శిక్షా ఎస్పీడీ సురేష్ కుమార్, ఎస్ఏపీడీ బి.శ్రీనివాసరావు, పరీక్షల విభాగం సంచాలకులు దేవానందరెడ్డి, సమగ్ర శిక్షా ఏఎస్పీడీ, ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ కెవీ శ్రీనివాసులురెడ్డి, జాయింట్ డైరెక్టర్ (సర్వీసులు) మువ్వా రామలింగం పాల్గొన్నారు.

నిఘా కట్టుదిట్టం

- సమస్యాత్మక కేంద్రాల్లో డీఈవోలు అవసరమైన చోట సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసుకోవాలి.
- ఇప్పటికే అమర్చిన వాటితో పాటు ఈ ఏడాది నూతనంగా 104 పరీక్షా కేంద్రాల్లో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు.
- ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకెళ్లకూడదు. సూపరింటెండెంట్‌తో సహా ఇన్విజిలేటర్లు, సిబ్బంది మొబైల్ ఫోన్ తీసుకెళ్లరాదు. పరీక్షా కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు.
- ప్రశ్నపత్రం బయటకు వెళితే అది ఏ కేంద్రం, ఏ విద్యార్థి, ఏ ఇన్విజిలేటర్ నుంచి వెళ్లిందో కనుక్కునే ఏర్పాట్లు చేశాం.
- విద్యార్థులు ఇంటి నుంచి పరీక్ష కేంద్రానికి రానూపోను హాల్ టికెట్ చూపించి ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణించవచ్చు.
- దేశంలోనే తొలిసారిగా అంధ విద్యార్థుల కోసం వారే స్వయంగా కంప్యూటర్ పై పరీక్ష రాసేలా ఏర్పాట్లు.
- పరీక్షా కేంద్రాల వద్ద నాడు–నేడు అభివృద్ధి పనులు మధ్యాహ్నం తర్వాతే.
- గతంలో అక్రమాలకు పాల్పడ్డ 75 మంది ఉపాధ్యాయులు ఆయా ఎమ్మార్వో ఆఫీసుల్లో ఉండేలా సర్క్యులర్ ఇచ్చినా, ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థన మేరకు ఉపసంహరణ.

ఆరు బయట, చెట్ల కింద తరగతులు నిర్వహించవద్దు

ఆదేశాలు జారీ చేసిన పాఠశాల విద్యా శాఖ

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఈ నెల 3వ తేదీ నుంచి ఒంటిపూట బడులు ప్రారంభమవుతాయని, ఎండల తీవ్రత దృష్ట్యా తరగతులను ఆరు బయట, చెట్ల కింద ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వహించరాదని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న స్కూళ్లలో ఆరు రోజులు తరగతులు నిర్వహించరాదని, ఇందుకు ప్రత్యామ్నాయంగా సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించాలన్నారు. ఈ నెల రెండో శనివారాన్ని పని దినంగా పరిగణించాలన్నారు. ప్రతి స్కూలులో మంచి నీటి సదుపాయం కల్పించాలని, వైద్య శాఖ సహకారంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లను సమకూర్చుకోవాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంస్థల సహకారంతో మజ్జిగ పంపిణీ చేయాలన్నారు. తరగతులు ముగియగానే మధ్యాహ్న భోజనం అందించాలని తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే చర్యలు తప్పవు

- గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ స్పష్టీకరణ
- బీజేపీ కార్యదర్శి సత్యకుమార్ కారుపై ఎవరూ రాయి విసరలేదు
- కాన్వాయ్‌లోని చివరి కారుపై రాయి విసిరిన వ్యక్తి అరెస్ట్



నగరంపాలెం : అమర్యాద ప్రవర్తన, అనుచిత వ్యాఖ్యలతో రెచ్చగొట్టే వారిపై చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ స్పష్టం చేశారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు వైరల్ కావడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొందన్నారు. మూడు రాజధానుల శిబిరం వద్ద ఇరువర్గాల మధ్య తోపులాటను అక్కడే విధుల్లో ఉన్న ఏఎస్పీ అనీల్‌కుమార్, తుల్లూరు డీఎస్పీ పోతురాజు, పోలీసులు సత్వరమే స్పందించి నిలువరించారని చెప్పారు. బీజేపీ కార్యదర్శి సత్యకుమార్ కాన్వాయ్ విజయవాడ వైపు బయలుదేరగా, చివరి కారుపై ఓ వ్యక్తి రాయి విసిరారని తెలిపారు. సత్యకుమార్ ప్రయాణిస్తున్న కారుపై రాయి వేయలేదని స్పష్టంచేశారు. సురేష్ అనే వ్యక్తి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, సత్వరమే సీసీ పుటేజీ ఇతర ఆధారాల మేరకు తాళ్లాయపాలెం గ్రామానికి చెందిన డి.నితిన్‌ను అరెస్ట్ చేశామన్నారు.

స్పీకర్‌గా చైర్‌ను కాపాడాల్సిన బాధ్యత నాపై ఉంది

- ప్రతిపక్ష ఎమ్మెల్యేలు గొడవ కోసమే సభకొచ్చారు
- సభ సజావుగా సాగాలంటే సస్పెన్షన్ ఒక్కటే మిగిలింది: స్పీకర్ తమ్మినేని



లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో తమ్మినేని సీతారాం

మంగళగిరి: సభాపతిగా సభ చైర్‌ను కాపాడాల్సిన బాధ్యత తనపై ఉందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి లక్ష్మీనృసింహస్వామిని స్పీకర్ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు స్పీకర్ చైర్‌ను గౌరవించాలని, కానీ ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష శాసనసభ్యులు ప్రజా సమస్యలను ప్రస్తావించడానికి బదులు.. కేవలం గొడవ చేయడానికే వచ్చినట్టుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధమైన తీరు వల్ల ప్రజలకు న్యాయం ఎలా జరుగుతుందన్నారు. తన రాజకీయ జీవితంలో ఇలాంటి ప్రతిపక్షాన్ని, పరిస్థితిని ఎన్నడూ చూడలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అసెంబ్లీలో ప్రజా సమస్యలు ప్రస్తావనకు రావాలన్నా, సభ ప్రశాంతంగా జరగాలన్నా తమ వద్ద ఉన్న చివరి ఆయుధం సస్పెన్షన్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఇకపై జరిగే అసెంబ్లీ సమావేశాల్లోనైనా ప్రతిపక్ష ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ అభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధితోపాటు ప్రజాసమస్యలను ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆయన హితవు పలికారు.

హజ్ యాత్రకు 2,319 మంది ఎంపిక

ఏపీ స్టేట్ హజ్ కమిటీ చైర్మన్ గౌసల్ అజాం వెల్లడి



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్–2023 యాత్ర కోసం దరఖాస్తు చేసుకున్న 2,319 మంది ఎంపికైనట్లు రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ బద్వేల్ షేక్ గౌసల్ అజాం చెప్పారు. విజయవాడలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రంజాన్ తర్వాత ప్రారంభించే హజ్ యాత్ర ఏర్పాట్లపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. హజ్ యాత్రకు ఎంపికైనవారు ఈ నెల 7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని, 10లోపు మెడికల్ స్క్రీనింగ్, ఫిట్‌నెస్, కోవిడ్ వ్యాక్సినేషన్ సర్టిఫికెట్లు, ఒరిజినల్ పాస్‌పోర్టును రాష్ట్ర హజ్ కమిటీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ప్రతి 300 మంది హజ్ యాత్రికులకు ఒక సహాయకుడిని ఎంపిక చేసే అవకాశం ఉందని, ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈ నెల 10లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒంటరి మహిళలు 300మంది దాటితే వారికి సహాయకురాలిగా మహిళా ఉద్యోగికి సౌదీ ప్రభుత్వం అనుమతివ్వడం హర్షణీయమన్నారు. హజ్ యాత్ర విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచే మొదలవుతుందని చెప్పారు. విజయవాడకు ఎంబార్కేషన్ పాయింట్ ఇవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన ఏర్పాట్లు చేస్తోందన్నారు. రాష్ట్ర హజ్ హౌస్ నిర్మాణంపై టీడీపీ దుర్మార్గపు రాజకీయం చేస్తోందని గౌసల్ అజాం మండిపడ్డారు. టీడీపీ అసంపూర్తిగా వదిలేసిన కడప హజ్ హౌస్‌ను పూర్తిచేసేందుకు సీఎం వైఎస్ జగన్ మరో రూ.7కోట్లు కేటాయించేలా ఆదేశాలు ఇచ్చారన్నారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో విజయవాడలో రాష్ట్ర హజ్‌హౌస్ నిర్మాణానికి స్థల పరిశీలన తుది దశకు చేరిందన్నారు. త్వరలోనే దీనికి ముఖ్యమంత్రి శంకుస్థాపన కూడా చేస్తారని ఆయన చెప్పారు.

దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది

- కేంద్రంలో ఉన్నది ఉన్మాద ప్రభుత్వం
- రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): బీజేపీ పాలనలో దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు చెప్పారు. ఆయన శనివారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్నది ఉన్మాద మనస్తత్వం కలిగిన ప్రభుత్వమని చెప్పారు. మన దేశ అప్పులు లక్షల కోట్లు పెరుగుతుంటే.. అదానీ ఆస్తులు మాత్రం భారీగా పెరుగుతున్నాయని అన్నారు. అదానీని ప్రశ్నిస్తే దేశ ద్రోహం కింద పరిగణిస్తున్నారన్నారు. అదానీ నుంచి ప్రధాని నరేంద్ర మోదీకి వాటా వెళ్తోందని ఆరోపించారు. దేశంలో వీరు చేస్తున్న అవినీతిని ప్రశ్నించడానికి సిద్ధమైన రాహుల్ గాంధీని వేధించడం శోచనీయమన్నారు. ఏపీ రాజకీయాలపై ప్రశ్నించే పవన్ కేంద్రప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలపై ఎందుకు మాట్లాడటంలేదని అన్నారు. కేంద్రంలో చక్రాలు తిప్పాను అని చెప్పే చంద్రబాబు నేడు రాహుల్ గాంధీకి జరిగిన అన్యాయంపై ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. చంద్రబాబుకు చట్టాలపై గౌరవం ఉంటే కేంద్ర చర్యలపై నిలదీయాలన్నారు. ఈ విషయంలో చంద్రబాబు బాధ్యత మరిచారని అన్నారు.

ఉత్సాహంగా ఆసరా



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అర్తమూరులో మహిళలకు చెక్కును అందజేసిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెంలో చెక్కును అందజేస్తున్న చేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి



పల్నాడు జిల్లా గురజాలలో మహిళలకు ఆసరా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



వైఎస్సార్ ఆసరా 3వ విడత సంబరాల్లో భాగంగా ఒంగోలులో బోనాలతో ర్యాలీ చేస్తున్న మేయర్ సుజాత, డ్వాక్రా మహిళలు



విశాఖ జిల్లా శొంఠ్యాంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, డ్వాక్రా మహిళలు



అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో మహిళలకు చెక్కును అందజేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్సీ మంగమ్మ

కొటియా గ్రామాలు ఒడిశావే

కేంద్ర మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు



మాట్లాడుతున్న కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్

సాలూరు: ఆంధ్రా – ఒడిశా సరిహద్దులోని వివాదాస్పద కొటియా గ్రూపు గ్రామాలపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఒడిశా రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కొటియా పంచాయతీ పట్టు చెన్నేరులో ఆయన శనివారం పర్యటించారు. కొటియా గ్రామాల వివాదంపై సుప్రీం కోర్టులో విచారణ జరుగుతున్న విషయాన్ని విస్మరించి.. కొటియా గ్రూపు గ్రామాలు ఒడిశావే అని ప్రకటించారు. ఇదే విషయాన్ని ఆంధ్రా కొటియా సీఐ రోహిణీపతికి కూడా చెప్పారు. మంత్రి వ్యాఖ్యలపై కొటియా గ్రూపు గ్రామాల ప్రజలు భగ్గుమన్నారు. ఇప్పటికే తమకు ఆంధ్రా ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలు అందజేస్తోందని తెలిపారు.

త్వరలో తిరుపతి నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు

సత్ఫలితాలను ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ఏపీఏడీసీఎల్ ప్రయత్నాలు



సాక్షి, అమరావతి: ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక నగరం తిరుపతి నుంచి త్వరలో అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇస్తోంది. తిరుపతి విమానాశ్రయానికి 2017లోనే అంతర్జాతీయ విమానాశ్రయ హోదా వచ్చింది. అయితే, ఇప్పటివరకు అంతర్జాతీయ సర్వీసులు ప్రారంభం కాలేదు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించి, తిరుపతి నుంచి ప్రపంచ నగరాలకు విమానాలు నడిచేలా కృషి చేస్తోంది. ముందుగా తిరుపతి విమానాశ్రయం నుంచి కువైట్‌కు సర్వీసులు ప్రారంభించేలా కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖతో పాటు విమానయాన సంస్థలతో ఏపీ ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఏడీసీఎల్), స్థానిక ఎంపీ, ఎయిర్‌పోర్టు అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక విమాన సర్వీసులు ప్రారంభించడానికి చాలా సమయం పట్టే అవకాశం ఉండటంతో ఓపెన్ స్కై పాలసీ కింద కువైట్‌కు విమాన సర్వీసులు ప్రారంభించాలని స్థానిక వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిని కోరారు. ఈ పాలసీ కింద 400 సీట్లు కేటాయించాలని కోరగా కేంద్రం నుంచి సానుకూల స్పందన వచ్చినట్లు అధికారులు తెలిపారు. తిరుపతి నుంచి కువైట్‌కు సర్వీసులు నడపడానికి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ నుంచి సానుకూల సంకేతాలు వచ్చాయని తిరుపతి ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజ్ కిషోర్ తెలిపారు. ఇండిగో, ఎయిర్‌ఏషియా సంస్థలతో కూడా సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. తక్షణం అంతర్జాతీయ సర్వీసులు నడపడానికి వీలుగా ఎయిర్‌పోర్టులో కస్టమ్స్, ఇమిగ్రేషన్‌కు అవసరమైన సౌకర్యాలతో పాటు విదేశీ ప్రయాణికులు వచ్చి వెళ్లేందుకు ప్రత్యేక మార్గాలు, కన్వేయర్ బెల్ట్ వంటి అన్ని సదుపాయాలు ఉన్నాయని చెప్పారు. ఒక్కసారి సర్వీసులు ప్రారంభిస్తే ఇమిగ్రేషన్, కస్టమ్స్ అధికారులను నియమించడానికి కేంద్రం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.

తీరనున్న అవస్థలు

రాయలసీమ ప్రాంత వాసులు విదేశాలకు వెళ్లేందుకు తిరుపతి విమానాశ్రయం చాలా అనుకూలంగా ఉంటుంది. రాయలసీమ నుంచి ముఖ్యంగా చిత్తూరు, రాజంపేట, రాయచోటి, నెల్లూరు ప్రాంతాల నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారు. ప్రస్తుతం వీరంతా వ్యయప్రయాసలకోర్చి చెన్నై వెళ్లి, అక్కడి నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సి వస్తోంది. అదే తిరుపతి ఎయిర్‌పోర్టు నుంచి సర్వీసులు అందుబాటులోకి వస్తే ఈ అవస్థలు తప్పుతాయని, చాలా సౌకర్యంగా ఉంటుందని అధికారులు తెలిపారు. అంతర్జాతీయ సర్వీసులను ప్రారంభించడానికి ఎంపీ గురుమూర్తి కేంద్రస్థాయిలో సంప్రదింపులు నడుపుతున్నారని, ఇవి సత్ఫలితాలను ఇస్తున్నాయని, త్వరలోనే తిరుపతి నుంచి అంతర్జాతీయ సర్వీసులు ప్రారంభమవుతాయని ఏపీఏడీసీఎల్ ఎండీ భరత్ రెడ్డి తెలిపారు.

నీటి లెక్కలు తేల్చకుండా వాడుకోవద్దని ఎలా అంటారు?


▶ మొదటి పేజీ తరువాయి

ఎందుకు ఆదేశించలేదని బోర్డును నిలదీస్తున్నారు. ప్రస్తుత నీటి సంవత్సరంలో రెండు రాష్ట్రాలు వాడుకున్న నీటి లెక్కలు తేల్చాకే ఇతర అంశాలపై చర్చిద్దామని స్పష్టం చేస్తున్నారు. లెక్కలు తేల్చకుండా నీటిని వాడుకోవద్దని ఎలా అంటారని ప్రశ్నిస్తున్నారు. ఇదే అంశంపై సోమవారం కృష్ణా బోర్డుకు లేఖ రాస్తామని ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి 'సాక్షి'కి తెలిపారు.

సాగర్ కుడి కాలువ ద్వారా రోజూ 9 వేల క్యూసెక్కులను ఏపీ వాడుకుంటోందంటూ తెలంగాణ ఈఎన్‌సీ రాసిన లేఖకు స్పందించిన కృష్ణా బోర్డు.. ఆ నీటి వాడకాన్ని ఆపేయాలని శుక్రవారం ఏపీ ఈఎన్‌సీకి లేఖ రాసింది. బోర్డు ఆదేశాలపై రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు మండిపడుతున్నారు. ప్రస్తుత నీటి సంవత్సరంలో వరద రోజుల్లో వాడుకున్నదిపోనూ మిగతా రోజుల్లో తెలంగాణ ప్రభుత్వం కోటా కంటే 73.56 టీఎంసీలు ఎక్కువ వినియోగించుకుందని, ఏపీ కోటాలో ఇంకా 199.31 టీఎంసీలు మిగిలే ఉన్నాయని అధికారులు తెలిపారు. నీటి లెక్కలు తేల్చి.. మా కోటా నీటిని రబీలో సాగు, వేసవిలో తాగునీటి అవసరాలకు విడుదల చేయాలని మార్చి 13న కృష్ణా బోర్డుకు లేఖ రాశామని ఏపీ ఈఎన్‌సీ గుర్తు చేస్తున్నారు. కోటా కంటే అధికంగా వాడుకున్న తెలంగాణను కట్టడి చేసి, సాగర్ ఎడమ కాలువ కోటా కింద ఏపీకి ఇంకా రావాల్సిన 13 టీఎంసీలను విడుదల చేసేలా ఆ రాష్ట్ర అధికారులను ఆదేశించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే అంశంపై సోమవారం లేఖ రాస్తామని అధికారులు చెప్పారు. నీటి లెక్కలు తేల్చేందుకు తక్షణమే సర్వ సభ్య సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరతామన్నారు. కోటా మేరకే తాగు అవసరాలకు సాగర్ కుడి కాలువ నుంచి నీటిని వాడుకుంటున్నామని, ఆపే ప్రశ్నే లేదని స్పష్టం చేస్తున్నారు.

సరికొత్తగా విశాఖ పోర్టు

- చురుగ్గా పలు అభివృద్ధి పనులు
- మౌలిక వసతుల కల్పనతో పాటు బెర్తుల ఆధునికీకరణ చేపట్టిన వీపీఏ.. 'ల్యాండ్ లార్డ్ పోర్టు' దిశగా అడుగులు



విశాఖపట్నం పోర్టు

సాక్షి, విశాఖపట్నం: భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విశాఖపట్నం పోర్టు అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. దేశంలోని మేజర్ పోర్టుల్లో 4వ స్థానానికి ఎగబాకిన విశాఖ పోర్టు అథారిటీ.. నంబర్ వన్ స్థానాన్ని చేజిక్కించుకునేందుకు అవసరమైన ప్రణాళికలను అమలు చేస్తోంది. రూ.755 కోట్ల వ్యయంతో పోర్టు ఆధునికీకరణ పనులను చేపట్టింది. బెర్తుల ఆధునికీకరణ, సామర్థ్య విస్తరణతో పాటు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం వివిధ జెట్టీల ద్వారా మాంగనీస్, బొగ్గు, జిప్సం, బాక్సైట్ తదితర ఖనిజాలు, ఇతర ప్రధాన ఉత్పత్తుల రవాణా జరుగుతోంది. భవిష్యత్‌లో వీటి రవాణా సామర్థ్యం పెరిగే అవకాశం ఉన్నందున జెట్టీల సామర్థ్యాన్ని విశాఖ పోర్టు అధికారులు పెంచుతున్నారు. అలాగే రైల్వేల ద్వారా కార్గో హ్యాండ్లింగ్‌ను వేగవంతం చేసేందుకు కూడా వివిధ పనులు చేపట్టారు. పోర్టులోని ఆర్‌అండ్‌డీ యార్డులో వ్యక్తిగత క్యాబిన్‌ల నిర్మాణం, ప్యానెల్ ఇంటర్‌లాకింగ్ ద్వారా యార్డును రైల్వే ప్రమాణాలకు అనుగుణంగా సిద్ధం చేస్తున్నారు. రాత్రి సమయంలో కూడా జనరల్ కార్గో బెర్త్ వద్ద కేప్ సైజ్ షిప్‌లను సైతం నిలుపుకునేలా ఏర్పాట్లు చేశారు. ఇన్నర్ హార్బర్, ఔటర్ హార్బర్‌లో సింగిల్ బీమ్ ఎకో సౌండర్‌ను మల్టీబీమ్‌గా అప్‌గ్రేడ్ చేశారు. పోర్టులో మొత్తం 29 బెర్తులుండగా.. ఇందులో 8 బెర్తులు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో నడుస్తున్నాయి. త్వరలో మరో 3 బెర్తులను కూడా పీపీపీ కింద ఇచ్చేందుకు చర్చలు జరుగుతున్నాయి. ప్రైవేట్ పెట్టుబడుల ద్వారా అంతర్గత నౌకాశ్రయంలోని డబ్ల్యూక్యూ–7, డబ్ల్యూక్యూ–8, ఈక్యూ–7, ఈక్యూ–6 బెర్తుల యాంత్రీకరణ పనులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ పనులు కూడా త్వరలోనే ప్రారంభం కానున్నాయి. చమురు రవాణాకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో చేపట్టిన ఇన్నర్ హార్బర్‌లోని ఓఆర్–1, 2 బెర్తుల అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. అలాగే వివిధ మౌలిక వసతులతో మూడు స్టోరేజీ షెడ్‌ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

చంద్రబాబువి పగటి కలలు

విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



సాక్షి, అమరావతి: 'మాకు ముందస్తు ఎన్నికలకు వెళ్లాల్సిన అవసరం లేదు. చంద్రబాబుకు ఎన్నికలు కావాలి. ఎన్నికలు వస్తే ఏదో అయిపోతానని ఆయన కలలు కంటున్నాడు. ఏమీ కాదు. ఇప్పుడు కొంతైనా ఆశతో బతుకుతున్నాడు. ఎన్నికల తర్వాత అదీ ఉండదు. వచ్చే ఎన్నికల్లో ఇప్పుడున్నన్ని సీట్లు కూడా ఆ పార్టీకి రావు. వాపును చూసి బలుపనుకుంటున్నాడు. ఎన్నికలయ్యాక చంద్రబాబు తుస్సుమంటాడు' అని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. పాలన, అధికార వికేంద్రీకరణ ద్వారానే రాష్ట్రం అభివృద్ధి సాధించగలుగుతుందన్నది తమ పార్టీ విధానమని చెప్పారు. తమ పార్టీ తొలి నుంచీ మూడు రాజధానులకే కట్టుబడి ఉందని, ఎప్పుడైనా తమది అదే నినాదమని స్పష్టం చేశారు. రేపటి నుంచే మూడు రాజధానులు అమల్లోకి రావాలన్నది తన డిమాండ్ అని, ఆ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అభ్యర్థిస్తున్నానని తెలిపారు. శనివారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. కొన్ని న్యాయపరమైన చిక్కుల వల్ల విశాఖ నుంచి పాలన ఆలస్యమవుతోందన్నారు. టీడీపీ, కొన్ని దుష్టశక్తులే మూడు రాజధానుల ప్రయత్నాలను అడ్డుకుంటున్నాయని.. తుదకు న్యాయం, నిజమే గెలుస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో మూడు రాజధానుల నినాదం వినిపిస్తామని చెప్పారు. కర్నూలు న్యాయ రాజధానిపై విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. తాము చట్టం, రాజ్యాంగం ప్రకారమే ముందుకు వెళ్తామన్నారు. మంత్రి బొత్స ఇంకా ఏమన్నారంటే..

మా ప్రభుత్వంపై పెరిగిన నమ్మకం

- అమరావతిలో ఉద్యమ స్ఫూర్తి అంటే ఏంటి? టెంట్లు వేసుకుని రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడమా? అక్కడ ఒకరిద్దరు రైతులు తప్ప మిగతా వారంతా చంద్రబాబు బినామీలు. బీజేపీ నేత సత్యకుమార్‌పై దాడి మాకేం అవసరం? మా పార్టీపై రాజకీయంగా బురదజల్లే ప్రయత్నాలవి.
- అమరావతిలో రాజధాని నిర్మాణం పేరిట రూ.లక్షల కోట్ల ప్రజాధనాన్ని, జాతి సంపదను గోతుల్లో పోయమంటే ఎలా? అమరావతిలో పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తామంటే అభ్యంతరం ఎందుకు? పేదలు, సామాన్యులు అక్కడ ఉండకూడదనడం ఎంత వరకు సబబు?
- దేశ చరిత్రలో ఎక్కడా లేనంతగా క్యాలెండర్ ప్రకారం సంక్షేమ పథకాలు ఇస్తున్నాం. మా ప్రభుత్వంపై ప్రజలకు మరింత నమ్మకం, భరోసా పెరిగింది. వారి ఆర్థిక పరిస్థితులు బాగు పడుతున్నాయి. ఇలాంటప్పుడు ముందస్తు ఎన్నికలకు వెళ్లాలన్న ఆతృత మా పార్టీకి ఎందుకు ఉంటుంది?
- ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటమికి నేనే బాధ్యత వహిస్తున్నా. ఓటమిపై పరిశీలన చేసుకొని, లోటుపాట్లుంటే సరి చేసుకుంటాం.
- దశాబ్దాలుగా మార్గదర్శి అక్రమాలకు పాల్పడుతోంది. ఇన్నాళ్లూ దాని యాజమాన్యం తప్పించుకుంది. ప్రస్తుతం మరిన్ని అక్రమాలు బయటకు వస్తున్నాయి. ఇక తప్పించుకోవడం సాధ్యం కాదు.

175 సీట్లలో పోటీ చేయాలనడం బుద్ధిలేనితనం

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌ను 175 స్థానాల్లో ఓడించడమే తమ లక్ష్యమని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పారు. అయితే, 175 సీట్లలో పోటీ చేస్తారా... అనేది ఒక బుద్ధి లేని ప్రశ్న అని మండిపడ్డారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నుంచి చాలామంది టీడీపీలోకి రావాలని ప్రయత్నం చేస్తున్నారని, తాము హోల్డ్‌లో పెట్టామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ గెలిస్తే ఎమ్మెల్యేలు అమ్ముడు పోయారనడం ఏమిటని ప్రశ్నించారు. తమకు 23 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, జగన్ పోటీయే పెట్టకూడదన్నారు. సరిపోయే సంఖ్యా బలం లేకపోయినా ఏడుగురిని పోటీలో పెట్టారని తెలిపారు. తన పార్టీలో చేర్చుకున్న నలుగురి ఎమ్మెల్యేలను పార్టీ నుంచి బయటకు పంపాలన్నారు.

లోకేశ్ డైరెక్షన్.. పల్లె ఓవరాక్షన్

- రెచ్చిపోయిన మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి
- అల్లరి మూకతో కలసి పుట్టపర్తిలో హల్‌చల్
- చర్చకు సిద్ధమన్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిపై తొడగొట్టి వీరంగం
- చెప్పులు, రాళ్లు రువ్వుతూ కారు ధ్వంసం
- సంయమనంతో ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే
- మరోసారి సత్యమ్మ సర్కిల్‌కు వచ్చి రెచ్చిపోయిన పల్లె



సత్యమ్మ గుడి వద్ద కారు పైకెక్కి టీడీపీ కార్యకర్తలను రెచ్చగొడుతున్న పల్లె



పగిలిన ఎమ్మెల్యే కారు అద్దం.. కారుపై పడిన చెప్పులు

సాక్షి, పుట్టపర్తి: 'ప్రశాంతి నిలయం'గా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో టీడీపీ నేత, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అనుచరులతో కలిసి అలజడి సృష్టించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ.. దౌర్జన్యకాండకు ఒడిగట్టారు. ఫలితంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేశ్ గత నెల 25న పుట్టపర్తి నియోజకవర్గం ఓబుళదేవరచెరువులో ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డిపై అవినీతి ఆరోపణలు చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. తాను అవినీతి చేసినట్లు నిరూపించాలని.. అభివృద్ధిపై ఏప్రిల్ ఒకటో తేదీన పుట్టపర్తి సత్యమ్మ గుడి వద్దకు చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో లోకేశ్ సూచన మేరకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి స్పందిస్తూ.. తాను చర్చకు వస్తున్నానని చెప్పడంతో ఆయన్ను పోలీసులు టీడీపీ కార్యాలయంలో హౌస్ అరెస్ట్ చేశారు. శనివారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి సత్యమ్మ గుడి సర్కిల్‌కు చేరుకున్నారు. కాసేపటికే పల్లె పోలీసుల నుంచి తప్పించుకుని.. భారీగా అనుచరులను వెంటేసుకుని అక్కడికి చేరుకున్నారు.

రండి చూసుకుందాం..



రెచ్చిపోతున్న టీడీపీ కార్యకర్త

పల్లె అక్కడికి వచ్చీ రాగానే కారు పైకెక్కి 'ఎమ్మెల్యే ఎక్కడ? నేను చర్చకు సిద్ధం' అంటూ హంగామా చేశారు. వెనుక ఉన్న అనుచరులు తొడలు కొడుతూ.. మీసం మెలేస్తూ 'రండి రేయ్ .. చూసుకుందాం' అంటూ రెచ్చగొట్టారు. పక్కనే ఉన్న ఎమ్మెల్యే వాహనం అద్దాలు ధ్వంసం చేశారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై చెప్పులు, రాళ్లు రువ్వారు. దీంతో ఆత్మ రక్షణ కోసం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రతిఘటించడానికి పూనుకున్నారు. పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్ నేతృత్వంలో పోలీసులు లాఠీలు ఝుళిపిస్తూ ఇరు వర్గాల వారిని చెదరగొట్టారు. ఈ దశలో ఎమ్మెల్యే దుద్దుకుంట తన అనుచరులతో కలిసి ఇంటి కెళ్లిపోయారు. బస్టాండ్ వరకు వెళ్లిన పల్లె మళ్లీ సత్యమ్మ గుడి సర్కిల్‌కు చేరుకుని హల్‌చల్ చేశారు.

నన్నయ వర్సిటీలో కూచిపూడి డిప్లొమా కోర్సు

రాజానగరం: గోదావరి తీరాన ఉన్న ఆదికవి నన్నయ యూనివర్సిటీలో రానున్న విద్యా సంవత్సరం నుంచి డిప్లొమా ఇన్ కూచిపూడి డాన్స్ (పార్ట్ టైం) కోర్సును ప్రారంభించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ తెలిపారు. ఏడాది వ్యవధి కలిగిన ఈ కోర్సులో చేరేందుకు ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేశామని, ఆసక్తిగలవారు ఈ నెల 3 నుంచి 18వ తేదీలోపు రూ.250 ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొత్తం 20 సీట్లు ఉంటాయని, వర్సిటీ క్యాంపస్‌లోని విద్యార్థినులకు పది, బయటివారికి పది సీట్లు చొప్పున కేటాయిస్తామని వివరించారు. వారంలో 3 రోజులు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు 0883256611/ 9912662500 నంబర్లలో సంప్రదించాలని లేదా వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.



నరులకు సంభవించునది యేదో అదే మృగములకు సంభవించును;
వారికిని వాటికిని కలుగు గతి ఒక్కటే; సకల జీవులకు ఒక్కటే ప్రాణము;
మృగముల కంటె నరుల కేమియు ఎక్కువలేదు.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.ద్వాదశి పూర్తి (24గంటలు), **నక్షత్రం:** మఖ పూర్తి (24గంటలు), **వర్జ్యం:** సా.5.55 నుండి 7.41 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.32 నుండి 5.21 వరకు, **అమృతఘడియలు:** తె.4.32 నుండి 6.20 వరకు (తెల్లవారితే సోమవారం).

సూర్యోదయం : 5.58
సూర్యాస్తమయం : 6.09
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

కుమారస్వామి (సన్నాఫ్ దేవెగౌడ)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

నాన్నగారికి దగ్గరగా కూర్చొని ఉన్నాను. "అలా దూరంగా ఉండిపోయావేం.." అన్నారు నాన్నగారు!

కుర్చీని జరుపుకోకుండా కుర్చీలోంచి నేనే కాస్త ముందుకు జరిగి నాన్నగారికి మరింత దగ్గరగా ఒరిగి కూర్చున్నాను.


"ఇదే నువ్వు చేస్తున్న తప్పు కుమారస్వామీ.." అన్నారు నాన్నగారు!

"ఏం చేశాను నాన్నగారూ?!" అని అడిగాను.

"కుర్చీని జరుపుకుని కూర్చోవలసి వచ్చినప్పుడు.. జరిపితే కుర్చీ ఎక్కడ ఇబ్బంది పడుతుందోనని ఆ ఇబ్బందేదో నువ్వే పడుతూ కుర్చీలోంచి ముందుకు జరిగి కూర్చుంటావు. ఇంత సున్నితంగా ఉంటే రాజకీయాలను అగౌరవపరిచినట్లు అవుతుంది కుమారస్వామీ.." అన్నారు నాన్నగారు.

ఆ మాటకు నా కళ్లు ఎమోషనల్ అయ్యాయి. కర్చీఫ్ తీసి కళ్లు, చెంపలు తుడుచుకున్నాను.

"గట్టిగా ఉండాలి కుమారస్వామీ. నీ కన్నా నీ కుర్చీనే గట్టిదనే సంకేతం నీ కన్నీళ్ల ద్వారా



గానీ, నీ కర్చీఫ్ ద్వారా గానీ బయటికి ప్రవహించకూడదు.." అన్నారు నాన్నగారు.

"కానీ నాన్నగారూ.. కుర్చీకి కూడా పెయిన్, ప్లెజర్ ఉంటాయని నాకు అనిపిస్తూ ఉంటుంది! ప్రజలు ఓటేసి కుర్చీలో కూర్చోబెట్టిన మనిషి ప్రజల సమస్యల్ని పట్టించుకోకుండా కూర్చున్నప్పుడు ఆ కుర్చీ.. పెయిన్‌నీ, ప్రజల సమస్యల్ని పరిష్కరించేందుకు కుర్చీలోంచి లేచి వెళ్లి ప్రజల్లో తిరుగుతున్నప్పుడు ఆ కుర్చీ.. ప్లెజర్‌నీ అనుభూతి చెందుతుందని నేను అనుకుంటూ ఉంటాను.." అన్నాను.

నాన్నగారు మాట్లాడలేదు!

"నాన్నగారూ.." అని మెల్లగా ఆయన చేతిని తట్టాను. నిద్రపోతున్నారు!

ప్రధానిగా ఉండగా నాన్నగారు ఇలాగే పార్లమెంటు హాల్లో నిద్రలోకి జారిపోతూ కనిపించేవారు. నిద్రను చూడటమే గానీ, ఆ నిద్ర వెనుక ఉన్న అలసటను చూసేవారెవరు? ఆయన కూర్చొని ఉన్న కుర్చీ తప్ప.

నిద్రలాంటిదే ఎమోషన్ కూడా. రెండూ మనకు తెలియకుండా మనల్ని పట్టేస్తాయి! అలసటతో నాన్నగారు నిద్రలోకి చేజారిపోయినట్లే.. బాధ్యతగా ఉండే మనుషులు, బాధ్యత పట్టని మనుషులు.. ఇద్దరూ నన్ను ఎమోషన్‌లోకి నెట్టేస్తారు.

కర్ణాటక ఎన్నికల ప్రకటన వచ్చినప్పుడు ఇలానే నేను ఎమోషనల్ అయ్యాను.

"మే 10నే పోలింగ్ పెట్టడానికి కారణం ఉంది. ఆరోజు బుధవారం. ఓటర్లను లాంగ్ వీకెండ్ హాలిడేస్‌కి వెళ్లనివ్వకుండా ఉంచేందుకే సోమవారం, శుక్రవారం కాకుండా బుధవారం రోజు పోలింగ్ పెట్టాను.." అని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ చెప్పినప్పుడు కలిగిన ఎమోషన్ అది.

పౌరులు బాధ్యతగా లేకున్నా, ప్రజా ప్రతినిధులు బాధ్యతగా లేకున్నా ఈ దేశ ఎన్నికల ప్రధాన అధికారి బాధ్యతగా ఉన్నారన్న ఆలోచన రాగానే నేను బ్రేక్ డౌన్ అయ్యాను. కర్చీఫ్ తీసి కళ్లు తుడుచుకున్నాను.

పౌరులకు బాధ్యతే ఉంటే 2019 లోక్‌సభ ఎన్నికల్లో మాండ్యాలో సుమలతకు బదులుగా నా కుమారుడు నిఖిల్‌ని గెలిపించేవారు కాదా?! ప్రజా ప్రతినిధులకు బాధ్యతే ఉంటే 2006లో, 2018లో నన్ను పూర్తిగా ఐదేళ్లూ ముఖ్యమంత్రిగా ఉండనిచ్చేవారు కాదా?!

ఈ రాజకీయాలు నాకు పడేవి కాదు. ఇక్కడ నేనొక గరళకంఠుడిని. దిగమింగుకుని ఉండలేను. భయ తాండవమూ చేయలేను. ఇవే నా ఆఖరు ఎన్నికలు. 2028లో ఒక సామాన్య కార్యకర్తగా మిగిలిపోతాను.

"ఏంటి కుమారస్వామీ ఆలోచిస్తున్నావ్.. మళ్లీ ఎమోషనా?" అంటున్నారు నాన్నగారు!! నిద్రలోకి ఆయన ఎంత త్వరగా వెళ్లిపోతారో, నిద్రలోంచి అంత త్వరగా తిరిగొచ్చేస్తారు.

89 ఏళ్ల వయసులో కూడా నాన్నగారు ఇంత ప్రశాంతంగా, నాన్-ఎమోషనల్‌గా ఉండగలగడానికి కారణం ఈ నిద్ర. నిర్నిద్రలేనా?!

మైండ్ గేమ్... మనీ గేమ్!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

అడ్డదారులు తొక్కి అధర్మ మార్గాన్నెంచుకొని ఏదో సాధించాలనుకోవడం ఎప్పుడూ ప్రమాదకరమే. తాత్కాలిక ఫలితాలు సిద్ధిస్తాయేమో గానీ అంతిమంగా పతనం తప్పదనే నీతి సారాన్ని మన ఇతిహాస కథలు బోధిస్తున్నాయి. అహల్యను చెరచడానికి దేవేంద్రుడు ఆమె భర్త గౌతముని వేషం దాల్చి మోసగిస్తాడు. చివరికి గౌతముని శాపానికి గురై కురూపిగా చిరకాలం బతకవలసి వచ్చింది. రావణాసురుడు సీతమ్మవారిని అపహరించడానికి వీలుగా మారీచుడు బంగారు జింకలా మారి రామలక్ష్మణులను ఏమార్చుతాడు. ఒంటరిగా ఉన్న సీతమ్మను మారువేషంలో వచ్చిన రావణుడు అపహరిస్తాడు. కానీ, అజేయుడని పేరున్న రావణాసురుడు అంతిమంగా రామ బాణానికి నేలకూలక తప్పలేదు. మహాభారతంలోని మాయా జూద ఘట్టంతో సహా మనకు ఇటువంటి వృత్తాంతాలెన్నో ఉన్నాయి.

ఇతిహాస మోసాలకు మరింత పదును పెట్టిన వాడు ఆధునిక యుగంలో గోబెల్స్. హిట్లర్ దగ్గర ప్రపగాండా మంత్రిగా పనిచేసిన గోబెల్స్, దుష్ప్రచారాలకు పర్యాయ పదంగా మిగిలిపోయాడు. అతని ప్రచారాల అండతో చెలరేగిపోయిన హిట్లర్ కనీవినీ ఎరుగని మారణకాండకు కారకుడయ్యాడు. చివరికి ప్రాణ భయంతో కలుగులో దాక్కొని కుక్కచావు చచ్చాడు. గోబెల్స్ ప్రపగాండా చాతుర్యానికి మరిన్ని కుయుక్తులు చేర్చి ఒక అధునాతన వంచనా శిల్పాన్ని చెక్కిన అపఖ్యాతి మన తెలుగువారైన చంద్రబాబుకూ, ఆయన భాగస్వాములైన యెల్లో మీడియాకూ సంయుక్తంగా దక్కుతుంది. తెలుగువారి ఘనకీర్తిని అంతర్జాతీయ యవనికపై ఎగరేసిన మహానుభావులెందరో మనకున్నారు. తులసి వనంలో గంజాయి మొక్కల్లా ఇటువంటి అపకీర్తి కలుపుమొక్కలు కూడా కొన్ని మొలకెత్తడం ఒక విషాదం.

ఇప్పుడు చంద్రబాబు సహా యెల్లో కూటమి సభ్యులు తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నారు. జీవన్మరణ సమస్య ఒక కరవాలం మాదిరిగా వారి మెడపై వేలాడుతున్నది. అధికారంలో ఉన్నప్పుడు వీరూ, వీరి అనుయాయులు వేల కోట్ల రూపాయలను అమరావతి జూదంలో ఫణంగా ఒడ్డారు. రైతుల నుంచి భూసమీకరణ చేయడమనేది బూటకమనీ, ఇందులో అత్యధిక శాతం భూమిని చంద్రబాబు కూటమి సభ్యులే కొనుగోలు చేసి రైతుల పేరు మీద సమీకరణకు ఇచ్చారనే వాస్తవాలు ఒక్కొక్కటిగా ఇప్పుడు బయటకొస్తున్నాయి. అమరావతి రైతుల పాదయాత్ర పేరుతో చేసిన ప్రహసనంలో ఆధార్ కార్డులు చూపెట్టి పాల్గొనడానికి అరవై మంది కూడా ముందుకు రాకపోవడంతో ఈ అభిప్రాయానికి బలం చేకూరింది. ప్రైవేట్ అంచనాల ప్రకారం యెల్లో కోటరీ సభ్యులు సోకాల్డ్ భూసమీకరణ మీద పదిహేను వేల కోట్లకు పైగా పెట్టుబడి పెట్టారు. అమరావతి రియల్ ఎస్టేట్ వ్యాపారం వారు అనుకున్నట్లు కొనసాగి వుంటే ఇంతకు పదింతలు సంపాదించవచ్చనే ఆశతో వారీ సమీకరణ తంతును జరిపించారు. అచ్చం రియల్ ఎస్టేట్ కంపెనీవాళ్లు విడుదల చేసినట్టే ప్రింటెడ్, డిజిటల్ గ్రాఫిక్ బ్రోచర్లను స్వయానా చంద్రబాబునాయుడే విడుదల చేసిన వైనం చాలామందికి గుర్తుండే ఉంటుంది. ఈ వెంచర్‌లో బలహీనవర్గాల ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించినప్పుడు యెల్లో ముఠా ఎంత అల్లకల్లోలం చేసిందో కూడా గుర్తుండే ఉంటుంది. కోర్టు మెట్లెక్కి మరీ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు.

నోటిదాకా వచ్చిన లక్షన్నర కోట్ల కేపిటల్ లడ్డూ అందకుండా పోతున్నదని ఈ ముఠా కుమిలి కుమిలి కునారిల్లుతున్నది. శాసన రాజధాని అక్కడే కొనసాగుతుందనీ, పాలనా, న్యాయ రాజధానులను మాత్రమే తరలిస్తామనీ ప్రభుత్వం చెప్పే సమాధానం ససేమిరా మింగుడుపడడం లేదు. అదిగో సచివాలయం, అల్లదిగో అసెంబ్లీ, అటు చూడు హైకోర్టు అని వెంచర్‌ను ప్రచారం చేసుకోవడానికి వీల్లేని పరిస్థితుల్లో చిక్కుకున్నామని ఆందోళనపడుతున్నారు. చంద్రబాబు విడుదల చేసిన బ్రోచర్లను ఒకసారి పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా బోధపడుతుంది. కృష్ణానది చీలి అమరావతి నగరం మధ్యలో పారుతున్నట్టు ఒక కల. ఒక కలర్ పిక్చర్. వెనిస్ నగరానికి అమ్మలాగా నగరం మధ్యలో పడవ ప్రయాణం. తాజ్‌మహల్ అమ్మమ్మ లాంటి కట్టడాలు, వీలైతే పారిస్‌లో ఉన్న ఐఫిల్ టవర్‌ను కొనుగోలు చేసి మన మందడం పక్కన పాతించడం... ఈ రకమైన సెట్టింగ్స్ వేయడమెలాగో తెలుసుకోవడానికి రాజమౌళితో కూడా చంద్రబాబు సంప్రదింపులు సాగించిన సంగతి తెలిసిందే. ఈ స్థాయిలో గ్రాఫిక్స్ ప్రచారానికి ప్లాన్ చేసుకున్న వారికి ఒక్క అసెంబ్లీ ఏం సరిపోతుంది?

భూముల విక్రయాల ద్వారా ఆశించిన లక్షన్నర కోట్లే కాదు... ఆ తర్వాత డెవలప్‌మెంట్ పేరుతో అంతకు రెట్టింపు ఆర్జించే ప్రణాళికను బాబు, ఆయన కోటరీ

> నోటిదాకా వచ్చిన లక్షన్నర కోట్ల కేపిటల్ లడ్డూ అందకుండా పోతున్నదని ఈ ముఠా కుమిలి కునారిల్లుతున్నది. శాసన రాజధాని అక్కడే కొనసాగుతుందనీ, పాలనా, న్యాయ రాజధానులను మాత్రమే తరలిస్తామనీ ప్రభుత్వం చెప్పే సమాధానం ససేమిరా మింగుడుపడడం లేదు. అదిగో సచివాలయం, అల్లదిగో అసెంబ్లీ, అటు చూడు హైకోర్టు అని వెంచర్‌ను ప్రచారం చేసుకోవడానికి వీల్లేని పరిస్థితుల్లో చిక్కుకున్నామని ఆందోళన పడుతున్నారు. చంద్రబాబు విడుదల చేసిన బ్రోచర్లను ఒకసారి పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా బోధపడుతుంది. కృష్ణానది చీలి అమరావతి నగరం మధ్యలో పారుతున్నట్టు ఒక కల. ఒక కలర్ పిక్చర్. వెనిస్ నగరానికి అమ్మలాగా నగరం మధ్యలో పడవ ప్రయాణం. తాజ్‌మహల్ అమ్మమ్మ లాంటి కట్టడాలు, వీలైతే పారిస్‌లో ఉన్న ఐఫిల్ టవర్‌ను కొనుగోలు చేసి మన మందడం పక్కన పాతించడం... ఈ స్థాయిలో గ్రాఫిక్స్ ప్రచారానికి ప్లాన్ చేసుకున్న వారికి ఒక్క అసెంబ్లీ ఏం సరిపోతుంది? ఆ తర్వాత డెవలప్‌మెంట్ పేరుతో అంతకు రెట్టింపు ఆర్జించే ప్రణాళికను బాబు, ఆయన కోటరీ తయారుచేసుకున్నది. ఇప్పుడా కలలన్నీ కల్లలుగా మారే పరిస్థితి ఎదురుకావడంతో, పెట్టిన పదిహేను వేల కోట్ల పరిస్థితేమిటని వణికిపోతున్నారు.

తయారుచేసుకున్నది. ఇప్పుడా కలలన్నీ కల్లలుగా మారే పరిస్థితి ఎదురుకావడంతో, పెట్టిన పదిహేను వేల కోట్ల పరిస్థితేమిటని బాబు, ఆయన భాగస్వాములు వణికిపోతున్నారు. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కాలంటే, ఏదో మేరకు డ్యామేజి కంట్రోల్ జరగాలంటే వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలిచితీరాలి. సాధ్యమేనా? అసాధ్యమనే సంగతి తెలియనంత అమాయకుడు కాదు చంద్రబాబు. జాతీయ స్థాయిలో ప్రతిష్ఠ గలిగిన ఒక సర్వే సంస్థ ఒక జాతీయ పార్టీకోసం రాష్ట్రాల వారీగా చేసిన అభిప్రాయ సేకరణ ద్వారా ఈ సంగతి రూఢీ అయింది. తెలుగుదేశం పార్టీ కంటే వైసీపీకి ఇరవై శాతానికి పైగా ఎక్కువ మద్దతున్నట్టు వెల్లడైంది. గడిచిన ఎన్నికల్లో ఈ తేడా పదిశాతం మాత్రమే. ఇప్పుడు వైసీపీ మద్దతు గతంతో పోలిస్తే రెండు నుంచి నాలుగు శాతం మాత్రమే పెరిగినప్పటికీ తెలుగుదేశం మద్దతు దాదాపుగా పదిశాతం పడిపోయింది. రెండు పార్టీల మధ్యన ఉన్న ఈ అగాధాన్ని దాటాలంటే హనుమంతుని మాదిరిగా లంఘించే పవన విహార విద్య తెలిసి ఉండాలి.

గత ఎన్నికల్లో వైసీపీకి యాభై శాతానికి పాయింట్ సున్నా సున్నా ఒకటి శాతం ఓట్లు తక్కువైనప్పటికీ నూటా యాభయ్యొక్క సీట్లొచ్చాయి. ఇప్పుడున్న అంచనాల ప్రకారం యాభై నాలుగు శాతం ఓట్లు వస్తే ఎన్ని సీట్లు రావాలి? ఈ పరిస్థితుల్లో తెలుగుదేశం నెగ్గుకురావాలంటే ఏం చేయాలి? హనుమంతుడిలా అగాధ లంఘన విద్యను ఎలా అభ్యసించాలి? చావోరేవో తేల్చుకోవాల్సిన పరిస్థితి. ఈ శిరోభారం నుంచి బయటపడేందుకు చాలాకాలం కిందటే తెలుగుదేశం పార్టీ డబుల్ యాక్షన్ విక్స్‌వేపోరబ్ వంటి ఒక ద్విముఖ వ్యూహాన్ని రంగంలోకి తెచ్చింది. ఈ డబుల్ యాక్షన్‌లో ఒకటి మనీ గేమ్, రెండు మైండ్ గేమ్! నాన్-వైసీపీ పార్టీలు, సంస్థలన్నింటినీ తన నాయకత్వంలో ఒక్క తాటిపైకి తేవాలి. ఇందుకోసం అవసరమైతే మనీ గేమ్‌కు రెడీ! అధికారం వస్తే ఓ రెండు లక్షల కోట్లను (అమరావతి ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా) కొల్లగొట్టే అవకాశం ఉన్నప్పుడు అందులో రెండు శాతమో మూడు శాతమో వెదజల్లితే మాత్రం నష్టమేమిటన్న నిర్ధారణకు యెల్లో కూటమి వచ్చేసినట్టు కనిపిస్తున్నది. ఇక వైసీపీకి జనంలో ఉన్న మద్దతును గణనీయంగా తగ్గించాలి. ఇందుకోసం మైండ్ గేమ్. దీనికి గోబెల్స్ ప్రచారమే ప్రాతిపదిక. కాకపోతే దానికంటే వెయ్యి గిగాబైట్ల సామర్థ్యమెక్కువ. దీన్ని ఆధారం చేసుకొని జనం మెదళ్లతో గేమ్ ఆడటం. వైసీపీ బలం క్షీణించిందనే అభిప్రాయాన్ని జొప్పించడం. ఇందుకోసం ఉపయోగపడే ఒక సందర్భాన్ని వాడుకోవడానికి చాలాకాలం క్రితమే ఆ పార్టీ ఒక వ్యూహాన్ని రూపొందించుకున్నది.

టీచర్స్, గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గాలను శాసనమండలికి జరిగే ఎన్నికల్లో అధికార పార్టీలు గెలవడం చాలా అరుదు. ఎప్పుడైనా ఒకటీ అరా సందర్భాల్లో ప్రతిష్ఠకు పోయి, డబ్బులు వెదజల్లి విపక్షాలను చీల్చినప్పుడు స్వల్ప తేడాతో గెలవడం జరిగేదేమో. అది కూడా ఒకటి రెండు సందర్భాలకు మించి లేవు. ఈ ఓటర్లలో వామపక్షాలకు ఆది నుంచి బలం ఎక్కువ. ఆ తర్వాతి స్థానం బీజేపీది. గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గాల్లో ప్రధానంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, టీచర్లు ఓటర్లుగా ఉంటారు. సాధారణ గ్రాడ్యుయేట్లు ఎవరూ స్వచ్ఛందంగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేయించుకోవడానికి ఉత్సాహం చూపరు. ఈ పనిని ఎవరో ఒకరు చేసిపెట్టాల్సిందే. వామపక్షాలు, బీజేపీ కార్యకర్తలు ఈ వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొంటారు. పైగా ఉద్యోగ సంఘాలు, ట్రేడ్ యూనియన్లు, బ్యాంకు ఉద్యోగుల సంఘాల్లోనూ వామపక్షాల పలుకుబడి మొదటినుంచీ ఉన్నది.

ఉత్తరాంధ్ర, తూర్పు, పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గాలు, రాయలసీమలోని రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికలపై చాలాకాలం క్రితమే టీడీపీ కన్నేసింది. వామపక్ష ఓట్లు, బీజేపీ ఓట్లు తన పార్టీ అభ్యర్థులకు ఎక్కువగా పోలయ్యేలా రహస్య మంత్రాంగం చేసింది. రంగంలో లేని జనసేన ఓట్లు స్వల్పమే అయినా టీడీపీ ఖాతాలో వేసుకున్నది. బీజేపీ, వామపక్షాల ఓట్లు గణనీయంగా టీడీపీకి బదిలీ అయిన ట్రెండ్ లెక్కింపులో కనిపించింది. పశ్చిమ రాయలసీమలో గత ఎన్నికల్లో వైసీపీ మద్దతుతో పోటీచేసిన ఇండిపెండెంట్ గెలిచారు. ఈసారి ఆయన వైసీపీ అభ్యర్థిగా రంగంలో ఉన్నారు. తొలి ప్రాధాన్యత ఓట్లలో ఆయనకే ఆధిక్యత లభించింది. యాభై శాతం ఓట్ల మార్కుకోసం రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించినప్పుడు టీడీపీ అభ్యర్థి గెలుపొందాడు. మొదటి ప్రాధాన్యతలో పీడీఎఫ్ (లెఫ్ట్), బీజేపీలకు ఓట్లేసినవారు గంపగుత్తగా రెండో ప్రాధాన్యతలో టీడీపీకి వేశారు. టీడీపీ చేసిన రహస్య మంత్రాంగానికి స్పష్టమైన ఉదాహరణ ఇది.

ఉత్తరాంధ్రలో గత ఎన్నికల్లో పీడీఎఫ్, బీజేపీ మధ్య

> చచ్చి పడి ఉన్న ఓ పెద్దపులి గోళ్లను కత్తిరించుకొచ్చి పులిని చంపింది నేనే అన్నాడట పూర్వం ఒకడు. ఇప్పుడు కూడా ఒకాయన రోజూ అంటూనే ఉంటాడు... సెల్‌ఫోన్ నాదే, కంప్యూటర్ నాదే, టీవీ నాదే, కెమెరా నాదే, హైదరాబాద్ నాదే, బాగ్దాద్ నాదే, దావోస్ నాదే, ఇస్తాంబుల్ నాదే, సింగపూర్ నాదే... ఈ రకమైన వ్యవహార శైలికి ఏం పేరు పెట్టాలి? సామాన్య జనుల సాధికారత కోసం, జనాభాలో సగమైన అక్కచెల్లెమ్మలకు సముచిత స్థానంకోసం, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో ప్రజాస్వామిక విప్లవం కోసం పనిచేస్తున్న ప్రభుత్వాన్ని గోబెల్స్ ప్రచారాలతో, మైండ్ గేమ్‌లతో, మనీ గేమ్‌లతో ఓడించగలమని భావిస్తే... అది అహంభావమైనా కావాలి... ఉన్మాదమైనా కావాలి. ఈ రెండూ జత కలిసి ఇవ్వాళ ఆంధ్రప్రదేశ్‌లో జమిలి నాట్యం చేస్తున్నవి. ఒకడు మీడియాను మాఫియాగా మార్చిన ప్రబుద్ధుడు. మరొకడు రాజకీయాన్ని జూదంగా మార్చినవాడు. ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్నవాడు. పాపాలు పండుతున్నాయి. ఒక్కొక్క స్కామ్ సాక్ష్యాధారాలతో బద్దలవుతున్నది. ఇద్దరూ కలిసి ఆంధ్రదేశం కళ్లకు ఇంకెంత కాలం గంతలు కట్టాలి?

హోరాహోరీ పోరు జరిగి స్వల్ప తేడాతో బీజేపీ గెలిచింది. ఈసారి వారి ఓట్లు తగ్గి టీడీపీ అభ్యర్థి గెలిచారు. తూర్పు రాయలసీమలో ఇంతకుముందు పీడీఎఫ్ గెలిచింది. ఇప్పుడు టీడీపీ గెలిచింది. ఇక్కడా అదే పరిస్థితి. రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో వైసీపీ గెలిచింది. దానికి మీడియాలో సరైన ప్రాధాన్యత లభించలేదు. ఒక గాలిని పోగేయడం, ఒక మూడ్‌ను సృష్టించడం కోసం తెలుగుదేశం, యెల్లో మీడియా సర్వశక్తులు ఒడ్డి ఫోకస్ పెట్టాయి. గత కొంత కాలంగా ఉద్యోగుల మనసుల్లో యెల్లో మీడియా నాటుతున్న ప్రభుత్వ వ్యతిరేక విషబీజాల ప్రభావం కూడా ఎంతోకొంత ఉండవచ్చు. ఇంతా చేస్తే మొత్తం పోలయిన ఓటల్లో వైసీపీ అభ్యర్థులకంటే టీడీపీకి వచ్చిన ఓట్లు కేవలం ఆరేడు శాతమే ఎక్కువ. బౌన్సీ పిచ్‌పై బ్యాటింగ్ చేసిన జట్టు చాలా గౌరవప్రదమైన స్కోరు చేసినట్టే వైసీపీ ఫలితాన్ని పరిగణించాల్సి ఉంటుంది. గతంలో అధికారంలో ఉన్న ఏ పార్టీ ఈ స్థాయి ప్రభావాన్ని చూపలేదు. రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాలను గెలుచుకోలేదు. ఇదీ వాస్తవికత. కానీ తెలుగుదేశం యెల్లో మీడియా ప్రభుత్వ వ్యతిరేక పవనం వీస్తున్నదని ప్రచారంలో పెట్టింది. దీన్నే మైండ్ గేమ్ అంటారు.

ఎమ్మెల్యేలు ఓటేసే ఎమ్మెల్సీ సీట్లలో ఏడుకు గాను ఒక సీటును టీడీపీ గెలిచింది. విలువలను దిగజార్చడం ఇష్టంలేక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వదిలేసుకున్న సీటు అది. వదిలేసిన సీటును గెలిచి ఎమ్మెల్యేలలోనూ ప్రభుత్వ వ్యతిరేక ప్రభంజనం వీస్తున్నదని డప్పేయడం మొదలుపెట్టారు. చచ్చి పడి ఉన్న ఓ పెద్దపులి గోళ్లను కత్తిరించుకొచ్చి పులిని చంపింది నేనే అన్నాడట పూర్వం ఒకడు. ఇప్పుడు కూడా ఒకాయన రోజూ అంటూనే ఉంటాడు... సెల్‌ఫోన్ నాదే, కంప్యూటర్ నాదే, టీవీ నాదే, కెమెరా నాదే, హైదరాబాద్ నాదే, బాగ్దాద్ నాదే, దావోస్ నాదే, ఇస్తాంబుల్ నాదే, సింగపూర్ నాదే... ఈరకమైన వ్యవహార శైలికి ఏం పేరు పెట్టాలి? సామాన్య జనుల సాధికారత కోసం, జనాభాలో సగమైన అక్కచెల్లెమ్మలకు సముచిత స్థానంకోసం, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో ప్రజాస్వామిక విప్లవం కోసం పనిచేస్తున్న ప్రభుత్వాన్ని గోబెల్స్ ప్రచారాలతో, మైండ్ గేమ్‌లతో, మనీ గేమ్‌లతో ఓడించగలమని భావిస్తే... అది అహంభావమైనా కావాలి... ఉన్మాదమైనా కావాలి.

ఈ రెండూ జత కలిసి ఇవ్వాళ ఆంధ్రప్రదేశ్‌లో జమిలి నాట్యం చేస్తున్నవి. ఒకడు మీడియాను మాఫియాగా మార్చిన ప్రబుద్ధుడు. అనేకానేక ఆరోపణలు ఎదుర్కొంటున్నా మాయోపాయాలతో న్యాయవ్యవస్థ కళ్లు కప్పుతున్నవాడు. మార్గదర్శి వ్యవహారంలో నేర నిర్ధారణ జరిగి కటకటాల వెనక్కి వెళ్లవలసినవాడు. మరొకడు రాజకీయ నేత. రాజకీయాన్ని జూదంగా మార్చినవాడు. ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్నవాడు. సవాలక్ష అవినీతి పనులకు కేరాఫ్ అడ్రస్. ఎత్తులతో, జిత్తులతో న్యాయ సమీక్షకు దూరం జరుగుతున్నవాడు. పాపాలు పండుతున్నాయి. ఒక్కొక్క స్కామ్ సాక్ష్యాధారాలతో బద్దలవుతున్నది. నేడో రేపో జైలు ఊచలు లెక్కపెట్టవలసినవాడు. ఇద్దరూ కలిసి ఆంధ్రదేశం కళ్లకు ఇంకెంతకాలం గంతలు కట్టాలి? ఓ అఖిలాంధ్ర మేధావులారా వీరి చట్టవిరుద్ధ చర్యలను ప్రశ్నించరెందుకని? నిజం నిద్ర లేవకముందే అబద్ధాలతో, అభూతకల్పనలతో ప్రభాత భేరీలు మోగిస్తున్న ఆషాఢభూతుల కదలికలపై కన్నేయవలసిన అవసరం లేదా? పేద ప్రజల మేలుకోసం, సామాన్య ప్రజల శ్రేయస్సుకోసం సాగుతున్న యజ్ఞాన్ని తమ స్వార్థంకోసం, సొంత వర్గ ప్రయోజనాల కోసం భగ్నం చేయజూస్తున్న యెల్లో ముఠాను ఎలుగెత్తి ఖండించడం నేటి కర్తవ్యం కాదా?

vardhelli1959@gmail.com

ఇథనాల్ కలిపిన పెట్రోలుతో ఎవరికి ప్రయోజనం?

దేశీయ ఇంధన అవసరాలు తీర్చడానికీ, ఇంధన దిగుమతి భారం తగ్గించడానికీ, వాయు, కర్బన కాలుష్యాలను తగ్గించడానికీ ఇథనాల్ కలిపిన పెట్రోలు పరిష్కారమని భారత ప్రభుత్వం ఎన్నో వెసులు బాట్లు కల్పించి ప్రోత్సహిస్తున్నది. ఆహార ధాన్యాలైన బియ్యం, గోధుమలు, మొక్కజొన్నల నుండి ఇథనాల్ ఉత్పత్తి చేయడానికి సత్వర పర్యావరణ అనుమతులూ, సబ్సిడీలూ, వడ్డీ రాయితీతో రుణాలూ మంజూరు చేసి 2025 నాటికి 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోలు అందుబాటులోకి తేవడానికి ప్రయత్నిస్తున్నది. ఇథనాల్‌ను పెట్రోలుకు కలపడం కొత్తేమీ కాదు. రెండో ప్రపంచ యుద్ధ కాలం నుండీ వాడుతున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, యూకే, ఇతర ఐరోపా దేశాలూ; కెనడా, చైనా కూడా మిశ్రమ ఇంధనాన్ని ప్రస్తుతం వాడుతున్నాయి.

శాస్త్రీయ అధ్యయనాలు ఇథనాల్‌ను ఇంధనంగా వాడడంలోని నష్టాలను వెలుగులోకి తెచ్చాయి. 2023 మార్చి13న ఐపీసీసీ విడుదల చేసిన నివేదిక, తాపం పెరుగుదల 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు మించకుండా నిరోధించడానికి శిలాజ ఇంధనాలకు సత్వర ముగింపు పలకాలని స్పష్టం చేసింది. కొత్తగా నిర్మిస్తున్న ఇథనాల్ ప్లాంట్లు కనీసం 30 ఏళ్లు పని చేస్తాయి. మరి 2070 నాటికి నికర జీరో కర్బన ఉద్గారాలెలా సాధ్యమవుతాయి?

అమెరికా ప్రభుత్వ శక్తి (ఎనర్జీ) విభాగం 'ఇ20... పెట్రోల్ కంటే 7.7 శాతం తక్కువ ఇంధన శక్తి కలిగి ఉంటుందని' నిర్ధారించింది. ఒక లీటరు పెట్రోల్... 1.073 లీటర్ల మిశ్రమ ఇంధనానికి సమానం. పరిశీలనల్లో పెట్రోలునూ, మిశ్రమ ఇంధనాన్నీ వాడినప్పుడు దాదాపు కర్బన ఉద్గారాలు అదేస్థాయిలో ఉంటాయని తేలింది. ప్రతి ఇథనాల్ ప్లాంట్‌కీ ఒక బొగ్గుతోకానీ, బయోమాస్‌తో కానీ నడిచే పవర్ ప్లాంట్‌కు అనుమతిస్తున్నారు. వాటి ఉద్గారాలు అదనం. ఇంకా ప్రతి లీటరు ఇథనాల్ ఉత్పత్తికి 0.76 కిలోల కార్బన్- డై-ఆక్సైడ్ విడుదలవుతుంది. దానిని పూర్తిగా పట్టి గాలిలో చేరకుండా ఆపే వ్యవస్థ లేదు. అంటే మొత్తం ఉత్పత్తయిన కార్బన్-డై-ఆక్సైడ్ చివరికి గాలిలోకి చేరుతుంది. భూతాపానికి దోహద పడుతుంది. అంటే లక్ష్యం తిరగబడుతుందన్న మాట.

చమురు దిగుమతుల ఆర్థిక భారం తగ్గించడానికి ఇథనాల్ ఇంధనం పరిష్కారంగా ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఇ10 ఇంధనం అందుబాటులోకి వచ్చింది. అయినా




పెరుగుతున్న డిమాండ్ వల్ల చమురు దిగుమతి భారం తగ్గ లేదన్నది స్పష్టం. విదేశీ మారక ద్రవ్యం ఖర్చు పెరిగింది కాని తగ్గ లేదు. ఇంకా తగిన ఇథనాల్ ఉత్పత్తి లేక ఇథనాల్ దిగుమతి కూడా పెరిగింది. దేశీయ చమురు ఉత్పత్తులు గణనీయంగా క్షీణిస్తున్నందునా, చమురు వినియోగం పెరుతున్నందునా, ఇథనాల్ కలపడం చమురుపై ఆధారపడడం నుండి విముక్తం చేయదు. కర్బన ఉద్గారాలు పారిస్ ఒప్పందానికి అనుగుణంగా తగ్గవు.

చెరకు, బియ్యం, మొక్క జొన్నల నుండి ఇథనాల్ ఉత్పత్తి నీటి వనరులపై భారం పెంచుతుంది. ఇథనాల్ ప్లాంట్‌ల ప్రతిపాదనలు లీటర్ ఇథనాల్‌కు 8 నుండి 10 లీటర్ల నీరు కావాలంటున్నాయి. చెరకు నుండి లీటరు ఇథనాల్ ఉత్పత్తికి దాదాపు మూడు వేల లీటర్ల నీరు అవసరమవుతుంది. ఆహార పంటలను ఇంధన ఉత్పత్తికి తరలించడం వల్ల అదనపు భూమిని సాగులోకి తేవలసి వస్తుంది. దానివల్ల భూవినియోగం మార్పు వస్తోంది. అందువల్ల ఉద్గారాలు పెరుగుతాయి. భూతాపం వల్ల పంటల దిగుబడి గణనీయంగా తగ్గడంతో ఆహార కొరత సమస్య ఉత్పన్నమవుతుంది. రైతులకు ఇథనాల్ ఉత్పత్తితో ఒరిగేదేమీ లేదు. ప్రభుత్వమే సబ్సిడీ ధరకు కంపెనీలకు బియ్యం సరఫరా చేస్తుంది. కిలో బియ్యం రూ. 20కు ఇస్తున్నది. అంటే కిలోకు రూ.17 సబ్సిడీ ఇస్తున్నది. ఒక లీటరు ఇథనాల్ ఉత్పత్తికి 2.22 కిలోల బియ్యం సబ్సిడీ ధరకు ఇస్తున్నారు. లీటరు ఇథనాల్ ఉత్పత్తికి బియ్యంపై రాయితీ రూ. 37.74. ఎఫ్‌సీఐ సరఫరా ధర రూ. 37 కు బియ్యం కొంటే లీటరు ఇథనాల్‌కు కావలసిన బియ్యం ధర రూ. 83.78. ప్రభుత్వం నిర్ణయించిన ఇథనాల్ ధర లీటరుకు 56.87. లీటరు పెట్రోలుకు ఇంధన శక్తిలో సమానమైన 1.51 లీటర్ల ఇథనాల్ ఉత్పత్తికి వాడే బియ్యం ఖరీదు రూ.126.5. ఆ పైన ఉత్పత్తి ఖర్చులు ఎటూ ఉంటాయి. అంటే మిశ్రమ ఇంధనం పెట్రోలు కంటే ప్రియమన్న మాట. ప్రస్తుతం రోడ్డుపైనున్న వాహనాలేవీ ఇ20 ఇంధనాన్ని వాడడానికి పనికిరావు. కొత్తగా వచ్చే వాహనాలను అందుకు అనువుగా రూపొందించినా ఇ20 అవసరం తక్కువే ఉంటుంది. అనువుగా మార్చని వాహనాలలో ఇ20 వాడితే ఇంజన్‌కు జరిగే నష్టం గణనీయం. ఇథనాల్ ఇంధనంతో జాతికీ, వాతావరణానికీ ప్రయోజనమేమిటో చర్చ జరగాలి.

– డా॥ కలపాల బాబూరావు, విశ్రాంత శాస్త్రవేత్త

విజయోత్సవ ఆదివారం

గుడ్ ఫ్రైడేకు ముందున్న ఆదివారాన్ని మట్టలాదివారం అంటారు. ఇంగ్లిష్‌లో 'పామ్ సండే' అంటారు. మ్రాని కొమ్మల ఆదివారం అనీ, యేసు యెరూషలేములో ప్రవేశించిన చివరి ఆదివారం అనీ, యేసు యెరూషలేములో విజయోత్సవంతో ప్రవేశించిన దినం అనీ వివిధ రకాలుగా పిలుస్తారు. ఈ ఆదివారం తర్వాత శ్రమల వారం 'ప్యాషన్ వీక్' మొదలవుతుంది. 'ప్యాషన్' అనే పదం 'ప్యాషియో' అనే లాటిన్ పదం నుండి వచ్చింది. అంటే శ్రమ అని అర్థం.



యేసు, ఆయన శిష్యులు ఒలీవల కొండ దగ్గర ఉన్న 'బేత్పగే' గ్రామం దగ్గరకు వచ్చారు. తన శిష్యులలో ఇద్దరిని పిలిచి 'అదిగో మనకు ఎదురుగా ఉన్న గ్రామానికి వెళ్ళండి. అక్కడ ఒక గాడిద కట్టబడి ఉంటుంది. దాని కట్లు విప్పి తోలుకొని రండి. ఎవరైనా మిమ్ముల ప్రశ్నిస్తే ఇది ప్రభువుకు కావాలని చెప్పండి' అని అన్నాడు. శిష్యులు ఆ గ్రామానికి వెళ్ళారు. కట్టబడి ఉన్న గాడిద కట్లు విప్పారు. అక్కడ ఉన్నవారు ఎందుకని అడిగారు. ప్రభువుకు కావాలని జవాబిచ్చారు. వారు అందుకు అంగీకరించారు. యేసు ఆ గాడిద మీద యెరూషలేము వైపు ప్రయాణం సాగించాడు. ఆ దారి పొడవునా జన సమూహములు నేలపై తమ వస్త్రాలను పరుస్తున్నారు. ఆ సమయంలో యెరూషలేము వీధులలో ఇసుక వేసినా రాలనంత జనం ఉన్నారు. అనేకులు ఖర్జూరపు మట్టలు చేతబూని, 'హోసన్నా, హోసన్నా' అంటూ గీతాలను ఆలపిస్తున్నారు. 'హోసన్నా' అంటే 'జయము' అని అర్థం.

ఖర్జూర మట్టలు చేబూని యేసును స్వాగతించారు గనుక దీనిని మట్టలాదివారం అని, చెట్ల కొమ్మలు దారి పొడవునా పరిచారు గనుక మ్రాను కొమ్మల ఆదివారం అని పిలవడం జరిగింది. యేసు పాపం మీద, సాతాను మీద, తుదకు మరణం మీద విజయం సాధించనై యున్నాడు గనుక ఈ రోజును విజయోత్సవ యెరూషలేం ప్రవేశ ఆదివారం అని బైబిల్ పండితులు పేర్కొన్నారు.

– పులుకూరి లాబాను ప్రభుదాసు, కావలి

(నేడు మట్టలాదివారం)

క్లుప్తంగా...

సైబర్ దాడులను నియంత్రించాలి

- ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎస్ సత్యనారాయణ



ఏర్పేడు(తిరుపతి జిల్లా): సైబర్ దాడులను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నియంత్రించాలని ఐఐటీ తిరుపతి డైరెక్టర్ డాక్టర్ కేఎస్ సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో శనివారం పవర్ గ్రిడ్ అండ్ స్మార్ట్ గ్రిడ్ నెట్‌వర్క్‌ల కోసం సైబర్ సెక్యూరిటీ సవాళ్లపై జాతీయ స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 33 ఇంధన రంగ సంస్థల నుంచి 100 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కేఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ సైబర్ భద్రత అవసరాల కోసం ఐఈఈఈ, ఎస్ఈఆర్‌సీ అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ప్రస్తుతం పూర్తిగా శక్తి ఆధారిత ప్రపంచాన్ని కలిగి ఉన్నామన్నారు. అనుభవాన్ని పంచుకోవడం, అవగాహన కల్పించడం ఈ సమావేశం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైడ్రో, సీఐఎస్‌వోఎంవోపీ, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ జీవోఎల్ అథారిటీ, ఎక్స్ అఫిషియో అదనపు కార్యదర్శి ఎంఏకేపీ సింగ్, ఇండియా స్మార్ట్ గ్రిడ్ ఫోరం(ఎస్‌జీఫ్) అధ్యక్షుడు రెజీకుమార్ పిళ్లైమురుగేశన్, శివప్రసాద్‌రెడ్డి, సంజీవ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కులవాదుల దాడులు దుర్మార్గం

- 916వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నేతలు



తాడికొండ: తాము శాంతియుతంగా కొనసాగిస్తున్న ఉద్యమంపై కులవాదులు వరుస దాడులు చేయడం దుర్మార్గమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యాన గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారం 916వ రోజుకు చేరాయి. ఈ దీక్షా శిబిరంలో పలువురు నాయకులు మాట్లాడుతూ మూడు రాజధానులకు మద్దతుగా దీక్ష చేస్తున్న బహుజనులపై 2021లో కులవాదులు దాడిచేశారని, అదే ఏడాది ఉద్దండరాయునిపాలెంలో కూడా దాడి చేసి రాళ్లతో కొట్టి గాయపరిచారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అమరావతికి మద్దతుగా చేస్తున్న దీక్షలకు పూర్తిగా ఆదరణ కొరవడిందని, 29 గ్రామాల్లో సైతం పదిమంది కూడా టెంట్లలో కనిపించకపోవడంతో విచక్షణ కోల్పోయిన కులవాదులు చంద్రబాబు డైరెక్షన్‌లో తమపై దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సీబీఐ కేసుల నుంచి బయటపడేందుకే మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి... బాబు కనుసన్నల్లో బీజేపీలో చేరి టీడీపీకి కోవర్టుగా మారాడనేది బహిరంగ సత్యమని, అమరావతి దీక్షల వేదికగా ఇది బట్టబయలైందన్నారు. బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఇందుపల్లి సుభాషిణి, ఈపూరి ఆదాం, పులిదాసు, బేతపూడి సాంబయ్య, పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

'స్పేస్' కాంటెస్ట్‌లో ప్రపంచ చాంపియన్‌గా శ్రీచైతన్య

సాక్షి, హైదరాబాద్: అమెరికా నాసా వారి ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్–2023లో శ్రీచైతన్య వరుసగా పదో సంవత్సరం ప్రపంచ చాంపియన్‌గా నిలిచింది. ప్రపంచ నలుమూలల నుంచి 30కి పైగా దేశాలు పాల్గొన్న ఇందులో తమ విద్యార్థులు నెంబర్‌వన్ స్థానంలో నిలబెట్టారని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. ఎన్ఎస్ఎస్ కాంటెస్ట్‌లో ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 138 ప్రాజెక్టుల్లో 89 ప్రాజెక్టులు ఒక్క భారత దేశం నుంచి ఎంపికవ్వగా.. అందులో 54 ప్రాజెక్టులు ఒక్క శ్రీచైతన్య నుంచే ఎంపికయ్యాయని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరల్డ్ 1, 2, 3 ప్రైజ్‌లలో గానీ, విన్నింగ్ ప్రాజెక్ట్ సంఖ్యలో గానీ శ్రీచైతన్య విద్యార్థులు సత్తా చాటారన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను శ్రీచైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ బి.ఎస్.రావు అభినందించారు.



హంస వాహనంపై రాములోరి విహారం

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో వెలసిన శ్రీ కోదండ రామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం కేరళ వాయిద్యాలు, కోలాటాల నడుమ వేణుగానాలంకారంలో కోదండ రాముడు భక్తులకు అభయం ఇచ్చారు. అనంతరం రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు హంస వాహనంపై రాములోరు విహరించారు. టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్ బాబు ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు.

నేడు వటపత్రశాయి అలంకారం..

కోదండ రామాలయంలో మంగళవారం ఉదయం 8:00 గంటలకు వటపత్రశాయి అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనం ఇస్తారు. రాత్రికి సింహ వాహనంపై కోదండ రాముడు ఒంటిమిట్ట పురవీధుల్లో ఊరేగుతారు.

ఐదు రోజుల్లో ఇల్లు రెడీ

భారత నిర్మాణ రంగంలో అడుగుపెట్టిన 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ



- అందుబాటులోకి తెచ్చిన ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థులు
- 600 చ.అడుగుల ఇల్లు.. ఐదు రోజుల్లో నిర్మాణం
- రూ.5.50 లక్షల ఖర్చు.. 60 ఏళ్లకు పైగా మన్నిక
- బెంగళూరులో మరో 3 అంతస్తుల భవనం సిద్ధం
- దేశ అవసరాలకు అనుగుణంగా టెక్నాలజీ వినియోగం



ఇటుక
ఇటుక పేర్చి ఇల్లు కట్టే స్థాయిని దాటేసి.. నచ్చిన మోడల్‌లో ఇంటిని ప్రింటింగ్ చేసుకునే స్థితికి వచ్చేశాడు మనిషి. నెలలు, సంవత్సరాల తరబడి కట్టే ఇళ్లను సైతం త్రీడీ ప్రింటింగ్ హౌసింగ్ టెక్నాలజీ సాయంతో గంటలు.. రోజుల్లోనే చకచకా నిర్మించేస్తున్నాడు.

సాక్షి, అమరావతి: భారత నిర్మాణ రంగంలో కొత్త టెక్నాలజీ చేరింది. శ్రమ లేకుండా ఆధునిక సాంకేతిక పద్ధతిని వినియోగించడం ద్వారా ఇళ్లను సిద్ధం చేయడంపై మద్రాస్ ఐఐటీ పూర్వ విద్యార్థులు చేసిన ప్రయోగాలు ఫలించాయి. సంప్రదాయ నిర్మాణాలకు భిన్నంగా 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ ఇళ్లను అందుబాటులోకి తెచ్చారు. ఇందుకోసం 'త్వస్త మాన్యుఫాక్చరింగ్ సొల్యూషన్స్' పేరుతో స్టార్టప్ సంస్థను స్థాపించి 3డీ ప్రింటర్‌ను అభివృద్ధి చేశారు. ప్రయోగాత్మకంగా ఐఐటీ ప్రాంగణంలోనే కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఓ ఇంటిని నిర్మించారు. ఒకే అంతస్తులో 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో కేవలం రూ.5.50 లక్షల ఖర్చుతో.. ఆధునిక హంగులతో 5 రోజుల్లోనే ఇల్లు పూర్తయిపోయింది. సామగ్రి కొనుగోలు, రవాణా, లేబర్ ఖర్చులు వంటివేమీ లేకుండా నిర్మించిన ఈ ఇళ్లు 50 నుంచి 60 ఏళ్లపాటు నాణ్యతతో మన్నుతాయని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు.

'త్వస్త'తో జత కట్టిన ఎల్ అండ్ టీ

త్వస్త స్టార్టప్ అందుబాటులోకి తెచ్చిన ఈ 3డీ ఇల్లు దేశాన్ని ఆకర్షిస్తోంది. తక్కువ ఖర్చుతోనే ఆధునిక హంగులతో డబుల్ బెడ్రూమ్ ఇంటిని పూర్తిచేయగలగడంతో ప్రముఖ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ త్వస్త మాన్యుఫాక్చరింగ్ సొల్యూషన్స్‌తో కలిసి పనిచేసేందుకు ముందుకొచ్చింది. ఇప్పటికే బెంగళూరులో 1000 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడంతస్తుల 3డీ ప్రింటెడ్ భవన నిర్మాణం పూర్తి చేసింది. భారత తపాలా శాఖకు చెందిన ఈ భవన నిర్మాణానికి కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అనుమతి సైతం మంజూరు చేయడం గమనార్హం. కొత్తగా వచ్చిన 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ ఇప్పటికే ప్రపంచంలోని చాలా దేశాలను ప్రభావితం చేసిందని.. ఈ టెక్నాలజీలో పెద్దఎత్తున ఇళ్ల నిర్మాణం చేపడితే తక్కువ సమయంలోనే లక్షలాది మందికి సొంతింటి కలను నిజం చేయవచ్చని ఇంజనీరింగ్ నిపుణులు పేర్కొంటున్నారు.

ప్లాన్.. కాంక్రీట్.. ప్రింటింగ్

సాధారణ ఇంటి నిర్మాణం మాదిరిగానే 3డీ ప్రింటింగ్ నిర్మాణం కూడా సాగుతుంది. అయితే, ఇందులో కార్మికులకు బదులుగా యంత్రం నిర్మాణ పని చేస్తుంది. ఇంటిని ఎక్కడ కట్టాలో నిర్ణయించాక, అవసరమైన ప్లాన్ (బ్లూప్రింట్) రూపొందిస్తారు. గోడలు, గదులు ఎలా ఉండాలో ప్లాన్ చేసి ఇంటి బ్లూప్రింట్ మోడలింగ్ సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్ ద్వారా సిద్ధం చేస్తారు. అనంతరం ప్లాన్‌ను కంప్యూటర్ సాయంతో భారీస్థాయిలో ఉండే 3డీ ప్రింటర్‌కు పంపిస్తారు. ఇంటి ప్రింటింగ్ ప్రారంభించే ముందు.. పేస్ట్ లాంటి బిల్డ్ మిశ్రమాన్ని (కాంక్రీట్) వేసేందుకు అనువుగా నిర్మాణ ప్రాంతం చుట్టూ యంత్రం రోబోటిక్ హ్యాండ్ కదిలేందుకు వీలుగా బిల్డింగ్ సైట్ చుట్టూ పట్టాలు అమరుస్తారు. అన్నీ సరిచూసుకున్నాక యంత్రానికున్న 'ప్రింట్' బటన్ ఆన్ చేయగానే ప్రింటర్ దానికదే ప్లాన్ ప్రకారం నిర్మాణాలన్నీ ప్రారంభించి గోడలు, కిటికీలు, వెంటిలేటర్లు వంటివి పూర్తిచేస్తుంది. ఇందులో ప్రింటర్‌లోని నాజిల్ ద్వారా కాంక్రీట్ మెటీరియల్ బయటకు వస్తే.. దాన్ని మరో కాంక్రీట్ డ్రయర్ నిర్మాణ సామగ్రిని త్వరగా పటిష్టం చేస్తుంది. ఆ వెంటనే దానిపై మరో పొర కాంక్రీట్ వేస్తుంది. ఇలా పొరలు పొరలుగా ప్లాన్‌లో ఉన్నట్టుగా నిర్మాణం పూర్తవుతుంది. ఆపై కిటికీలు, తలుపులు, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వైరింగ్ వంటి పనులను కార్మికులతో పూర్తిచేస్తారు.

భగవంతుడి రక్షణలో భారతదేశం

శంకర విజయేంద్ర సరస్వతి స్వామి



అనుగ్రహభాషణ చేస్తున్న శంకర విజయేంద్ర సరస్వతి స్వామి

తెనాలి : భారతదేశం ఎల్లప్పుడూ భగవంతుడి రక్షణలో ఉంటుందని శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి చెప్పారు. ధర్మ ప్రచారానికి ఎప్పుడు అవసరం ఉంటే అప్పుడు భగవంతుడు కొత్త స్వరూపంతో అవతరించి, ప్రజలందరినీ ధర్మమార్గంలో నడిపిస్తాడని తెలిపారు. శ్రీ శంకర సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఇక్కడ ఏర్పాటు చేసిన భారీ ఆధ్యాత్మిక కార్యక్రమంలో వేలాదిగా హాజరైన భక్తులనుద్దేశించి స్వామి అనుగ్రహభాషణం చేశా రు. పవిత్ర పుణ్యభూమిగా, కర్మభూమిగా విలసిల్లే భారత దేశంలో చిన్న చిన్న ధర్మ కార్యాలు కూడా మహత్తరమైన ఫలితాలనిస్తాయని చెప్పారు.
కలియుగంలో వైశాఖ శుక్ల పంచమి రోజున కేరళలో పరమేశ్వరుడే శంకరాచార్యుడిగా అవతరించారని, సనాతన హైందవ ధర్మం ప్రకారం ధర్మశాస్త్రాలను ఆచరించి, ప్రజలకు ధర్మ మార్గ నిర్దేశం చేశారని తె లిపారు. సృష్టి ఆరంభం నుంచే గొప్ప సనాతన హైందవ ధర్మం కలిగిన పవిత్ర దేశంలో మనం జన్మించామని, మన ధర్మాలను గురించి తెలుసుకోవాలని భక్తులకు సూచించారు. ధర్మం అనేది వైజ్ఞానికం, సామాజికమని, ఏ కొందరికో పరిమితం కా దని, అందరికోసం పని చేసేదే సనాతన ధర్మమ ని చెప్పారు. పుష్కరాన్ని ప్రచారం చేసింది ఆంధ్ర దేశమేనని తెలిపారు. అంతకుముందు శంకర విజ యేంద్ర సరస్వతి స్వామికి కొత్తవంతెన నుంచి సభాస్థలి వరకు పట్టణంలో శోభాయాత్ర జరిపారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పుష్ప దంపతులు స్వామికి స్వాగతం పలికారు.

బొగ్గు యూనిట్లు వదిలేద్దాం

- పునరుత్పాదక విద్యుత్ తీసుకొస్తే ప్రయోజనం
- వచ్చే దశాబ్ద కాలంలో రూ.76 వేల కోట్లకుపైగా ఆదా
- 'రిటైరింగ్ టు సేవ్' పేరుతో జరిగిన అధ్యయనంలో వెల్లడి



సాక్షి, అమరావతి: ఇంధన పరివర్తనలో భాగంగా పాత బొగ్గు యూనిట్లను మూసివేయడం ద్వారా రానున్న దశాబ్ద కాలంలో ఏపీ రూ.76 వేల కోట్లకు పైగా ఆదా చేయగలదని 'రిటైరింగ్ టు సేవ్' పేరుతో జరిగిన 'థింక్ ట్యాంక్ క్లైమేట్ రిస్క్ హారిజన్స్' పరిశోధనలో తేలింది. ఖరీదైన బొగ్గు యూనిట్లను చవకైన పునరుత్పాదక శక్తితో భర్తీ చేయడం వల్ల వినియోగదారులకు విద్యుత్ ఖర్చులను తగ్గించడం.. పంపిణీ సంస్థల ఆర్థిక పనితీరును మెరుగుపరచడం.. రాష్ట్ర పునరుత్పాదక ఇంధన లక్ష్యాలను సాధించడంలో మూడు రెట్లు ప్రయోజనాలు ఉంటాయని అధ్యయనం వెల్లడించింది. అన్ని కొత్త బొగ్గు విద్యుత్ ప్లాంట్లు వాటి సామర్థ్యంలో 40 శాతానికి సమానమైన పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని ఏర్పాటు చేయాలని ఇటీవల విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదేశం నేపథ్యంలో తాజా ఫలితాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

పునరుత్పాదక విద్యుత్‌కు ప్రాధాన్యం

దేశంలోనే పునరుత్పాదక విద్యుత్ రంగంలో వేగంగా వృద్ధిని సాధిస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవల విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్(జీఐఎస్)లో కూడా అత్యధిక ఒప్పందాలు ఇంధన రంగంలో.. అందునా పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తికి సంబంధించే జరిగాయి. దాదాపు రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులు ఈ రంగంలో రానున్నాయి. కాగా, పుష్కలమైన పునరుత్పాదక వ నరులు, ఆధునిక ఇంధన విధానాలతో ప్రణాళికాబద్ధంగా పాత బొగ్గు ప్లాంట్‌లను దశలవారీగా తగ్గించడం ప్రారంభించవచ్చని, దీని ఫలితంగా డిస్కంలకు దీర్ఘకాలిక ఆర్థిక ప్రయోజనాలు లభిస్తాయని 'రిటైరింగ్ టు సేవ్' అధ్యయనం పేర్కొంది.

ఇదీ పొదుపు లెక్క

గత దశాబ్దంలో స్థాపిత విద్యుత్ సామర్థ్యం గణనీయంగా పెరగడంతో ఇప్పుడు మిగులు ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏపీ సాధించింది. ప్రస్తుతం బొగ్గు ప్లాంట్లు 60 శాతం కంటే తక్కువ ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్‌తో నడుస్తున్నాయి. రాష్ట్రంలోని రాయలసీమ థర్మల్ పవర్ స్టేషన్, డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్‌లో 1,680 మెగావాట్ల సామర్థ్యం గల 8 బొగ్గు యూనిట్లను నిలిపివేయడం ద్వారా వచ్చే పదేళ్లలో రూ.19 వేల కోట్ల ఆదా అవుతుందని 'రిటైరింగ్ టు సేవ్' అధ్యయనం అంచనా వేసింది. అదేవిధంగా యూనిట్ రూ.4 లేదా అంతకంటే ఎక్కువ టారిఫ్‌లతో ఉన్న అన్ని ప్లాంట్ల నుంచి విద్యుత్ కొనుగోలును దశల వారీగా తగ్గించి.. యూనిట్ రూ.2.7 చొప్పున లభించే పునరుత్పాదక శక్తితో భర్తీ చేస్తే అదనంగా పదేళ్లలో రూ.57 వేల కోట్లను పొదుపు చేయవచ్చని తెలిపింది. మొత్తం ఆదా రూ.76 వేల కోట్లకు పైగా ఉంటుందని అధ్యయనం లెక్కగట్టింది.

అమ్మవారి సన్నిధిలో హైకోర్టు సీజే ప్రశాంత్‌కుమార్ మిశ్రా



దుర్గమ్మ సన్నిధిలో కుటుంబ సభ్యులతో సీజే ప్రశాంత్‌కుమార్ మిశ్రా



జస్టిస్ వి.సుజాతకు అమ్మవారి ప్రసాదాలు అందజేస్తున్న చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా కుటుంబ సమేతంగా, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత వేర్వేరుగా వచ్చా రు. శనివారం అమ్మవారి పంచహారతుల సేవలో పాల్గొన్న అనంతరం దుర్గమ్మను దర్శించుకుని ప్ర త్యేక పూజలు జరిపించుకున్నారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ వి.సుజాతలకు అమ్మవారి ప్రసాదా లు, పట్టువస్త్రాలను అందజేశారు. తొలుత వీరికి ఆ లయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ సాదరంగా స్వాగతం పలికారు.

దుర్గమ్మ సేవలో సతీశ్‌రెడ్డి



ఆశీర్వచన మండపంలో జి.సతీశ్‌రెడ్డి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కేంద్ర రక్షణశాఖ సాంకేతిక సలహాదారు జి.సతీశ్‌రెడ్డి శనివారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఆలయ అర్చకులు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు.

క్లుప్తంగా

రాహుల్ గాంధీపై మరో పరువు నష్టం కేసు

ఆర్ఎస్ఎస్–కౌరవుల వ్యాఖ్యలపై ఉత్తరాఖండ్‌లో కేసు నమోదు



న్యూఢిల్లీ: ప్రధాని మోదీ ఇంటిపేరుపై అనుచిత వ్యాఖ్యలతో ఎంపీగా అనర్హత వేటు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి మరో తలనొప్పి మొదలైంది. మహాభారతంలోని కౌరవులను రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్)తో పోలుస్తూ రాహుల్ వ్యాఖ్యలు చేశారంటూ ఆర్ఎస్ఎస్ కార్యకర్త ఒకరు కేసు వేశారు. గతంలో భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ చేసిన ఈ వ్యాఖ్యలపై ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ కోర్టులో కమల్ భదౌరియా అనే వ్యక్తి పరువు నష్టం కేసు వేశారు. ఈ కేసు ఈనెల 12వ తేదీన విచారణకు రానుంది. కమల్ న్యాయవాది చెప్పిన ప్రకారం.. ఈ జనవరి తొమ్మిదో తేదీన భారత్ జోడో యాత్రలో భాగంగా హరియాణాలోని అంబాలా పట్టణంలోని ఒక కూడలిలో రాహుల్ ప్రసంగించారు. 'కౌరవులు ఎవరో మీకు తెలుసా ? మొదట మీకు 21 శతాబ్దపు కౌరవుల గురించి వివరిస్తా. వాళ్లంతా ఖాకీ రంగు నిక్కర్లు వేసుకుంటారు. చేతిలో లాఠీ పట్టుకుని 'శాఖ'లు నిర్వహిస్తారు. భారత్‌లోని ఇద్దరు, ముగ్గురు అపర కుబేరులు వీరికి మద్దతుగా నిలుస్తున్నారు' అని రాహుల్ ప్రసంగించారని తన పిటిషన్‌లో కమల్ పేర్కొన్నారు. '21వ శతాబ్దంలో కౌరవులు ఇంకా ఉన్నారు అంటే అది ఆర్ఎస్ఎస్ సభ్యులే' అని ప్రసంగించి ఆర్ఎస్ఎస్ పరువుకు రాహుల్ తీవ్ర భంగం కల్గించారని ఆరోపించారు. 'మోదీ అని ఇంటిపేరు ఉన్నవాళ్లంతా దొంగలే' అని వ్యాఖ్యానించారన్న కేసులో దోషిగా తేలడంతో సూరత్ కోర్టు రాహుల్‌కు ఇప్పటికే రెండేళ్ల జైలుశిక్ష విధించిన విషయం తెల్సిందే. ఎగువ కోర్టులో అప్పీల్‌కు అవకాశం కల్పిస్తూ శిక్ష అమలును తాత్కాలిక నిలుపుదల చేసిన విషయం తెల్సిందే.

'అది కేంద్రం పరిధిలోది'

న్యూఢిల్లీ: పార్టీ ఫిరాయించే ప్రజాప్రతినిధులు సదరు సభ కాలపరిమితిలో జరిగే ఉప ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించడం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని ఎన్నికల సంఘం పేర్కొంది. ఇందులో తమ పాత్రేమీ ఉండబోదని స్పష్టం చేసింది. కాంగ్రెస్ నాయకురాలు జయా ఠాకూర్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టుకు ఈ మేరకు అఫిడవిట్ సమర్పించింది.

చట్టానికి ఆరోగ్య పరీక్ష..



- ప్రైవేట్ వైద్యులు వర్సెస్ ప్రభుత్వ చట్టం..
- రాజస్తాన్‌లో రెండు వారాలుగా స్తంభించిన వైద్య సేవలు
- ఆరోగ్య హక్కు చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు.. 2,500 ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది నిరసన

ప్రజలకు ఆరోగ్య హక్కును పరిపూర్ణంగా అందించేందుకంటూ రాజస్తాన్‌లో అశోక్ గహ్లోత్ ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఆరోగ్య హక్కు చట్టం (రైట్ టు హెల్త్) దుమారం రేపుతోంది. ఎమర్జెన్సీ సమయాల్లో రోగులు ముందుగా డబ్బులు చెల్లించకపోయినా ప్రైవేటు ఆస్పత్రులు, వైద్యులు విధిగా చికిత్స చేసి తీరాలని చెబుతోంది. దీన్ని తీవ్రంగా నిరసిస్తూ ప్రైవేటు వైద్యులు మెరుపు సమ్మెలకు దిగారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపునిచ్చిన సమ్మెలో లక్ష మంది ప్రైవేటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్రంలో దాదాపుగా 2,500 ప్రైవేటు ఆస్పత్రులకు చెందిన వైద్యులు రెండు వారాలుగా ఉధృతంగా ఆందోళనలు కొనసాగిస్తున్నారు. దాంతో అత్యవసర పరిస్థితుల్లోనూ చికిత్స అందించే వైద్యుల్లేక రాష్ట్రంలో రోగులు అల్లాడుతున్నారు. వైద్యం కోసం పొరుగు రాష్ట్రాల బాట పడుతున్నారు. అయినా వెనక్కి తగ్గేది లేదని సీఎం గహ్లోత్ అంటున్నారు. 2018 ఎన్నికల హామీని నెరవేర్చామని చెబుతున్నారు. దేశంలో తొలిసారి రాజస్తానే ఇలాంటి చట్టం తెచ్చిందని ఆరోగ్య మంత్రి ప్రసాద్ లాల్ మీనా గర్వంగా ప్రకటించారు. మరోవైపు ప్రైవేటు డాక్టర్ల వాదన కూడా విని, వారి ఆందోళనలను సీఎం తీర్చాలని కాంగ్రెస్ అసమ్మతి నేత సచిన్ పైలట్ హితవు పలికారు. అలా ఈ చట్టం అధికార కాంగ్రెస్‌లోనూ అంతర్గత పోరుకు దారి తీయొచ్చంటున్నారు.

ఏమిటీ చట్టం?

ఈ చట్టం ప్రకారం ఒక వ్యక్తి అనారోగ్యంతో అత్యవసర పరిస్థితిలో వచ్చినప్పుడు ప్రైవేటు ఆస్పత్రులు, ప్రైవేటు డాక్టర్లు వైద్యం నిరాకరించకూడదు. ముందుగా డబ్బులు చెల్లించకపోయినా చికిత్స అందించి తీరాలి. చికిత్స పూర్తయ్యాక రోగి డబ్బులు కట్టలేని పరిస్థితుల్లో ఉంటే ఆ బిల్లుల్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రమాదాలు, పాము కాట్లు, గర్భిణుల ప్రసవంతో పాటు రాష్ట్ర ఆరోగ్య శాఖ నిర్దేశించిన ఏ పరిస్థితులైనా ఎమర్జెన్సీ కిందకు వస్తాయి. వాటికి వైద్యం నిరాకరించే ఆస్పత్రి/వైద్యుడు తొలిసారి 10 వేలు జరిమానా చెల్లించాలి. ఆ తర్వాత 25 వేలు, అలా పెరుగుతూ పోతుంది.

చట్టంలో స్పష్టత లేని విషయాలివే!

- ఎమర్జెన్సీ అంటే చట్టంలో సరిగ్గా వివరించలేదు. ఒక్కోసారి తలనొప్పి కూడా అత్యవసర పరిస్థితి కిందకు వచ్చి బ్రెయిన్ హెమరేజ్‌కి దారి తీయవచ్చు.
- ఎంత బిల్లయినా ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుందా?
- వైద్య పరీక్షలకయ్యే ఖర్చుల సంగతేమిటి? కడుపు నొప్పి, తలనొప్పితో వచ్చి పరీక్షలన్నీ చేశాక తీరా అది ఎమర్జెన్సీ కాదని తేలితే ఆ వైద్య పరీక్షల ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందా?
- బిల్లు పంపిన ఎన్నాళ్లకు ప్రభుత్వం ఆ సొమ్ముల్ని తిరిగి చెల్లిస్తుంది? ప్రైవేటు ఆస్పత్రులు ఎన్నాళ్లు వేచి చూడాలి?

ప్రైవేటు వైద్యుల నిరసనలెందుకు?

- ప్రైవేటు ఆస్పత్రులను పూర్తిగా రూపుమాపాలన్న ఉద్దేశంతోనే ఈ చట్టాన్ని చేశారని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. వైద్యుల జీవించే హక్కును కాలదన్నేలా ఈ చట్టం ఉందని, ఎమర్జెన్సీ అంటూ రోగులు వస్తే వారి సమస్య ఎలాంటిదైనా చికిత్స తప్పనిసరిగా ఇవ్వాలన్న నిబంధన వల్ల ఇక కనీస విశ్రాంతి కూడా దొరకదని వైద్యులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, ప్రభుత్వ ఆస్పత్రులు తమ బాధ్యతను చాకచక్యంగా ప్రైవేటు ఆస్పత్రులపై నెట్టేస్తున్నాయన్న వాదనలున్నాయి. రోగులు బిల్లులు చెల్లించలేని పక్షంలో వాటిని ప్రభుత్వం ఎలా చెల్లిస్తుందో చట్టంలో స్పష్టత లేదని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయి. ఈ చట్టం అమలు సరిగ్గా జరగకపోతే రోగులకు, డాక్టర్లకు మధ్య పరస్పరం అపనమ్మకం ఎక్కువైపోతుందని వైద్యుల్లో ఒక వర్గం ఆందోళన వ్యక్తం చేస్తోంది. "దీన్ని ఆరోగ్య హక్కు చట్టం అని పిలుస్తున్నారు. కానీ ఇందులో రోగుల హక్కుల కంటే వైద్యుని బాధ్యతలే ఎక్కువ! దీన్ని బలవంతంగా రుద్దితే వైద్యులు ఆర్థికంగా, వృత్తిపరంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటారు" అని జైపూర్‌కు చెందిన డాక్టర్ బ్రూనో అన్నారు.

వైద్యులకు వేధింపులు తప్పవా?

- ప్రైవేటు క్లినిక్‌లో డాక్టర్ చికిత్స ఇవ్వడానికి నిరాకరిస్తే అతనిపై రోగి న్యాయపరమైన చర్యలకు దిగొచ్చు. చట్టంలోని ఈ నిబంధన వల్ల తాము వేధింపులకి గురి కాక తప్పదని, అధికార యంత్రాంగం జోక్యం పెరిగిపోయి తప్పుడు కేసులు కూడా నమోదయ్యే అవకాశాలున్నాయని ప్రైవేటు డాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. "ఎవరికైనా చిన్న ప్రైవేటు క్లినిక్ ఉంటే ఎమర్జెన్సీ కింద 24 గంటలు తెరిచి ఉంచడం కష్టం. వైద్యులకు వ్యక్తిగత జీవితం ఉండదా? రోగులు కేసు పెడితే దాన్ని సవాల్ చేసే అవకాశం వైద్యులకు లేకుండా చేశారు. ఇది కచ్చితంగా వైద్యుల్ని వేధించేందుకే" అని జైపూర్ అసోసియేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ అమిత్ యాదవ్ విమర్శించారు.

ప్రజా హక్కులకు వ్యతిరేకం కాదు

- రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనల్లో పాల్గొంటున్న వైద్యులు, ఆరోగ్య నిపుణులు, సామాజిక కార్యకర్తలు అందరికీ ఆరోగ్యం అందించాలనే ఆ చట్టం స్ఫూర్తికి తాము మద్దతుగానే నిలుస్తున్నామని అంటున్నారు. ప్రభుత్వ ఉద్దేశం మంచిదే అయినా చట్టంలో ఎన్నో లొసుగులున్నాయని డాక్టర్ పార్థ శర్మ అన్నారు. వాటినన్నింటిని తీర్చాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత చట్టాన్ని యథాతథంగా అమలు చేస్తే మంచి కంటే చెడే జరుగుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.


వైద్యుల నిరసన(ఫైల్)

– సాక్షి, నేషనల్ డెస్క్

ఏప్రిల్–జూన్‌లో వేడి సెగలు!

- దేశంలో చాలా చోట్ల కాస్తంత ఎక్కువగానే ఉష్ణోగ్రతలు
- అంచనాలు వెల్లడించిన భారత వాతావరణ శాఖ



న్యూఢిల్లీ: వాయవ్య ప్రాంతం మినహా దాదాపు భారతదేశమంతటా ఈ ఏప్రిల్ నుంచి జూన్ నెలదాకా సాధారణం కంటే కాస్త ఎక్కువగానే ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. సంబంధిత వివరాలను శనివారం ప్రకటించింది. '2023 ఎండాకాలంలో మధ్య, తూర్పు, వాయవ్య భారతంలో సాధారణం కంటే ఎక్కువగా హీట్‌వేవ్ రోజులు కొనసాగవచ్చు. దేశవ్యాప్తంగా సాధారణ గరిష్ఠ ఉష్ణోగ్రతలు కొద్దిగా అధికం కావచ్చు. అయితే దక్షిణ భారతదేశంలో, ఇంకొన్ని వాయవ్య ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు అనేవి సాధారణంగా, సాధారణం కంటే తక్కువగా నమోదుకావచ్చు' అని వాతావరణ శాఖ తన అంచనాల్లో పేర్కొంది. మైదాన ప్రాంతాల్లో 40 డిగ్రీల సెల్సియస్‌ను, తీరప్రాంతాల్లో 37 డిగ్రీల సెల్సియస్‌ను, కొండ ప్రాంతాల్లో 30 డిగ్రీల సెల్సియస్‌ను దాటినా, ఆ సీజన్‌లో ఆ ప్రాంతంలో సాధారణంగా నమోదవ్వాల్సిన ఉష్ణోగ్రత కంటే 4.5 డిగ్రీల సెల్సియస్ ఎక్కువ ఉష్ణోగ్రత ఉంటే దానిని హీట్‌వేవ్‌గా పరిగణిస్తారు. భారత్‌లో 1901 నుంచి ఉష్ణోగ్రతల నమోదును గణిస్తుండగా ఈ ఏడాది ఫిబ్రవరి.. అత్యంత వేడి ఫిబ్రవరిగా రికార్డులకెక్కడం గమనార్హం. అయినాసరే సాధారణం కంటే ఎక్కువగా(29.9 మిల్లీమీటర్లకు బదులు 37.6 మిల్లీమీటర్లు) వర్షపాతం నమోదవడం, ఏడుసార్లు పశ్చిమ అసమతుల్యతల కారణంగా మార్చి నెలలో ఉష్ణోగ్రతలు మామూలు స్థాయిలోనే కొనసాగిన విషయం విదితమే. గత ఏడాది మార్చి నెల మాత్రం గత 121 సంవత్సరాల్లో మూడో అతి పొడిబారిన మార్చి నెలగా రికార్డును తిరగరాసింది. భారత్‌లో రుతుపవనాల స్థితిని ప్రభావితం చేసే దక్షిణఅమెరికా దగ్గర్లోని పసిఫిక్ మహాసముద్ర జలాలు చల్లబడే(లా నినో) పరిస్థితి బలహీన పడిందని వాతావరణ శాఖ తెలిపింది. లా నినో పరిస్థితి లేదు అంటే ఎల్ నినో ఉండబోతోందని అర్థం. ఎల్ నినో అనేది అక్కడి సముద్ర జలాలు వేడెక్కడాన్ని సూచిస్తుంది. అప్పుడు అక్కడి నుంచి వచ్చే గాలుల కారణంగా భారత్‌లో రుతుపవనాల సీజన్‌లో తక్కువ వర్షాలు కురుస్తాయి. అయితే మే నెలకల్లా పరిస్థితులు మారే అవకాశముందని భిన్న మోడల్స్ అంచనాల్లో తేలిందని వాతావరణ శాఖ తెలిపింది.

హస్తినకొస్తే అంతం చేస్తాం

- ఏకే47తో కాల్చేస్తాం
- శివసేన ఎంపీ సంజయ్‌రౌత్‌ను బెదిరించిన గ్యాంగ్‌స్టర్ బృంద సభ్యుడు!
- రౌత్ ఫిర్యాదుతో ఒకరి అరెస్ట్



ముంబై: ఓ గ్యాంగ్‌స్టర్ బృందం తనను చంపేస్తానని బెదిరించిందని శివసేన (ఉద్ధవ్ ఠాక్రే వర్గం) ఎంపీ సంజయ్ రౌత్ సంచలన ఆరోపణలు చేశారు. బెదిరింపుల అంశంపై వెంటనే ముంబైలో పోలీసులకు ఆయన ఫిర్యాదుచేశారు. ముంబైలో ఉండే సంజయ్‌రౌత్ ఢిల్లీకొస్తే ఏకే47 తుపాకీతో కాల్చిపడేస్తామని హెచ్చరిస్తూ ఆయనకు వాట్సాప్‌లో సందేశం పంపారు. ఈ ఘటనలో ముంబై పోలీసులు పుణేకు చెందిన 23 ఏళ్ల రాహుల్ తలేకర్‌ను అరెస్ట్‌చేశారు. కంజుర్‌మార్గ్ పోలీస్‌స్టేషన్‌లో రౌత్ సోదరుడు, ఎమ్మెల్యే సునీల్ ఇచ్చిన ఫిర్యాదు, పోలీసు అధికారి శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. సంజయ్ రౌత్‌కు రాహుల్ తలేకర్ ముందుగా ఫోన్‌లో బెదిరించేందుకు ప్రయత్నించాడు. అది కుదరకపోవడంతో వాట్సాప్‌లో బెదిరిస్తూ మెసేజ్ చేశాడు. 'రౌత్ హిందువులకు శత్రువు. నువ్వు ఢిల్లీలో కనిపించావంటే ఏకే47తో చంపేస్తా. పంజాబ్ గాయకుడు సిద్ధూ మూసేవాలాకు పట్టిన గతే నీకు పడుతుంది. లారెన్స్ నుంచి వచ్చిన హెచ్చరిక ఇది. నీ, బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్‌ల మరణం తథ్యం. ఇది ఫిక్స్' అని హెచ్చరించాడు. మూసేవాలాను గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ బృందం చంపేసిందని ఆరోపణలు ఉన్న విషయం తెల్సిందే. దీంతో మెసేజ్‌లో పేర్కొన్న లారెన్స్‌ను లారెన్స్ బిష్ణోయ్‌గా పోలీసులు భావిస్తున్నారు. తలేకర్‌ను అరెస్ట్‌చేసిన పోలీసులు అతనిని విచారిస్తున్నారు. సోషల్‌మీడియా ద్వారా బిష్ణోయ్ గురించి తెల్సుకుని, మద్యం తాగిన మైకంలో అతను రౌత్‌కు బెదిరింపు సందేశం పంపినట్లు కేసు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు వార్తలొచ్చాయి. పాత్రా చావల్ కేసులో అరెస్టయి కస్టడీలో ఉన్నప్పుడు తనకు ఇలాంటి బెదిరింపులు వచ్చాయని, వీటిని భయపడేది లేదని రౌత్ స్పష్టం చేశారు. రౌత్‌ను హత్య చేస్తామని బెదిరింపులు రావడాన్ని మహారాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తీవ్రమైన అంశంగా పరిగణించాలని ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే డిమాండ్‌చేశారు.

నా పరువు మంటగలిపేందుకు తెగించారు

- విదేశీ శక్తులతోనూ చేతులు కలుపుతారు: మోదీ
- ప్రతిష్ట దిగజార్చేందుకు 'సుపారీ' ఇచ్చారు
- కాంగ్రెస్, రాహుల్‌పై పరోక్ష విమర్శలు


రైలులో విద్యార్థులతో మాట్లాడుతున్న మోదీ

భోపాల్: తన వ్యక్తిగత ప్రతిష్టను సర్వనాశనం చేసేందుకు 'కొందరు' విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీని, రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ పరోక్షంగా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శనివారం భోపాల్‌లోని రాణి కమలాపతి రైల్వేస్టేషన్‌లో భోపాల్–ఢిల్లీ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. "2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాడే కొందరు నా పరువు ప్రతిష్టలను గంగలో కలపాలని కంకణం కట్టుకున్నారు. ఇందుకోసం ఎంతకైనా దిగజారుతున్నారు. 'మోదీ.. నీ సమాధికి గొయ్యి తవ్వుతాం' అని కూడా కొందరు బహిరంగంగా ప్రతిజ్ఞ చేశారు. తమ లక్ష్యం నెరవేర్చుకునేందుకు దేశ, విదేశీ శక్తులతో చేతులు కలిపారు. కొందరు ఇక్కడి నుంచి పనిచేస్తే, ఇంకొందరు విదేశాల నుంచి కుట్రలు చేస్తున్నారు. ఇందుకు 'సుపారీ' సైతం ఇచ్చారు. వారికో విషయం తెలీదనుకుంటా. ఓట్లేసి నన్ను గెలిపించుకున్న కోట్లాది ప్రజానీకం సురక్షా కవచంలా నావైపు నిలిచినంతకాలం నన్నెవరూ ఏమీ చేయలేరు. ఇలాంటి కుట్రలను పటాపంచలు చేస్తూ దేశాభివృద్ధి కోసం, జాతి నిర్మాణం కోసం ప్రతి ఒక్క పౌరుడు పాటుపడాలి" అన్నారు. భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని బ్రిటన్‌లో రాహుల్ వ్యాఖ్యానించడం, రాహుల్‌ను ఎంపీగా అనర్హుడిగా ప్రకటించిన ఉదంతాన్ని నిశితంగా గమనిస్తున్నామని జర్మనీ, అమెరికా ఉన్నతాధికారులు ప్రకటించిన నేపథ్యంలో మోదీ వ్యాఖ్యలుచేయడం గమనార్హం. భారత అంతర్గత వ్యవహారాల్లోకి రాహుల్ కుట్రపూరితంగా విదేశాల జోక్యాన్ని ఆహ్వానిస్తున్నారని బీజేపీ తీవ్రంగా ఆక్షేపించడం తెల్సిందే.

బుజ్జగింపులతో సరిపుచ్చారు

'గత ప్రభుత్వాలు రైల్వే సేవల విషయంలో ప్రజలను బుజ్జగింపులతోనే సరిపుచ్చాయిగానీ సరైన ప్రయాణ భాగ్యం దక్కనివ్వలేదు. ఆ ఒక్క కుటుంబం గురించే పట్టించుకున్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజల ప్రయాణ సేవలను గాలికొదిలేశారు. మా సర్కార్ సంస్కరణలు తెచ్చి ప్రజానీకం సౌకర్యవంతంగా ప్రయాణించేలా, వారి ఆకాంక్షలకు తగ్గట్లు రైల్వే శాఖను ఆధునీకరిస్తోంది. ప్రజల్ని మోదీ ఒకటోతేదీన ఏప్రిల్ ఫూల్ చేస్తాడని కాంగ్రెస్ మిత్రులు అంటున్నారు. కానీ మేం అదే ఏప్రిల్ ఒకటిన రైలు ప్రారంభించి చూపించాం. ఈ సెమీ–హైస్పీడ్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ దేశ నైపుణ్యం, సామర్థ్యం, భరోసాకు ప్రతీక' అని అన్నారు. '2014కు ముందు వరకు రైల్వే బడ్జెట్‌లో మధ్యప్రదేశ్‌కు రూ.600 కోట్లు దక్కేవి. మా హయాంలో ఇది ఏకంగా రూ.13,000 కోట్లను దాటింది. కొత్త రైలుతో ఇక్కడి నుంచి ఢిల్లీకెళ్లే వ్యాపారాలు, వృత్తినిపుణులకు ఎంతో ప్రయోజనం. పర్యాటకాభివృద్ధితో ఉపాధి అవకాశాలూ పెరుగుతాయి' అని అన్నారు. ఈ మార్గానికి సమీపంలోనే సాంచీ, భీమ్‌బెట్కా, భోజ్‌పూర్, ఉదయగిరి గుహలు ఉన్నాయి. 'స్వాతంత్ర్యంరాగానే సిద్ధంగా ఉన్న రైల్వే నెట్‌వర్క్‌ను మాత్రమే గత ప్రభుత్వాలు అప్‌గ్రేడ్ చేశాయి. కొత్త రైల్వేస్‌ను సొంత రాజకీయ ప్రయోజనాలకు పణంగా పెట్టాయి. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఎందుకు ఈశాన్య రాష్ట్రాలను రైల్వేనెట్‌వర్క్‌లో అనుసంధానం చేయలేదు?. గతంలో ఎందుకు ఆధునీకరించి నవీకరించలేదు ?' అని ప్రశ్నించారు. కార్యక్రమంలో భాగంగా 'భారతీయ రైల్' ఇతివృత్తంతో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో ఎంపికైన 300 మంది చిన్నారులతో మోదీ మాట్లాడారు. ఆ రైలులో సిబ్బందితోనూ సంభాషించారు. రైలు సర్వీస్ ప్రారంభోత్సవంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర గవర్నర్ మంగూ భాయ్, సీఎం చౌహాన్ పాల్గొన్నారు. భారతీయ రైల్వే నెట్‌వర్క్‌లో శనివారం తప్ప మిగతా వారమంతా నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లలో ఇది 11వది. కొత్త రైలులో అధునాతన బ్రేకింగ్ వ్యవస్థ కారణంగా విద్యుత్ 30 శాతం ఆదా అవనుంది.

సైనిక సన్నద్ధతపై సమీక్ష

సైనిక దళాల సన్నద్ధత, దేశం ఎదుర్కొంటున్న భద్రతా సవాళ్లు తదితరాలపై ప్రధాని మోదీ కీలక వార్షిక సమీక్ష నిర్వహించారు. భోపాల్‌లో జరిగిన ఈ సమీక్షలో త్రివిధ దళాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సరిహద్దుల వెంబడి చైనాతో సవాళ్లు, పాకిస్తాన్ నుంచి సీమాంతర ఉగ్రవాదం తదితర అంశాలు చర్చకు వచ్చినట్టు రక్షణ శాఖ పేర్కొంది. "కొత్త సవాళ్లను దీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ప్రధాని సూచించారు. అందుకవసరమైన సాయుధ, సాంకేతిక సంపత్తిని ఎప్పటికప్పుడు అందజేసేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్టు వివరించారు" అని వివరించింది. పలు అంశాలను ప్రధానికి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ వివరించారు.

సత్ప్రవర్తనతో రెండు నెలల ముందే...

సిద్ధూ విడుదల



పటియాలా: పంజాబ్ రాష్ట్ర కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నవ్‌జ్యోత్ సింగ్ సిద్ధూ జైలుశిక్ష ముగించుకుని శనివారం పటియాలా కేంద్ర కారాగారం నుంచి విడుదలయ్యారు. బయటకు రాగానే కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. 'ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేశారు. రాజ్యాంగబద్ధ వ్యవస్థలను బానిసలుగా తమ ఇష్టానికి వాడుకుంటున్నారు. పంజాబ్‌లో రాష్ట్రపతి పాలన తెచ్చేందుకు కుట్ర పన్నుతున్నారు' అని మోదీ ప్రభుత్వాన్ని విమర్శించారు. ఆప్ నేత, సీఎం భగవంత్ మాన్‌ను అక్బారీ (పత్రికల్లో ప్రకటనలిచ్చే) ముఖ్యమంత్రిగా అభివర్ణించారు. రాష్ట్రం శాంతిభద్రతలు, రుణాల సమస్యల వలయంలో చిక్కుకుందన్నారు. 'దేశాన్ని నిరంకుశ పాలన పట్టిపీడించిన ప్రతిసారి దేశంలో విప్లవం పుట్టుకొస్తుంది. అలా ఈసారి పుట్టుకొచ్చిన విప్లవమే రాహుల్ గాంధీ' అని సిద్ధూ వ్యాఖ్యానించారు. 1988లో ఒక రోడ్డు ప్రమాద గొడవలో ఘర్షణ పడటంతో ఒకరి మృతికి కారణమైన నేరానికి సిద్ధూకు సుప్రీంకోర్టు గత ఏడాది మేనెలలో ఒక ఏడాదిపాటు జైలుశిక్ష విధించిన విషయం విదితమే. సత్ప్రవర్తన కారణంగా సిద్ధూ 10 నెలలకే విడుదలయ్యారని ఆయన న్యాయవాది తెలిపారు. సిద్ధూ విడుదల సందర్భంగా జైలు ప్రాంతం ఆయన మద్దతుదారులతో నిండిపోయింది.

సభలు నడవాలని బీజేపీకి లేదు

అందుకే సయోధ్య చర్యల్లేవు: కాంగ్రెస్

న్యూఢిల్లీ: పార్లమెంటు సమావేశాలు సాగాలనే ఉద్దేశం మోదీ సర్కారుకు లేనే లేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. అందుకే ప్రతిష్టంభనను తొలగించేందుకు విపక్షాలతో రాజీ ప్రయత్నాలేవీ చేయడం లేదని ఆ పార్టీ నేత జైరాం రమేశ్ అన్నారు. దాంతో చరిత్రలోనే తొలిసారిగా బడ్జెట్ సమావేశాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం కనిపిస్తోందన్నారు. కీలకమైన బిల్లులను ఎలాంటి చర్చా లేకుండానే ప్రభుత్వం ఆమోదముద్ర వేయించుకుంటోందని మండిపడ్డారు. నిబంధనల ప్రకారం స్టాండింగ్ కమిటీలకు పంపాల్సిన బిల్లులను వ్యతిరేకత భయంతో తమ పార్టీ నేతల సారథ్యంలోని సెలెక్ట్ కమిటీలకు పంపుకుంటోందని ఆరోపించారు. మార్చి 13న మొదలైన రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో ఒక్క రోజు కూడా ఉభయ సభలు సజావుగా జరగని విషయం తెలిసిందే. అదానీ అంశంపై సంయుక్త పార్లమెంటరీ సంఘం విచారణకు విపక్షాలు, భారత్‌లో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందన్న వ్యాఖ్యలపై రాహుల్ క్షమాపణకు అధికార బీజేపీ పట్టుబడుతుండటంతో రోజూ వాయిదాల పర్వమే కొనసాగుతోంది.

'మోదీ' తీర్పు దేశానికే షాక్: కేజ్రీవాల్



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్హతల వివరాలను వెల్లడించాల్సిన అవసరం లేదంటూ గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పుతో దేశమంతా షాకైందని ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. శనివారం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు. "మోదీ విద్యార్హతలపై అనుమానాలను ఈ తీర్పు మరింత పెంచింది. ఆయన నిజంగానే గుజరాత్, ఢిల్లీ యూనివర్సిటీల్లో చదివి ఉంటే ఆ విషయాన్ని అవి గర్వంగా చెప్పుకోవాలి. అలాకాకుండా వివరాలు దాచేస్తున్నాయి. మోదీకి నిజంగానే డిగ్రీ ఉంటే దాన్ని గుజరాత్ వర్సిటీ ఎందుకు చూపించడం లేదు? ఇందుకు మోదీ అహంకారమైనా కారణం అయ్యుండాలి. లేదంటే ఆయన సర్టిఫికెట్లు నకిలీవైనా అయ్యుండాలి" అని అన్నారు. మోదీ విద్యావంతుడై ఉంటే నోట్ల రద్దు నిర్ణయాన్ని అమలు చేసేవారు కాదని అభిప్రాయపడ్డారు. మోదీ విద్యార్హతలు కోరినందుకు కేజ్రీవాల్‌కు కోర్టు రూ.25 వేల జరిమానా కూడా విధించడం తెలిసిందే.

ఢిల్లీ హిట్ అండ్ రన్ కేసులో చార్జిషీట్

న్యూఢిల్లీ: సంచలనం సృష్టించిన ఢిల్లీ హిట్ అండ్ రన్ కేసులో ఏడుగురు నిందితులపై పోలీసులు శనివారం 800 పేజీల చార్జిషీట్ దాఖలు చేశారు. దాదాపు 120 మంది సాక్ష్యాలను అందులో పొందుపరిచారు. నిందితుల్లో నలుగురిపై హత్యా నేరం మోపారు. దీనిపై విచారణను ఏప్రిల్ 13కు మెట్రోపాలిటన్ జడ్జి సన్యా దలాల్ వాయిదా వేశారు. గత డిసెంబర్ 31న ఢిల్లీలో న్యూ ఇయర్ వేడుకలు చేసుకుని అర్ధరాత్రి దాటాక స్కూటీపై వెళ్తున్న అంజలీసింగ్ అనే 20 ఏళ్ల యువతిని నిందితులు కారుతో ఢీకొట్టడం, ఆమె కారు కింద చిక్కుకుందని తెలిసి కూడా అలాగే 12 కిలోమీటర్లకు పైగా లాక్కెళ్లడం తెలిసిందే. దాంతో ఒళ్లంతా ఛిద్రమై అంజలి అత్యంత బాధాకరంగా మరణించింది.

కెనడా–అమెరికా సరిహద్దు దాటబోతూ...

భారతీయ కుటుంబం దుర్మరణం

టొరంటో: కెనడా నుంచి నదీ మార్గంలో అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించే ప్రయత్నంలో బోటు తిరగబడి ఓ భారతీయ కుటుంబం దుర్మరణం పాలైంది. ఈ ఉదంతానికి సంబంధించి ఇప్పటిదాకా 8 మృతదేహాలను పోలీసులు వెలికితీశారు. ఇవి భారత, రొమేనియా సంతతికి చెందిన రెండు కుటుంబాలవిగా తేలింది. మృతుల్లో భారతీయులు ఎంతమంది అన్నది తేలాల్సి ఉంది. అలాగే మరో మృతదేహం దొరకాల్సి కూడా ఉందని పోలీసులు చెప్పారు.

అమెరికాలో టోర్నడో బీభత్సం


రోలింగ్ ఫోర్క్ పట్టణంలో టోర్నడోతో దెబ్బతిన్న ప్రాంతంలో మాట్లాడుతున్న బైడెన్

18 మందికి పైగా దుర్మరణం

లిటిల్‌రాక్ (యూఎస్): అమెరికాలో వారం క్రితం మిసిసిపి, పరిసర ప్రాంతాలను అల్లాడించిన ప్రాణాంతక టోర్నడో శుక్రవారం దక్షిణ, పశ్చిమ మధ్య ప్రాంతాలను వణికించింది. అర్కన్సాస్, ఇల్లినాయితో పాటు ఇండియానా, అలబామా రాష్ట్రాల్లోనూ పెను విధ్వంసం సృష్టించింది. గంటకు 100 కిలోమీటర్ల పై చిలుకు వేగంతో వచ్చిపడ్డ పెనుగాలుల ధాటికి ఎక్కడ చూసినా నేలమట్టమైన ఇళ్లు, షాపింగ్ సెంటర్లు తదితర భవనాలతో పరిస్థితి భయానకంగా మారింది. టోర్నడో బారిన పడి 18 మందికి పైగా మరణించగా డజన్ల మంది గాయపడ్డారు. అయోవా, ఓక్లహామా రాష్ట్రాల్లోనూ భారీ నష్టం సంభవించింది. దాదాపు 3 లక్షలకు పైగా ఇళ్లకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. పెనుగాలుల కారణంగా పలుచోట్ల అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నాయి. షికాగో అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. అత్యవసర, విపత్తు స్పందన బృందాలు రంగంలోకి దిగాయి. వచ్చే బుధవారం మరికొన్ని భారీ తుపాన్లు, టోర్నడోలు రావచ్చని వాతావరణ విభాగం హెచ్చరించింది.

విమానంలో అసభ్య ప్రవర్తన

ముంబై: విమానాల్లో ప్రయాణికుల ఆగడాలు ఆగడంలేదు. తప్పతాగి ఒకరు.. తోటి మహిళా ప్రయాణికురాలిపై మూత్ర విసర్జన చేస్తూ మరొకరు, సిబ్బంది చెంప చెళ్లుమనిపిస్తూ ఇంకొకరు.. ఇలా అనుచిత ప్రవర్తనలతో ఇప్పటికే పలువురు ప్రయాణికులు అరెస్టవడం తెల్సిందే. గురువారం జరిగిన ఇలాంటి మరో ఘటన తాజాగా శనివారం వెలుగులోకి వచ్చింది. బ్యాంకాక్ నుంచి ముంబైకి వస్తున్న ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం ఈ ఘటనకు వేదికైంది. ఈ ఘటనలో స్వీడన్‌కు చెందిన ప్రయాణికుడిని విమానం ల్యాండ్ అయ్యాక అరెస్ట్‌చేయడం ఆనక బెయిల్‌పై బయటకురావడం చకచకా జరిగిపోయాయి.

అసలేం జరిగింది ?

గురువారం బ్యాంక్ నుంచి ముంబైకి వస్తున్న విమానం మార్గమధ్యంలో ఉండగా 63 ఏళ్ల క్లాస్ ఎరిక్ హరాల్డ్ జోనస్ వెస్ట్‌బర్గ్ అనే ప్రయాణికుడు తనకు చేపలు, రొయ్యలు వంటి సీ–ఫుడ్ మాత్రమే కావాలని గొడవకు దిగాడు. అప్పటికే అతను తప్పతాగి ఉన్నాడు. ఆయనను శాంతింపజేసేందుకు 24 ఏళ్ల విమాన మహిళా సిబ్బంది ఒకరు అతడికి చికెన్ వంటకాన్ని వడ్డించారు. తర్వాత బిల్లు కట్టమని స్వైపింగ్ మెషీన్‌ను ఇస్తుంటే పిన్ టైప్‌చేయకుండా సీటులోంచి లేచి దగ్గరకు వచ్చి ఆమె చేయి పట్టుకుని, అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె సాయం కోసం గట్టిగా అరిచింది. దీంతో ఆమెకు సాయపడబోయిన మరో ప్రయాణికుడిని వెస్ట్‌బర్గ్ కొట్టాడు. వెంటనే ఆమె కెప్టెన్‌కు ఫిర్యాదుచేశారు. కెప్టెన్ నుంచి ఫిర్యాదు అందుకున్న ముంబైలోని ఎయిర్‌పోర్ట్ అధికారులు విమానం ల్యాండ్ అవగానే వెస్ట్‌బర్గ్‌ను అదుపులోకి తీసుకుని సహర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పారు. పోలీసులు అతడిని అరెస్ట్‌చేసి శుక్రవారం అంధేరీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టగా రూ.20,000 పూచీకత్తుపై బెయిల్ మంజూరుచేశారు. ఇలాంటి ఘటనల్లో వెస్ట్‌బర్గ్‌తో కలిపి గత మూడునెలల్లో ఇలా 8 మంది ప్రయాణికులు అరెస్ట్ అవడం గమనార్హం.


కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో ప్రఖ్యాత సూర్య దేవాలయాన్ని దర్శించుకున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బేలా ఎం.త్రివేది

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
ఆదివారం | 2 | ఏప్రిల్ | 2023

కార్పొరేషన్ పరిధిలోకి 130 పాఠశాలలు

సాక్షి, చెన్నై: చెన్నై కార్పొరేషన్ పరిధిలోకి శివార్లలోని తిరువొత్తియూరు, ఎన్నూరు పరిసరాలలో ఉన్న 130 ప్రభుత్వ పాఠశాలలను తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. చెన్నై కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలలను స్మార్ట్‌గా తీర్చిదిద్దే పనులు జరుగుతున్నాయి. ఈ పరిస్థితులలో చెన్నై శివారు ఉత్తర చెన్నై పరిధిలోని తిరువొత్తియూరు, ఎన్నూరు పరిసరాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోని కార్పొరేషన్‌తో అనుసంధానించేందుకు అధికారులు నిర్ణయించారు. అలాగే, చెన్నై కార్పొరేషన్ పరిధిలోని మరో 333 పాఠశాలలలో విద్యార్థులకు అల్పాహార పథకం జూన్ నుంచి అమలు చేయడానికి చర్యలు తీసుకున్నారు.

న్యూస్‌రీల్

అధ్యాపకుడిపై అట్రాసిటీ కేసు

సాక్షి,చెన్నై: కామరాజర్ వర్సిటీ అధ్యాపకుడు షణ్ముగరాజ్‌పై ఓ విద్యార్థిని చేసిన ఫిర్యాదుతో శనివారం అట్రాసిటీ కేసు నమోదైంది. మదురై కామరాజర్ వర్సిటీలో పనిచేస్తున్న ఈ అధ్యాపకుడిపై గతంలో గవర్నర్‌కు సైతం ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై విచారణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. ఈ పరిస్థితుల్లో ఓ విద్యార్థిని కులం పేరుతో దూషిస్తూ రెచ్చిపోయిన ఆ అధ్యాపకుడి వీరంగం వీడియోగా బయటకు వచ్చింది. ఇది సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అదే సమయంలో ఆ విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదుతో సదరు అధ్యాపకుడిపై కేసు నమోదు చేశారు. ఆయన్ను అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు.

సోలార్ సిగ్నల్ బోర్డు ఏర్పాటు



సిగ్నల్ బోర్డును ప్రారంభిస్తున్న కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్

తిరువళ్లూరు: రాష్ట్రంలో సోలార్ విద్యుత్‌తో నడిచే ఆటోమెటిక్ సిగ్నల్ బోర్డును ఆవడి పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ శనివారం ప్రారంభించారు. ఆవడి పోలీసు కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను కఠినతరం చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే సిగ్నల్ బోర్డును ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అంబత్తూరు ప్రాంతంలో రాష్ట్రంలోనే మొట్టమొదట సారిగా సోలార్ విద్యుత్‌తో నడిచే ఆటోమెటిక్ సిగ్నల్ బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సిగ్నల్ బోర్డును శనివారం ఉదయం కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ ప్రారంభించి అందుబాటులోకి తెచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ వాహనచోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసిన ఆయన, నిబంధనలు పాటించి ప్రమాద రహిత ప్రాంతంగా ఆవడి కమిషనరేట్‌ను మార్చాలని ఆదేశించారు.

అన్నను కాల్చి చంపిన తమ్ముడి అరెస్ట్



వెంకటేశన్, చంద్రన్ (ఫైల్)

కొరుక్కుపేట: నాటు తుపాకీతో కాల్చి అన్నను హత్య చేసిన తమ్ముడిని పోలీసులు అరెస్టు చేశారు. తిరుకళికుండ్రం సమీపంలోని కొత్తిమంగళం ఎంజీఆర్ నగర్‌లో సంచార జాతుల వారికి స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా ఉమ్మడి ఇళ్లను ప్రభుత్వం నిర్మించి ఇచ్చింది. ఇక్కడ వెంకటేశన్ (30), అతని తమ్ముడు చంద్రన్ (28) కుటుంబాలతో నివాసం ఉంటున్నారు. ఉమ్మడి ఇంటిని తన పేరుకు మార్చాలని అన్న వెంకటేశన్‌ను చంద్రన్ కోరాడు. అందుకు వెంకటేశన్ నిరాకరించాడు. ఆ ఇంటిని తాను తీసుకుని వెనుక ఉన్న ఖాళీ స్థలాన్ని, రెండు సవర్ల నగలు ఇస్తానని చెప్పాడు. దానికి చంద్రన్ అంగీకరించలేదు. ఈ విషయంగా వీరి మధ్య గొడవ జరుగుతోంది. శుక్రవారం కూడా గొడవ పడ్డారు. చంద్రన్ ఇంటిలో ఉన్న నాటు తుపాకీతో అన్న వెంకటేశన్‌ను కాల్చాడు. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు అక్కడికి చేరుకుని వెంకటేశన్ మృతదేహాన్ని చెంగల్పట్టు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరారీలో ఉన్న చంద్రన్‌ను శనివారం అరెస్టు చేశారు.

ఏదైనా చేయాలన్న తపనతోనే స్టార్టప్‌ల ఏర్పాటు

కొరుక్కుపేట: సరికొత్తగా, కళాత్మకంగా ఏదైనా చేయాలన్న తపనతోనే తమను స్టార్టప్‌లు స్థాపించే స్థాయికి చేర్చినట్టు యువ వ్యాపారవేత్తలు దివ్య దయానిధి మారన్, కరణ్ దయానిధి మారన్, నివేది అరవింద్ తెలిపారు. దేశంలో స్నీకర్స్ కల్చర్ పెరిగిపోతుండటంతో కేకేఐఎక్స్ పేరుతో కొత్త స్టార్టప్ కంపెనీని ప్రారంభించినట్టు తెలిపారు. వారు కేకేఐఎక్స్ ద్వారా కస్టమర్లకు తమకు ఇష్టమైన బ్రాండెడ్ స్నీకర్లను డిజైన్ చేసి అందిస్తున్నారు. స్థానికంగా ఏర్పాటైన సమావేశంలో వ్యవస్థాపకుల్లో ఒకరైన దివ్య దయానిధి మారన్ మాట్లాడుతూ ఉపాధి పొందడంకంటే పదిమందికి ఉపాధి కల్పించేలా ఎదగాలన్నదే తమ ఆలోచన అని చెప్పారు. సరికొత్తగా ఏదైనా చేయాలన్న తపనే తమను ఈ స్థాయికి చేర్చినట్టు ఆనందం వ్యక్తం చేశారు. వినియోగదారుల అభిరుచికి తగినట్టు వారికి ఇష్టమైన రంగుల్లో అందించేలా తమ సంస్థ పనిచేస్తుందని వివరించారు.

తెరపైకి కొత్త జిల్లాలు

రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు విషయం తెరపైకి వచ్చింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు 8 కొత్త జిల్లాలు ఏర్పాటుచేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. దీనికి అసెంబ్లీలో శనివారం రెవెన్యూ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ చేసిన వ్యాఖ్యలు బలాన్ని చేకూర్చుతున్నాయి. అలాగే చెన్నైలో ట్రాఫిక్ రద్దీ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. షోళింగనల్లూరులో బ్రహ్మాండ గ్రీన్ పార్క్ ఏర్పాటు కానుంది.

- అసెంబ్లీలో చర్చ
- మరో 8 జిల్లాల కోసం పట్టు
- చెన్నైలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కొత్త పథకం
- షోళింగనల్లూరులో గ్రీన్ పార్క్
- ఆన్‌లైన్ గేమింగ్‌లకు ప్రత్యేక పాలసీ



అసెంబ్లీ



తమిళనాడు జిల్లాల మ్యాప్

సాక్షి, చెన్నై : రాష్ట్రంలో 2019 వరకు 32 జిల్లాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో విల్లుపురాన్ని విడగొట్టి కళ్లకురిచ్చి, తిరునల్వేలిని విడగొట్టి తెన్‌కాశి, కాంచీపురాన్ని చీల్చి చెంగల్పట్టు, వేలూరును విడదీసి తిరుపత్తూరు, రాణిపేట, నాగపట్నం నుంచి మైలాడుతురై జిల్లాలు ఆవిర్భవించాయి. దీంతో రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 38కి చేరింది. అదే సమయంలో తంజావూరును చీల్చి కుంభకోణం కేంద్రంగా ఓ జిల్లాతో పాటు మరికొన్ని కొత్త జిల్లాల ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు. అదే సమయంలో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగడంతో ఆ నినాదం మరుగున పడింది.

మళ్లీ కొత్త జిల్లాల డిమాండ్

అసెంబ్లీ సమావేశాలలో భాగంగా శనివారం పోలూరు ఎమ్మెల్యే సేవూరు రామచంద్రన్ తన ప్రసంగంలో కొత్త జిల్లాల ఏర్పాటు విషయాన్ని తెరమీదకు తెచ్చారు. తిరువణ్ణామలై అతి పెద్ద జిల్లాగా ఉందని, దీన్ని విడదీసి ఆరణి కేంద్రంగా కొత్త జిల్లా ప్రకటించాలని కోరారు. దీనిపై రెవెన్యూ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ స్పందించారు. రాష్ట్రానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు పలువురు ఇప్పటికే పలు కొత్త జిల్లాల కోసం ప్రభుత్వానికి వినతులు పంపించారని వివరించారు. దీన్నిబట్టి చూస్తే రాష్ట్రంలో కొత్తగా మరో 8 జిల్లాల ఆవిర్భావం అవశ్యమని పేర్కొన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటులో రెవెన్యూ డివిజన్లు, తాలూకాలు, రెవెన్యూ గ్రామాలు, బ్లాకులు, మున్సిపాలిటీలు, పట్టణ, గ్రామ పంచాయతీల విభజన తప్పనిసరని తెలిపారు. ఈ వ్యవహారంపై సీఎంకు విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. దీనిపై చర్చించాల్సిన అవసరం కూడా ఉందన్నారు. అన్నీ సజావుగా జరిగితే కొత్త జిల్లాలపై దృష్టి పెడతామన్నారు.

మంత్రుల సమాధానాలు

ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యుల ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇచ్చారు. మంత్రి నెహ్రూ మాట్లాడుతూ కావేరి – కొల్లిడం ఉమ్మడి తాగునీటి పథకం త్వరలో అమల్లోకి తెస్తామని తెలిపారు. పెరంబలూరు వాసుల దాహార్తిని తీర్చేందుకు రూ. 90 కోట్లతో పథకం చేపట్టనున్నట్టు వివరించారు. రూ.90 కోట్లతో పలాలవరం భూగర్భ డ్రైనేజీ పనులను చేపట్టినట్టు తెలిపారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో వార్డుల విభజన పనులపై దృష్టి పెట్టామని, రెండేళ్లలో ముగిస్తామన్నారు. కావేరి– వైగై– గుండారు అనుసంధానం జరిగి తీరుతుందని మంత్రి దురైమురుగన్ చెప్పారు. రూ. 36 కోట్లతో 7 ఆలయాలకు రాజగోపురాలను నిర్మించనున్నామని దేవదాయ శాఖమంత్రి శేఖర్ బాబు తెలిపారు.

పేపర్ ప్రసంగాలు వద్దు

సభ్యులకు స్పీకర్ అప్పావు సున్నితంగా క్లాస్ పీకారు. మాజీ మంత్రి అన్బళగన్ పేపర్‌లో రాసుకొచ్చిన విషయాలను చదువుతుండగా స్పీకర్ అప్పావు జోక్యం చేసుకున్నారు. పేపర్ లెస్‌గా సభ వ్యవహారాలు జరుగుతున్నా, అనేక మంది సభ్యులు పేపర్‌లో ప్రసంగాలు రాసుకొచ్చి చదివేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పద్ధతి మారాలని ఆయన హితవు పలికారు.

మూడు శాఖలపై చర్చ

అసెంబ్లీలో మూడు శాఖలకు నిధుల కేటాయింపులపై చర్చ జరిగింది. మంత్రి ఏవీ వేలు రహదారులు, ప్రజా పనుల శాఖలకు నిధుల కేటాయింపులు. కొత్త పథకాలను వివరించారు. చెన్నైలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక పథకం అమలు చేయబోతున్నామని ప్రకటించారు. త్వరలో వివరాలను వెల్లడిస్తామన్నారు. రామేశ్వరం నుంచి శ్రీలంకకు ప్రయాణికుల పడవ నడిపేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. రాష్ట్రంలోని పురాతన, పారంపర్య భవనాల సంరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఐటీ శాఖ మంత్రి మనోతంగరాజ్ మాట్లాడుతూ షోళింగనల్లూరులో రూ.20 కోట్లతో గ్రీన్ పార్క్ ఏర్పాటు చేయనున్నామని ప్రకటించారు. అలాగే ఆన్‌లైన్ గేమింగ్ వ్యవహారంలో ప్రత్యేక పాలసీ తీసుకు రానున్నామని తెలిపారు.

టోల్ వడ్డన



- చార్జీల పెంపుపై వ్యతిరేకత
- లారీ, ట్యాంకర్ల యజమానుల నిరసన

సాక్షి, చెన్నై : రాష్ట్రంలోని పలు టోల్‌గేట్లలో చార్జీలు పెరిగాయి. ఇవి శనివారం వేకువజాము నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ పెంపును వ్యతిరేకిస్తూ లారీ, ట్యాంకర్ యజమానులు, ట్రాన్స్‌పోర్టు వాహనదారులు నిరసనకు దిగారు. రాష్ట్రంలోని చెన్నై – తిరుచ్చి– మదురై – కన్యాకుమారి, చెన్నై – కోయంబత్తూరు , చెన్నై – బెంగళూరు జాతీయ రహదారుల్లో పదుల సంఖ్యలో టోల్‌గేట్లు ఉన్న విషయం తెలిసిందే. 60 కిమీ దూరానికి ఒక టోల్ గేట్ చొప్పున ఉండాల్సి ఉన్నా, అందుకు భిన్నంగా రాష్ట్రంలో అనేక చోట్ల ఉన్నాయి. ప్రతి ఏటా టోల్ వడ్డన మోత మోగుతుండడంతో వాహనదారులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని 60 టోల్‌గేట్లలో 39 టోల్ గేట్లలో చార్జీల వడ్డన వేకువజాము నుంచి అమల్లోకి రావడంతో వ్యతిరేకత మొదలైంది. ఈసారి 10 నుంచి 15 శాతం మేరకు వడ్డన మోగింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని టోల్‌గేట్ల వద్ద లారీ, కంటైనర్ వాహనాల యజమానులు, ఇసుక లారీలు, ట్రాన్స్‌పోర్టు వాహన సంఘాల నేతృత్వంలో ఆందోళనలు జరిగాయి. టోల్ చార్జీలు తగ్గించాలని నిరసన కారులు నినదించారు. ఇప్పటికే పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలతో సతమతమవుతున్నామని, ఇప్పుడు టోల్ వడ్డన రూపంలో అదనపు భారం తప్పడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. ఇదిలాఉండగా, ఈ టోల్ వడ్డన వ్యవహారం అసెంబ్లీలో చర్చకు సైతం వచ్చింది. రాష్ట్రంలో అనవసరంగా ఉన్న టోల్‌గేట్లను త్వరితగతిన తొలగించాలని కేంద్ర ప్రభుత్వానికి పదే పదే లేఖలు రాసినట్టు మంత్రి ఏవీ వేలు తెలిపారు. వారు స్పందించని పక్షంలో తర్వాత తామే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

నటుడు ఆర్కే సురేష్ మెడకు ఆరుద్రా ఉచ్చు

సాక్షి, చెన్నై: సినీ నటుడు ఆర్‌కే సురేష్ మెడకు ఆరుద్రా గోల్డ్ ఉచ్చు తగులుకుంది. ఆయన్ను విచారించేందుకు చెన్నై ఆర్థిక నేర విభాగం సిద్ధమైంది. ఆరుద్రా గోల్డ్ పేరిట రాష్ట్రవ్యాప్తంగా జరిగిన రూ.2,438 కోట్ల మోసం కేసును ఆర్థిక నేర విభాగం తీవ్రంగా విచారిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో ఎనిమిది మంది అరెస్టు అయ్యారు. ఇందులో ఆ సంస్థ డైరెక్టర్, బీజేపీ నాయకుడు హరీష్ కూడా ఉన్నారు. వీరి వద్ద జరిపిన విచారణలో ఆర్‌కే సురేష్ పేరు తెరపైకి వచ్చింది. సురేష్ బీజేపీ నాయకుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఈయనకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైతో సన్నిహిత పరిచయం ఉన్నట్టు సామాజిక మాధ్యమాలలో ఫొటోలు ప్రత్యక్షం అయ్యాయి. దీంతో సురేష్‌ను విచారించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ప్రస్తుతం సురేష్ సినీ షూటింగ్ నిమిత్తం విదేశాలలో ఉన్నట్టు సమాచారం. ఆయన్ను విదేశాల నుంచి రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



సురేష్

10 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యం



అవార్డులను ప్రదానం చేస్తున్న మంత్రి మెయ్యనాథన్

– మంత్రి మెయ్యనాథన్

సాక్షి, చెన్నై : రాష్ట్రాన్ని పచ్చదనంతో నింపే విధంగా ఏడాదికి 10 కోట్ల మొక్కలను నాటడం లక్ష్యంగా నిర్ణయం తీసుకున్నామని పర్యావరణశాఖ మంత్రి శివ వి.మెయ్యనాథన్ తెలిపారు. శనివారం సీఐఐ సదరన్ రీజియన్ నేతృత్వంలో స్థానికంగా పర్యావరణం, ఆరోగ్యం, భద్రత అనే అంశంపై ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. అర్హులైన వారికి, సంస్థలకు అవార్డులను అందజేసినానంతరం మంత్రి మెయ్యనాథన్ ప్రసంగిస్తూ, హరిత తమిళనాడు మిషన్ కింద రాష్ట్రంలో 23 నుంచి 33 శాతం వరకు పచ్చదనం పెంపునకు నిర్ణయించామన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఏటా 10 కోట్ల మొక్కలను నాటడం, పర్యవేక్షించడం లక్ష్యంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పర్యావరణ, సామాజిక, ఆర్థిక భద్రతను నిర్ధారించడంలో భాగంగా కొన్ని ముఖ్యమైన ప్రాంతాలు, కోస్టల్ జోన్ మేనేజ్ మెంట్, నీటి వనరుల పునరుద్ధరణ వంటి కార్యక్రమాలు, పర్యావరణ అవగాహన, సామర్థ్యం పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని వివరించారు. కార్యక్రమంలో సీఐఐ వైస్ చైర్మన్ శ్రీవత్స్ రామ్, సీఐఐ -ఎస్ఆర్ ఈహెచ్ఎస్ అవార్డుల కమిటీ చైర్మన్ సోహంజీత్ రంధావా, సబ్ కమిటీ చైర్మన్ రవిచంద్రన్ పాల్గొన్నారు.

కళాక్షేత్ర అధ్యాపకుడిపై కేసు

- రంగంలోకి పోలీసులు
- విచారణ వేగవంతం

సాక్షి, చెన్నై: పూర్వ విద్యార్థిని ఫిర్యాదుతో కళాక్షేత్ర అధ్యాపకుడు హరిపద్మన్‌పై అడయార్ మహిళా పోలీసులు శనివారం కేసు నమోదు చేసి విచారణను వేగవంతం చేశారు. చెన్నై తిరువాన్మియూరులోని నాట్య, సంగీత నిలయం కళా క్షేత్రలోని కొందరు అధ్యాపకులపై లైంగిక వేధింపుల ఆరోపణలు శుక్రవారం కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో పోలీసులు తొలుత స్పందించ లేని పరిస్థితి. పోరాటం చేస్తున్న విద్యార్థినులకు తమ వంతుగా భద్రత కల్పించారు. ఏ ఒక్కరూ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇవ్వకపోవడంతో తొలి రోజు పోలీసులు చోద్యం చూడక తప్పలేదు. అయితే, ఓ పూర్వ విద్యార్థిని శనివారం తెరపైకి వచ్చారు. రెండేళ్ల క్రితం తనకు ఇదే నిలయంలో జరిగిన లైంగిక వేధింపులను వివరిస్తూ అడయార్ మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను పొందిన శిక్షణ, అర్హతలతో ఓ కార్యక్రమానికి తనను ఎంపిక చేశారని, ఇక్కడ పనిచేస్తున్న హరిపద్మన్ లైంగిక వేధింపులు భరించ లేక బయటకురావడమే కాదు, ఆ కార్యక్రమానికి తాను దూరం అయ్యానని ఆవేదన వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను విచారణకు సిద్ధం అని, తనతో పాటు అక్కడున్న బాధిత విద్యార్థినులకు న్యాయం జరగాలని పోలీసులను కోరారు. దీంతో అడయార్ మహిళా పోలీసులు రంగంలోకి దిగారు. పూర్వ విద్యార్థిని ఫిర్యాదుతో ఓ అడయార్ మహిళా పోలీసు హరి పద్మన్‌పై కేసు నమోదు చేశారు. విచారణను వేగవంతం చేశారు. ఆయన వద్ద తీవ్రంగా విచారణ జరుగుతోంది. ఆయన్ను అరెస్టుచేసే అవకాశాలు కూడా ఉన్నట్టు సమాచారం. దీంతో లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ముగ్గురు అధ్యాపకులను సైతం విచారణ వలయంలోకి తెచ్చే విధంగా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.



హరి పద్మన్

324 మంది రౌడీషీటర్ల అరెస్ట్

కొరుక్కుపేట: పరారీలో రౌడీ షీటర్లు చేజింగ్ రాజా, గన్ కార్తీ, ఆర్కాట్ సురేష్, బిను సహా 324 మందిని పోలీసులు పట్టుకున్నారు. చెన్నైలోని క్రైమ్ స్క్వాడ్ పోలీసులు బైక్ రైడర్లు, రౌడీల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈక్రమంలో సీరియస్ క్రైమ్ ప్రివెన్షన్ యూనిట్ పోలీసులు పదేళ్లకు పైగా పరారీలో ఉన్న నేరస్తులను అందుపులోకి తీసుకున్నారు. ప్రధానంగా గన్ కార్తీ , ఆర్కాడు సురేష్ , బిను, కరిమేడు అన్బు, వెల్‌లై ప్రకాష్, పాల్ ప్రవీణ్, రామ్కి, పల్లు సతీష్, రజిని లను అరెస్ట్ చేశారు. ఎగ్మూర్ ప్రాంతంలో మణిమారన్ సహా ఐదుగురు నేరస్తులను అరెస్ట్ చేశారు. గత ఏడాది 280 మంది నమోదిత నేరగాళ్లు, 44 మంది సహా 324 మందిని అరెస్ట్ చేశారు.

కనులపండువగా రథోత్సవం

- తిరువారూర్‌లో భక్త జనసంద్రం
- రోజంతా భక్తుల చెంత స్వామివారు



రథోత్సవానికి హాజరైన భక్తజనసంద్రం

సాక్షి, చెన్నై: తిరువారూరులో రథోత్సవం శనివారం కనులపండువగా జరిగింది. ఉదయం బయలుదేరిన అతిపెద్ద రథం రాత్రి సమయంలో తిరిగి ఆలయం వద్దకు చేరుకుంది. రోజంతా భక్తుల చెంత స్వామివారు గడిపారు. అడుగడుగునా భక్త జనులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

రాష్ట్రంలోని పురాతన, ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో తిరువారూర్ జిల్లా కేంద్రంలో వెలిసిన త్యాగరాజస్వామి ఆలయం కూడా ఒకటి. ఇక్కడ ప్రతి ఏటా వార్షిక పంగుణి రథోత్సవ బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ ఆలయంలో మూలవిరాట్‌గా త్యాగ రాజేశ్వరుడు, వన్నిగనాథర్ పేరిట పరమశివుడు కొలువై ఉన్నారు. ఇక్కడి ఉత్సవమూర్తిని నిధి విడంగర్‌గా కూడా భక్తులు పిలుస్తుంటారు. తొమ్మిది రాజగోపురాలతో దేదీప్యమానంగా కనిపించే ఈ ఆలయంలోని రథం ఆసియా ఖండంలోనే అతి పెద్దది. 96 (29 మీటర్ల) అడుగుల ఎత్తుతో 300 టన్నుల బరువుతో ఈ రథం భక్తులకు కనిపిస్తుంటుంది. ఈ ఏడాది పంగుణి ఉత్తిర తిరువిళాగా ఆలి తేరోట్టం(రథోత్సవ) బ్రహ్మోత్సవాలకు గత నెల 9వ తేదీన శ్రీకారం చుట్టారు. ప్రతిరోజూ ఆలయంలో విశిష్ట పూజలు, అభిషేకాది కార్యక్రమాలు జరిగాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో స్వామివారి వాహన సేవలు జరిగాయి. ఈ ఉత్సవాల్లో ముఖ్య ఘట్టం శనివారం కనులపండువగా జరిగింది.

రథోత్సవం కోలాహలం..

96 అడుగుల రథాన్ని లాగితే కైలాసం, వైకుంఠంలో చోటు దక్కించుకోవచ్చన్నది భక్తుల నమ్మకం. అందుకే ఈ రథోత్సవం నిమిత్తం వేలాదిగా భక్త జనం తిరువారూర్‌కు పోటెత్తారు. విల్లుపురం, తిరుచ్చిల నుంచి తిరువారూర్‌కు ప్రత్యేక రైళ్లు నడిపారు. అలాగే, తిరుత్తురై పూండి, నాగపట్నం, మైలాడుతురై, కుంభకోణం, తంజావూరుల నుంచి ప్రత్యేక బస్సులను నడిపారు. వేలాదిగా వేకువ జామున భక్తులు ఆలయ పరిసరాలలో జరిగిన ఉత్సవాలను తిలకించారు. రథోత్సవం నిమిత్తం అర్ధరాత్రి స్వామి వారు రథం మండపానికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజలు, అలంకరణలు జరిగాయి. త్యాగరాజస్వామిని అనుకరిస్తూ వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, కమలాంబాల్, చండీకేశ్వర స్వాములు ఆ మండపం వద్దకు చేరుకున్నారు. ఉదయాన్నే స్వామి వారు రథంపై ఆశీనులయ్యారు. ముందుగా ఉన్న మరో రెండు చిన్న రథాలలో వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామిని అధిష్టింప చేశారు. వెనుక మరో రెండు రథాలపై కమలాంబాల్, చండీకేశ్వరస్వామి ఆశీనులయ్యారు. సరిగ్గా 7.30 గంటలు మేళ తాళాల నడుమ, బాణసంచాల మోతతో త్యాగ రాజేశ్వరుడిని స్మరిస్తూ నినాదాలు మార్మోగాయి. తిరువారూర్ జిల్లా కలెక్టర్ చారుశ్రీ, ఎంపీ సెల్వరాజ్, ఎమ్మెల్యే పూండి కలైవానన్ రథాన్ని లాగారు. భక్తులు అందరూ రథాన్ని లాగుతూ కదిలారు. వెనుక నుంచి అతి పెద్ద ఈ రథాన్ని రెండు బుల్డోజర్ వాహనాలు ద్వారా నెడుతూ ముందుకు సాగాయి. కీల్ వీధి నుంచి దక్షిణ వీధితో పాటుగా నాలుగు వీధుల్లో రథోత్సవం జరిగింది. రాత్రి 8 గంటల సమయంలో రథం మళ్లీ ఆలయం వద్దకు చేరుకుంది. భక్తులు అడుగడుగునా స్వామి వారికి కర్పూర నీరాజనాలు పలికి కొబ్బరి కాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. రథం ముందు శివుడి వేషాధారణలతో భక్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ రథం ఒక వీధిని దాటేందుకు రెండు గంటల సమయం పట్టింది. అలాగే, ప్రతి వీధి మలుపు దాటేందుకు గంట అదనపు సమయం పట్టింది. హైడ్రాలిక్ బ్రేక్‌ల సాయంతో రథం నెమ్మదిగా సాగింది. రథోత్సవం దృష్ట్యా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు, అధికారులు, ఆలయ పాలక మండలి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

అవినీతి కేసులో సబ్‌రిజిస్ట్రార్ అరెస్ట్

తిరువొత్తియూరు: పుదువై కారైక్కాల్‌లో అవినీతికి పాల్పడుతున్న రిజిస్ట్రేషన్ కార్యాలయ సబ్ రిజిస్ట్రార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పుదువై కారైక్కాల్ నెహ్రూ వీధిలో సహాయ రిజిస్ట్రార్ కార్యాలయం ఉంది. ఇక్కడ తిరుప్పట్టినరవి ప్రాంతానికి చెందిన వ్యక్తి ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయడానికి సబ్ రిజిస్ట్రార్ లంచం కోరినట్టు తెలిసింది. దీంతో అతను ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. దీంతో ఏసీబీ అధికారులు వారం రోజులుగా నిఘా వేశారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం అధికారులు ఆకస్మికంగా కార్యాలయంపై దాడులు చేశారు. దాడిలో లెక్కలోకి రాని నగదు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల వరకు విచారణ చేశారు. తర్వాత సబ్‌రిజిస్ట్రార్ చంద్రమోహన్, అతని రిజిస్ట్రేషన్ సహాయకుడు అరుణ్ కుమార్‌ను అరెస్టు చేశారు.

మాస్క్ జోన్లు

- మాస్క్‌లు తప్పనిసరి బోర్డులు



చెన్నైలోని ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో మాస్క్ జోన్

సాక్షి, చెన్నై: ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌ల వద్ద మాస్క్‌లు తప్పనిసరి బోర్డులు శనివారం ఏర్పాటయ్యాయి. రోగులు మాస్క్‌లు ధరిస్తున్నారా అని ప్రత్యేక పర్యవేక్షకులు తీవ్రంగా పరిశీలిస్తున్నారు. రాష్ట్రంలో కరోనా వైరస్ కేసుల పెరుగుల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు, ఆరోగ్యకేంద్రాలలో మాస్క్‌లు తప్పనిసరి చేస్తూ ఆరోగ్య శాఖ డైరెక్టర్ సెల్వవినాయగం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో అన్ని ఆస్పత్రుల వద్ద మాస్క్‌లు తప్పనిసరి బోర్డులు దర్శనం ఇస్తున్నాయి. మాస్క్ జోన్లుగా ఆస్పత్రులు పరిసరాలను ప్రకటించారు. దీంతో ఆయా ఆస్పత్రుల బయట మాస్క్‌ల విక్రయదారులు ప్రత్యక్షం అయ్యారు. మాస్క్‌లు లేకుండా వచ్చిన వారిని ఆస్పత్రుల్లోకి యాజయాన్యాలు అనుమతించడంలేదు.

క్లుప్తంగా

ఒకేషనల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి


ప్రసంగిస్తున్న రాష్ట్ర కార్యదర్శి జనార్దన్

వేలూరు: రాష్ట్ర వ్యాప్తంగా ఒకేషనల్ టీచర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తమిళనాడు ఒకేషనల్ టీచర్స్ ఫెడరేషన్ సంఘం రాష్ట్ర కార్యదర్శి జనార్దన్ అన్నారు. వేలూరులో ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వృత్తి విద్యాకోర్సులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు రూ.10 కోట్లతో అప్‌గ్రేడ్ చేస్తామని విద్యాశాఖా మంత్రి ప్రకటించడం అభినందనీయమన్నారు. అయితే కోర్టు తీర్పులను తమ సంఘం గౌరవిస్తుందని అయితే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్ కోసం సంబంధిత ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని కోరారు. వృత్తి కోర్సుల్లో నూతన విద్యా కోర్సులు ప్రవేశ పెట్టి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అనేక పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారని దీన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఉన్నత పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులు ఏర్పాటు చేసి వాటికి అవసరమైన టీచర్‌లను నియమించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో వివిధ తీర్మానాలను ఆమోదించారు. తీర్మానాలను విద్యాశాఖ, ముఖ్యమంత్రికి అందజేయనున్నట్లు తెలిపారు. సంఘం రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు పాండురంగన్, నాగలింగన్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ జూదాన్ని నిషేధించాలంటూ ఆందోళన

కొరుక్కుపేట: రాజపాలెంలో ఆన్‌లైన్ జూదాన్ని నిషేధించాలని డిమాండ్ చేస్తూ గవర్నర్‌కు నల్లజెండాలను చూపుతూ ఆందోళన చేసిన మార్క్సిస్టు కమ్యూనిస్టు నేతను పోలీసులు అరెస్టు చేశారు. విరుదునగర్ జిల్లా రాజపాళయంలో కార్యక్రమాలలో పాల్గొనడానికి శనివారం రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్ రవి విచ్చేశారు. తొలుత శ్రీవిల్లిపుత్తూర్‌లో ఆండాల్ అమ్మవారిని దర్శించుకున్న గవర్నర్ కళాశాల వేడుకలో పాల్గొనడానికి రాజపాళయంకు వెళ్లారు. ఈ స్థితిలో కారల్‌మార్క్స్ గురించి గవర్నర్ ఆర్.ఎన్.రవి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, ఆన్‌లైన్ జూదాన్ని నిషేధించే విధింగా సంతకం చేయకపోవడానికి వ్యతిరేకంగాను రాజపాళయం రౌంటాన వద్ద నల్లజెండాలతో కమ్యూనిస్టు పార్టీ నేతలు ఆందోళన చేశారు. ఇందులో మార్క్సిస్టు కమ్యునిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి అర్జున్, నగర కార్యదర్శి మారియప్పన్‌ల నేతృత్వంలో రాజపాళయం, శ్రీవిల్లిపుత్తూర్, శివకాశి వంటి ప్రాంతాలనకు చెందిన 100 మందికిపైగా కార్యకర్తలు పాల్గొన్నారు. పోలీసులు వారిని అరెస్టు చేశారు.

కోలాహలంగా రథోత్సవం


రథోత్సవంలో భక్తులు


అశేష భక్తజనం నడుమ వఠారన్నేశ్వర్ ఆలయ రథోత్సవం


విశేష అలంకరణలో వండార్‌కుయలి సమేత సోమస్కందర్

తిరుత్తణి: అశేష భక్తజనం నడుమ వఠారన్నేశ్వర్ అలయ కమల రథోత్సవం శనివారం కోలాహలంగా సాగింది. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయ అనుబంధంలోని తిరువలంగాడు వఠారన్నేశ్వర్ అలయంలో పంగుని బ్రహ్మోత్సవాలు మార్చి 26న ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఏడవ రోజు శనివారం ఉదయం కమల రథోత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. తిరుత్తణి ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయ ఆధ్వర్యంలో రథ మండపం వద్ద చెక్క రథాన్ని పుష్పాలతో అలంకరించి వండార్‌కుయలి సమేత ఉత్సవర్లు సోమస్కందర్ ప్రత్యేక అలంకరణలో రథంలో కొలువుదీర్చారు. శివాచార్యులు ప్రత్యేక దీపారాధన పూజలతో వేలాదిగా తరలివచ్చిన భక్తులు రథం లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. శివ నామస్మరణతో మార్మోగింది. భక్తులు కర్పూర హారతులిచ్చి కొబ్బరికాయలు కొట్టి స్వామిని దర్శించుకున్నారు.

ఘనంగా ఒత్తాండేశ్వర స్వామి రథోత్సవం

తిరువళ్లూరు: తిరుమళిసైలో ప్రసిద్ధి చెందిన ఒత్తాండేశ్వర స్వామి వారి ఆలయ పంగుణి మాసం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు శనివారం ఉదయం రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరువళ్లూరు జిల్లా తిరుమళిసైలో ప్రసిద్ధి చెందిన శ్రీ కులుందనాయగి సమేత ఒత్తాండేశ్వర స్వామి వారి ఆలయం వుంది. ఈ ఆలయంలో ప్రతి ఏటా పంగుణి బ్రహ్మోత్సవాలు 13 రోజుల పాటు నిర్వహించడం ఆనవాయితీ. గత ఆదివారం ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలను ప్రారంభించారు. ఏడవ రోజు శనివారం ఉదయం 7.30 గంటలకు ఆలయం నుంచి కులుంద నాయగీ సమేత ఒత్తాండేశ్వరుడు ప్రత్యేక పూజలు అందుకుని రథంపైకి బయలుదేరారు. అక్కడ నుంచి శివనామస్మరణంతో రథోత్సవం ప్రారంభమైంది. వేలాది మంది భక్తులు రథాన్ని లాగి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కాగా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం తిరుకల్యాణం, పంచమూర్తుల ఉత్సవం జరగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

మెరీనాలో మెట్రోరైలు పనులు

కొరుక్కుపేట: మెట్రో రైలు నిర్మాణ పనుల నిమిత్తం మెరీనా బీచ్‌లోని గాంధీ విగ్రహాన్ని తాత్కాలికంగా తరలించారు. పని పూర్తయిన తర్వాత అదే స్థలంలో మళ్లీ అమర్చుతారు. చెన్నైలో దశలవారీగా మెట్రో రైలు ప్రాజెక్టును 3 లైన్లలో అమలు చేస్తున్నారు. వీటిలో ఒకటి లైట్ హౌస్ – పూందమల్లి బైపాస్ వరకు మార్గం. ఈ మార్గంలో లైట్ హౌస్, మైలాపూర్, నందనం, టి.నగర్, కోడంబాక్కం, వడపళని, పోరూర్, అయ్యప్పన్‌తాంగల్, కాట్టుపాక్కం ప్రాంతాలు. ఇందులో లైట్‌హౌస్ నుంచి కోడంబాక్కం పవర్ హౌస్ వరకు మెట్రో పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. లైట్ హౌస్ నుంచి వడపళని వరకు భూగర్భంలో తర్వాత వంతెన మార్గంలో మెట్రో రైలు ఉంటుంది. ఇందుకోసం మెరీనా బీచ్‌లోని గాంధీ విగ్రహం వద్ద ప్రాథమికంగా మొక్కలు నాటే ప్రాంతంగా కిలోమీటర్ మేర బారికేడ్లు ఏర్పాటు చేశారు. అక్కడ ఉన్న గాంధీ విగ్రహానికి నష్టం జరగకుండా శనివారం భారీ క్రేన్‌ల సాయంతో అక్కడి నుంచి తొలగించి 25 మీటర్ల దూరంలో తాత్కాలికంగా ఉంచారు. భారీ క్రేన్ సహాయంతో విగ్రహాన్ని పైకి లేపి కొత్త ప్రదేశంలో భద్రంగా ఉంచారు. మెట్రో పనులు పూర్తయితే గాంధీ విగ్రహాన్ని పునరుద్ధరించి అదే చోట మళ్లీ అమర్చుతారు.

● ఆర్ట్ హౌస్

ఆర్ట్ హౌస్ పేరిట చెన్నైలో కళాకృతుల ప్రదర్శన శనివారం ఏర్పాటైంది. నాన్ యార్ (నేను ఎవరు) అని కళాకారుడు స్వీయ, వ్యక్తిగత గుర్తింపు అన్వేషణలో భాగంగా అద్భుతంగా ఈ కళా ప్రదర్శన ఏర్పాటు చేశారు. దీనిని ఆర్కాట్ యువరాజు మహ్మద్ ఆసిఫ్ అలీ, కళాకారుడు, విమర్శకుడు అశ్రఫీ ఎస్ భగత్ ప్రారంభించారు. ప్రదర్శన ఏప్రిల్ 15వ తేదీ వరకు జరగనుంది.
– సాక్షి, చెన్నై





సమస్యల పరిష్కారానికి ఉమ్మడి పోరాటం


ప్రసంగిస్తున్న అఖిల భారత అధ్యక్షుడు గణేషన్

తిరువళ్లూరు: తమిళనాడు వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఉద్యోగులు, సహాయకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగుల సంఘం అఖిల భారత అధ్యక్షుడు గణేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమిళనాడు ప్రాథమిక ఉద్యోగులు, ఆఫీస్ అసిస్టెంట్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 10న చెన్నైలో భారీ ర్యాలీని నిర్ణయించారు.

ర్యాలీ విజయవంతం చేసే అంశంపై ఉద్యోగులతో ప్రత్యేక సమావేశానికి తిరువళ్లూరులో శనివారం ఉదయం నిర్వహించారు. సమావేశానికి అఖిల భారత అధ్యక్షుడు గణేషన్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులను ఎంప్లాయిమెంట్ కార్యాలయం ద్వారా భర్తీ చేయాలని, వాణిజ్య పన్నుల శాఖలో ఖాళీగా వున్న అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఓవర్ హెడ్ వాటర్ స్టోరేజీ ట్యాంక్ అపరేటర్లకు వేతాలను చెల్లించాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చెన్నైలో ఏప్రిల్ 10న భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని, ర్యాలీలో ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నిర్వాహకులు మధురం, షణ్ముగం, సురేష్, బోస్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా అరికట్టేందుకు కృషి


అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందిస్తున్న డాక్టర్ పీఎం నాయిర్, హరిహరన్

కొరుక్కుపేట: మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు అందరూ సమష్టిగా కృషిచేయాలని హ్యూమన్ ట్రాఫికింగ్ మ్యాటర్స్ అంతర్జాతీయ నిపుణులు, రిటైర్డ్ ఐపీఎస్ డాక్టర్ పీఎం నాయిర్ పిలుపునిచ్చారు. ఈమేరకు ఇండియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (ఐసీడబ్ల్యూఓ), హన్స్ సీడెల్ ఫౌండేషన్ ఇండియా సంయుక్త ఆధర్యంలో చెన్నై పెరంబూరు సెంబియంలో ఉన్న చెవలియర్ టి థామస్ ఎలిబిజెత్ మహిళా కళాశాల అధ్యపకులకు మానవ అక్రమరవాణాపై ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఇందులో 90మంది అధ్యాపకులు పాల్గొన్నారు. ఐసీడబ్ల్యూఓ వ్యవస్థాపక కార్యదర్శి ఏజే హరిహరన్, తమిళనాడు బచ్‌పన్ బచావో ఆందోళన్ రాష్ట్ర కోఆర్డినేటర్ హెచ్ నాదర్ష మాలిమ్ పాల్గొని ఎక్కువగా మానవ అక్రమ రవాణా జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ శ్రీదేవి, ప్రొఫెసర్ యోగిత, ప్రవీణా సాల్మన్ పాల్గొన్నారు.

అసురన్‌కు 20 రెట్లు ఎక్కువ విడుదలై


సీమాన్, భారతీరాజాలతో విడుదలై చిత్ర యూనిట్

తమిళసినిమా: వెట్రిమారన్ దర్శకత్వంలో ధనుష్ కథానాయకుడిగా నటించిన చిత్రం అసురన్. ఈ చిత్రం విడుదలై సంచలన విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. తాజాగా సూరీని హీరోగా పరిచయం చేస్తూ దర్శకుడు వెట్రిమారన్ తెరకెక్కించిన చిత్రం విడుదలై. నటుడు విజయ్‌సేతుపతి ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి ఇళయరాజా సంగీతాన్ని అందించారు.ఆర్ ఎస్.ఇన్ఫోటెయిన్‌మెంట్ పతాకంపై ఎల్ రెడ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం రెండు భాగాలుగా రూపొందడం విశేషం. కాగా చిత్ర తొలిభాగం శుక్రవారం తెరపైకి వచ్చింది. చిత్రంలో ప్రతిపాత్రకు ప్రాముఖ్యత ఉంటుంది. అదేవిధంగా చిత్రంలో పాత్రలు మాత్రమే కనిపిస్తాయి నటులు కనిపించరు. సూరి పోలీస్ కారుడ్రైవరుగా నటించగా విజయ్‌సేతుపతి గిరిజన ప్రాంత ప్రజలకు అండగా నిలిచే పాత్రలో నటించారు. అడవి ప్రాంతంలో మైనింగ్ కంపెనీని ప్రారంభించడానికి ప్రభుత్వ అధికారులు ప్రయత్నాలు చేస్తారు. ఆ కంపెనీ వస్తే గిరిజన జీవన విధానానికి ముప్పు ఉంటుందని భావించిన పెరుమాళ్ పాత్రలో నటించిన విజయ్‌సేతుపతి టీమ్ అడ్డుకుంటుంది.

దీంతో పోలీసులు రంగంలో దిగి పెరుమాళ్‌ను అరెస్ట్ చేయడానికి గిరిజనులను చిత్ర హింసలకు గురిచేస్తారు. అలా పోలీసులకు తీవ్రవాదిగా ముద్రపడి వారి మధ్య జరిగే పోరాటమే విడుదలై చిత్రం. దీన్ని రెడ్ జెయింట్ మూవీస్ నిర్మిస్తోంది. ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. చిత్రాన్ని శుక్రవారం సాయంత్రం నామ్ తమిళర్ పార్టీ నేత సీమాన్, దర్శకుడు భారతీరాజా చూశారు. అనంతరం సీమాన్ మీడియాతో మాట్లాడుతూ చిత్రాన్ని అందరూ దయచేసి చూడండి. సూరి మీ కళ్ల నుంచి దూరం కారని, ఆయనలో ఇంతకుముందు హాస్య నటుడిని ఇందులో చూడలేమని అన్నారు. దర్శకుడు వెట్రిమారన్ ఈ చిత్రం కోసం ఎంతో శ్రమించారని, విడుదలై చరిత్రలో నిలిచిపోయే చిత్రం అని పేర్కొన్నారు. ఆయన ఇంతకుముందు తెరితెక్కించిన అసురన్ చిత్రం కంటే పది ఇరవై రెట్లు అధికంగా విడుదలై ఉంటుందన్నారు. దీనికి సీక్వెల్ మరింత గొప్పగా ఉంటుందని అభిప్రాయాన్ని సీమాన్ వ్యక్తం చేశారు.

కోలీవుడ్ టాక్స్

హీరోగా ఐశ్వర్యా రాజేష్ సోదరుడు


మైడియర్ దయానా వెబ్ సీరీస్ ప్రారంభోత్సవం

తమిళసినిమా: నటి ఐశ్వర్య రాజేష్ గురించి ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. స్వశక్తితో కింద నుంచి ఒక్కోమెట్టు ఎక్కుతూ కథానాయకి స్థాయికి ఎదిగిన నటి. ప్రస్తుతం హీరోయిన్ ఓరియెంటెడ్ కథా చిత్రాల్లో నటిస్తూ స్టార్ హీరోయిన్లకు పోటీ ఇస్తున్నారు. కాగా తాజాగా ఆమె అన్నయ్య మణికంఠ రాజేష్ కథానాయకుడిగా పరిచయం అవుతున్నారు. ఈయన ఇంతకుముందే ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రలో నటించిన డ్రైవర్ జమున చిత్రంలో ఒక కీలక పాత్రను పోషించారు. అదేవిధంగా ఇటీవల బిగ్‌బాస్ రియాల్టీ గేమ్‌షోలో పాల్గొని మరింత గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ సమయంలో తన అన్నయ్యకు సపోర్టుగా నటి ఐశ్వర్యరాజేష్ ప్రచారం చేశారు కూడా. తాజాగా ఈయన కథానాయకుడుగా వెబ్‌సీరీస్‌లో నటిస్తున్నారు. దీనికి మైడియర్ దయానా అనే టైటిల్ నిర్ణయించారు. దీనికి పీకే విజయ్, గిరిధర్ రామ్ గణేశ్‌ల ద్వయం దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో మహాలక్ష్మి అనే నటి కథానాయకిగా పరిచయం అవుతున్నారు. ఐనాకుమార్, అక్షయ ప్రేమనాథ్ ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ వెబ్‌సీరీస్‌కు వాట్స్ ప్రభు ఛాయాగ్రహణం, గుహ గణేష్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఓర్స్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ వెబ్‌సీరీస్ శుక్రవారం చెన్నైలో పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. ఐశ్వర్య రాజేష్ ముఖ్య అతిథిగా పాల్గొని వెబ్‌సీరీస్ యూనిట్ వర్గాలకు శుభాకాంక్షలు తెలిపారు.

పురావస్తు మ్యూజియంలో సూర్య


కీళడి మ్యూజియంలో సూర్య దంపతులు

తమిళసినిమా: నటుడు సూర్యకు చరిత్ర, దానికి సంబంధించిన అంశాలు అన్నా ఆసక్తి ఎక్కువ. ఆ మధ్య ఆయన డెక్కన్ ఏర్ లైన్ విమానం అధినేత గోపీనాథ్ బయోపిక్‌తో తెరకెక్కించిన సూరరై పోట్రు చిత్రంలో నటించి జాతీయ ఉత్తమ నటుడు అవార్డును గెలుచుకున్న విషయం తెలిసిందే. కాగా తమిళనాడు ప్రభుత్వ పురావస్తు శాఖ కీళడి ప్రాంతంలో ఏర్పాటు చేసిన మ్యూజియంను సందర్శించడానికి సూర్య వెళ్లారు. ఆయనతో పాటు భార్య జ్యోతిక, పిల్లలు దేవ్, దియా, తల్లిదండ్రులు శివకుమార్, లక్ష్మి వెళ్లారు. కీళడి గ్రామం మదురై శివగంగై జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఉంది. అక్కడ తమిళనాడు ప్రభుత్వ పురావస్తుశాఖ బ్రహ్మాండమైన ప్రపంచ స్థాయి పురాతన వస్తువుల మ్యూజియంను ఏర్పాటు చేసింది. దీన్ని ప్రజల సందర్శనార్థం గత మార్చి 6న ప్రారంభించారు. కాగా, ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి సందర్శకులకు టికెట్ ధరను నిర్ణయించి డబ్బు వసూలు చేస్తున్నారు. మ్యూజియం తవ్వకాల్లో బయటపడ్డ అనేక పురాతన వస్తువుల ప్రదర్శనను తిలకించడానికి నటుడు సూర్యకుటుంబం శనివారం కీళడి గ్రామానికి వెళ్లారు. వీరితో పాటు మదురై ఎంపీ వెంకటేశన్ ఉన్నారు.

లివింగ్ టు గెదర్ అంటే బాధేస్తుంది

తమిళసినిమా: ప్రస్తుతం వెబ్ సీరీస్ క్వీన్‌గా వెలిగిపోతున్న నటి వాణిభోజన్. టీవీ యాంకర్‌గా జీవితాన్ని ప్రారంభించిన ఈమె ఆ తర్వాత బుల్లితెర నటిగా కొన్ని సీరియళ్లలో నటించింది. దీంతో సినిమాల్లో నటించే అవకాశాన్ని దక్కించుకుంది. ఓ మై కడవులే చిత్రంతో మంచి పేరు తెచ్చుకున్న ఈ అమ్మడిని ఆ తర్వాత పలు అవకాశాలు వరించాయి. నటుడు విక్రమ్‌కు జంటగా కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో మహాన్ చిత్రంలో నటించింది. ఆ చిత్రంపై చాలా ఆశలు పెట్టుకుంది. అయితే చిత్రం విడుదలైన తర్వాత ఆమెకు నిరాశే ఎదురైంది. కారణం ఆమె పాత్రను పూర్తిగాఎడిటింగ్ పార్టీకే పరిమితం చేశారు చిత్ర వర్గాలు. అదేవిధంగా వాణి భోజన్ నటించిన సినిమాలు ఆశించిన విజయాలు సాధించకపోవడంతో వాణి దృష్టి వెబ్‌సీరీస్‌పై పడింది. అలా తమిళ్ రాకర్స్ ట్రిపిల్స్ ఇరు ధ్రువం 2, తాజాగా సెంగళం వెబ్ సీరీస్‌లో నటించింది. కాగా వ్యక్తిగతంగా ఈమె ఒక నటుడితో ప్రేమ, లివింగ్ టు గెదర్ వంటి వార్తలు బాగానే ప్రచారంలో ఉన్నాయి. నటుడు జైతో లివింగ్ టుగెదర్‌లో ఉన్నట్టు ప్రచారం హోరెత్తింది. ఈమె కాల్‌షీట్స్ వ్యవహారం కూడా ఆయనే చూసుకునేవారని, ఇతరులెవరూ ఆమెతో సంప్రదించే అవకాశం కూడా ఉండేది కాదు అనే ప్రచారం జరిగింది. దీని వల్లే వాణిభోజన్‌కు సినిమా అవకాశాలు తగ్గిపోయాయి అని వార్తలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. అయితే నటుడు జయ్‌తో లివింగ్ టుగెదర్ ప్రచారాన్ని వాణి భోజన్ ఇప్పుడు ఖండిస్తూ ఉంది. దీని గురించి ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆమె పేర్కొంటూ తాను, నటుడు జయ్ ట్రిపిల్స్ వెబ్‌సీరీస్‌లో నటించామని, అలాగని ఇలాంటి వార్తలు ప్రచారం చేస్తారా అంటూ ప్రశ్నించింది. జయ్‌తో రిలేషన్ షిప్ అన్నా బాధపడను కానీ లివింగ్ టుగెదర్‌లో ఉన్నాననడమే బాధిస్తుందని పేర్కొంది. తాను కష్టపడి బ్యాంకులోను తీసుకుని ఇల్లు కట్టుకుంటే సొంత ఇంట్లో నివశించకుండా ఎవరో ఒకరి ఇంట్లో అతనితో లివింగ్ టుగెదర్‌లో ఉంటున్నానని రాయడం చీప్‌గా ఉందని వాణి భోజన్ ఆవేదనను వ్యక్తం చేసింది.


వాణి భోజన్

వణంగాన్ తొలి షెడ్యూల్ పూర్తి


షూటింగ్ సెట్‌లో దర్శకుడు బాలా

తమిళసినిమా: సంచలన దర్శకుడు బాలా దర్శకత్వం వహిస్తున్న చిత్రం వణంగాన్. ఇంతకుముందు పితామగన్, నందా వంటి విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించిన ఈయన ఇటీవల నటుడు విక్రమ్ వారసుడు ధృవ్‌విక్రమ్ కథానాయకుడిగా పరిచయం చేస్తూ వర్మ అనే చిత్రాన్ని తెరకెక్కించారు. అయితే ఆ చిత్రం సంతృప్తిని కలిగించలేదంటూ మరో దర్శకుడుతో రీమేక్ చేయడం జరిగింది. కాగా చాలా గ్యాప్ తరువాత బాలా దర్శకత్వం వహిస్తున్న చిత్రం వణంగాన్. ఈ చిత్రం ఇంతకుముందు సూర్య కథానాయకుడుగా కొంత భాగం పూర్తిచేసుకుంది. అయితే ఆ తర్వాత అనివార్య కారణాల వల్ల సూర్య ఆ చిత్రం నుంచి వైదొలిగారు. దీంతో బాలా నటుడు సూర్య పాత్రలో అరుణ్‌విజయ్‌ను ఎంపిక చేసుకున్నారు. రోషిణి ప్రకాష్ కథానాయకిగా నటిస్తున్న ఇందులో సముద్రకణి ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతాన్ని, ఆర్బి.గురుదేవ్ ఛాయాగ్రహణం అందిస్తున్న ఈ చిత్ర షూటింగ్ తొలి షెడ్యూల్ కన్యాకుమారిలో నిర్వహించారు. చిత్ర తొలి షెడ్యూల్ షూటింగ్ పూర్తి అయినట్లు చిత్రవర్గాలు మీడియాకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కన్యాకుమారిలో ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరించినట్లు తెలిపారు. షెడ్యూల్ ఏప్రిల్ 17వ తేదీ నుంచి తిరువణ్ణామలై పరిసర ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ చిత్రానికి వైరముత్తు పాటలను, సిల్వా ఫైట్స్ సన్నివేశాల బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

క్లుప్తంగా

పచ్చకామెర్లతో తండ్రి, కూతురు మృతి


ఆరోగ్యఅరుల్ (ఫైల్)


జెనిథెరిసా (ఫైల్)

అన్నానగర్: ముదుకులత్తూరు సమీపంలో శనివారం పచ్చకామెర్లతో తండ్రి, కూతురు మృతి చెందారు. రామనాథపురం జిల్లా ముదుకులత్తూరు సమీపంలోని ముత్తు విజయపురానికి చెందిన ఆరోగ్య అరుల్ (27) రైతు. పచ్చకామెర్లతో బాధపడుతూ మదురైలో మూలికా చికిత్స పొందుతున్నారు. అతడి కాలేయం దెబ్బతిన్నట్టు తేలింది. ఆయన కుమార్తె జెనిథెరిసా (6)కు కూడా 24వ తేదీన జ్వరం రావడంతో రామనాథపురం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ నిర్వహించిన పరీక్షల్లో బాలికకు పచ్చకామెర్లు వచ్చినట్టు వైద్యులు నిర్ధారించారు. ఆరోగ్య ఆరుల్‌ను, జెని థెరిసాను రామనాథపురం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరూ శనివారం మృతి చెందారు.

యువతి హత్య

తిరువొత్తియూరు: శంకరాపురం సమీపంలోని ఎస్ కొలత్తూరులో యువతి హత్యకు గురైంది. ఎస్.కొలత్తూరు గ్రామం తిరువణ్ణామలై రోడ్డులో ఉన్న చిత్తోరిలో శనివారం ఉదయం సుమారు 20 సంవత్సరాల యువతి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. దుండగులు ఆమె గొంతు కోసి హత్య చేసి పెట్రోల్ పోసి కాల్చినట్టు తెలుస్తోంది. సమాచారం అందుకున్న కల్లకురిచ్చి పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఎస్పీ మోహన్ మాట్లాడుతూ శనివారం ఉదయం 3.30 నుంచి 4.30 గంటల మధ్యలో హత్య జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. మృతురాలి వివరాలు తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నీరు అనుకుని పురుగుల మందు తాగి కూలీ మృతి

అన్నానగర్ : అళగియపాండియాపురం సమీపంలో శనివారం ఓ కూలీ నీరు అనుకుని పురుగుల మందు తాగి మృతి చెందాడు. కన్యాకుమారి జిల్లా అళగియపాండియాపురం పెరుందలైకాడు ప్రాంతానికి చెందిన రామయ్య (65) కొబ్బరికాయలు కొట్టేవాడు. ఆయన తేలంది కాలనీకి చెందిన శివగామి కొబ్బరి తోటలో కొబ్బరి చెట్టు ఎక్కి కొబ్బరి కాయ కోసి కిందకు వచ్చాడు. దాహం వేయడంతో నీరు అనుకుని అక్కడ ఉన్న క్రిమి సంహారక మందు తాగాడు. స్పృహతప్పి పడిపోయిన అతన్ని స్థానికులు బూతపాండి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఆచారిపాళ్యం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జోలార్‌పేటలో నకిలీ డాక్టర్ అరెస్ట్




మందులతో పట్టుబడిన సంపత్

వేలూరు: తిరుపత్తూరు జిల్లాలో ఎక్కువ మంది నకిలీ డాక్టర్లు రోగులకు చికిత్స చేస్తున్నట్టు జిల్లా ప్రభుత్వ వైద్యాధికారి శివకుమార్‌కు ఫిర్యాదు వచ్చింది. ఆయన ఆదేశాల మేరకు వైద్యాధికారి సెల్వనాథన్, వైద్య సిబ్బంది జోలార్‌పేట సమీపంలోని తామనేరి తాలూకాలో తనఖీలు చేపట్టారు. తామనేరిలో సంపత్(48) తన ఇంటిలో అనుమతి లేకుండా రోగులకు చికిత్స చేస్తున్నట్లు తెలిసింది. వైద్యాధికారులు విచారణ చేపట్టగా అతను డిప్లమో నర్సింగ్ పూర్తి చేసి ఆంగ్ల వైద్యం చేస్తున్నట్లు తేలింది. అతన్ని పోలీసులకు అప్పగించి మందులు, ఇంజెక్షన్‌లు, స్కానర్ తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా పుదూరులో ఆరోగ్యరాజ్ తన ఇంటిలో ఎటువంటి మెడిసిన్ చదవకుండా రోగులకు వైద్యం చేస్తున్నట్లు తెలియడంతో తనిఖీలు చేశారు. అప్పటికే విషయం తెలుసుకున్న ఆరోగ్యరాజ్ అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు నకిలీ డాక్టర్ ఆరోగ్య రాజ్ కోసం గాలిస్తున్నారు.

రైలు ఢీకొని తండ్రి, కుమార్తె మృతి

అన్నానగర్: రైలు ఢీకొని తండ్రి, ఐదేళ్ల కుమార్తె మృతిచెందింది. ఈ ఘటన నెల్లై సమీపంలో శనివారం చోటుచేసుకుంది. నెల్లై సమీపంలోని మేళమున్నీర్ పాళం అన్నైనగర్ ప్రాంతంలోని రైలు పట్టాలపై శనివారం ఇద్దరు వ్యక్తులు శవమై కనిపించారు. ఇది చూసిన స్థానికులు మున్నీరుపాలెం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ విషయమై నాగర్‌కోయిల్ రైల్వే పోలీసులకు కూడా సమాచారం అందించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పాలైయంకోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు విచారణలో మేలమున్నీర్‌పాళ్యం అన్నానగర్‌కు చెందిన శివ (32) భవన నిర్మాణ కార్మికుడు. ఇతని ఐదేళ్ల కుమార్తె ముత్తుసెల్వి. శుక్రవారం రాత్రి శివ కుమార్తె ముత్తుసెల్విని అన్నానగర్ రైల్వే ట్రాక్ సమీపంలోని సొంత స్థలాన్ని చూసేందుకు తీసుకెళ్లాడు. పట్టాలు దాటేందుకు ప్రయత్నిస్తుండగా శివ, ముత్తుసెల్విని రైలు ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనమంతా ప్రకృతిని గౌరవించాలి


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సరోజినీ ప్రేమ్‌చంద్

కొరుక్కుపేట: కనిపిస్తున్న తల్లి, తండ్రి, గురువులతో పాటు ప్రకృతి అనే గొప్ప గురువును మనమంతా గౌరవించాల్సిన అవసరం ఉందని, దీని వల్ల సకల ప్రాణికోటి మనుగడ సజావుగా సాగుతుందని ప్రముఖ రచయిత్రి సరోజినీ ప్రేమ్‌చంద్ అన్నారు. స్థానిక పట్టాభిరాంలో ఉన్న ధర్మ మూర్తి రావు బహదూర్ కలవల కన్నన్ చెట్టి హిందూ కళాశాల, తెలుగు శాఖ తెలుగు భాషా సమితి ఆధ్వర్యంలో శోభకృత్ శోభలు అనే పేరుతో శనివారం ఉగాది పండుగ జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా ప్రముఖ రచయిత్రి సరోజినీ ప్రేమ్‌చంద్ పాల్గొని మాట్లాడుతూ మనిషి ముఖ్యంగా జీవితంలో మూడు విషయాలను అనుసరించాలి అన్నారు. చేసే పనిని హృదయపూర్వకంగా చేయాలి, మన అభివృద్ధికి సాయం చేసిన ఎవరికైనా కృతజ్ఞత చూపడం, అందరితో, అన్ని జీవరాశులతో దయగా ఉండడం అనే లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి వారికి జ్ఞాపికలు, ధ్రువపత్రాలను అందజేశారు. కనక దుర్గ పాఠశాలకు చెందిన గౌరీ శంకర్, పెరంబూర్ డీఆర్ బీసీసీ పాఠశాలకు చెందిన ఏడుకొండలయ్యకు ఉగాది పురస్కారాలను కళాశాల ప్రధాన అధ్యాపకులు, ముఖ్య అతిథి చేతుల మీదుగా ప్రదానం చేశారు. శాఖాధ్యక్షుడు డా. ముద్దులూరు సురేశ్, డా. తుమ్మపూడి కల్పన, డా. మాధవి పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీరాముడి చిద్విలాసం


గరుడ వాహనంపై ఉన్న శ్రీరాముడికి పూజలు చేస్తున్న అర్చకుడు

కొరుక్కుపేట: కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. అందులో భాగంగా శనివారం శ్రీరాములు గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. ఆలయ అర్చకులు స్వామివారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి మూలవిరాట్, ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. వేడుకల్లో శైలేష్ జోస్యుల బృందం భక్తి గేయాలను ఆలపించారు.

వీరంగం సృష్టించిన కోతులు


బోనులో బంధించిన కోతులు

అన్నానగర్: అరకండనల్లూరు మున్సిపాలిటీలో వీరంగం సృష్టించిన వంద కోతులను శనివారం పట్టుకుని బోనులో పెట్టారు. కళ్లకురిచ్చి జిల్లా అరకండనల్లూరు మున్సిపాలిటీ పరిధిలో కోతుల బెడద రోజురోజుకు పెరిగిపోతోంది. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మధ్యాహ్నం పూట పచ్చిక బయళ్ల పై, చెట్ల కింద కూర్చొని తినే విద్యార్థుల ఆహారాన్ని కోతులు లాక్కెళ్లి, దారిన వెళ్లే వారి వెంట పడి వస్తువులను లాక్కుంటాయి. దీంతో అరకండనల్లూరులో సంచరిస్తున్న కోతులను బంధించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతూ వచ్చారు. దీనిపై గత 21వ తేదీ దినపత్రికలో వార్త ప్రచురితమైంది. అనంతరం అరకండనల్లూరు మున్సిపల్ అధ్యక్షుడు వకీల్ రాయల్ ఎస్.అన్బు ఆదేశాల మేరకు కార్యనిర్వహణాధికారి అరుళ్ కుమార్ సమక్షంలో మున్సిపల్ ఉద్యోగులు కోతులు పట్టే వారితో కలిసి బోనులు ఏర్పాటు చేశారు. శనివారం వంద కోతులు బోనులో చిక్కుకున్నాయి. వీటిని వాహనాల్లో అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

బావిలో చిన్నారి మృతదేహం


బావిలో తేలుతున్న చిన్నారి మృతదేహం

అన్నానగర్: విక్రవాండి సమీపంలోని బావిలో శనివారం ఆరు నెలల ఆడశిశువు శవంగా తేలింది. విల్లుపురం జిల్లా విక్రవాండి పక్కన వడకుచిపాళ్యం గ్రామంలో బావి ఉంది. రెండు నెలలుగా బావిని ప్రజలు వినియోగించుకోవడం లేదు. ఈ స్థితిలో శనివారం ఉదయం బావిలో ఆరు నెలల పాప శవంగా తేలింది. ఇది చూసిన గ్రామస్తులు వెంటనే విక్రవాండి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ వినాయక్ మురుగన్ ఎస్ఐ ప్రకాశ్, ఫైర్ ఆఫీసర్ సుందరేశ్వరన్‌ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. బావిలో నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని ముండ్యంబాక్కం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై గ్రామ పాలనాధికారి రాందాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పసికందుతో మహిళా ధర్నా


ధర్నా చేస్తున్న మహిళ

అన్నానగర్: చిదంబరంలో ఓ మహిళ తనను ప్రియుడితో కలపాలని శనివారం మసీదు ఎదుట పసిపాపతో ధర్నా చేసింది. కడలూరు జిల్లా చిదంబరం అంబలతాడి వీధికి చెందిన శ్రీనివాసన్ కుమార్తె మహేశ్వరి (22). శనివారం చిదంబరం లాబాయి వీధిలోని మసీదు ఎదుట మగబిడ్డ, బంధువులతో కలిసి ధర్నాకు దిగింది. విషయం తెలిసి చిదంబరం మహిళా పోలీస్ సీఐ వనజ, ఎస్ఐ పొన్నమగరం, పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మహేశ్వరిని విచారించారు. విచారణలో మహేశ్వరి, చిదంబరం అంబలతాడి వీధికి చెందిన ఆసిఫ్ కుమారుడు బక్కీం అస్లాం(25) ఏడాదిన్నరగా ప్రేమించుకుంటున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో మహేశ్వరి గర్భవతి అయ్యింది. ఈ విషయాన్ని బక్కీం అస్లాం కుటుంబ సభ్యులకు తెలియజేసినప్పటికీ వారు పెళ్లికి అంగీకరించలేదు. బక్కీమ్ అస్లాం చెప్పిన మాటలు విని, మహేశ్వరి ఆయిషాగా పేరు మార్చుకుని, ఇస్లాం స్వీకరించింది. ఈక్రమంలో మహేశ్వరి మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే అస్లాం విదేశాలకు వెళ్లడంతో తనకు న్యాయం చేయాలి మసీదు ఎదుట ధర్నాకు దిగింది. పోలీసులు ఆమెతో చర్చించి ధర్నా విరమింపజేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తుపాకీ తూటా స్వాధీనం

అన్నానగర్: తిరుచ్చి విమానాశ్రయంలో శనివారం వేకువజామున తుపాకీ తూటాను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తిరుచ్చి నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు ఇండిగో విమానం శనివారం వేకువజామున బయలుదేరేందుకు సిద్ధమైంది. ఈ విమానంలో ప్రయాణించేందుకు వెళ్తున్న ప్రయాణికుల వస్తువులను సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ తనిఖీ చేసింది. హైదరాబాద్‌కు వెళ్తున్న నాగై జిల్లా వేదారణ్యం అగస్తీశ్వరానికి చెందిన సంతోష్ రాజం (23) వద్ద బుల్లెట్ లభ్యమైంది. విచారణలో బుల్లెట్ నా బ్యాగ్ లోకి ఎలా వచ్చిందో తెలియదని చెప్పాడు. బుల్లెట్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు అతడిని అరెస్టు చేసి విచారణ జరిపి బెయిల్‌పై విడుదల చేశారు.

రూ.కోటి విలువైన ఎర్రచందనం స్వాధీనం

- అంతర్రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్ అరెస్టు
- ఐదుగురు నిందితుల పరారీ
- జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి వెల్లడి


పట్టుబడిన ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్ అరెస్ట్ చూపిస్తున్న పోలీసులు

తిరుపతి క్రైమ్: తిరుపతి జిల్లా వెస్ట్ సబ్ డివిజన్ భాకరాపేట సర్కిల్ ఎర్రావారిపాళెం పరిధిలో కోటి రూపాయలు విలువైన ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకుని అంతర్రాష్ట్ర స్మగ్లర్‌ను అరెస్టుచేసినట్టు ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.

శనివారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఎర్రావారిపాళెం మండలం, యల్లమంద క్రాస్ వద్ద శుక్రవారం సాయంత్రం పెద్ద స్థాయిలో ఎర్రచందనం అక్రమ రవాణాకు సిద్ధం చేస్తున్నట్టు పోలసులకు కచ్చితమైన సమాచారం అందింది. ఆ మేరకు భాకరాపేట సీఐ తులసిరాం, ఎస్ఐలు ప్రకాష్, వెంకటేశ్వర్లు, తమ సిబ్బంది ఆ ప్రాంతంలో దాడులు చేశారు. రవాణాకు సిద్ధంగా ఉన్న సుమారు కోటి రూపాయల విలువైన 31 ఎర్రచందనం దుంగలు, 2 కార్లు, ద్విచక్ర వానాలు స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు కృష్ణగిరి జిల్లాకు చెందిన అంతర్రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్ల ముఠాకు చెందిన షేక్ షరీఫుల్లాను అరెస్ట్ చేశారు. మరో నిందితులు పరారయ్యారు. మీడియా సమావేశంలో ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమలకుమారి, డీఎస్పీ నరసప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సైనికుడి ఇంట్లో చోరీ

అన్నానగర్ : బోచంపల్లి సమీపంలో శనివారం మాజీ సైనికుడి ఇంట్లో 34 సవర్ల నగలు, రూ.4 లక్షల నగదు చోరీకి పాల్పడిన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. కృష్ణగిరి జిల్లా బోచంపల్లి సమీపంలోని తిరువాయలూరుకు చెందిన శివశక్తి (40) మాజీ సైనికుడు. ఇతను ప్రస్తుతం సేలం సమీపంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 19న ఇంటికి తాళం వేసి భార్య కమలతో కలిసి సేలం వెళ్లాడు. భార్యాభర్తలు తిరిగి శనివారం ఊరికి వచ్చారు. తలుపులు తెరిచి ఉండడాన్ని చూసి దిగ్భ్రాంతి చెందారు. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 34 సవర్ల బంగారు నగలు, రూ.4 లక్షల నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. శివశక్తి బోచంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. వేలిముద్ర నిపుణులు వేలిముద్రలు సేకరించారు.

రూ.48.6 లక్షల గంజాయి స్వాధీనం

– మహారాష్ట్రకు చెందిన వ్యక్తి అరెస్ట్

తిరువొత్తియూరు: కారులో అక్రమంగా తరలిస్తున్న రూ.48.60 లక్షల విలువైన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన వ్యక్తిని అరెస్టు చేశారు. ఎక్సైజ్ విభాగం అదనపు డైరెక్టర్ మహేష్ కుమార్ అగర్వాల్, పోలీసు శాఖ రూపేష్ కుమార్ మీనా నేతృత్వంలో పోలీసులు శుక్రవారం రాత్రి తిరువళ్లూరు జిల్లా ఆరంబాక్కం పోలీసు స్టేషన్ సమీపంలోని కోల్‌కత్తా- చెన్నై హైవేలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో వచ్చిన కారును పరిశీలించడగా రూ.48.60 లక్షల విలువైన గంజాయి ఉన్నట్టు గుర్తించారు. దాన్ని స్వాధీనం చేసుకుని మహారాష్ట్రకు చెందిన దశరథ్ పవార్‌ను అరెస్టు చేశారు.

చదురగిరిలో దర్శనానికి భక్తులకు అనుమతి

తిరువొత్తియూరు: పంగుని నెల ప్రదోషంతో పాటు పౌర్ణమిని పురస్కరించుకుని ఏప్రిల్ 3వ తేదీ నుంచి నాలుగు రోజులు చదురగిరికి వెళ్లేందుకు భక్తులకు అధికారులు అనుమతి ఇచ్చారు. 10 నుంచి 60 ఏళ్లలోపు వారు కొండ ఎక్కడానికి అనుమతి ఇవ్వలేదు. ఆ నాలుగు రోజులు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు మాత్రమే భక్తులకు అనుమతి ఇచ్చినట్టు ఆలయ నిర్వాహకులు వెల్లడించారు.

దంపతులు ఆత్మహత్య

అన్నానగర్: పుదుకోట్టైలో శనివారం దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పుదుకోట్టైలోని తిరుకోకర్ణం కమ్మలార్ వీధికి చెందిన ఆనంద్ (30). ఇతనికి బంధువు కూతురు కౌసల్య(23)తో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. ఆనంద్ వడ్రంగి పని చేసేవాడు. ఈ క్రమంలో శుక్రవారం కౌసల్య ఇంట్లో ఫ్యాన్‌కి ఉరివేసుకుని శవమై కనిపించింది. ఆనంద్ విషం తాగి నేలపై పడి ఉన్నాడు. స్నేహితుడు ఇంటికి వచ్చి చూడగా వారిద్దరూ శవమై కనిపించారు. దిగ్భ్రాంతి చెందిన అతను వెంటనే తిరుకోకర్ణం పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. విచారణలో దంపతులు ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిసింది. అనంతరం వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పుదుకోట్టై ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించి తిరుకోకర్ణం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడు బలవన్మరణం

తిరువొత్తియూరు: చెన్నై తిరువొత్తియూరులో 9వ తరగతి విద్యార్థి విద్యార్థి ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడాడ్డు. తిరువొత్తియూరు జ్యోతినగర్ పాఠశాల వీధికి చెందిన పరిమల రాజ్ కుమారుడు రిషి (15). ఇతను ఎన్నూరు అన్నై శివగామి నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. రిషి సరిగా చదవకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. విరక్తి చెందిన రిషి శుక్రవారం బాత్‌రూంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 7 కంపార్టమెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 61,425 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 26,430 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.3.01 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శన మవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 14 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులు 2 గంటల్లోనే దర్శనం చేసుకుంటున్నారు.

మహిళను మోసం చేసిన డీఎంకే నేత అరెస్ట్


అరెస్టయిన డీఎంకే ప్రతినిధి కృష్ణన్

తిరువళ్లూరు: మనస్పర్థల కారణంగా భర్తకు దూరంగా వున్న వివాహితను తిరిగి భర్త చెంతకు చేరుస్తానని నమ్మించి గర్భవతిని చేసిన డీఎంకే నేతను తిరువళ్లూరు మహిళ పోలీసులు అరెస్టు చేశారు. తిరువళ్లూరు జిల్లా పూండి యూనియన్ తిరుప్పాచ్చూర్ గ్రామానికి చెందిన హృదయరాజ్ కుమార్తె సత్య(20)కు గత ఏడాది పెళ్లి అయింది. ఆరు నెలలకే భర్తతో ఏర్పడిన మనస్పర్థల కారణంగా పుట్టింటికి వచ్చేసింది. అదే ప్రాంతానికి చెందిన డీఎంకే ప్రతినిధి కృష్ణన్(70)ను ఆమె ఆశ్రయించింది. తనను భర్త వద్దకు చేర్చాలని కోరింది. భర్త వద్దకు చేరుస్తానని నమ్మించి ఆమెపై పలుమార్లు లైంగిక దాడి చేశాడు. దీంతో సత్య గర్భం దాల్చింది. ఈ విషయాన్ని బయటకు చెబితే ఇబ్బందులు పడతావని కృష్ణన్ ఆమెను బెదిరించాడు. ఆమె రెండు రోజుల క్రితం ఆడ శిశువుకు జన్మనిచ్చింది. శిశువు మృతి చెందింది. శిశువును ఇంటికి సమీపంలోనే పాతిపెట్టిన కృష్ణన్ విషయాన్ని బయటకు చెప్పవద్దని ఆమెను మళ్లీ బెదిరించాడు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో సత్యను విచారించారు. కృష్ణన్ లైంగిక దాడి చేయడంతోపాటు విషయాన్ని బయటకు చెప్పవద్దని బెదిరించినట్టు నిర్ధారణ కావడంతో శుక్రవారం రాత్రి అతన్ని అరెస్టు చేశారు.

నకిలీ పత్రాలతో బ్యాంకులో రూ.3 కోట్ల మోసం

- ఆరుగురికి మూడేళ్ల జైలు శిక్ష

తిరువొత్తియూరు: నకిలీ పత్రాలతో ఐడీబీఐ బ్యాంకులో రూ.3 కోట్ల అప్పు తీసుకుని మోసం చేసిన ఆరుగురికి మూడేళ్ల జైలు శిక్షను విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. చెన్నైలో ఉన్న ఏజీకే సంస్థ తరపున ఐడీబీఐ బ్యాంకులో రూ.3 కోట్ల వరకు అప్పు తీసుకున్నారు. అందుకోసం సమర్పించిన ఆధారాలు నకిలీవని తెలిసింది. దీనిపై బ్యాంక్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సంస్థకు చెందిన టి.కుమార్ రాజు, టి.అశోకన్, బి.ఆనందాన్, ఆర్.రామచంద్రన్, టి.మణిశంకర్, ఎస్.శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనపై ఎగ్మోర్‌లో అదనపు క్రైమ్ విభాగం కోర్టులో విచారణ జరుగుతూ వచ్చింది. దీనిపై న్యాయమూర్తి ఆర్.గిరిజ రాణి తీర్పు ఇచ్చారు. అందులో ఏజీకే పాక్కరస్ తరఫున బ్యాంకులో మోసం చేసిన కుమార్ రాజు, టి.అశోక్ అనే ఇద్దరికీ రూ.3 కోట్ల జరిమానా విధించారు. అదేవిధంగా వీరికి సహకరించిన నలుగురికి తలా మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు.

5 కిలోల బంగారం, రూ.30 లక్షల నగదు స్వాధీనం

అన్నానగర్: రామనాథపురం సమీపంలో శనివారం శ్రీలంక నుంచి అక్రమంగా తరలిస్తున్న రూ.3 కోట్ల విలువైన 5 కిలోల బంగారాన్ని కేంద్ర ప్రభుత్వ రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈ బంగారం కొనుగోలు చేసిన నగల వ్యాపారి నుంచి రూ.30 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రామనాథపురం జిల్లా సముద్ర సరిహద్దులో అక్రమంగా బంగారం తరలిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ రెవెన్యూ ఇంటలిజెన్స్ విభాగానికి శనివారం సమాచారం అందింది. అధికారులు మండపం సమీపంలోని వేదలై సముద్ర ప్రాంతంలో తనిఖీలు చేశారు. సముద్రంలోకి దూకేందుకు శ్రీలంక నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. చక్రాల వాహనంలో బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. వారిని వెంబడించి రామనాథపురం సమీపంలో పట్టుకున్నారు. రూ.3 కోట్ల విలువైన 5 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో బంగారం కొనుగోలు చేసేందుకు రామనాథపురానికి చెందిన నగల వ్యాపారి అక్కడకు వచ్చినట్లు తెలిపారు. ఆ తర్వాత అధికారులు స్వర్ణకారుల ఇంటికి వెళ్లి నగల వ్యాపారిని పట్టుకుని బంగారం కొనుగోలు చేస్తున్న రూ.30 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఇద్దరు బంగారు దొంగలు, నగల వ్యాపారిని మదురైకి తీసుకెళ్లారు.

టోల్ చార్జీల పెంపుపై లారీ యజమానుల నిరసన

వేలూరు: దేశ వ్యాప్తంగా పెంచిన టోల్ చార్జీలను తగ్గించాలని కోరుతూ లారీ యజమానులు శనివారం వేలూరు జిల్లా పల్లిగొండ టోల్‌గేట్ ఎదుట ధర్నా చేశారు. జిల్లాలోని పల్లిగొండలో అర్ధరాత్రి 12 నుంచి పెంచిన టోల్ ధర అమలులోకి వచ్చింది. దీంతో వాహణదారులు ఆందోళన చెందారు. శనివారం ఉదయం లారీ యజమానుల సంఘం ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. లారీ యజమానులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇష్టానుసారంగా టోల్ గేటు ధరలను పెంచుతోందన్నారు. కరోనా కాలం నుంచి ఇప్పుడే కోలుకుంటున్న నేపథ్యంలో ప్రభుత్వం టోల్ ధరలను పెంచడం సరికాదన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని, లేని పక్షంలో దేశ వ్యాప్తంగా లారీ యజమానుల సంఘం ఆధ్వర్యంలో లారీలను నిలిపి వేసి సమ్మె చేస్తామని హెచ్చరించారు. టోల్‌గేట్ వద్ద ధర్నా చేయడంతో వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రాకపోకలను పునరుద్ధరించారు.

భిక్షాటన చేస్తూ ఉద్యానవన శాఖ ఉద్యోగుల నిరసన


భిక్షాటన చేస్తున్న ఉద్యోగులు

అన్నానగర్: వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఉద్యానవన శాఖ ఉద్యోగులు శనివారం బొటానికల్ గార్డెన్‌లో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. నీలగిరి జిల్లాలో ఉద్యానవన శాఖలో పనిచేస్తున్న ఉద్యానవన, వ్యవసాయ కార్మికుల ప్రత్యేక పీరియాడికల్ వేతనాన్ని పీరియాడికల్‌గా మార్చాలని, వ్యవసాయ కార్మికులకు పెన్షన్, ప్యాకేజీ ఫండ్, గ్రాట్యూటీ సహా 10 డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు గత 23వ తేదీ నుంచి ఊటీ ప్రభుత్వ బొటానికల్ గార్డెన్‌లో ధర్నా చేస్తున్నారు. ఉద్యానవన శాఖలో 5 సంవత్సరాలకు పైగా దినసరి కూలీలుగా పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, రోజు కూలీ రూ.400 నుంచి రూ.700లకు పెంచాలని డిమాండ్ చేస్తూ నూతనంగా చెట్టుకు వినతిపత్రం ఇచ్చి నీటి కుంటలోకి దిగి నిరసన తెలిపారు.

గ్రామ పరిపాలన మహిళా అధికారి అరెస్ట్

అన్నానగర్: తిరుచ్చి సమీపంలో పట్టా పేరు మార్చేందుకు రూ.5 వేలు లంచం తీసుకున్న మహిళా గ్రామ పరిపాలన అధికారిణి ఏసీబీ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. తిరుచ్చి జిల్లా మన్నచనల్లూర్ తాలూకా పరిధిలోని అయ్యంపాళయం ప్రాంతానికి చెందిన అఖిల. రైతు అయిన అఖిల తండ్రి ఇటీవల వైయాపురి అయ్యంపాలెం గ్రామంలో 29 సెంట్ల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. తండ్రి పేరు మీదున్న భూమిని తన పేరుకు మార్చాలని మంచనల్లూరు తాలూకా కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంది. అతని దరఖాస్తును అయ్యంపాళయం గ్రామ పరిపాలనా అధికారికి పంపారు. దరఖాస్తును పరిశీలించిన అయ్యంపాళయం గ్రామ పరిపాలనా అధికారి పళనియమ్మాళ్ (44) రూ. 5వేలు లంచం డిమాండ్ చేశారు. అయితే లంచం ఇవ్వడానికి ఇష్టపడని అఖిల తిరుచ్చి జిల్లా అవినీతి నిరోధక శాఖకు ఫిర్యాదు చేసింది. దీంతో తిరుచ్చి అవినీతి నిరోధక శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మణికంఠన్ నేతృత్వంలోని పోలీసులు రసాయనం పూసిన కరెన్సీ నోట్లను అఖిలకు ఇచ్చి గ్రామ పరిపాలనా అధికారికి ఇవ్వాలని కోరారు. దీంతో అఖిల డబ్బులు తీసుకుని శనివారం అయ్యంపాళయం గ్రామ పరిపాలనా కార్యాలయానికి వెళ్లింది. ఆ సమయంలో అఖిల రసాయనం పూసిన డబ్బును అక్కడి గ్రామ పరిపాలన అధికారి పళనిఅమ్మాళ్‌కు ఇచ్చింది. దానిని తీసుకుంటుండగా సాదా సీదా దుస్తుల్లో ఉన్న లంచాల నిరోధక పోలీసులు అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు.

ముక్కంటి సేవలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి


ఆలయ ధ్వజస్తంభం వద్ద న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఎం సుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఎం సుబ్రహ్మణ్యం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణా మూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వదించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

• అవగాహన


ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ తరఫున అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇందులో ఆటిజం చిన్నారులు, వారి తల్లిదండ్రులు, సంరక్షకులతో ప్లకార్డులు చేతపట్టి అవగాహన పెంచారు. –కొరుక్కుపేట:

మహిళ పొట్టలో 10 కేజీల కణితి తొలగింపు


తొలగించిన కణితిని చూపిస్తున్న డాక్టర్ సురేష్‌బాబు

కుప్పం(చిత్తూరు జిల్లా): కుప్పం పట్టణంలోని బీఆర్‌డీ ఆస్పత్రిలో శనివారం ఓ మహిళకు శస్త్ర చికిత్స చేసి 10 కేజీల కణితిని వైద్యులు తొలగించారు. రామకుప్పం మండలానికి చెందిన లక్ష్మమ్మ(56) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆస్పత్రికి వెళ్లిన లక్ష్మమ్మకు పొట్టలో గడ్డ ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. డాక్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో ఆపరేషన్ చేసి లక్ష్మమ్మ పొట్టలోని కణితిని తొలగించారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటోంది.

8న సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్

- ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 8న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తెలుగు రాష్ట్రాల మధ్య రెండో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ పారంభిస్తారని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ - తిరుపతి మధ్య నడిచే ఈ రైలు ఎనిమిదిన్నర గంటల వ్యవధిలోనే గమ్యస్థానాన్ని చేరుకుంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లేవారికి ఈ రైలు ఎంతో సదుపాయంగా ఉంటుందని వివరించారు. ఈ రైలు నల్లగొండ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు స్టేషన్లలో ఆగుతుందని శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాని మోదీ ఈ రైలును ప్రారంభించే తొలిరోజు మాత్రం నల్లగొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు స్టేషన్లలో ఆగుతుందని వెల్లడించారు. వందేభారత్ రైలు ఆగనున్న అన్ని స్టేషన్లలో స్థానిక ప్రజలు ఘనంగా స్వాగతం పలకాలని కిషన్‌రెడ్డి కోరారు.

భలే బనానా

- ఉద్యాన వర్సిటీలో ఫలిస్తున్న పరిశోధనలు
- విభిన్న రంగుల్లో అరటి పుష్పాలు
- ఇతర రంగుల్లోనూ పండ్లు

దూర్వాస మహర్షి భార్య 'కదళి' వృక్షంగా పునర్జన్మ పొందారన్నది పురాణ గాథ. పూజాదికాల్లో కదళీ ఫలాలదే అగ్ర తాంబూలం. సంపూర్ణ పోషకాలను అందించే ఫలరాజం అరటి. పచ్చి అరటికాయ కూరలకు ప్రశస్తం. అరటి పువ్వు కూరల్లో శ్రేష్టం. అరటి ఆకులో విందు భోజనం ఆరోగ్యకరం. ఇన్ని విశేషాలున్న అరటి మొక్క ఇకపై పెరట్లోను.. ఉద్యానాల్లోను అలంకార మొక్కగానూ మారబోతోంది. ఉద్యాన వర్సిటీలో ఈ దిశగా చేపట్టిన పరిశోధనలు ఫలించాయి.


ఇలాంటి అరటి కాయలు రానున్నాయి
పసుపు అరటి పువ్వులు

తాడేపల్లిగూడెం: విదేశాలలో అరటిని అలంకరణ మొక్కగా వినియోగిస్తుంటారు. జర్మనీ వంటి దేశాల్లో ఇళ్ల మధ్య కుండీల్లో అలంకరణ మొక్కలుగా అరటిని వినియోగిస్తారు. ఇటీవల సంప్రదాయేతర అలంకార మొక్కల వినియోగం దేశంలోనూ పెరుగుతోంది. హల్దీ వేడుకల్లో అరటి ఆకుల డెకరేషన్‌కు ప్రాధాన్యత పెరిగింది. అలంకరణ పుష్పాలుగా అరటి పువ్వులను వాడే అలవాటు పెరుగుతూ వస్తోంది. ల్యాండ్ స్కేపింగ్, గార్డెనింగ్ విస్తృతం కావడంతో అలంకరణలో అరటి మొక్కలు చేరాయి. ఈ నేపథ్యంలోనే పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో అరటి మొక్కలపై ఏడాది కాలంగా చేస్తున్న ప్రయోగాలు ఫలించాయి. ఉద్యాన వర్సిటీలో వివిధ రంగుల్లో విరిసిన అరటి పుష్పాలు ఆకట్టుకుంటున్నాయి. త్వరలోనే వీటిని నర్సరీల వరకు చేర్చే ప్రయత్నాలకు ఉద్యాన వర్సిటీ శ్రీకారం చుడుతోంది.


పింక్ కలర్ పువ్వులు

ఆకర్షణీయ అరటి పుష్పాలు

ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఏడాది క్రితం వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన 55 అలంకార అరటి మొక్కలను ఇక్కడ పెంచుతున్నారు. ఎక్కువ ఖర్చు అవసరం లేకుండా.. తక్కువ నిర్వహణతో ఈ అలంకరణ అరటి మొక్కలు ఏడాది పొడవునా ఇక్కడున్న వాతావరణ పరిస్థితుల్లో కూడా పెరుగుతాయని గమనించారు. ఉద్యాన వర్సిటీలో నాటిన మొక్కలు ప్రస్తుతం పుష్పిస్తున్నాయి. ఆర్నమెంటల్ బనానా శాస్త్రీయ నామం మూసా ఆర్నాటా. ఇది ఆసియా ఖండానికి చెందిన మొక్క. 10 అడుగుల పొడవు.. నిగనిగలాడే ఆకుపచ్చ రంగుల్లో ఉండే పెద్ద ఆకులను ఉత్పత్తి చేస్తుంది. ఈ మొక్క లేత గులాబీ రంగు నుంచి ముదురు ఎరుపు రంగుతో ఉండే ఆకర్షణీయమైన పెద్ద పువ్వులను ఉత్పత్తి చేస్తోంది. అలంకార అరటిలో రోడోక్లామిస్, కాలిమూసా రకాలు అనువైనవిగా ప్రాచుర్యం పొందాయి. ఈ రెండు మొక్కలు నీటి ఎద్దడిని తట్టుకుని ఔట్‌డోర్, ఇండోర్ తోటల పెంపకానికి అనువైనవిగా గుర్తించారు. ముసెల్లాసీయే కార్నా అనే అరటిపువ్వు వైవిధ్య భరితంగా ఉంటుంది. పుష్పగుచ్ఛం తెరుచుకునే ముందు తామర పువ్వులా కనిపిస్తుంది. అందుకే దీనిని తామర అరటి అంటున్నారు. ఇది చాలా అందంగా, ఆకర్షణీయంగా ఉంటుంది.

అరటి పండ్ల కొత్త రకాలు

కాగా, వివిధ రంగుల్లో కాసే అరటి పండ్ల కొత్త రకాలను సైతం ఉద్యాన వర్సిటీ అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. రాబోయే రోజుల్లో వివిధ ప్రాంతాల నుంచి పండ్ల రకాలను కూడా సేకరించనుంది. అర్నమెంటల్ అరటి, పండ్ల అరటి పరిశోధనలకు సంబంధించి తమిళనాడు రాష్ట్రం తిరుచ్చిలోని 'నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఫర్ బనానా'తో ఉద్యాన వర్సిటీ ఒప్పందం కూడా కుదుర్చుకుంది.

నర్సరీలకు అందిస్తాం

అలంకరణ అరటి మొక్కల పెంపకంపై ఉద్యాన వర్సిటీలో చేసిన ప్రయోగాలు సత్ఫలితాలను ఇచ్చాయి. వీటిని త్వరలో నర్సరీలకు అందచేసే ఆలోచన ఉంది. కట్ ఫ్లవర్స్‌గా అరటి పువ్వులను కూడా వాడొచ్చు. ఈ క్రమంలోనే ఈ మొక్కలను యూనివర్సిటీ సేకరించింది. అలంకరణ అరటి పువ్వులు వాడిపోకుండా ఎక్కువ కాలం ఉంటాయి. ఇతర పూలతో పోలిస్తే కొత్తదనంతో ఎక్కువ ఆకర్షణీయంగా ఉంటాయి. వీటిపై పరిశోధన చేస్తూ ఉత్తమ అరటిపూల రకాలను ఆసక్తి గల రైతులకు, నర్సరీలకు పంపిణీ చేయనున్నాం. ఇకబెనా బొకేలలో కూడా వీటిని వాడవచ్చు. లిసియాంతస్‌పై ప్రయోగాలు చేసినట్టుగానే యూనివర్సిటీ అలంకరణ అరటిలో వివిధ రకాలపై మరిన్ని ప్రయోగాలు చేయనుంది.


మొక్కలను పరిశీలిస్తున్న ఉద్యాన వర్సిటీ వీసీ జానకిరామ్ తదితరులు

– డాక్టర్ తోలేటి జానకిరామ్, వీసీ, ఉద్యాన వర్సిటీ

ప్రొఫెషన్ ఏదైనా.. యాక్టింగే ప్యాషన్!



- వెబ్ సిరీస్‌లు, ఓటీటీల నేపథ్యంలో అవకాశాలు
- సద్వినియోగం చేసుకుంటున్న సిటీజనులు
- నటనా కౌశలంతో ఆకట్టుకుంటున్న వైనం

సాక్షి, హైదరాబాద్: గతంలో నటులు అంటే నాటకాలనో, సినిమాలనో కెరీర్‌గా ఎంచుకున్నవారే అన్నట్టుగా ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. వృత్తిలా కాకుండా హాబీగా నటించేవారి సంఖ్య పెరిగిపోయింది. గత ఐదేళ్ల కాలంలో ఆన్‌లైన్ సర్వీసుల మాదిరి ఈ హాబీ కూడా ఒక్కసారిగా ఊపందుకుంది. ముఖ్యంగా ఓటీటీ వేదికలు విస్తృతమవడం, పెద్దసంఖ్యలో సీరియల్స్, వెబ్ సిరీస్‌లు రూపుదిద్దుకుంటుండడంతో నటీనటులకు అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. పాత్రోచితంగా కనిపించే వ్యక్తులకు కాస్తంత శిక్షణ అందిస్తే చాలు పనై పోతోంది. వయసులకు అతీతంగా నగరంలో అనేకమందికి నటన ఓ ప్యాషన్‌గా మారిపోయింది.

ప్రేక్షకాభిరుచిలో మార్పు...

➤ నటనలో పేరున్నవారు, బాగా తెలిసిన ముఖాలను మాత్రమే కాకుండా కొత్త వారిని కూడా ఆదరించే దిశగా ప్రేక్షకుల అభిరుచుల్లో స్పష్ట మైన మార్పు వచ్చింది. దీంతో నిర్మాతలు కొత్త నటీనటులతో ప్రయోగాలు చేయడానికి గతంలోలా భయపడడం లేదు. అంతేకాకుండా ఏ రంగంలో ఉన్నవారు ఆ రంగానికి సంబంధించిన పాత్ర లో కాస్త సులభంగా మమేకమ య్యే వీలుంటుంది. కాబట్టి వినూ త్న పద్ధతుల్లో సినిమాలో వైద్యుడిపాత్ర ఉంటే వైద్యుడిని, లాయర్ పాత్రకు లాయ ర్‌ని ఎంచుకుంటున్నారు. సర దాగా ఓ సీన్‌లో చేసేవారు కొందరైతే, ఇంకొందరు ప్రాధాన్యత కలిగిన పాత్రల్లోనూ తమ సత్తా చూపుతున్నారు. దీంతో రంగాలేమైనా తెరంగేట్రం సాధారణ విషయంగా మారిపోయింది.

ఓ గంగవ్వ.. ఇంకో రామ్.. మరో శ్రీనివాస్


దీపా కిరణ్


శ్రీనివాస్


రామ్

ఒక యూట్యూబ్ చానెల్ ప్రోగ్రామ్ ద్వారా పేరు తెచ్చుకున్న మారుమూల గ్రామానికి చెందిన గంగవ్వ దీనికో ఉదాహరణ. నగరానికి చెందిన ఫ్యాషన్ డిజైనర్ రామ్... గత కొంత కాలంగా సెలబ్రిటీల కోసం పనిచేస్తూ ఆ రంగంలో పేరొందారు. లుక్స్‌లో టాలీవుడ్ హీరోలకు తీసిపోని రామ్... గత లాక్ డౌన్ టైమ్‌లో దొరికిన ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకున్నారు. 'పచ్చీస్'పేరుతో రూపొందించిన ఓ సినిమాలో హీరోగా నటించారు. ఆ సినిమా ప్రస్తుతం ఓటీటీలో అందుబాటులో ఉంది. నిర్మాణ రంగంలో ఉన్న మణికొండకు చెందిన శ్రీనివాస్‌కు కూడా నటనపై మక్కువ ఎక్కువ. కానీ ఎన్నో ఏళ్ల పాటు తనలోని నటనా కౌశలాన్ని తనలోనే దాచేసుకున్నారు. పిల్లలు పెద్దవాళ్లవడంతో వృత్తికి కాస్త విరామం ఇచ్చారు. సీరియల్స్‌తో పాటు సినిమాల్లోనూ రాణిస్తున్నారు. ఇక నగరంలో స్టోరీ టెల్లింగ్‌కు కేరాఫ్‌గా పేరొందిన దీపా కిరణ్ కూడా ఇటీవల యాంగర్ టేల్స్ అనే ఓటీటీ చిత్రంలో నటించారు. అందులోని నాలుగు పొట్టి కథల్లో ఒకటైన 'యాన్ ఆఫ్టర్ నూన్ న్యాప్'లో ఆమె కనిపిస్తారు.

కేరెక్టర్‌కు ఓకే.. కెరీర్‌గా నాట్ ఓకే


సంధ్యారాజు


రాఘవేంద్ర

ఇలాంటి నటులు వరుస పెట్టి సినిమాలు చేసేయాలనే ఆత్రుత ఏమీ చూపడం లేదు. తమ వృత్తికో, ఉద్యోగానికో ప్రాధాన్యత ఇస్తూనే 'జస్ట్ ఫర్ ఏ ఛేంజ్'అన్నట్టుగా అడపాదడపా వచ్చిన అవకాశాల్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. సినిమా అనేది తమకు కేవలం అభిరుచి మాత్రమేనని చాలామంది అంటున్నారు. ''నాట్యం'అనేది నా అభిరుచికి, నా ఆలోచనలకు దగ్గరగా ఉన్న సినిమా కాబట్టి నటించాను. అంతే తప్ప సినిమాల్ని కెరీర్‌గా తీసుకునే ఆలోచన లేదు..'అంటున్నారు సంధ్యారాజు. ప్రముఖ పారిశ్రామికవేత్త సత్యం రామలింగరాజు కుటుంబ సభ్యురాలైన ఈ సంప్రదాయ నృత్య కారిణి... ఇటీవలే నాట్యం అనే సినిమాలో కథానాయికగా నటించారు. ఆ సినిమా విమర్శకుల ప్రశంసలతో పాటు జాతీయ పురస్కారాన్ని కూడా అందుకుంది. అయినప్పటికీ ఆమె మరో చిత్రంలో నటించలేదు. అదే విధంగా నగరానికి చెందిన ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఆకెళ్ల రాఘవేంద్ర కూడా ఒకటి రెండు చిత్రాల్లో కనిపించారు.

అల్లదివో.. బ్రహ్మాండ నాయకుడు

- నయనానందంగా కోనేటి రాయుడి కల్యాణం
- భక్తులతో శోభిల్లిన వాడపల్లి క్షేత్రం


మాడవీధుల్లో కన్నుల పండువగా సాగుతున్న రథోత్సవం

ఆత్రేయపురం: అభయమొసంగ శ్రీవారు వచ్చారు.. శంఖచక్రధారిగా చిరుమందహాసంతో దర్శనమిచ్చారు.. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకా అంటూ భక్తులు తన్మయత్వంతో కొలిచారు. గౌతమీ నదీ తీరాన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కోనేటి రాయుడి కల్యాణ మహోత్సవాలు అట్టహాసంగా జరిగాయి. శనివారం రాత్రి 7–01 గంటలకు ఈ రమణీయ ఘట్టాన్ని నిర్వహించారు. అత్యంత సుందరంగా అలంకరించిన కల్యాణ మండపంలో పట్టువస్త్రాలు, సర్వాభరణాలతో ముస్తాబైన శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో వేంకటేశ్వరస్వామి కొలువుదీరారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణ వేడుకను కడు రమణీయంగా నిర్వహించారు. భక్తజనం తన్మయత్వంతో కల్యాణ వేడుకలను తిలకించారు. ఈ వేడుకలతో వాడపల్లి క్షేత్రానికి ఆధ్యాత్మిక శోభ వచ్చింది. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి దంపతులు, ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు స్వామి వారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను సమర్పించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజాదికారులు నిర్వహించారు. కల్యాణ మండపానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమ గుండంలో భక్తులు హారతి కర్పూరాలను భక్తిశ్రద్ధలతో వెలిగించారు. ఈ వెలుగుల్లో వేంకటేశ్వరస్వామి అమ్మవార్లకు అర్చకుల వేదమంత్రోచ్చారణలతో వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం చైత్రశుద్ధ ఏకాదశి శుభముహూర్తం రాత్రి 7–01 గంటలకు కల్యాణాన్ని జరిపించారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంత్ర మండలం నడిపూడికి చెందిన వేదపండితుడు ఖండవల్లి రాజేశ్వరవరప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చక బృందం సభ్యులు పూజాదికాలు చేశారు. పంచద్రవ్యాలు, సుగంధ పరిమళాలు, సువాసనలు వెదజల్లే పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపంలో స్వామివారి కల్యాణ వేడుకలు జరిగాయి.

సుందరంగా అలంకరించి..

తొలుత భరద్వాజ గోత్రీయుడు వేంకటేశ్వర స్వామి, భార్గవ గోత్రవతి శ్రీదేవి, కాశ్యపస గోత్రవతి భూదేవిల ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, బంగారు, వెండి వజ్రాభరణాలతో సుందరంగా అలంకరించారు. తొలుత గర్భగుడి నుంచి కల్యాణ వేదికకు ఊరేగింపుగా తీసుకు వచ్చారు. మధ్యాహ్నం 3 గంటలకు స్వామివారి రథోత్సవం పురమాడ వీధుల్లో కన్నుల పండువగా జరిగింది. రావులపాలేనికి చెందిన, ఆలయ కమిటీ సభ్యులు మన్యం నాగవెంకట సూర్యకుమారి, భాను దంపతులు ముత్యాల తలంబ్రాలను సమకూర్చగా శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి ముత్యాల తలంబ్రాల కార్యక్రమం వైభవంగా జరిగింది. కల్యాణ వేడుకల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శంఖచక్రధరా శరణు.. శరణు

- వైభవంగా అమలాపురంలో వెంకన్న రథోత్సవం
- ప్రారంభించిన మంత్రి విశ్వరూప్ దంపతులు


అమలాపురంలో అశేష భక్తజనం నడుమ వేంకటేశ్వరస్వామి రథోత్సవం

అమలాపురం టౌన్: శంఖచక్రధరా శరణు.. శరణు అంటూ భక్తజనం మోకరిల్లింది.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం తీర్థం, రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. కోనసీమ నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. సాయంత్రం 3.15 గంటలకు ఆలయం వద్ద స్వామి రథానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, బేబీ మీనాక్షి దంపతులు కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. తొలుత పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ మంత్రి విశ్వరూప్ దంపతులు పూజలు చేశారు. గోవింద నామస్మరణ మధ్య రథాన్ని భక్తులు ముందుకు లాగారు. తొలుత రథానికి ఆలయ ప్రధానార్చకులు పెద్దింటి లక్ష్మీ నరసింహాచార్యులు, సత్యనారాయణాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మహిపాల వీధి, గండు వీధి, గారపాటి వీధి, పుల్లయ్య రామాలయం వీధి తదితర ప్రాంతాల నుంచి రథోత్సవం సాగింది. దారి పొడవునా రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఈఓలు దూనబోయిన సాయి బాబు, బొక్కా వీరవెంకటేశ్వరరావు, ధర్మకర్తల ఆధ్వర్యంలో రథోత్సవం సాగింది. ఒకపక్క స్వామివారి తీర్థం, మరోపక్క రథోత్సవంతో ఎర్రవంతెన నుంచి ముమ్మిడివరం గేటు సెంటర్ వరకూ రద్దీ నెలకొంది. పట్టణ వైఎస్సార్ సీపీ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి ఆధ్వర్యంలో యువకులు సేవలు అందించారు. ఇదిలా ఉంటే మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని పాల్గొన్నారు. గండువీధిలో రథం ఒకవైపు నాలుగు చక్రాలు మున్సిపల్ డ్రెయిన్‌లో దిగబడి ఒరిగిపోయింది. భారీ క్రేన్‌ను రప్పించి రథాన్ని బయటకు లాగడంతో రథోత్సవం యథావిధిగా సాగింది.

ఆక్వా రైతులకు శుభవార్త

విద్యుత్ రాయితీ దరఖాస్తులకు అవకాశం

- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 3.25 లక్షల ఎకరాల్లో సాగు
- సుమారు 27 వేల విద్యుత్ కనెక్షన్లు
- ఇప్పటివరకూ 17,250 కనెక్షన్లకు సబ్సిడీ వర్తింపు
- మరింత మందికి అందించేలా చర్యలు


భీమవరంలో రొయ్యల చెరువుల్లో తిరుగుతున్న ఏరియేటర్

సాక్షి,భీమవరం: రాష్ట్రంలో ఆక్వా సాగుకు అన్నివిధాలా అండగా నిలుస్తూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తోంది. దీనిలో భాగంగా ఆక్వా సాగుకు విద్యుత్ సబ్సిడీ పొందేందుకు రైతులకు మరో అవకాశం ఇచ్చింది. ఇప్పటివరకు విద్యుత్ రాయితీ పొందలేకపోతున్న అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవడానికి వెసులుబాటు కల్పించింది. రైతు సమస్యలు తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్వాసాగుకు యూనిట్ విద్యుత్‌ను కేవలం రూ.1.50 అందించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో పెద్ద సంఖ్యలో రైతులు ఆక్వా సాగుకు విద్యుత్ వినియోగిస్తున్నారు. సబ్సిడీ విద్యుత్ వినియోగం కారణంగా పెద్ద మొత్తంలో పెట్టుబడులు తగ్గడంతో రైతులు ఏటా మూడు పంటల్లో రొయ్యల పట్టుబడి చేస్తున్నారు.

3.25 లక్షల ఎకరాల్లో..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా సుమారు 3.25 లక్షల ఎకరాల్లో రైతులు ఆక్వా సాగు చేస్తుండగా సుమారు 27 వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

☛ పశ్చిమగోదావరి జిల్లాలో 1,01,858 ఎకరాల సాగుకు సుమారు 13,856 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఆక్వాజోన్ పరిధిలో ఉన్న దాదాపు 8,059 విద్యుత్ కనెక్షన్ల ద్వారా సుమారు 40 వేల మంది రైతులు సబ్సిడీ విద్యుత్ పొందుతున్నారు. వీరందరికీ యూనిట్ రూ.1.50లకు ప్రభుత్వం సరఫరా చేస్తోంది.

☛ ఏలూరు జిల్లాలో సుమారు 1.98 లక్షల ఎకరాల్లో ఆక్వాసాగు ఉండగా 13,205 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో దాదాపు 9,191 విద్యుత్ కనెక్షన్ల ద్వారా రైతులు సబ్సిడీ విద్యుత్ పొందుతున్నారు.

ఆక్వా రైతులకు మేలు చేసేలా..

ఆక్వా రైతులకు మేలు చేసేలా కోవిడ్ సమయంలో ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. ప్రధానం రొయ్యలు, చేపల ఎగుమతులు తగ్గిపోవడంతో ధరలు తగ్గి చెరువుల్లో పట్టుబడులు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే చెరువుల్లోని రొయ్యలు, చేపలకు మేతలు వేసి పెంచలేక నష్టపోయారు. ఇదే అదనుగా కొందరు వ్యాపారులు ధరలు మరింత తగ్గించిన సమయంలో ప్రభుత్వం చొరవ తీసుకుని కనీస మద్దతు ధరలకు కొనుగోలు చేసేలా ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. అలాగే ఇటీవల ఆక్వా మేతల ధరలు పెరిగి రొయ్యల ధరలు పతనమైన సమయంలోనూ మంత్రులు, అధికారులతో కూడిన ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేసి ప్రభుత్వం ప్రకటించిన ధరలకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

అర్హులందరికీ వర్తించేలా..

ఆక్వా సాగులో అర్హత ఉన్నా సబ్సిడీ పొందలేని రైతులు చాలా మంది ఉన్నారు. వీరంతా ఆక్వా రైతుల సంఘాల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సమస్యను విన్నవించుకున్నారు. దీంతో ఆక్వాజోన్‌లో ఉన్న పదెకరాలలోపు రైతులు ఈ–ఫిష్ నమోదు చేసుకుంటే విద్యుత్ సబ్సిడీ పొందేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రైతులు కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి అధికారులు అవకాశం కల్పించారు. అర్హులైన రైతులంతా తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకుంటే సబ్సిడీ విద్యుత్ పొందవచ్చని అధికారులు చెబుతున్నారు.

దరఖాస్తు చేసుకోవచ్చు



అర్హత కలిగి విద్యుత్ సబ్సిడీ పొందలేకపోతున్న ఆక్వా రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆక్వాసాగు చేస్తున్న భూములు ఆక్వాజోన్‌లో ఉండాలి. ఈ–ఫిష్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలి. రైతులు తమ సమీపంలోని రైతు భరోసా కేంద్రంలో మత్స్యశాఖ సిబ్బందిని కలిసి వివరాలు అందిస్తే విద్యుత్ రాయితీ పొందేందుకు అవకాశం ఉంటుంది.

–ఎల్ఎల్ఎన్ రాజు, మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, భీమవరం

తెలంగాణ

ఆర్టీసీ చార్జీల్లో స్వల్పంగా టోల్ రుసుము పెంపు

సాక్షి, హైదరాబాద్: టోల్‌ప్లాజాల్లో చార్జీలు పెంచిన నేపథ్యంలో ఆ రూపంలో ఆర్టీసీపై పడే భారాన్ని రికవరీ చేసుకునేందుకు టికెట్ చార్జీలో ఉండే టోల్ రుసుమును సంస్థ సవరించింది. ఆర్టీసీ బస్సులు కూడా టోల్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో గతంలోనే, టోల్ రుసుమును టికెట్ ధరలో చేర్చింది. ఇప్పుడు కొత్తగా పడే భారానికి తగ్గట్టు దాన్ని సవరించింది. అయితే, గతేడాది డీజిల్ సెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెస్, సేఫ్టీ సెస్.. ఇలా పలు సెస్‌లను చేర్చి టికెట్ ధరలను సవరించినప్పుడు చిల్లర సమస్య రాకుండా తదుపరి పది రూపాయలకు రౌండింగ్ ఆఫ్ చేసింది. ఇప్పుడు ఒక టోల్‌గేట్ దాటుతూ వెళ్లే స్టాప్‌లకు కొత్తగా టోల్ రుసుము జోడించినా ఆ రౌండింగ్ ఆఫ్ చేసిన మొత్తాని కంటే తక్కువే అవుతున్నందున అదనంగా పెంపు లేకుండా పోయింది. కానీ రెండు, మూడు టోల్‌గేట్లు దాటుతూ వెళ్లే ప్రయాణికులకు మాత్రం కొంత మేర అదనపు భారం పడుతోంది. ఒక్కో టోల్ గేట్‌కు సంబంధించి రూ.4 చొప్పున టికెట్ రుసుములో చేర్చింది. రౌండింగ్ ఆఫ్ పరిధి మించి రావాలంటే కనీసం రెండు టోల్‌గేట్లు దాటి ప్రయాణించాల్సి ఉంటుంది. అప్పుడు రూ.10 చొప్పున అదనంగా టికెట్ రుసుములో చేర్చారు. విజయవాడ, ఖమ్మం మార్గాల్లో మూడు చొప్పున టోల్ గేట్లు ఉన్నందున చివరి స్టాప్ వరకు వెళ్లే వారికి మాత్రం రూ.20 చొప్పున అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో నిత్యం 28 లక్షల మంది సగటున ప్రయాణిస్తున్నారు. వీరిలో సిటీబస్సుల్లో తిరిగే వారి సంఖ్య దాదాపు 13 లక్షలుంటోంది. వీరిపై టోల్ రుసుము భారం లేదు. పల్లె వెలుగు బస్సుల నిడివి తక్కువ. వీటిల్లో 12 లక్షలమంది ప్రయాణిస్తున్నారు. వీరిపై భారం దాదాపు లేదు. ఇక దూర ప్రాంత బస్సుల్లో తిరిగే మిగిలిన మూడు లక్షలమందిపై ఈ పెంపు ప్రభావం కనిపిస్తోంది.

వైరల్

బ్యూటిప్స్

టర్మరిక్ క్యూబ్స్‌తో.. మచ్చలేని అందం

ఎన్ని జాగ్రత్తలు పాటిస్తున్నప్పటికీ ఒక్కోసారి ముఖ చర్మం జిడ్డుగా, మొటిమలు, బ్లాక్, వైట్ హెడ్స్ వల్ల అందవిహీనంగా కనిపిస్తుంది. ఈ సమస్యలన్నింటికీ పసుపు, ఐస్‌క్యూబ్‌లతో మంచి పరిష్కారం లభిస్తుంది.

- టీస్పూను పసుపు, టీస్పూను ముల్తానీ మట్టి, టీస్పూను కమలా తొక్కల పొడి, కప్పు రోజ్‌వాటర్, టీస్పూను కొబ్బరి పాలు, ఆరు చుక్కల నిమ్మనూనెను తీసుకుని ఒక గిన్నెలో వేసి చక్కగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఐస్‌క్యూబ్స్ ట్రేలో పోసి గడ్డకట్టేంత వరకు రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి. ఈ క్యూబ్‌లు మూడు వారాల వరకు తాజాగా ఉంటాయి.



- ముఖాన్ని శుభ్రంగా కడిగి ఈ ఐస్‌క్యూబ్స్‌తో ఇరవై నిమిషాల పాటు మర్దన చేయాలి
- ఇరవై నిమిషాల తరువాత నీటితో కడిగి తడిలేకుండా తుడవాలి. ఇప్పుడు మాయిశ్చరైజర్ లేదా అలోవెరా జెల్‌ను రాసుకోవాలి.
- ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల ముఖంపై పేరుకుపోయిన మొటిమల తాలూకు మచ్చలు, వైట్, బ్లాక్ హెడ్స్, ట్యాన్ పోయి ముఖం ఫ్రెష్‌గా రేడియంట్‌గా కనిపిస్తుంది.
- చర్మం జిడ్డు కారడం నియంత్రణలో ఉండడమేగాక, దీర్ఘకాలంగా వేధిస్తోన్న మొటిమలు కూడా తగ్గుముఖం పడతాయి.
- పసుపు, కొబ్బరి పాలు వృద్ధాప్య చాయలను నియంత్రించి చర్మం యవ్వనంగా కనిపించేలా చేస్తాయి.

అవాంఛిత రోమాలకు మసూర్ ప్యాక్!



వంద గ్రాముల మసూర్ దాల్ (ఎర్రపప్పు), ఇరవై గ్రాముల గంధం పొడి, ఒక నారింజకాయ తొక్క, రెండు గ్లాసులు పచ్చి పాలు తీసుకోవాలి. మసూర్ దాల్, గంధంపొడిని, నారింజ తొక్కను పాలల్లో వేసి గంటపాటు నానబెట్టాలి. తరువాత వీటిని మిక్సీ జార్‌లో వేసి మెత్తని పేస్టులా చేసుకోవాలి. ఈ పేస్టును డైలీ ముఖానికి రాసి ఆరిన తరువాత కడిగేయాలి. ఇలా చేయడం వల్ల ముఖం మీద మృతకణాలు, అవాంఛిత రోమాలు తొలగి ముఖవర్చస్సు మెరుగుపడుతుంది.

చల్లటి, తీయటి టెక్నో క్రియేటివిటీ!

మనసు ఉంటే మార్గం ఉండడమే కాదు... చల్లని ఐస్‌క్రీమ్ కూడా ఉంటుంది!

ఎండాకాలంలో చాలా మంది బయటికి వెళ్లి మార్కెట్‌లోని తీయటి, చల్లటి ప్యాకేజ్‌డ్ ఐస్‌క్రీమ్‌లను తింటారు. 'ఇంత విషయానికి అంతదూరమేలా?'



అంటుంది ఒక ఇల్లాలు. ఐస్‌క్రీమ్‌ల కోసం బయటికి వెళ్లనవసరం లేకుండా సుబ్బరంగా ఇంట్లోనే తయారు చేస్తుంటుంది. ఈ తయారీ ప్రక్రియకు అట్టే ఖర్చు కాదు. సహజ పదార్థాలు(నేచురల్ ఇన్‌గ్రేడియెంట్స్)ను ఉపయోగించి చేసే ఈ ఐస్‌క్రీమ్‌ల రుచి బయటి ఐస్‌క్రీమ్‌ల కంటే బ్రహ్మాండంగా ఉంటుందట!

ఇన్‌గ్రేడియెంట్స్‌తో కూడిన వేడి వేడి ద్రావకాన్ని ఒక పాత్రలో పోసి, మూతపెట్టి దాన్ని ఫ్రీజర్‌లాంటి పాత్రలో పెట్టి చుట్టూ ఐస్‌ముక్కలు వేస్తుంది. ఈ పాత్రకు తాడు కట్టి, ఫ్యాన్‌కు వేలాడదీసి స్విచ్ వేస్తుంది. ఫ్రిజ్‌తో పనేలే! కొద్దిసేపటి తరువాత ఐస్‌క్రీమ్ మన ముందు ఉంటుంది. ఈ వీడియో క్లిప్‌ను పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తే వైరల్ అయింది.

'చక్కని ఐస్‌క్రీమ్ తయారుచేయడానికి అవసరమైన పదార్థాలే కాదు... కాస్త ఓపిక, అందమైన చిరునవ్వు కూడా ముఖ్యమే'

'చల్లటి, తీయటి టెక్నో క్రియేటివిటీ ఇది'... ఇలా నెటిజనులు రకరకాలుగా స్పందించారు.

గోల్ ఇన్ శారీ!

మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ మున్సిపల్ కార్పోరేషన్ ఒక స్వచ్ఛందసంస్థతో కలిసి మహిళల కోసం 'గోల్ ఇన్ శారీ' పేరుతో ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించింది. గ్వాలియర్ జిల్లాలోని ఎనిమిది టీమ్‌లు ఇందులో పాల్గొన్నాయి. 20 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వయసు ఉన్న మహిళల వరకు ఈ టీమ్‌లలో ఉన్నారు.

'గోల్ ఇన్ శారీ' టోర్నమెంట్ ప్రత్యేకత ఏమిటంటే సంప్రదాయ క్రీడా దుస్తులు ధరించకుండా చీర మాత్రమే ధరించాలి!

'వేర్ శారీ అండ్ స్టే ఫిట్' థీమ్‌తో నిర్వహించిన ఈ టోర్నమెంట్ ఎంత హిట్ అయిందంటే 'వచ్చే టోర్నమెంట్‌లో మేము కూడా పాల్గొంటాం' అని వివిధ జిల్లాల నుంచి మహిళలు వస్తున్నారు.

'గోల్ ఇన్ శారీ టోర్నమెంట్‌లో పాల్గొన్నవారిలో కాస్తోకూస్తో ఫుట్‌బాల్ ఆడడం వచ్చిన వారి నుంచి ఈ టోర్నమెంట్ కోసమే ఆట నేర్చుకున్న వారి వరకు ఎందరో ఉన్నారు. ఆటలో వారి అద్భుత ప్రతిభ చూస్తే రెండు కళ్లు చాలవు అనిపిస్తుంది' అంటుంది సామాజిక



కార్యకర్త, టోర్నమెంట్ నిర్వాహకురాలు అంజలి గుప్తా బాత్రా.

ఈ టోర్నమెంట్ తాలూకు వీడియోను ఐఏఎస్ అధికారి కిశోర్ కన్యాల్ ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తే వేలాది వ్యూస్‌తో వైరల్ అయింది.

హాయ్... చిందెయ్..

'ఈ వయసులో డ్యాన్స్ ఏమిటి?' అనుకుంటారు కొందరు.

అయితే 'మీ వయసు ఎంత?' అని డ్యాన్స్ ఎప్పుడూ వివరం అడగదు.

విషయంలోకి వెళితే... కేరళలోని ఎతన్య కుమ్మట్టీ గ్రామంలోని ఆలయంలో సంప్రదాయ సంగీత విభావరి ఘనంగా జరుగుతుంది. దీనిలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటారు. ఈ విభావరిలో యూత్ హవా ఎక్కువగా ఉంటుంది. అయితే ఒక వృద్ధురాలు మాత్రం 'నేను సైతం' అంటూ రిథమిక్ బీట్స్‌కు అందమైన స్టెప్స్ వేసింది.

బామ్మ డ్యాన్సు చేస్తున్న వీడియో క్లిప్‌ను స్వాతి జగదీష్ అనే యూజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే అనూహ్యమైన రెస్పాన్స్ వచ్చింది.

'సారీ... బామ్మ అనుమతి లేకుండా ఈ క్లిప్‌ను పోస్ట్ చేశాను. వద్దంటే ఇప్పుడే తీసివేస్తాను. నాకైతే బామ్మ డాన్స్ తెగ నచ్చేసింది' అని రాసింది స్వాతి.

'డిలీట్ చేయాల్సిన అవసరమే లేదు' అని నెటిజనులు ముక్తకంఠంతో చెప్పారు.



'బామ్మ డ్యాన్స్ వీడియో చూస్తుంటే... కర్ణాటకలోని మంగళూర్, బంట్వాల్ ప్రాంతాలలో మహిళలు చేసే పిలినాలికె అనే టైగర్ డాన్స్ గుర్తుకు వచ్చింది' అని ఒక నెటిజన్ రాశాడు.

ఇంటిప్స్



- పచ్చిమిరప కాయలు తరిగిన తర్వాత ఎండు మిరపకాయలు ముట్టుకున్న తర్వాత చేతులు మండుతుంటాయి. అలా మంటపుట్టకుండా ఉండాలంటే మిరపకాయలను కట్ చేసే ముందు చేతులకు ఆవ నూనె లేదా కొబ్బరి నూనె రాసుకోవాలి.



- గ్యాస్ స్టవ్ బర్నర్ రింగులు నల్లగా మారిపోతే వాటిని వెనిగర్‌లో వేసి ఐదు గంటలు నానపెట్టాలి. నానిన తరువాత బేకింగ్ సోడావేసి స్టీల్ పీచుతో తోమితే బర్నర్ రింగులు నలుపు పోయి మెరుస్తాయి.



- కుకర్ విజిల్ వచ్చినప్పుడు పొంగి.. కుకర్ మూత మీద, స్టవ్ మీద పడుతూ ఇబ్బందిపెడుతుంటే.. విజిల్ చుట్టూ ఒక కాటన్ క్లాత్‌ను పెట్టాలి. అప్పుడు కుకర్ విజిల్ వచ్చినప్పుడు పొంగినా కాటన్ క్లాత్ పీల్చుకుంటుంది. తరువాత ఆ క్లాత్‌ను నీళ్లలో కడుక్కోవచ్చు.



- సమ్మర్‌లో నిమ్మకాయ షర్బత్‌ని ఎక్కువగా తాగుతుంటాం. అయితే నిమ్మరసంలో వేసిన చక్కెర అంత త్వరగా కరగదు. అటువంటప్పుడు నిమ్మరసంలో వేసేముందు పంచదారను కాసిని వేడినీళ్లలో వేసి కలిపితే త్వరగా కరుగుతుంది. పంచదార కరిగాక చల్లటి నీళ్లు, నిమ్మరసం వేసి కలిపితే నిమ్మరసం ఎంతో టేస్టీగా ఉంటుంది.



- వెల్లుల్లి రెబ్బల పొట్టు త్వరగా తీయాలంటే తీసేముందు వెల్లుల్లి రెబ్బలను ఓ ఐదు నిమిషాలపాటు వేడి నీళ్లలో నానబెడితే సరి. ఆ తరువాత పొట్టు తీస్తే సులభంగా వస్తుంది.




- అరకట్ట కొత్తిమీర ఆకుల్ని తీసుకుని శుభ్రంగా కడిగి మిక్సీజార్‌లో వేసి కొద్దిగా నీళ్లు పోసి జ్యూస్‌లా గ్రైండ్ చేసుకోవాలి. ఈ జ్యూస్‌ను ఉదయం పరగడుపున తాగితే రాత్రి సమయంలో మంచి నిద్ర పడుతుంది.



- మధ్యస్థంగా పండిన అరటిపండును ముక్కలుగా కట్ చేసి గ్లాసు నీళ్లల్లో వేసి సన్నని మంట మీద పదిహేను నిమిషాలు మరిగించాలి. మరిగాక అరస్పూను దాల్చిన చెక్క పొడి వేసి మరో పదినిమిషాలు మరిగించాలి. తరువాత వడగట్టి కొద్దిగా తేనె కలిపి నిద్రపోయే ముందు తాగితే వెంటనే నిద్ర పడుతుంది.

హెల్త్

35 ఏళ్ల తర్వాతా... ఆరోగ్యకరమైన బిడ్డ పుట్టాలంటే?



గత కొన్నేళ్ల కిందటి వరకు గర్భధారణకు పెరిగే వయసు లేదా పెద్ద వయసు కాస్త ప్రతికూల ఫలితాలు ఇవ్వవచ్చనీ, సాధారణంగా 28 లేదా 30 ఏళ్లలోపే గర్భధారణ జరగడంతో ఆరోగ్యకరమైన పిల్లలు పుట్టే ఆస్కారం ఎక్కువనే మాటలు వినిపించేవి. అంతేకాదు... 35 ఏళ్లు పైబడ్డ తర్వాత గర్భధారణ జరిగితే పిల్లల్లో డౌన్స్ సిండ్రోమ్ వంటి కొన్ని అనర్థాలు కనిపించే అవకాశాలూ ఎక్కువేనంటూ ఆందోళన నిండిన సలహాలూ వచ్చేవి. అయితే ఆ మాటల్లో కొద్దిపాటి నిజాలున్నప్పటికీ అంత కంగారు పడాల్సిన అవసరం లేదంటున్నారు వైద్యులు. మెడికల్ పుస్తకాల్లో చెప్పినట్లుగా 35 వయసు దాటాక పుట్టిన పిల్లల్లో జన్యుపరమైన సమస్యలు తలెత్తే అవకాశాలు అరుదుగా ఉంటాయి. వాటి గురించి అంతగా ఆందోళన అవసరం లేదంటూ డాక్టర్లు చెబుతున్న సంగతులివి....

ఇటీవల కాలం అనేక మార్పులను తెస్తోంది. యువతులు సైతం బాగా చదువుకుంటూ, కెరియర్‌లో స్థిరపడిన తర్వాతే పిల్లలను కోరుకుంటున్నారు. దాంతో గర్భధారణ, పిల్లలు కలగడంలో ఆలస్యం సాధారణమవుతోంది. వయసు 35 ఏళ్లు దాటాక గర్భధారణ జరిగిన కేసుల్లో గర్భస్రావాలు జరిగే రేటు ఎక్కువనీ, ఆలస్యంగా గర్భధారణ జరిగినప్పుడు పుట్టే పిల్లలకు పుట్టుకతో వచ్చే జన్యుసమస్యలు వస్తాయనే అభిప్రాయాలు ఎక్కువగా ఉండేవి. అందులో కొద్దిపాటి సత్యం ఉంటే ఉండవచ్చేమోగానీ... అదే అక్షరసత్యమనీ, ఆ మాటలే శిలాక్షరాలని అనుకోడానికి వీల్లేదని వైద్యపరిశోధనలు వెల్లడిస్తున్నాయంటున్నారు డాక్టర్లు. అందుకే 'అడ్వాన్స్‌డ్ మెటర్నల్ ఏజ్', 'జీరియాట్రిక్ ప్రెగ్నెన్సీ' అనే పదాలను విని, చదివి కంగారు పడవద్దని చెబుతున్నారు.

ఆలస్యపు గర్భధారణలో అనర్థాలు ఎందుకంటే..?

ముప్పై ఐదేళ్ల తర్వాత జరిగే గర్భధారణల వల్ల పుట్టబోయే పిల్లల్లో అనేక ఆరోగ్యపరమైన రిస్కులతో పాటు అబార్షన్స్‌కు అవకాశం ఎక్కువ. దానికి కొన్ని కారణాలు ఉంటాయి. అవి... ● అండాశయం వయసు పెరుగుతున్న కొద్దీ ఆరోగ్యకరమైన అండం విడుదల సక్రమంగా జరగడానికి అవకాశం తక్కువ. అండం నాణ్యతా తగ్గుతుంది. అంటే గర్భధారణకు అవకాశాలు పూర్తిగా తగ్గుతాయని కాదు. కానీ ఆలస్యపు గర్భధారణ విషయంలో క్రమం తప్పకుండా డాక్టర్‌ను సంప్రదిస్తూ జాగ్రత్తగా ఉండాలి. ● అబార్షన్స్ రిస్క్ ఎక్కువ. ● వయసు పెరుగుతున్న కొద్దీ అండంలో జరిగే కణవిభజన అంత సక్రమంగా ఉంకపోవచ్చు. దాంతో క్రోమోజోముల సంఖ్యలో విభజన సక్రమంగా జరకపోవచ్చు.

ఇతర సమస్యల విషయానికి వస్తే...

● మహిళల్లో 30 ఏళ్లు దాటాక అధిక రక్తపోటు, డయాబెటిస్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. ఇది గర్భధారణపై ప్రభావం చూపవచ్చు. ● పీసీఓడీ, ఫైబ్రాయిడ్స్ సమస్యలూ, ఫెలోపియన్ ట్యూబులు మూసుకుపోవడం జరగవచ్చు. ● పెద్ద వయసు మహిళలకు పుట్టే పిల్లలు తక్కువ బరువుతో పుట్టే అవకాశముంది. ● 35 ఏళ్లు దాటిన మహిళల్లో సహజ ప్రసవపు అవకాశాలు తగ్గి, సిజేరియన్‌కే అవకాశాలు ఎక్కువ.

ఇటీవల ఆలస్యంగా కెరియర్‌లో స్థిరపడ్డ తర్వాత, అప్పటికీ స్వాభావికంగా గర్భధారణ జరగక పోతే 35 దాటిన తర్వాతే కృత్రిమ గర్భధారణకు వెళ్తున్నారు. అయినప్పటికీ ఆరోగ్యకరమైన గర్భధారణ, పండంటి బిడ్డ పుట్టే కేసులే చాలా ఎక్కువ. ఇందుకు కొన్ని సూచనలు, జాగ్రత్తలు పాటించాలి.

గర్భధారణ కంటే ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గర్భం ధరించాలనుకున్న కాస్త పెద్ద వయసు మహిళ గర్భధారణ కంటే ముందునుంచే కొన్ని సూచనలు, జాగ్రత్తలు పాటించాలి.

● తమ సాధారణ ఆరోగ్యం, జీవనశైలి, ఏవైనా ఆరోగ్య సమస్యలుంటే వాటి గురించి, కుటుంబ ఆరోగ్య చరిత్ర గురించి డాక్టర్‌కు విపులంగా వివరించాలి. ● అప్పటికే తీసుకున్న వ్యాక్సిన్‌ల వివరాలు తెలపాలి. తీసుకోవాల్సిన వ్యాక్సిన్లు ఇంకేమైనా ఉన్నాయా అని వాకబు చేయాలి. ● జీవిత భాగస్వామి (భర్త) వారి వైపు ఆరోగ్య వివరాలు, కుటుంబ ఆరోగ్య చరిత్ర గురించి కూడా చెప్పాలి. (వయసు ఎక్కువైనా, తక్కువైనా గర్భధారణ కోరుకున్న మహిళలందరూ ఈ సూచనలు పాటించాలి.) ● డిప్రెషన్, హైబీపీ, మధుమేహం (డయాబెటిస్) లాంటి ఆరోగ్య సమస్యలు ఉంటే డాక్టర్‌కు వివరించాలి. ● ప్రతిరోజూ 400 మైక్రోగ్రాములకు తగ్గకుండా ఫోలిక్ యాసిడ్‌తో పాటు మల్టీవిటమిన్ టాబ్లెట్లు వాడాలి. (పిండం పెరుగుదల సమయంలో ఈ పోషకాలన్నీ ప్రతి కణానికీ కావాలి. ఈ సప్లిమెంట్స్ వాడటం వల్ల పుట్టబోయే చిన్నారికి గ్రహణం మొర్రి వంటి సమస్యలతో పాటు వెన్నుపాము లోపాలు (న్యూరల్ ట్యూబ్ డిఫెక్ట్స్) నివారితమవుతాయి. ● గర్భధారణ సమయంలో ఉండాల్సిన బరువు కంటే... మరీ ఎక్కువ బరువు ఉండటం, అలాగని బరువు తక్కువగా ఉండటం ఈ రెండూ కొన్ని ముప్పులను ఆహ్వానిస్తాయి. అందుకే ఆరోగ్యకరమైన రీతిలో ఆహారం తీసుకుంటూ, తగిన వ్యాయామం చేస్తూ ఉండాల్సినంత బరువు మాత్రమే ఉండేలా జాగ్రత్త పడాలి. ● గర్భధారణ సమయంలో ఆల్కహాల్, పొగతాగడం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి. ● పనిచేసే చోట లేదా ఇతరత్రా ప్రదేశాలలో హానికారకమైన రసాయనాలకు దూరంగా ఉండాలి. ఇలా హానికర రసాయనాలకు ఎక్స్‌పోజ్ కావడం బిడ్డలో పుట్టుకతో వచ్చే లోపాలకు దారితీయవచ్చు. (ఉదాహరణకు కెమికల్ లేదా పెయింట్స్ వంటి పరిశ్రమల్లో పనిచేసేవారి కోసం ఈ జాగ్రత్తలు). ● ఒత్తిడికి పూర్తిగా దూరంగా ఉండాలి. హాయిగా, ఆహ్లాదంగా ఉండటానికి ప్రయత్నించాలి.

గర్భధారణ సమయమప్పుడు ఈ సూచనలు...

● అన్ని విధాలా ఆరోగ్యకరంగా ఉన్నామని ఫీలవుతున్నప్పటికీ... డాక్టర్లు నిర్దేశించిన ప్రకారం క్రమం తప్పకుండా వారి ఫాలో అప్‌లో ఉండాలి. ● గర్భవతిగా ఉన్నప్పుడు తీసుకోవాల్సిన వ్యాక్సిన్‌ల వివరాలు (ఫ్లూ షాట్ వంటివి) తెలుసుకుని, వాటిని తప్పక తీసుకోవాలి. ● ఆ సమయంలో డాక్టర్లు సూచించిన చికిత్స ప్రణాళికను పూర్తిగా అనుసరించాలి. ఇది తల్లి, కడుపులోని బిడ్డ... ఈ ఇరువురూ పూర్తిగా సురక్షితంగా ఉండేలా చేస్తాయి. ● సమతులాహారం తీసుకుంటూ శరీరానికి అవసరమైన అన్ని పోషకాలు అంటే... క్యాల్షియమ్, ఫోలిక్ యాసిడ్, ఐరన్, విటమిన్–డి వంటి అన్ని పోషకాలందేలా చూడాలి. శరీరానికి శ్రమ కలగని రీతిలోనే వ్యాయామం చేస్తూ, రోజంతా చురుగ్గా ఉండాలి.



డాక్టర్ వరలక్ష్మి కె.ఎస్.
సీనియర్ గైనకాలజిస్ట్

రిస్క్ ఉన్నా... ఆరోగ్యకరమైన ప్రెగ్నెన్సీ కోసం...

ఒకవేళ మహిళకు 35 ఏళ్లు దాటాక గర్భధారణ జరిగే అవకాశం ఉన్నప్పుడు కొన్ని స్క్రీనింగ్ పరీక్షలు చేయించాలి. అవి... ● సెల్-ఫ్రీ డీఎన్ఏ స్క్రీనింగ్ పరీక్ష ● కొంత మెటర్నల్ బ్లడ్ స్క్రీనింగ్ (అయితే ఇలాంటి స్క్రీనింగ్ పరీక్షల వల్ల పుట్టబోయే చిన్నారిలోని లోపాలన్నీ నూరు శాతం తెలియకపోవచ్చు. కానీ రాబోయే ముప్పులు కొంత సూచనాత్మకంగా తెలిసే అవకాశాలు మాత్రం ఉంటాయి). ● న్యూకల్ ట్రాన్స్‌లుయెన్సీ (ఎన్‌టీ) స్కాన్ టెస్ట్ అనే పరీక్షను గర్భధారణ తర్వాత 14వ వారాల లోపు చేయించాలి. ● గర్భధారణ తర్వాత 20 వారాలప్పుడు అనామలీ స్కాన్ వంటి పరీక్షల్ని చేయించాలి.

భవిష్యత్తుకోసం అండాల సంరక్షణ...

రోజులు గడుస్తున్న కొద్దీ విడుదలయ్యే అండాల నాణ్యత, అందులో లోపాలు వస్తాయి. అందుకే జీవితంలో ఇంకా స్థిరపడని వారు తగిన సమయంలో ఆరోగ్యంగా ఉన్న అండాలను సేకరించి పెట్టుకోవడానికీ ఇప్పుడు అవకాశం ఉంది. అన్నీ అనువుగా ఉన్న సమయంలో ఆ అండాలను గర్భధారణకు ఉపయోగించుకోవచ్చు. అంతేకాదు... దురదృష్టవశాత్తూ చిన్నవయసులోనే మెనోపాజ్ రావడం లేదా ఏవైనా క్యాన్సర్లకు గురై అండాశయాలను తొలగించాల్సిన పరిస్థితులు రావడం వంటివి జరిగితే... ముందుగా సేకరించి పెట్టుకున్న ఆరోగ్యకరమైన అండాల సహాయంతో అటు తర్వాత కూడా ఆరోగ్యకరమైన రీతిలో గర్భధారణకు ఇప్పుడు అవకాశాలున్నాయి.

చివరగా... 35 ఏళ్ల తర్వాత కూడా సురక్షితమైన గర్భధారణ కోసం ఏవైనా ఆరోగ్య సమస్యలుంటే ముందుగానే సరైనరీతిలో డాక్టర్ సలహాలు పాటించడం, సమతులాహారం తీసుకోవడం, తగినంత బరువు ఉండేలా చూసుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలి వంటివి పండంటి బిడ్డ పుట్టేందుకు ఎంతగానో ఉపకరిస్తాయి. గర్భధారణకు ముందునుంచే గైనకాలజిస్ట్ సూచనలు అనుసరిస్తూ, ఆరోగ్యకరమైన జీవనశైలి పాటిస్తే ఆరోగ్యకరమైన గర్భధారణకు వయసు ఒక అంకె మాత్రమే.

జీఈఆర్‌డీ నివారణకు సింపుల్ సూచనలు

గ్యాస్ పైకి ఎగజిమ్ముతూ ఉంటే..!



గ్యాస్‌తో నిండి, కడుపు ఉబ్బరంగా ఉండి అది పైకి ఎగజిమ్ముతూ... ఇబ్బంది పెట్టడం అనే సమస్య ప్రతి ఒక్కరి జీవితంలో ఒక్కసారైనా అనుభవంలోకి వస్తుంది. అంత సాధారణమైన సమస్య ఇది. ఇక కొందరిలోనైతే అది గుండెపోటా అనే అనుమానానికి తావిస్తూ, ఆందోళనకు గురిచేస్తుంది. ఇటీవల ఈ తరహా సమస్యలు చాలామందిలో కనిపిస్తున్నాయి. కడుపులో ఆహారం జీర్ణం కావడానికి అవసరమయ్యే యాసిడ్ తాలూకు వాయువులు గ్యాస్ రూపంలో పైకి ఎగజిమ్ముతుండే ఈ సమస్యను 'గ్యాస్ట్రో ఈసోఫేజియల్ రిఫ్లక్స్ డిసీజ్' (జీఈఆర్‌డీ) అంటారు. చిన్న చిన్న చిట్కాలనూ, సూచనలను పాటిస్తే చాలావరకు ఈ సమస్యను అధిగమించవచ్చు. అవి... ● పీచు ఎక్కువగా ఉండే కాయధాన్యాలనూ, ఆకుకూరలను తమ ఆహారంలో ఎక్కువగా తీసుకోవాలి. ● పాలు, మిల్క్ ప్రాడక్ట్స్ వాడే సమయంలో కొవ్వు తక్కువగా ఉండే డెయిరీ ఉత్పాదనలను వాడాలి. ● జీఈఆర్‌డీతో బాధపడేవారు కొవ్వు తక్కువగా ఉండే ఆహారాలు వాడటం మేలు. ఇక మాంసాహారాన్ని బాగా ఇష్టపడేవారు రెడ్‌మీట్ వంటి వాటికి దూరంగా ఉండి కేవలం వైట్ మీట్ అయిన చికెన్, చేపల వంటి వైపునకు మొగ్గుచూపాలి. ● నారింజ, నిమ్మ, ద్రాక్ష, పైనాపిల్, టమాటాల వంటివి ఇతరులకు బాగా ఆరోగ్యకరమే అయినప్పటికీ... గ్యాస్ సమస్య ఉండేవారు తాత్కాలికంగా వాటికి కాస్తంత దూరంగా ఉండాలి. ● రాత్రిపూట భోజనం చాలా ఆలస్యంగా తినకూడదు. తిన్న తర్వాత కొద్దిదూరం తప్పక నడవాలి. వీలైతే రాత్రి నిద్రకు ముందర రెండుగంటల పాటు ఏమీ తినకుండా ఉండటం మంచిది. ● ఒంటి కంటే తల భాగం కాస్త ఎత్తుగా ఉండేలా తలగడ అమర్చుకోవాలి. అయితే ఈ తలగడ కేవలం తల కింద మాత్రమే కాకుండా భుజాల కింది వరకూ ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.

మెడిటిప్స్

కుక్క కాటుకు గురైనప్పుడు...

ఇటీవల కుక్క కాటు కేసుల గురించిన వార్తలు, వివరాలు తరచూ వినిపిస్తున్నాయి. వేసవి తీవ్రత కారణంగా వాటికి సరైన నీడ దొరకకపోవడం, ఆహారం, నీళ్లు లభ్యం కాకపోవడంతో ఈ సీజన్‌లో చిరాకు పెరుగుతుంది. అందుకే ఈ వేసవి కాలంలో త్వరగా ఆగ్రహం చెందడం, మొరగడం, వెంటపడటం... చివరకు కరవడం కూడా కాస్త ఎక్కువే. కుక్క మొరుగుతూ దగ్గరకు వస్తున్నప్పుడు ఆందోళన చెందకూడదు. ఒకవేళ దురదృష్టవశాత్తూ కుక్క కాటుకు గురైతే మాత్రం ఈ కింది సూచనలు పాటించాలి. ● కుక్క కరవగానే వీలైనంత త్వరగా ఆ గాయాన్ని పై నుంచి నీరు ధారగా ఓ ప్రవాహంలా కింద పడుతుండగా శుభ్రంగా కడగాలి. అంటే... మగ్‌తో నీళ్లు పోస్తూ గాని, కుళాయి కింద గానీ గాయమైన భాగాన్ని ఉంచి నీళ్లు పడుతుండగా సబ్బుతో వీలైనంత శుభ్రంగా కడగాలి. ● కుక్క కాటు తర్వాత ఆ గాయానికి ఎలాంటి కట్టూ కట్టకూడదు. దాన్ని ఓపెన్‌గానే ఉంచాలి.



● కుక్క కాటుతో రేబీస్ వచ్చే అవకాశాలు ఎక్కువ కాబట్టి... పైన పేర్కొన్న ప్రథమ చికిత్స ముగిసిన వెన్వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ఆయన సూచించిన మేరకు యాంటీరేబీస్ వ్యాక్సిన్‌ను అవసరాన్ని బట్టి మూడు లేదా ఐదు మోతాదుల్లో తీసుకోవాలి. గాయం తగ్గడానికి డాక్టర్ సూచించిన మందుల్ని క్రమం తప్పకుండా వాడాలి. ● కుక్కకాటు గాయమైన చోట... ఆ గాయం తీవ్రతను బట్టి ఇమ్యునోగ్లోబులిన్ రెండు డోసులు ఇప్పించి, మిగతావి చేతికి ఇప్పించాలి. ● గాయం అయిన వైపు ఉండే చేతికి ఇమ్యునోగ్లోబ్యులిన్ ఇంజెక్షన్ ఇచ్చి... ఆ రెండో వైపు చేతికి యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను ఇవ్వాల్సి ఉంటుంది.



వెర్‌స్టాపెన్‌కు పోల్ పొజిషన్

ఫార్ములావన్ సీజన్‌లోని మూడో రేసు ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రిలో తొలి విజయమే లక్ష్యంగా ప్రపంచ చాంపియన్ మాక్స్ వెర్‌స్టాపెన్ బరిలోకి దిగనున్నాడు. మెల్‌బోర్న్‌లో శనివారం జరిగిన క్వాలిఫయింగ్ సెషన్‌లో వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ల్యాప్‌ను ఒక నిమిషం 16.732 సెకన్లలో పూర్తి చేసి 'పోల్ పొజిషన్' సాధించాడు. తద్వారా నేడు జరిగే ప్రధాన రేసును వెర్‌స్టాపెన్ తొలి స్థానం నుంచి ప్రారంభించే అవకాశాన్ని దక్కించుకున్నాడు. ఇప్పటి వరకు ఆరుసార్లు ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రిలో పోటీపడ్డ వెర్‌స్టాపెన్ 2019లో అత్యుత్తమంగా మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. నేటి ప్రధాన రేసులో వెర్‌స్టాపెన్‌కు మెర్సిడెస్ జట్టు డ్రైవర్లు జార్జి రసెల్, లూయిస్ హామిల్టన్ నుంచి గట్టిపోటీ లభించనుంది. రసెల్ రెండో స్థానం నుంచి, హామిల్టన్ మూడో స్థానం నుంచి రేసును ప్రారంభిస్తారు. ఈ సీజన్‌లో రెండు రేసులు జరగ్గా.. తొలి రేసు బహ్రెయిన్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్, రెండో రేసు సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రిలో సెర్జియో పెరెజ్ విజేతలుగా నిలిచారు.

లక్నో 'సూపర్' విజయం

50 పరుగులతో ఢిల్లీ చిత్తు

- కైల్ మేయర్స్ మెరుపు హాఫ్ సెంచరీ
- మార్క్ వుడ్‌కు ఐదు వికెట్లు


మేయర్స్

లక్నో: కేఎల్ రాహుల్ నాయకత్వంలోనే లక్నో సూపర్ జెయింట్స్ ఐపీఎల్ కొత్త సీజన్‌లో శుభారంభం చేసింది. శనివారం ఏకపక్షంగా సాగిన పోరులో లక్నో 50 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. కైల్ మేయర్స్ (38 బంతుల్లో 73; 2 ఫోర్లు, 7 సిక్సర్లు) చెలరేగాడు. అనంతరం ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్లకు 143 పరుగులే చేయగలిగింది. డేవిడ్ వార్నర్ (**48 బంతుల్లో 56**; 7 ఫోర్లు), రిలీ రోసో (20 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్) మినహా అంతా విఫలమయ్యారు. పదునైన పేస్‌తో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మార్క్ వుడ్ (5/14) **ప్రత్యర్థిని** దెబ్బ కొట్టాడు.

నిరాశపర్చిన రాహుల్


లక్నో ఇన్నింగ్స్ నెమ్మదిగా ప్రారంభమైంది. కెప్టెన్ కేఎల్ రాహుల్ (8) విఫలం కాగా, పవర్‌ప్లేలో స్కోరు 30 పరుగులే. అయితే ఆ తర్వాత మేయర్స్ చెలరేగిపోయాడు. ముకేశ్ ఓవర్లో 2 సిక్స్‌లు, అక్షర్ **ఓవర్లో** అతను వరుసగా 4, 6 బాదాడు. కుల్దీప్ ఓవర్లో సిక్సర్‌తో 28 బంతుల్లోనే అతని హాఫ్ సెంచరీ పూర్తయింది. ఆ తర్వాతా తన జోరు కొనసాగిస్తూ మేయర్స్ 4 బంతుల వ్యవధిలో 3 సిక్స్‌లు కొట్టడం విశేషం. మరో ఎండ్‌లో హుడా (17), స్టొయినిస్ (12), కృనాల్ పాండ్యా (15 నాటౌట్) ప్రభావం చూపలేకపోయారు. సకారియా వేసిన 17వ ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్‌తో 19 పరుగులు రాబట్టిన లక్నో... అతను వేసిన 20వ ఓవర్లోనూ 3 సిక్సర్లతో 22 పరుగులు పిండుకుంది. చివర్లో నికోలస్ పూరన్ (21 బంతుల్లో 36; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ లక్నో భారీ స్కోరుకు కారణమైంది.

టపటపా...

ఉనాద్కట్ ఓవర్లో మూడు ఫోర్లతో ఆట మొదలు పెట్టిన వార్నర్ జోరుతో 4 ఓవర్లలో ఢిల్లీ స్కోరు 40 పరుగులకు చేరగా, భారీ లక్ష్యం దిశగా శుభారంభం లభించినట్లు అనిపించింది. అయితే లక్నో బౌలర్లు వుడ్, రవి బిష్ణోయ్ 7 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు తీసి ప్రత్యర్థిని కట్టి పడేశారు. కొద్ది సేపు ధాటిని ప్రదర్శించిన రోసో, పావెల్ (1) కూడా ఎనిమిది పరుగుల వ్యవధిలో వెనుదిరగడంతో ఢిల్లీ గెలుపు ఆశలు సన్నగిల్లాయి. మరో వైపు ఒంటరి పోరుతో 45 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించి వార్నర్ పోరాడినా లాభం లేకపోయింది.

ఆ క్యాచ్ పట్టి ఉంటే...

ఐపీఎల్‌లో తన తొలి మ్యాచ్ ఆడిన కైల్ మేయర్స్‌కు అదృష్టం కలిసొచ్చింది. సకారియా బౌలింగ్‌లో షార్ట్ థర్డ్‌మాన్ వద్ద అతను ఇచ్చి అతి సునాయాస క్యాచ్‌ను ఖలీల్ అహ్మద్ వదిలేశాడు. ఆ సమయంలో మేయర్స్ స్కోరు 14. ఆ తర్వాత చెలరేగిన అతను తన స్కోరుకు మరో 59 పరుగులు జోడించడం విశేషం.


మార్క్ వుడ్ (5/14)

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) అక్షర్ (బి) సకారియా 8; మేయర్స్ (బి) అక్షర్ 73; హుడా (సి) వార్నర్ (బి) కుల్దీప్ 17; కృనాల్ (నాటౌట్) 15; స్టొయినిస్ (సి) సర్ఫ్‌రాజ్ (బి) ఖలీల్ 12; పూరన్ (సి) పృథ్వీ షా (బి) ఖలీల్ 36; బదోని (సి) సర్ఫ్‌రాజ్ (బి) సకారియా 18; కృష్ణప్ప గౌతమ్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 193. వికెట్ల పతనం:** 1–19, 2–98, 3–100, 4–117, 5–165, 6–187. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4–0–30–2, ముకేశ్ 4–0–34–0, సకారియా 4–0–53–2, అక్షర్ 4–0–38–1, కుల్దీప్ 4–0–35–1.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: పృథ్వీ షా (బి) వుడ్ 12; వార్నర్ (సి) గౌతమ్ (బి) ఆవేశ్ 56; మార్ష్ (బి) వుడ్ 0; సర్ఫ్‌రాజ్ (సి) గౌతమ్ (బి) వుడ్ 4; రోసో (సి) మేయర్స్ (బి) బిష్ణోయ్ 30; పావెల్ (ఎల్బీ) (బి) బిష్ణోయ్ 1; అమాన్ (సి) పూరన్ (బి) ఆవేశ్ 4; అక్షర్ (సి) (సబ్) మన్కడ్ (బి) వుడ్ 16; కుల్దీప్ (నాటౌట్) 6; సకారియా (సి) కృనాల్ (బి) వుడ్ 4; ముకేశ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 143. వికెట్ల పతనం:** 1–41, 2–41, 3–48, 4–86, 5–94, 6–112, 7–113, 8–139, 9–143. **బౌలింగ్:** మేయర్స్ 1–0–7–0, ఉనాద్కట్ 3–0–39–0, గౌతమ్ 4–0–23–0, ఆవేశ్ ఖాన్ 4–0–29–2, మార్క్ వుడ్ 4–0–14–5, బిష్ణోయ్ 4–0–31–2.

పంజాబ్‌దే పైచేయి

కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై ఏడు పరుగులతో గెలుపు

రాణించిన రాజపక్స, అర్‌ష్దీప్ సింగ్


అర్‌ష్దీప్ సింగ్

మొహాలి: సొంతగడ్డపై పంజాబ్ కింగ్స్ శుభారంభం చేసింది. ఐపీఎల్ టి20 క్రికెట్ టోర్నీలో భాగంగా శనివారం మాజీ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఏడు పరుగుల తేడాతో విజయం సాధించింది. మూడు కీలక వికెట్లతో పంజాబ్ విజయంలో ముఖ్య పాత్ర పోషించిన అర్‌ష్దీప్ సింగ్ (3/19)కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. రాజపక్స (32 బంతుల్లో 50; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో మెరిపించగా... శిఖర్ ధావన్ (29 బంతుల్లో 40; 6 ఫోర్లు), ప్రభ్‌సిమ్రన్ (12 బంతుల్లో 23; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా దూకుడుగా ఆడారు. పంజాబ్ ఇన్నింగ్స్ ముగిశాక మైదానంలో ఫ్లడ్‌లైట్‌లు మొరాయించడంతో కోల్‌కతా ఇన్నింగ్స్ అరగంట ఆలస్యంగా మొదలైంది. 192 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతా 16 ఓవర్లలో 7 వికెట్లకు 146 పరుగులు చేసిన దశలో భారీ వర్షంతో ఆట నిలిచిపోయింది. వర్షం తగ్గకపోవడంతో ఆట సాధ్యపడలేదు. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 16 ఓవర్ల వరకు కోల్‌కతా విజయ సమీకరణం 154 పరుగులుగా ఉంది. 80 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన కోల్‌కతాను రసెల్ (19 బంతుల్లో 35; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), వెంకటేశ్ అయ్యర్ (28 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్) ఆదుకున్నారు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 50 పరుగులు జోడించడంతో గెలుపుపై కోల్‌కతా ఆశలు పెంచుకుంది. అయితే వీరిద్దరిని వరుస ఓవర్లలో పంజాబ్ బౌలర్లు పెవిలియన్ పంపించడం, ఆ వెంటనే వర్షం రావడంతో కోల్‌కతాకు నిరాశ తప్పలేదు.

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ × రాజస్తాన్ (మ. గం. 3:30 నుంచి)
బెంగళూరు × ముంబై (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ సింగ్ (సి) గుర్బాజ్ (బి) సౌతీ 23; శిఖర్ ధావన్ (బి) వరుణ్ చక్రవర్తి 40; రాజపక్స (సి) రింకూ సింగ్ (బి) ఉమేశ్ 50; జితేశ్ శర్మ (సి) ఉమేశ్ (బి) సౌతీ 21; సికందర్ రజా (సి) నితీశ్ రాణా (బి) నరైన్ 16; స్యామ్ కరన్ (నాటౌట్) 26; షారుఖ్ ఖాన్ (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 191. వికెట్ల పతనం:** 1–23, 2–109, 3–135, 4–143, 5–168. **బౌలింగ్:** ఉమేశ్ యాదవ్ 4–0–27–1, సౌతీ 4–0–54–2, సునీల్ నరైన్ 4–0–40–1, వరుణ్ చక్రవర్తి 4–0–26–1, శార్దుల్ ఠాకూర్ 4–0–43–0.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: మన్‌దీప్ సింగ్ (సి) స్యామ్ కరన్ (బి) అర్‌ష్దీప్ సింగ్ 2; గుర్బాజ్ (బి) ఎలిస్ 22; అనుకూల్ రాయ్ (సి) సికందర్ రజా (బి) అర్‌ష్దీప్ సింగ్ 4; వెంకటేశ్ అయ్యర్ (సి) రాహుల్ చహర్ (బి) అర్‌ష్దీప్ సింగ్ 34; నితీశ్ రాణా (సి) రాహుల్ చహర్ (బి) సికందర్ రజా 24; రింకూ సింగ్ (సి) సికందర్ రజా (బి) రాహుల్ చహర్ 4; ఆండ్రీ రసెల్ (సి) సికందర్ రజా (బి) స్యామ్ కరన్ 35; శార్దుల్ ఠాకూర్ (నాటౌట్) 8; సునీల్ నరైన్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (16 ఓవర్లలో 7 వికెట్లకు) 146.**

వికెట్ల పతనం: 1–13, 2–17, 3–29, 4–75, 5–80, 6–130, 7–138.

బౌలింగ్: స్యామ్ కరన్ 3–0–38–1, అర్‌ష్దీప్ సింగ్ 3–0–19–3, ఎలిస్ 3–0–27–1, సికందర్ రజా 3–0–25–1, రిషి ధావన్ 1–0–15–0, రాహుల్ చహర్ 2–0–12–1, హర్‌ప్రీత్ బ్రార్ 1–0–7–0.

ఫైనల్లో సింధు



మాడ్రిడ్: స్పెయిన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ పీవీ సింధు ఫైనల్లోకి ప్రవేశించింది. సెమీఫైనల్లో సింధు 24–22, 22–20తో యో జియా మిన్ (సింగపూర్)పై గెలిచి ఈ ఏడాది తొలిసారి ఓ టోర్నీలో ఫైనల్ చేరింది. గత ఏడాది కామన్వెల్త్ గేమ్స్‌లో, సింగపూర్ ఓపెన్‌లో ఫైనల్ చేరిన తర్వాత సింధు మరో టోర్నీలో తుది పోరుకు అర్హత పొందడం ఇదే తొలిసారి. నేడు జరిగే ఫైనల్లో గ్రెగోరియా మరిస్కా తున్‌జుంగ్ (ఇండోనేసియా)తో సింధు తలపడుతుంది.

హంపి, హారిక గేమ్‌లు 'డ్రా'



న్యూఢిల్లీ: అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, అంతర్జాతీయ మాస్టర్ వైశాలి తమ ఏడో రౌండ్ గేమ్‌లను 'డ్రా'గా ముగించారు. శనివారం జరిగిన ఏడో రౌండ్‌లో బిబిసారా (కజకిస్తాన్)తో ఆడిన హంపి 37 ఎత్తుల్లో... వైశాలితో జరిగిన గేమ్‌ను హారిక 42 ఎత్తుల్లో 'డ్రా'గా చేసుకున్నారు. ఏడో రౌండ్ తర్వాత హంపి మూడు పాయింట్లతో ఐదో ర్యాంక్‌లో, హారిక రెండు పాయింట్లతో ఎనిమిదో ర్యాంక్‌లో ఉన్నారు.

అల్‌కరాజ్‌కు షాక్



ఫ్లోరిడా: మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీ నుంచి డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ అల్‌కరాజ్ (స్పెయిన్) నిష్క్రమించాడు. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో పదో సీడ్ సినెర్ (ఇటలీ) 6–7 (4/7), 6–4, 6–2తో టాప్ సీడ్ అల్‌కరాజ్‌ను బోల్తా కొట్టించి ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఈ ఓటమితో అల్‌కరాజ్ తన నంబర్‌వన్ ర్యాంక్‌ను సెర్బియా దిగ్గజం జొకోవిచ్‌కు కోల్పోనున్నాడు.

విజేత సాకేత్–యూకీ జోడీ



సాక్షి, హైదరాబాద్: జిరోనా ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని భారత్‌కే చెందిన తన సహచరుడు యూకీ బాంబ్రీతో కలిసి డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. స్పెయిన్‌లో శనివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో సాకేత్–యూకీ జోడీ 6–4, 6–4తో సెర్వాంటెస్–రొకా బటాలా (స్పెయిన్) ద్వయంపై గెలిచింది. సాకేత్–యూకీలకు 4,250 యూరోల (రూ. 3 లక్షల 79 వేలు) ప్రైజ్‌మనీతో పాటు 75 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఓవరాల్‌గా సాకేత్–యూకీ జోడీకిది ఎనిమిదో టైటిల్ కాగా, ఈ ఏడాది రెండోది. గత జనవరిలో వీరిద్దరు నొంతబురి ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ సాధించారు.

సినిమా

ట్యూన్ అయ్యారు


ఇళయరాజా, యువన్ శంకర్ రాజా


రవి బస్రూర్

తెలుగు తెరపై పరభాషా తారలు చాలామంది కనిపిస్తుంటారు. తెరవెనక పరభాషా సాంకేతిక నిపుణులు పని చేస్తుంటారు. ముఖ్యంగా పలువురు పరభాషా సంగీతదర్శకులు టాలీవుడ్‌కి ట్యూన్ అయ్యారు. ఈ ఏడాది తెలుగు చిత్రాలకు ఎక్కువగా ఇతర భాషల సంగీతదర్శకులు ట్యూన్లు ఇస్తున్నారు. వారి గురించి తెలుసుకుందాం.



హారిస్ జయరాజ్


సంతోష్ నారాయణన్

- 'కేజీఎఫ్ 1, 2' చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో పేరు తెచ్చుకున్నారు రవి బస్రూర్ (కన్నడ). ప్రస్తుతం ప్రభాస్ హీరోగా 'కేజీఎఫ్' దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న 'సలార్' చిత్రానికి, అలాగే సీనియర్ నటుడు హరనాథ్ సోదరుడు, నటుడు వెంకట సుబ్బరాజ్ తనయుడు హీరోగా పరిచయమవుతున్న 'సీతామనోహర శ్రీరాఘవ' చిత్రానికి కూడా రవి బస్రూర్ స్వరాలందిస్తున్నారు.
- గతంలో 'బిల్లా రంగా, గురు' ఇటీవల 'దసరా' చిత్రాలకు సంగీతం అందించారు సంతోష్ నారాయణన్ (తమిళ్). ప్రస్తుతం ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న 'ప్రాజెక్ట్ కె'కి, వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను డైరెక్షన్‌లో ప్రారంభమైన 'సైంధవ్' చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు.
- హీరోగా, సంగీత దర్శకునిగా కొనసాగుతున్న జీవీ ప్రకాశ్‌కుమార్ (తమిళ్) ఇప్పటికే తెలుగులో పలు చిత్రాలకు సంగీతం అందించారు. ప్రస్తుతం రవితేజ హీరోగా వంశీ దర్శకత్వంలో రూపొందుతున్న 'టైగర్ నాగేశ్వరరావు'కి, నితిన్ హీరోగా వెంకీ కుడుముల తెరకెక్కిస్తున్న చిత్రానికి స్వరాలందిస్తున్నారు.
- మాతృభాష మలయాళంలో 'నోట్ బుక్' (2006) ద్వారా సంగీతదర్శకుడిగా కెరీర్ ఆరంభించిన గోపీ సుందర్ 'మళ్ళీ మళ్లీ ఇది రాని రోజు' (2015) చిత్రంతో తెలుగుకి వచ్చారు. ఆ తర్వాత 'భలే భలే మగాడివోయ్', 'మజ్ను', 'ప్రేమమ్', 'గీత గోవిందం', 'మజిలీ' తదితర చిత్రాలకు స్వరాలందించారు. ఇటీవల రిలీజైన '18 పేజెస్', 'బుట్ట బొమ్మ' చిత్రాలకు గోపీయే సంగీతదర్శకుడు.
- 'అజ్ఞాతవాసి' (2018), నాని 'గ్యాంగ్‌లీడర్' (2019) వంటి చిత్రాలకు తనదైన శైలిలో సంగీతం అందించారు అనిరుధ్ రవిచంద్రన్. ప్రస్తుతం ఆయన ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న చిత్రానికి స్వరాలందిస్తున్నారు.
- 'జర్నీ' (2011), 'సమ్‌థింగ్ సమ్‌థింగ్' (2013), 'సిటిజన్' (2013) వంటి డబ్బింగ్ చిత్రాలతో టాలీవుడ్‌కి పరిచయమైన సి.సత్య (తమిళ్) ప్రస్తుతం స్ట్రెయిట్ తెలుగు చిత్రం చేస్తున్నారు. పవన్ కల్యాణ్–సాయిధరమ్ తేజ్ హీరోలుగా సముద్రఖని దర్శకత్వం వహిస్తున్న చిత్రానికి సత్యనే స్వరకర్త.
- తమిళ చిత్రాలతో పాటు తెలుగు సినిమాలకూ తనదైన శైలిలో సంగీతం అందిస్తున్నారు హారీస్ జయరాజ్ (తమిళ్). ప్రస్తుతం ఆయన నితిన్ హీరోగా వక్కంతం వంశీ దర్శకత్వం వహిస్తున్న చిత్రానికి, నాగశౌర్య కథానాయకుడుగా చేస్తున్న చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.
- 'కిరాక్ పార్టీ' (2018) చిత్రంతో తెలుగులోకి సంగీత దర్శకునిగా ఎంట్రీ ఇచ్చారు అజనీష్ లోక్‌నాథ్ (కన్నడ). ఆ తర్వాత 'నన్ను దోచుకుందువటే' (2018) మూవీకి స్వరాలు అందించారు. నాలుగేళ్ల విరామం తర్వాత ఆయన తెలుగులో చేస్తున్న తాజా చిత్రం 'విరూపాక్ష'. సాయిధరమ్ తేజ్ హీరోగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది.
- మలయాళ చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హేషమ్ అబ్దుల్ వహాబ్ 'ఖుషి' సినిమాతో తెలుగుకి వస్తున్నారు. విజయ్ దేవరకొండ, సమంత జంటగా శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న చిత్రం ఇది. అలాగే నాని హీరోగా శౌర్యువ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రానికి, శర్వానంద్ హీరోగా శ్రీరామ్ ఆదిత్య తెరకెక్కిస్తున్న చిత్రానికి హేషమ్ అబ్దుల్ సంగీతం అందిస్తున్నారు.

వీరే కాదు.. మరికొందరు ఇతర భాషల సంగీత దర్శకులు తెలుగు చిత్రాలకు ట్యూన్లు ఇస్తున్నారు.


అంజనీష్ లోక్‌నాథ్


జీవీ ప్రకాశ్


హేషమ్ అబ్దుల్


అనిరుధ్


గోపీ సుందర్


సి. సత్య

మ్యూజిక్ మేస్ట్రో ఇళయరాజా పాటలను 1980ల నుంచి తెలుగు శ్రోతలు వింటున్నారు. తెలుగు పరిశ్రమతో సుదీర్ఘ అనుబంధం ఇళయరాజాది. ఇటీవల విడుదలైన 'రంగ మార్తాండ'కు ఆయనే స్వరకర్త. అలాగే త్వరలో విడుదల కానున్న 'మ్యూజిక్ స్కూల్'కి కూడా స్వరాలందించారు. ఇక ఇళయరాజా తనయుడు యువన్ శంకర్ రాజా టాలీవుడ్ కెరీర్ 'శేషు' (2002) సినిమాతో ప్రారంభమై, కొనసాగుతోంది. ప్రస్తుతం నాగచైతన్య హీరోగా వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెరకెక్కిన 'కస్టడీ' చిత్రానికి తండ్రి ఇళయరాజాతో కలిసి స్వరాలు అందించారు యువన్. అలాగే శర్వానంద్ హీరోగా చేయనున్న ఓ చిత్రానికి యువన్ శంకర్ స్వరాలందిస్తున్నారు.

రావణాసుర విజయంపై నమ్మకం ఉంది - రవితేజ


సుధీర్‌వర్మ, సుశాంత్, రవితేజ, అభిషేక్ నామా

''రావణాసుర' చిత్రం నన్నెంతో అలరించింది. కచ్చితంగా ప్రేక్షకులందర్నీ కూడా అలరిస్తుందని నా ప్రగాఢ నమ్మకం. ఈ సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నాం'' అన్నారు రవితేజ. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'రావణాసుర'. ఇందులో అనూ ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నగార్కర్, పూజితా పొన్నాడ హీరోయిన్లుగా నటించారు. అభిషేక్ నామా, రవితేజ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రవితేజ మాట్లాడుతూ– ''రావణాసుర' టైటిల్, ఆ టైటిల్ డిజైన్ క్రెడిట్ నిర్మాత అభిషేక్‌కు దక్కుతుంది. అతను మల్టీటాలెంటెడ్ పర్సన్. ఈ సినిమా మంచి విజయం సాధించి నిర్మాతలుగా మాకు మంచి పేరు రావాలని, భవిష్యత్‌లో మేమిద్దరం కలిసి మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. ఈ సినిమా హిట్‌తో సుధీర్ వర్మ నెక్ట్స్ లెవల్‌కి వెళ్లాలి. ఆర్‌టీ టీమ్ వర్క్స్ బ్యాక్‌బోన్స్ అయిన శేత, నమ్రత, వింధ్యా రెడ్డిగార్లకు థ్యాంక్స్. నా ఉత్సాహం, నా ప్రోత్సాహం నా అభిమానులే'' అని అన్నారు. ''రవితేజగారి నుంచి కొత్త విషయాలు నేర్చుకున్నాను. రిజల్ట్‌తో సంబంధం లేకుండా ప్రతి సినిమాకు కష్టపడాలని చెప్పారు. సుధీర్‌వర్మ అద్భుతమైన దర్శకుడు. ఆయన నన్ను కొత్తగా చూపించారనే అనుకుంటున్నాను'' అన్నారు సుశాంత్. ''రావణాసుర' బ్లాక్‌బస్టర్ హిట్ అవుతుంది'' అన్నారు అభిషేక్ నామా. ''రవితేజగారి 'ఆంజనేయులు' సినిమాకు దర్శకత్వ విభాగంలో వర్క్ చేశాను. దర్శకుడిగా ఆయనతో ఓ సినిమా చేయాలనుకున్నాను. 'రావణాసుర' వంటి మంచి స్టోరీకి డైరెక్టర్‌గా నన్ను సెలక్ట్ చేసుకున్న రవితేజగారికి ధన్యవాదాలు. ఈ సినిమా చూసిన తర్వాత ఆడియన్స్ హండ్రెండ్ పర్సెంట్ థ్రిల్ అవుతారు'' అన్నారు సుధీర్‌వర్మ. మేఘా ఆకాష్, దక్షా నగార్కర్, పూజితా పొన్నాడ, మ్యూజిక్ డైరెక్టర్స్ హర్షవర్ధన్ రామేశ్వర్, భీమ్స్ సిసిరోలియో, రైటర్ శ్రీకాంత్ విస్సా తదితరులు పాల్గొన్నారు.

ఇది చాలా స్పెషల్ మూవీ

- ఏఆర్ మురుగదాస్


'ఠాగూర్' మధు, మురుగదాస్, గౌతమ్ కార్తీక్

''1947 ఆగస్టు 15న మన దేశానికి స్వాతంత్య్రం వచ్చిందని మనందరికీ తెలుసు. కానీ అడవి మధ్యలో ఉండే ఓ కొండ ప్రాంతంలోని ఓ ఊరు ప్రజలకు ఈ విషయాన్ని ఓ కారణం చేత బ్రిటిష్ అధికారులు చెప్పరు. దీంతో అక్కడి ప్రజలు స్వాతంత్య్రం కోసం పోరాడుతూనే ఉంటారు. వ్యక్తిగతంగా వారందరికీ ఆగస్టు 16న స్వాతంత్య్రం. అయితే 1947 ఆగస్టు 14, 15, 16.. ఈ మూడు రోజుల్లో ఆ ఊళ్లో ఏం జరిగింది? అనే విషయం ఆసక్తికరం. ఇది చాలా స్పెషల్ మూవీ'' అన్నారు దర్శక–నిర్మాత ఏఆర్ మురుగదాస్. గౌతమ్ కార్తీక్ హీరోగా ఎన్.ఎస్. పొన్‌కుమార్ దర్శకత్వంలో రూపొందిన పీరియాడికల్ ఫిల్మ్ 'ఆగస్టు 16, 1947'. దర్శకుడు ఏఆర్ మురుగదాస్, ఓం ప్రకాష్ భట్, నర్సిరామ్ చౌదరి నిర్మించిన ఈ చిత్రాన్ని ఈ నెల 14న నిర్మాత ఎన్వీ ప్రసాద్ తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో ''ఎప్పటికీ గుర్తుండిపోయే కథ ఇది'' అన్నారు గౌతమ్ కార్తీక్. ''ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించాలి'' అన్నారు పొన్‌కుమార్. ''ఆగస్టు 16, 1947' ప్రత్యేకంగా ఉంటుంది. క్లయిమాక్స్ అద్భుతంగా ఉంది. తెలుగు ప్రేక్షకులందరికీ ఈ సినిమా నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు నిర్మాత 'ఠాగూర్' మధు.

ఒకే ఒక్క పాత్రతో...


గార్గేయి

ఒకే ఒక్క పాత్రతో రూపొందిన చిత్రం 'హలో మీరా'. గార్గేయి యల్లాప్రగడ ప్రధాన పాత్రలో కాకర్ల శ్రీనివాసు దర్శకత్వంలో జీవన్ కాకర్ల సమర్పణలో డా. లక్ష్మణరావు దిక్కల, వరప్రసాద రావు దుంపల, పద్మ కాకర్ల ఈ చిత్రాన్ని నిర్మించారు. ''ఒకే పాత్రతో సినిమాని అద్భుతంగా నడిపించడంతో పాటు అసభ్యకర సన్నివేశాలు లేకుండా శ్రీనివాసు తెరకెక్కించారు. ఈ నెల 21న ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.

37 ఏళ్లకు మళ్లీ జోడీగా...


రాజేంద్ర ప్రసాద్, అర్చన

'లేడీస్ టైలర్' (1986) సినిమాని, ఆ చిత్రంలో జంటగా నటించిన రాజేంద్రప్రసాద్, అర్చనల కెమిస్ట్రీని అంత సులువుగా మరచిపోలేం. ఈ జోడీ 37 ఏళ్లకు స్క్రీన్ షేర్ చేసుకుంటున్న చిత్రం 'షష్టిపూర్తి'. రాజేంద్ర ప్రసాద్, అర్చన ప్రధాన పాత్రల్లో రూపేష్ కుమార్ చౌదరి, ఆకాంక్షా సింగ్ జంటగా పవన్ ప్రభ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. హీరోగా నటించడంతో పాటు రూపేష్ నిర్మిస్తున్నారు. చెన్నైలోని సంగీతదర్శకుడు ఇళయరాజా స్టూడియోస్‌లో ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ఆరంభమైంది. తొలి సీన్‌కి ఇళయరాజా కెమెరా స్విచాన్ చేయగా, నిర్మాత ఆర్‌బి చౌదరి క్లాప్ ఇచ్చారు. రూపేష్ కుమార్ చౌదరి మాట్లాడుతూ– ''లేడీస్ టైలర్' తర్వాత రాజేంద్రప్రసాద్, ఇళయరాజాగార్ల కాంబినేషన్‌లో 'ఆస్తులు అంతస్తులు, చెట్టు కింద ప్లీడర్, ఏప్రిల్ 1 విడుదల' వంటి మ్యూజికల్ హిట్స్ వచ్చాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ లెజెండ్స్ కాంబినేషన్ రిపీట్ అవుతోంది. అలాగే 'లేడీస్ టైలర్' తర్వాత రాజేంద్ర ప్రసాద్, అర్చనగారు చేస్తున్న చిత్రమిది. సినిమాలో మొత్తం నాలుగు పాటలు ఉన్నాయి. ఇదొక న్యూ ఏజ్ ఫ్యామిలీ డ్రామా. జూలైలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని చెప్పారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



కుల కట్న ప్రసక్తి లేదు/SC మాల/లేటు/45/5'11"/ B.Tech,MBA,LLB,(Ph.D) 40k PM, కొంచెం కాలేజ్ వైకల్యం కాలు/హైదరాబాదులో స్థిరపడిన వరుడికి ఆదర్శ భావాలు కలిగిన వధువు కావలెను. డైరెక్ట్ ఫోన్: 7702498915. [H-778981]

మాల/29 సం॥/5'11"/ B.Tech/ ITI/ SWE Job/25L P/A/వెల్ సెటిల్డ్ Family వరుడికి తగిన వధువు కావలెను. Ph: 7702195227 [HA-10399]

బెస్త గంగపుత్ర/డైవర్సీ/CNB/28సం॥ /5'6"/SWE/13L P/A/G+1 House/ Own Flat/Land వెల్ సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9391646037 [HA-10399]

2nd మ్యారేజ్/డైవర్సీ/40సం॥/ వెల్ సెటిల్డ్ వరునికి సెటిలైన వధువు కావలెను. Caste No Bar. సంప్ర: కళ్యాణమస్తు: రిచ్ ప్రొఫైల్స్. 1st, 2nd, లేట్ మ్యారేజెస్. 9912349189 [HA-1913]

హిందు మాల/కట్న ప్రసక్తిలేదు/B.Tech/ Govt. AE / ట్రాన్స్‌కో/ 90,000/-pm / 5'9" ఎత్తు, 28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-13924]

ముదిరాజ్/B.Tech / Govt. Asst. మేనేజర్/ యూనియన్ బ్యాంక్/ 70,000/-pm/ 5'9" ఎత్తు, 27 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-13924]

వడ్డెర/ కట్న ప్రసక్తిలేదు / B.Tech / C. Govt. ఎలక్ట్రికల్ ఇంజినీర్/80,000/-pm/ 5'10" ఎత్తు, 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-13924]

విశ్వబ్రాహ్మణ్/ M.Sc / C. Govt. అకౌంటెంట్ ఆఫీసర్/రైల్వేస్ / 60,000/-pm/ 5'11" ఎత్తు, 28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-10396]

ముదిరాజ్/B.Tech/ Govt. Asst. ఎగ్జి॥ ఇంజినీర్/ ట్రాన్స్‌కో/ 10 Lakhs P/A, 5'10" ఎత్తు, 28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-10396]

క్రిస్టియన్ మాల/ M.Tech / C. Govt. P.O/ SBI బ్యాంక్/ 60,000/- pm, 5'11" ఎత్తు, 28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-10396]

క్రిస్టియన్ మాదిగ/B.Tech/ Govt. Asst. ఎగ్జి॥ ఇంజినీర్/ RWS/ 70,000/- pm, 5'11" ఎత్తు, 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-10396]

Reddy రెండవ పెళ్ళి- 33/5'10"/MS-USA 20Cr & 40/5'8" / MS-USA Citizen, Cont: Prabhakar Reddy. 9391198332. [H-797610]

యాదవ: M.Tech / C.Govt. Asst Engineer (IOCL)/ 80,000/ PM/5"8 ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 8008965895 [H-10398]

మాల క్రిస్టియన్: M.Tech/C.Govt. Office (Income Tax Dept)/ 1Lakh/ PM/5'8"/ ఎత్తు/28 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9866034870 [H-10398]

మాల హిందూ: M.Tech/C.Govt. PO (SBI) / 80,000/- PM / 5'8"/ఎత్తు / 28 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9866034870 [H-10398]

విశ్వబ్రాహ్మణ: 38yr/MBA Manager Pvt జాబ్ 53 వేలు (PM), 2nd మ్యారేజ్ గల అందమైన వరునికి అదే కులానికి చెందిన తగిన వధువు కావలెను (అర్జెంట్) డైరెక్ట్ సంప్ర: 7981066406 [H-793400]

కుల పట్టింపులేదు: 2వ పెళ్లి, ఆర్యవైశ్య Direct 42 సంవత్సరాల వరుడికి తగిన వధువు కావలెను. Ph: 7569735421 [H-793400]

రెడ్డి: మోటాటి యువతిని పెళ్లి చేసుకునేందుకు రెడ్డి మోటాటి యువకుడికి సాంప్రదాయ కుటుంబం నుండి వధువు కావలెను. ఆర్థికంగా స్థిరపడిన నెలకు మంచి ఆదాయం గల అబ్బాయికి వయస్సు: 42 సం॥లు (లేట్ మ్యారేజ్) ఆసక్తి కలిగిన 30-35 సం॥ల రెడ్డి వధువు పెళ్లి చేసుకొనుటకు కావలెను విద్య అర్హత కనీసం డిగ్రీ. Ph: 8639375257(K.N.Reddy) [H-92819]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: koreddy43@gmail.com, Facebook.com/koreddymarriagebureau

వధువు కావలెను

Reddy/USA-Citizen / USA-Doctor/ 1998/5'8" / Total Family USA Citizens/Father Own Company. *Cont: K.C. Reddy. Ph: 9849321309

Reddy/ BE/BITS/SWE/Hyd/ 1992/ 5'7"/32L/yr/20Cr. Cont: K.C. Reddy-Mar-Bureau-Road No.3, B.Hills-Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/BS / MS/USA/H1 1997/ 6'/ 400Cr / 150K. * Cont : K.C. Reddy -Mar- Bureau- Hyd. Ph: 9849321309/9347807015

Reddy/(Divorcee) / MBBS/MD(GM)/ 1994/5'9"/50Cr. *1985/5'8"/MD/50Cr. * Cont: K.C. Reddy-Mar-Bur-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech(NIT)/MS/MBA / USA/ 140K / 200Cr Needs Beautiful Girls USA or India. *Cont: K.C. Reddy-Hyd Ph: 9849321309/ 9347807015

Reddy/MBBS/MD / Very Handsome Boy/1995/5'10"/400Cr. * Cont: K.C. Reddy-Road No.3-B.Hills-Hyd Ph: 9849321309/ 9347807015

Reddy/MBBS/MD/1990/5'10"/500Cr /Hyd- *Cont: K.C. Reddy-Mar-Bureau-Road No.3, B.Hills-Hyd. Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/Good Business/Very Hand some Boy/B.Tech/1997/6'/100Cr. *Cont: K.C. Reddy-Mar-Bureau - Hyd- Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech/IIT/MS/H1 /USA/1992/ 5'11"/495K/10Cr. * Cont : K.C. Reddy-Mar-Bureau-Road No. 3-B.Bhills-Hyd. Ph:9849321309/9347807015

Reddy/USA-Doc / USA - Citizen/ MBBS/ MS (Surgeon)/Very Hand some Boy/1990/6'/50Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015 [D-507]

వరుడు కావలెను

Reddy / USA Citizen Doctor/ Beautiful/2002/5'7"/Parents USA Citizens/Business USA *Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/MBBS/Most Beautiful/ 1998/5'9"/50Cr * Needs Doctor or Business Well Settled *Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/Divorcee/Most Beautiful/ B.Tech/SWE/Hyd/1991/5'4"/10Cr. *Cont: K.C. Reddy - Mar-Bureau-Hyd Ph:9849321309/9347807015

Reddy/BBA/Most Beautiful/ 1997/ 5'4"/100Cr-*Cont: K.C. Reddy-Mar- Bureau-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/ MS/ Job India/Most Beautiful/ Father Bureaucrat/ 1994/ 5'3"/400Cr. *Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309/9347807015

Reddy/MBBS /MD /Final yr/ 1995/ 5'5"/100Cr-Needs Doc or any Business. *Cont: K.C. Reddy- Hyd-Ph: 9849321309/9347807015

Reddy/ B.Tech /MS/H1/USA/Most Buautiful/1996/5'9"/100Cr. * Cont: K.C. Reddy-Mar-Bureau- Hyd- Ph: 9849321309/9347807015

Reddy/(Divorcee)/B.Tech/IIT/MS/H1/USA /Most Beautiful/ Rich / 1992 / 5'6"/110K. *Cont: K.C. Reddy-Mar-Bureau-Road No.3-B.Hills-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MS/1993/5'3"/1000Cr. *IIT/B.Tech/1994/5'7"/1500Cr. *Cont: K.C. Reddy-Mar-Bureau-Road No.3-B.Hills-Hyd. Ph: 9849321309

Reddy/USA-Doctor/Most Beautiful/1992/5'7"/50Cr. *Cont: K.C. Reddy-Marriage Bureau- Hyd- Ph: 9849321309/9347807015

2వ పెళ్లి/ B.Sc/C.Govt. Asst. మేనేజర్/ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా/ 85,000/-PM/ 5'8" ఎత్తు/ 32 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 9963757612 [HA-13926]

రజక/ కట్నప్రసక్తి లేదు/B.Tech/ Govt. AE/ ఇరిగేషన్ Dept./ 80,000/-PM/ 5'10" ఎత్తు/ 28సం॥ల వరునికి అందమైన వధువు కావలెను. ఫోన్: 7075953400, 7842467951 [HA-13926]

మాదిగ/B.Tech/ Govt. AE/ జెన్‌కో/ 90,000/- PM./ 5'9"ఎత్తు/ 28సం॥ల/ వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 9642459724 [HA-13926]

SC మాదిగ/B.Tech/ Govt. Asst./ Exp. ఇంజనీర్/ (R&B Dept.) 80,000/-PM./ 5'8"ఎత్తు/ 28సం॥ల వరునికి వధువు కావలెను. ఫోన్: 9703978131 [HA-13926]

ఫ్రీ రిజిస్ట్రేషన్: 1వ, 2వ, లేట్ మ్యారేజ్ వధువులు కావలెను. అన్ని కులాల (OC, BC, SC, ST మైనారిటీ) వారు సంప్ర/ వాట్సాప్ నెం. 7207211109/ 8919607701. వివరాలు సెండ్ చేయండి. సంబంధాలు ఫాస్ట్‌గా చూడబడును. [HA-1036]

SC మాల & క్రిస్టియన్/M.Tech (EEE)/ C. Govt. డిప్యూటీ మేనేజర్/SBI / 10 Lakhs PA/ 5'8" ఎత్తు/ 28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-13927]

యాదవ/ కట్న ప్రసక్తిలేదు / B.Tech (సివిల్)/ C. Govt. బ్యాంక్ P.O/ SBI / 60,000/-pm/ 5'8" ఎత్తు/ 28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 9515755529 [HA-13927]

రజక/B.Tech / C. Govt. Asst. మేనేజర్/ SBI / 78,000/-pm / 5'10" ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9515942275 [HA-13927]

క్యాస్ట్ నో బార్, డైవర్సీ, 43y, 5'10" (MBBS MD) డాక్టర్, జీతం 4 లక్షలు నెలకి, Hyd సంపన్న వరుడికి తగిన (డాక్టర్/ఇంజనీర్/గ్రాడ్యుయేట్) వధువు కావలెను ✆ 94401 24742 [B-1013]

కాపు/60 సం॥/5'7"/M.Sc.,/గవర్నమెంట్ జాబ్ గెజిటెడ్ ఆఫీసర్ నెలకు 1,50,000/- సంపాదించు వరునకు తగిన వధువు కావలెను. బ్రోకర్లు లేరు. ✆ : 95503 95951 [R-1687]

Eediga (goud), 31yr, H, 5'11" B.Tech, Software, 1.5Lpm @ B'lore, Wanted software (Telugu Bride), Ph - 9581869864, 7032571526, No Agent (Direct). [HA-0255]

Reddy Groom-29/5'10"/M.Tech C. Govt, AGM, 2,30,000/-PM & 27/5'8"/ BDM - Business, 3cr P/A, Cont: Prabhakar Reddy. PH: 9391198332. [H-797610]

★

రెడ్డి/లేట్ మ్యారేజ్/39y/నెలకు లక్ష రూపాయల ఆదాయం సొంత ఇల్లు, కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి కుల, కట్న ప్రసక్తి లేని అమ్మాయి కావలెను. డైవర్సీ/విడో అయినా OK డైరెక్ట్. Ph: 7989079290 [H-792998]

Handsome Boy From a Very Rich Family of Hyderabad 28 Years Businessman Only Son is looking for a suitable match (080-69072068). [HA-10995]

★★

శెట్టిబలిజ 34/5'5"/B.Tech MS/H1B USA *31/ 5'5"/B.Tech MS/H1B USA *39/5'8"/B.Tech/ Sr. Manager Central/Govt.HYD అబ్బాయిలకు తగిన B.Tech చేసి ఉద్యోగము చేస్తున్న సాఫ్ట్‌వేర్ శెట్టిబలిజ అమ్మాయిలు కావలెను సం॥ శుభమస్తు DSNR.HYD S. రాములు గౌడ్. ఫోన్: 8790690309. [H-781457]

పద్మశాలి, 29సం., 5'11", ఎరుపు, మేనేజర్ HDFC బ్యాంక్, 10L PA, అందమైన యువకునికి 5'3" ఎత్తు తగ్గని అందమైన యువతి కావలెను. సంప్ర॥ 93921 34606, 73828 93350. [B-786514]

BC/ కుల ప్రసక్తి లేదు / 50 yrs / B.Tech, MBA / Govt. Engineer 2 LC PM / 2 పిల్లలు ఉన్నారు / Divorce / వరునికి తగిన వధువు కావలెను.No brokers.Ph : 62810 06161 [B-1166887]

కమ్మ / 27 / ఇంటర్ / కమ్మ / 29/ డిగ్రీ / కట్నములు ఇవ్వుకోలేని వధువులకు, కమ్మ వరులు కావలయును. సంప్ర : 76710 76288 [B-1201877]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Business, 27, 5' 8", Hyderabad, Handsome, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 31, 5' 11", 250 K, 20 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE, MS(USA), 30, 5' 11", Hyderabad, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Germany, BE, MS, 28, 5' 8", SWE, 42 K Euros, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Govt, MBA, 26, 5' 3", 18 L P/A, 18 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 25, 5' 7", SWE, 129 K, 4 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 3", 150 K, H1, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 4", SWE, 120 K, 3 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE (IIT), MSc, 29, 5' 10", 24 L P/A, 20 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5' 11", Doctor, Rich Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Australia BE, MS, 28, 5' 8", Analyst, 90K, 5 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి CA, 27, 6' 2", Associate, 15 L P/A, 10 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MDS, 29, 5' 7", Dental Doctor, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 23, 5' 4", SWE, 10.8 L P/A, Hyd, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 5' 6", 64 L P/A, Hyderabad,10 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.


రెడ్డి MBBS, 28, 5' 3", Doctor, Rich Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818. LETTER

డైరెక్ట్: కాపు/ 5'5"/ 56 Years/ M.Sc, కుల పట్టింపు లేదు. నెలకు రూ. 40 వేల ఆదాయం కలిగి, 70 లక్షల స్థిరాస్తి గల వ్యక్తికి మంచి మనసున్న మహిళ కావలెను. వివరాలకు: సెల్: 8341482731 [K- 1219918]

యాదవులు 2nd మ్యారేజ్ వయస్సు 47 H.5'7" గవర్నమెంట్ దేవస్థానంలో ఉద్యోగం. నెలకు 45 వేలు జీతం. వరుడుకి వధువు కావలెను. క్యాస్ట్ నో బార్ ✆ 96769 82230 [R-1154758]

దేవాంగులు వెల్ సెటిల్డ్ వరుడుకి వధువు కావలెను. లేట్ మ్యారేజిస్, డివర్సైడ్, రెండవ వివాహ సంబంధములు కూడా అన్ని కులముల వారికి చూడబడును. మణిశ్రీ మ్యారేజ్ బ్యూరో (8), పత్తేబాద-ఏలూరు, దేశ వ్యాప్తంగా నెట్‌వర్క్ కలిగిన సంస్థ. సంప్ర : 98907 67614 [G-1323]

వరుడు కావలెను



కాపు/45y/5'5"/కుల పట్టింపు లేదు/ఫెయిర్ / M.Com/ Govt. ఎంప్లాయి 70K (PM) వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ & సొంత ఇల్లు కల్గిన అందమైన వధువుకు కుల పట్టింపు లేని వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర: Ph: 8008474869 [H-781403]

No Caste bar, 1,2 వ 1 కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు, వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం Ok త్వరగా చూసుకునే వారికోసం మాత్రమే ఫోన్: W: 7794980808. [H-778981]

రెడ్డి: 40yr/ కులపట్టింపులేదు/ ఫెయిర్. Govt ఎంప్లాయ్ 1.లక్ష (PM), వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ బిజినెస్ & 2 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) సంప్ర: 9492081545 [H-793400]

పద్మశాలి/25 సం॥/5'4"/B.Tech/ MBA/Govt.Job (DRDO)/10L P/A Well Settled వధువుకి తగిన వరుడు కావలెను. Ph : 88970 91964 [HA-10399]

SC మాదిగ /25 సం॥/5'5"/B.Tech/ MBA/SWE Job/10L P/A అందమైన వధువుకు వెల్ సెటిల్డ్ Family/తగిన వరుడు కావలెను. (USA Also OK) Ph : 6281925716 [HA-10399]

కాపు /CNB / డైవర్సీ / 40 సం॥ / 5'4" సెంట్రల్ Govt.Job/12L P/A/G+1 House/వెల్ సెటిల్డ్ అమ్మాయికి తగిన వరుడు కావలెను. Ph: 9390933661 [HA-10399]

క్రిస్టియన్ మాల/B.Tech/ C.Govt. Asst. మేనేజర్/ కెనరా బ్యాంక్/50,000/-pm/ 5'4" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-13924]

కుల ప్రసక్తిలేదు/ B.Tech/ SWE/ 60,000/-pm/ 5'5" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-13924]

SC హిందు మాల/B.Tech/ Govt. ల్యాండ్ సర్వేయర్/ రెవెన్యూ Dept./ 38,000/-pm/ 5'5" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-10396]

కాపు/నాయుడు/విడో/60y/తక్కువ వయస్సు /2 ఇళ్ళు/2 ఎకరముల వరి పొలము కల సాంప్రదాయ వధువుకు మంచి ప్రవర్తన కలిగిన వరుడు కావలెను. ఫోన్: 8341777480. [H-781455]

నాయుడ్స్/55y/విడో/సొంత అపార్ట్‌మెంట్/ ఆంధ్రాలో తోటలు/ఐరన్, సిమెంట్ బిజినెస్ పై నెలకు మంచి ఆదాయం కలిగిన వధువుకు కుల, ఆస్తి ప్రసక్తి ఇల్లరికపు వరుడు కావలెను. ఫోన్: 9505858232. [H-781455]

రెడ్డి/54y/విడో/డిగ్రీ/సొంత ఇల్లు/ షాప్: 45,000/-PM/3 ఎకరాల ల్యాండ్ కల వధువుకి కుల, ఆస్తి పట్టింపులేని వరుడు కావలెను. ఫోన్: 9121433952. [H-781455]

FC/విడో/55y/ 5'3"/ డిగ్రీ/ Fair/ఫ్యామిలీ పెన్షన్/సొంత బిజినెస్ 60,000/- PM Income/2 వాటాల ఇల్లు మంచి మృదు స్వభావం గల వధువుకు మధ్య తరగతి వరుడు కావలెను. ఫోన్: 9059150892. [H-781455]

యాదవ : B.Tech/C.Govt. Asst Manager (Canara Bank)/ 50,000/ PM/ 5'4"/ ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 8008965895 [HA-10398]

మాల క్రిస్టియన్ B.Tech/C.Govt. Officer (FC)/55,000/ PM/5'4"/ ఎత్తు/ 26సం॥ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 9866034870.. [HA-10398]

శ్రీ శ్రీరస్తు శుభమస్తు మ్యారేజ్ బ్యూరో (రెడ్డీస్)

గజ్జల ప్రభాకర్ రెడ్డి Mobile : 9059189869, 9966808059

రెడ్డీస్ : హై రిచ్ ఫ్యామిలీస్: డాక్టర్స్/సాఫ్ట్‌వేర్/ బిజినెస్ /Govt / IAS / IPS / IRS / IFS / IES & All ఇండియా & విదేశీ సంబంధాలు 1వ, 2వ Matches కలవు.

వధువు కావలెను

రెడ్డి/1996/5'11"/B.Tech, MBA/ ఓన్ ఇండస్ట్రియల్ / 1000Crs ప్రాపర్టీగల వరుడికి Well Settled వధువు కావలెను. Ph : 9059189869, 9966808059

రెడ్డి/1993/5'8" / D.M Cardiology/ 15Crs / Well Settled Family గల వరుడికి డాక్టర్ వధువు కావలెను. Ph: 9059189869, 9966808059

రెడ్డి/1993 / 5'10"/ MCH Surgical Gastroenterology / 50 Crs ప్రాపర్టీ గల వరుడికి డాక్టర్ వధువు కావలెను. Ph : 9059189869, 9966808059

రెడ్డి/డైవర్సీ/1987/6'1"/MS Engineering/ USA / 260K/USAలో Own హౌస్/30Crs ప్రాపర్టీ గల వరుడికి ఇండియా or అబ్రాడ్‌లో ఉన్న 1వ, 2వ వధువు కావలెను. Ph : 9059189869, 9966808059

రెడ్డి/డైవర్సీ/1993/5'11"/MS Engineering/ USA/USD 200K/30Crs ప్రాపర్టీ గల వరుడికి ఇండియా or USA లో ఉన్న 1వ, 2వ వధువు కావలెను. Ph : 9059189869, 9966808059

రెడ్డి/1996/ 5'11"/ B.Tech/100Crs ప్రాపర్టీ /Own Pharmaceuticals Pvt Ltd/10 Lakhs Rents PM గల వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9059189869, 9966808059

రెడ్డి/1990/5'11"/MS Ortho/50Crs ప్రాపర్టీ గల వరుడికి డాక్టర్ వధువు కావలెను. Ph: 9059189869, 9966808059

రెడ్డి/డైవర్సీ / 1987/5'9" / MS Computer Science/ 200 Crs ప్రాపర్టీ/Settled in Bangalore గల వరుడికి Good ఫ్యామిలీ నుండి 1వ, 2వ వధువు కావలెను. Ph: 9059189869, 9966808059

రెడ్డి/1995 /5'11" / B.Tech/Own Car Showrooms/150Crs ప్రాపర్టీ గల వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9059189869, 9966808059

రెడ్డి/1994 / 6' / MS Engineering/ USA/USD/200K/20Cr/ప్రాపర్టీ గల వరుడికి Good Looking వధువు కావలెను. Ph: 9059189869, 9966808059 [H-792853]

వరుడు కావలెను

రెడ్డి/1996/5'5"/MBBS/100Crs ప్రాపర్టీ/ Father Business గల వధువుకి డాక్టర్ or Business వరుడు కావలెను. Ph : 9059189869, 9966808059

రెడ్డి/1994/5'4"/CA/150 Crs ప్రాపర్టీ గల వధువుకి Well Settled వరుడు కావలెను. Ph : 9059189869, 9966808059

రెడ్డి /1997 / 5'7" / MBBS/Own Industrial/500Crs ప్రాపర్టీ గల వధువుకి Welled Insustrial వరుడు కావలెను. Ph : 9059189869, 9966808059

రెడ్డి/1995/5'5"/MD Gen.Medicin/Own Nursing Home/100Crs ప్రాపర్టీ గల వధువుకి ఏదైనా సూపర్ స్పెషాలిటీ చేసిన డాక్టర్ వరుడు కావలెను. Ph : 9059189869, 9966808059

రెడ్డి/డైవర్సీ/1991/5'4"/M.Tech/Own Business/30Crs ప్రాపర్టీ గల వధువుకు తగిన వరుడు కావలెను. Ph : 9059189869, 9966808059

రెడ్డి/డైవర్సీ/1988/5'6"/B.Tech/MBA/ 50 Crs ప్రాపర్టీ/ Software Job గల వధువుకి Well Settled వరుడు కావలెను. Ph : 9059189869, 9966808059

రెడ్డి/డైవర్సీ/1992/5'5"/MSC/5000Crs ప్రాపర్టీ/1 Cr రెంట్స్ PM/Bangoloreలో ఉన్న వధువుకి Bangoloreలో సెటిల్డ్‌ైన 1వ, 2వ వరుడు కావలెను. Ph : 9059189869, 9966808059

రెడ్డి/1999/5'4"/MBA/150Crs ప్రాపర్టీ / (Industrialist) గల వధువుకి Well Settled వరుడు కావలెను. Ph: 9059189869, 9966808059

రెడ్డి/1993/5'4"/MS OBG/ 20Crs/ ప్రాపర్టీ గల వధువుకి డాక్టర్ or Well Settled వరుడు కావలెను. Ph : 9059189869, 9966808059

రెడ్డి/డైవర్సీ/1987/5'7"/MS Engineering/ USA/USD/ 180K/Well Settled వధువుకి USA లో ఉన్న 1వ, 2వ వరుడు కావలెను. Ph : 9059189869, 9966808059

వైశ్య : విడో/49Y/5'4"/ MA, B.Ed/Govt. Teacher VRS 60K PM Own Business, House, పొలం (Rents) 3L PM కోట్లప్రాపర్టీ గల వధువుకు కులపట్టింపులేని ఇల్లరికం వరుడు కావలెను (పిల్లలు ఉన్నా OK) Ph: 7386919413 [H-796885]

యాదవ: విడో/48y/5'4"/ BSc Staff Nurse (VRS)/ 50K PM Own Medical Agency, House Rents/ 4 L PM/ కోట్ల ప్రాపర్టీ ఉన్న అందమైన పిల్లలులేని వధువుకు FC/BC ఇల్లరికం వరుడు కావలెను. (పిల్లలు ఉన్నాOK) Ph: 8297518729 [H-796885]

కులపట్టింపు లేదు: విడో/ 46Y/ R&B Engineer/1L PM/Own House/ 19 ఎ॥ ల్యాండ్/ కోట్ల ప్రాపర్టీ గల ఆర్థికంగా స్థిరపడిన అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9059643083 [H-796885]

Reddy: విడో/ 48/5'4"/MBA/Fashion Designer/ 50K PM గార్మెంట్ బిజినెస్/Own House/10ఎ॥పొలం/ 3L PM/ కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు FC/BC ఇల్లరికం వరుడు కావలెను. (పిల్లలు ఉన్నాOK) Ph: 9542256079 [H-796885]

కులపట్టింపు లేదు: విడో/ 47/ 5'6"/PG/ Govt Emp/ VRS/ 50K PM/ Own Business/ House/ పొలాలు (Rents/3L PM/ కోట్ల ప్రాపర్టీ ఫ్యామిలీని కోల్పోయిన వధువుకు FC/BC ఇల్లరికం వరుడు కావలెను. (పిల్లలు ఉన్నాOK) Ph: 9177631661 [H-796885]

రెడ్డి విడో 37 సం. 5.3 ఎత్తు 18 ఎకరాల పొలం సొంత ఇల్లు స్థిరాస్తి కలిగి పిల్లలు లేని ఒంటరి వధువుకు వరుడు కావలెను (ఆస్తి కుల పట్టింపు లేదు). Send Photos Only whatsapp: 9441145961. [H-778981]

బ్రాహ్మణ/విడో/54yrs/Fair/ప్రైవేటు జాబ్/ రెండు చిన్న ఇళ్ళు/కొంచెం పొలం/మధ్య తరగతి కుటుంబానికి చెందిన వధువుకు సాంప్రదాయ వరుడు కావలెను, కుల ప్రసక్తి లేదు. ఫోన్: 9133521622. [H-778981]

కుల పట్టింపులేదు: 2వ పెళ్ళి /35yrs/ Govt. ఎంప్లాయ్/ 2,50,000/- (PM) బాగా స్థిరపడిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK & పిల్లలు ఉన్నా OK) సంప్రదించండి: 9502046384 [H-793400]

రెడ్డి: విడో /52yrs/ 5'3/ ప్రొఫెసర్ గుంటూరు సొంత అపార్ట్‌మెంట్స్/ సొంత హాస్టల్స్/ రెంట్స్ మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (అర్జెంట్) (నో బ్రోకర్స్) (ఇల్లరికం OK) 7799083500, 7386660643 [H-793400]

SC మాల/ ఏకైక కుమార్తె/ BE/C.Govt. Asst. మేనేజర్/ కెనరాబ్యాంక్ 60,000/-PM. /5'3"/ 26సం॥ల/ అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8897389698 [HA-13926]

రజక/ B.Tech/ C.Govt. Asst. Exp. ఇంజనీర్/ ఇరిగేషన్ Dept. / 55,000/-PM./ 5'4" ఎత్తు/ 26సం॥ల/ అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8897389698 [HA-13926]

SC మాదిగ/ B.Tech/ Govt. Asst. Exp. ఇంజనీర్/ పంచాయతీరాజ్ Dept./ 50,000/-PM./ 5'3" ఎత్తు/ 27సం॥ల/ అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 7032058965 [HA-13926]

మాల/ 26/ 5'4"/ MBBS, PG Gynic, Good Family Background వధువుకు తగిన వరుడు కావలెను. No Brokers, ఫోన్ : 9493285326 [HA-13926]

కాపు/ 2వ పెళ్లి / 51Yrs / 60,000/-PM/ సొంత ఇల్లు & పొలాలు గల వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. ఫోన్: 8179207047 [HA-13926]

క్రిస్టియన్ మాదిగ/ B.Tech/C.Govt. బ్యాంక్ క్లర్క్/ 35,000/-PM/ 5'4" ఎత్తు/ 26సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8374801504 [HA-13926]

2వ పెళ్లి/52y/ ఫ్యామిలీ పెన్షనర్/ 80,000/-pm/ ప్రాపర్టీ, 3 Cr ప్రాపర్టీ గల సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. Any Caste. Ph: 8340059430 [HA-13927]

బ్రాహ్మణ/2వ పెళ్లి/32/5'3"/ B.Sc/ Pvt. జాబ్/ 15,000/-pm/ వధువుకు తగిన జాబ్/బిజినెస్ వరుడు కావలెను. Ph: 9701743336 [HA-13927]

రెడ్డి/విడో/45/5'6"/ నెల్లూర్/ సొంత బిజినెస్/ కోట్ల ఆస్తి గల రెడ్డి ఒంటరి వధువుకు తగిన వరుడు కావలెను. వాట్సప్: 9030129988 [HA-13927]

ముదిరాజ్/ఏకైక కుమార్తె/B.Tech/ C. Govt. బ్యాంక్ క్యాషియర్/ బ్యాంక్ ఆఫ్ ఇండియా/ 28,000/-pm/ 5'4"/ ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9052296834 [HA-13927]

క్రిస్టియన్ మాదిగ/B.Tech, MBA/ C. Govt. డిప్యూటీ మేనేజర్/ SBI/ 65,000/-pm/ 5'4"/ ఎత్తు/25 సం॥ల వధువుకు Any ఎంప్లాయి/ డాక్టర్ వరుడు కావలెను. Ph: 9515755529, 9912280929 [HA-13927]

బ్రాహ్మణ/25/ 5'3"/ఇంటర్ *28/5'2"/B.Sc *30/5'3"/ఇంటర్ *27/5'3"/MBA వధువులకు వరులు కావలెను. జాబ్/బిజినెస్ Ok. పురోహితులకు సంబంధాలు కలవు. Ph: 7815999246 [HA-13927]

బ్రాహ్మణ/26/5'3"/ఇంటర్ *28/5'3"/MBA *30/5'2"/B.Sc. *31/5'3"/B.Com కట్నం ఇవ్వుకోలేని మధ్య తరగతి వధువులకు వరుల కావలెను. జాబ్/ బిజినెస్ /వధువున్న పురోహితులు అయినా సంప్ర: 7207634758 [HA-13927]

రెడ్డి/ విడో/కుల ప్రసక్తిలేదు/35yrs/M.Tech/SWE/2 లక్షల (PM), తెల్లని అందమైన & సొంత ఇల్లు, వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను (పిల్లలు ఉన్నా & ఇల్లరికం OK) సంప్ర: Ph: 8519990447 [H-781403]

రెడ్డి/ విడో/ 60yrs / 5'3"/ V.Fair / సొంత ఇల్లు/రెంట్స్/ఓన్ బిజినెస్/2 ఎకరాల పంట పొలం గల వధువుకి కుల పట్టింపు లేని వరుడు కావలెను. Ph: 8143066631 [H-781403]

క్రిస్టియన్ SC మాదిగ వధువులకు వరులు కావలెను. MA, M.Ed. 39 నుండి 42 మధ్య ఒకరు MA, B.Ed. 46 నుండి 49 మధ్య వయస్సు వున్న క్రైస్తవ భక్తిగల కుటుంబ వరులు కావలెను. Whatsapp Biodata : 8008678969 [L-795038]

రెడ్డి/డైవర్సీ /58yrs/ 5'4"/ V.Fair /ఫ్యామిలీ పెన్షన్/ 50K/ఓన్ హౌస్/రెంట్స్ /5 ఎకరాల పంట పొలం గల వధువుకి కుల పట్టింపు లేని వరుడు కావలెను. 20 Lakhs (FD). 7386647732 [H-781403]

Reddy రెండవ పెళ్ళి- 32/5'3"/V.Fair/ Rich, B.Tech - SWE & 32/5'6"/ B.Tech SWE/V.Fair, Cont: Prabhakar Reddy. 9391198332. [H-797610]

Reddy Br, 27/5'7"/B.Tech, MS-USA /Rich & 25/5'5"/MD (Radiology) II yr / Rich & 22/5'6"/ B.Com, Cont: Prabhakar Reddy. 9391198332. [H-797610]

Reddy Br, 26/5'4"/B.Tech, MS-Australia & 26/5'4"/B.Tech SWE/ Fair/Rich & 30/5'5" MBBS-MD Cont: Prabhakar Reddy. 9391198332. [H-797610]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13928]

Kamma - Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13928]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13928]

పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ: తెనాలి (గుంటూరు జిల్లా) వారి 12వ వివాహ పరిచయ వేదిక కార్యక్రమము 23.04.2023 ఆదివారము ఉ. 9 గం.ల నుండి. 9963924665, 9849851322. [T-1781]

పెళ్లి కాలేదని బాధపడుతున్నారా? సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్, గ్రూప్ 1, 2 ఆఫీసర్స్, అబ్రాడ్ వారికి ఫాస్ట్‌గా పెళ్లి సంబంధాలు చూడబడును. పూర్ణ మాట్రిమోనీ, తిరుపతి, 7093722724 . [T-469]

15లో॥ అన్ని కులాల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి. info@rohinimarriages.com, ✆ 94418 29644, 94920 33897, 94407 85888 [B-939]

40 సం॥లుగా వేలాది సంబంధాలు కుదిర్చిన సంస్థ "కాకతీయ మ్యారేజెస్" రెడ్డి, కమ్మ, కాపు, ఇతర కులముల సంబంధాలకై kaakateeya.com. Ph: 9342939345, 9848134222 [HA-10348]

వడ్డెర వధువు వివాహ సంబంధాలు కుదుర్చబడును. దేశ, విదేశ త్వరిత సంబంధాల కొరకు సంప్రదించండి: 9381553423 [HA-13908]

మాల, మాదిగ స్పెషల్. IAS, IPS, IFS, IRS, గ్రూప్ I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్ USA, UK, Ph: 73969 15712 (A) [M-6986]

1వ, 2వ / డైవర్సీ / విడో, స్త్రీ / పురుషులకు 25 సం॥ నుండి 50 సం॥ల వారికి వివాహ సంబంధాలు (CNB) ఫ్రీ రిజిస్ట్రేషన్ సుమ మ్యారేజ్, Hyd. Cell: 7386271546. [Z-772209]

Registration Free. మీకు తగిన సంబంధాలు ఉంటేనే Subscription తీసుకోండి. 25 సంబంధాలు కేవలం రూ. 500/- మాత్రమే. www.jeelakarrabellam.com, 98497 44707 [G-955]

★

ఓన్లీ పద్మశాలి.డాక్టర్స్/ఇంజనీర్స్/NRI/ Govt/బిజినెస్/ప్రైవేట్/హైరిచ్ 1వ, 2వ, లేట్, మీరు కోరిన పెళ్లి సంబంధాలకు సంప్రదించండి: 9160000284 [HA-13929]

బ్రాహ్మణ: వధూ, వరుల స్వయం వరం (Online) 02-04-2023న Bhavani Matrimony, Hyd, Free Registration Ph: 9704656103, 9533608887 (Whats App) [HA-1119]

★★

kalyanimatrimony.in కాపు, కమ్మ, రెడ్డి, గౌడ్, బ్రాహ్మణ, వైశ్య వారి సాంప్రదాయ వివాహ సంబంధాల కొరకు వెంటనే సంప్ర: 8500747535, 9533133969. [H-781456]

క్రిస్టియన్ & హిందూ: మాల, మాదిగ మరియు (OC, BC, SC, ST) అన్ని కులములలో క్రైస్తవ విశ్వాసుల వివాహ (1st & 2nd) సంబంధముల కొరకు సంప్ర. ✆ 80746 35739 [B-1201781]

లక్ష్మీనారాయణ మ్యారేజ్ బ్యూరో. సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్, NRI, బిజినెస్, ప్రొఫెషనల్స్‌కు & అన్ని కులాల వారికి సంబంధములు కుదర్చ బడును. ఆర్. నాగేంద్రమ్మ. ✆ 63093 56630. [B-1165853]

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE Govt Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp). [HA-1004]

వేదికలు



మాదిగ వివాహ పరిచయ వేదిక: ప్రతి శని, ఆదివారాలు 12-6pm, ముందుగా మీ ప్రొఫైల్ రిజిస్టర్ చేసుకోవాలి "సికింద్రాబాద్ స్టేషన్ బ్లూసీ బ్యాక్. ఫోన్: 9347046175. [H-781455]

ఫ్రీ: అన్ని కులములు/1st2nd/లేటు వధూ/ వరుల వివాహ సంబంధముల ఫాస్ట్ సెటిల్మెంట్‌కై వెంటనే ఫోటో, బయోడేటా పంపండి. సంప్ర: "మానేసా" మ్యారేజ్ బ్యూరో: PH/WA: 9291503949. [H-778981]

రజక వివాహ వేదిక (1994)/ డాక్టర్స్/ ఇంజనీర్స్/ Abroad/ USA/ UK/ B.Ed/ Govt Job సంబంధాలకై సంప్రదించండి ఫోన్: 8106303155/ 9391265304. [H-781403]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13928]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13928]

ఆప్కాబ్ లాభం రూ.249కోట్లు

- 2022-23లో రూ.36,732 కోట్ల వ్యాపారం
- రికార్డు స్థాయిలో రూ.27వేల కోట్ల రుణాలు
- రూ.9వేల కోట్ల డిపాజిట్ల సేకరణ
- 2021-22తో పోలిస్తే 20 శాతం వృద్ధి నమోదు

సాక్షి, అమరావతి : గ్రామీణ సహకార బ్యాంకింగ్ రంగంలో దేశంలోనే నెం.1గా నిలిచిన 'ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్' (ఆప్కాబ్) వ్యాపారంలో రికార్డులు తిరగరాస్తోంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.249.25 కోట్ల మేర లాభాలు ఆర్జించింది. ఆడిటింగ్ ప్రక్రియ పూర్తికాగానే బ్యాంకు సాధించిన పురోగతిని చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి శనివారం మీడియాకు వివరించారు. 2022-23లో ఆప్కాబ్ రికార్డు స్థాయిలో రూ. 36,732.43 కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహించింది. 2021-22తో పోలిస్తే 20 శాతం వృద్ధిరేటు నమోదు చేసింది. 2018-19లో రూ.13వేల కోట్ల వ్యాపారం చేసిన ఈ సంస్థ గడిచిన 45 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో 2022-23 ముగిసే నాటికి తన వ్యాపారం మూడురెట్లు పెంచుకుంది. రాష్ట్రంలో సొంతంగా 24 బ్రాంచిల ద్వారా సేవలందిస్తున్న ఆప్కాబ్, రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తోంది. ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక చేయూత నిస్తూనే వ్యాపారంలో వాణిజ్య బ్యాంకులకు దీటుగా నిలుస్తోంది. అలాగే, 2021-22లో రూ. 30,587.62 కోట్ల వ్యాపారం చేయగా, రూ.242.82 కోట్ల లాభాలను ఆర్జించింది. గతేడాది రూ.22,338 కోట్ల రుణాలు ఇవ్వగా, రూ.8,250 కోట్ల డిపాజిట్లు సేకరించింది. ఇక 2022-23లో రూ.27,069 కోట్ల రుణాలు ఇవ్వగా, రూ.9,042 కోట్ల డిపాజిట్లను సేకరించి గతేడాది కంటే మిన్నగా రూ.249.25 కోట్ల లాభాలు ఆర్జించింది. పెట్టుబడుల విషయానికొస్తే 2021-22లో రూ.1,996 కోట్ల పెట్టుబడులు పెట్టిన ఆప్కాబ్.. 2022-23లో రూ.1,993 కోట్లు పెట్టింది. ఎన్‌పీఏను కూడా గణనీయంగా తగ్గించుకోగలిగింది. 2021-22లో 1.51శాతం ఉన్న ఎన్‌పీఏ 2022-23లో 0.62 శాతానికి తగ్గించుకుంది.

> **రూ.50వేల కోట్ల వ్యాపారమే లక్ష్యం..**
>
> సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రోత్సాహం.. సహకారంతో ఆప్కాబ్ 2022-23లో రికార్డు స్థాయిలో వ్యాపార లావాదేవీలు నిర్వహించగలిగింది. అలాగే, బ్యాంకు మంచి లాభాలను ఆర్జించింది. సహకార రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా షేర్ క్యాపిటల్ అసిస్టెన్స్ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.295 కోట్ల మేర ఆర్థిక చేయూతనివ్వడం ఇందుకు దోహదపడింది. కొత్త ఆర్థిక సంవత్సరంలో ఖాతాదారులతో పాటు రైతులకు, స్వయం సహాయక సంఘాలకు మరిన్ని సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటాం. కనీసం రూ.50వేల కోట్ల వ్యాపారం సాధించడమే లక్ష్యంగా ముందుకెళ్తాం.
>
> – మల్లెల ఝాన్సీరాణి, ఆప్కాబ్ చైర్‌పర్సన్

● తెలంగాణ

డేటా చోరీ సూత్రధారి దొరికాడు

- హరియాణాలో వినయ్ భరద్వాజ్‌ను అరెస్ట్ చేసిన సైబరాబాద్ పోలీసులు
- హైదరాబాద్‌కు చెందిన 56 లక్షలు, ఏపీకి చెందిన 2.10 కోట్ల మంది డేటా చోరీ

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే అతిపెద్ద డేటా చౌర్యం కేసులో కీలక సూత్రధారిని సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. దేశ జనాభాలో 50 శాతం ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని తస్కరించి విక్రయిస్తున్న ఫరీదాబాద్‌కు చెందిన వెబ్ డిజైనర్ వినయ్ భరద్వాజ్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. 24 రాష్ట్రాలు, 8 మెట్రో నగరాలకు చెందిన సుమారు 70 కోట్ల మంది రహస్య సమాచారాన్ని తస్కరించినట్లు పోలీసులు గుర్తించారు. రక్షణ, విద్యుత్, ఇంధన శాఖ, జీఎస్టీ, ఆర్టీవోలతోపాటు ఇతర ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, ప్రవాసులు, టీచర్లు, వైద్యులు, లాయర్లు, ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, గృహిణులు.. ఇలా 104 కేటగిరీలకు చెందిన ప్రజలు, సంస్థల వ్యక్తిగత, రహస్య సమాచారాన్ని నిందితుడు చోరీ చేసి విక్రయిస్తున్నట్లు విచారణలో పోలీసులు గుర్తించారు. హరియాణాలోని ఫరీదాబాద్‌కు చెందిన వినయ్.. వెబ్ డిజైనింగ్ కోసం తన వద్దకు వచ్చే కస్టమర్ల వివరాలను మార్కెటింగ్ ఏజెంట్లకు, సైబర్ నేరస్తులకు విక్రయించి సొమ్ము చేసుకొనేవాడు. అప్పనంగా డబ్బు వస్తుండటంతో ప్రజలు, సంస్థల వ్యక్తిగత, రహస్య సమాచారాన్ని సైతం తస్కరించాలని నిర్ణయించుకున్నాడు. డేటా సమీకరణ కోసం ఏకంగా 4.5 లక్షల మంది ఉద్యోగులను నియమించుకున్నాడు. ఇందులో అమీర్ సొహైల్, మదన్ గోపాల్‌లు కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించారు. తస్కరించిన డేటాను విక్రయించేందుకు ఇన్‌స్పైర్ వెబ్జ్ వెబ్‌సైట్‌ను ప్రారంభించాడు. కస్టమర్లను ఆకర్షించేందుకు సోషల్ మీడియాలో ప్రచారం చేసేవాడు. క్లౌడ్ డ్రైవ్ లింక్‌ల ద్వారా మాత్రమే డేటాను విక్రయించేవాడు. ఇలా గత 8-12 నెలలుగా నిందితుడు డేటా తస్కరణ, విక్రయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పరారీలో ఉన్న అమీర్, మదన్‌ల కోసం సైబరాబాద్ పోలీసు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

> **తెలుగు రాష్ట్రాల ప్రజల డేటా కూడా..**
>
> నిందితుడు విక్రయించిన డేటాలో తెలంగాణ, ఏపీ ప్రజల డేటా కూడా ఉంది. హైదరాబాద్‌కు చెందిన 56 లక్షలు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 2.10 కోట్ల మంది వ్యక్తిగత వివరాలను నేరస్తుడు విక్రయానికి పెట్టాడు. పన్ను చెల్లింపుదారులు, కంపెనీ సెక్రటరీలు, ఆడిటర్లు, ఉద్యోగస్తుల డేటా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అలాగే 1.26 లక్షల మంది ప్రవాసులు, 5 లక్షల మంది హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (హెచ్‌ఎన్‌ఐ)ల డేటా విక్రయానికి పెట్టేశాడు. బైజూస్, వేదాంతు వంటి ఆన్‌లైన్ విద్యాసంస్థలకు చెందిన 18 లక్షల మంది విద్యార్థులు, 1.8 లక్షల మంది నీట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు, 30 లక్షల మంది సీబీఎస్‌ఈ (10, 12వ తరగతి), 3.5 కోట్ల మంది ఇతర విద్యార్థుల డేటాను నేరస్తులు విక్రయానికి పెట్టారు.

శ్రీశైలం ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

- స్కూటీని ఢీకొని బోల్తా పడిన బొలెరో
- శ్రీశైల దేవస్థానం అర్చకుడు, మాచర్ల వార్డు వలంటీర్ దుర్మరణం

పెద్దదోర్నాల: బొలెరో వాహనం అదుపు తప్పి ఎదురుగా వస్తున్న స్కూటీని, లోయకు రక్షణగా వేసిన ఇనుప క్రాస్ వారియర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నంద్యాల జిల్లా శ్రీశైల పుణ్య క్షేత్రానికి చెందిన ఆలయ అర్చకులు చిలిమికోటి శివనాగ ప్రసాద్(40), పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన వార్డు వలంటీర్ కొరటా వెంకటేశ్ (36) దుర్మరణం చెందారు. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... మాచర్ల నుంచి ఆరుగురు వ్యక్తులు శ్రీశైల పుణ్యక్షేత్రానికి బొలెరో వాహనంలో శనివారం బయలుదేరారు. శ్రీశైలం ఘాట్ రోడ్డులో ఇష్టకామేశ్వరి ఆలయ ముఖద్వారం వద్ద బొలెరో వాహనం అదుపుతప్పి ఎదురుగా స్కూటీపై వస్తున్న అర్చకుడు శివనాగ ప్రసాద్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ తర్వాత రోడ్డు పక్కనే లోయకు రక్షణగా వేసిన క్రాస్ బారియర్‌ను బొలెరో ఢీ కొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో బొలెరో వాహనం వెనుక సీటులో ఉన్న కొరటాల వెంకటేష్ శరీరంలోకి క్రాస్ బారియర్ దూసుకెళ్లటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీనివాసరావు సిబ్బందితో అక్కడకు చేరుకుని ట్రాఫిక్ జామ్‌ను క్లియర్ చేసి, క్షతగాత్రులను సమీపంలోని శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇరువురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ఏరియా వైద్యశాలకు పంపించారు.

తెలంగాణ


ఎదురు కాల్పుల్లో మావోయిస్టు హతం

చింతలమానెపల్లి/కాళేశ్వరం: మహారాష్ట్రలోని ఏటపల్లి, భామ్రాగఢ్ సమీపంలో ఉన్న గట్ట అటవీప్రాంతంలో మహారాష్ట్ర పోలీసులు, మావోయిస్టులకు మధ్య శనివారం ఉదయం ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మావోయిస్టు సమీర్ అలియాస్ సాధులింగ మొహందా (31) మృతిచెందాడు. గడ్చిరోలి జిల్లా ఎస్పీ నీలోత్పల్ ఈ ఘటన వివరాలను వెల్లడించారు. మృతుడు భామ్రాగఢ్ తాలూకా తుమర్కోడి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. తప్పించుకున్న మావోయిస్టులకోసం గాలింపు కొనసాగిస్తున్నట్లు ఎస్పీ వివరించారు. మృతిచెందిన మావోయిస్టుపై రూ. 2 లక్షల రివార్డు ఉంది. మృతదేహాన్ని గడ్చిరోలి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

‘కొంప’ముంచిన ‘కార్తికేయ’

బోర్డు తిప్పేసిన మరో కోఆపరేటివ్ సొసైటీ

- 300 మంది డిపాజిటర్ల గగ్గోలు
- ‘మొత్తం’ పక్కదారి పట్టాయేమోనని అనుమానాలు
- అడ్డగోలుగా రూ.4.50 కోట్ల రుణాలు కూడా..
- విచారణకు సహకార శాఖ ఆదేశం



కాకినాడలోని ది కార్తికేయ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సహకార చట్టాలను చట్టుబండలు చేస్తూ కొన్ని కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీలు ఖాతాదారుల కొంప ముంచేస్తున్నాయి. కాకినాడ జయలక్ష్మి మ్యూచువల్లీ కోఆపరేటివ్ బ్యాంకు రూ.560 కోట్లకు బోర్డు తిప్పేసి, సుమారు 20 వేల మంది ఖాతాదారులకు కుచ్చుటోపీ పెట్టిన వ్యవహారం మరచిపోకుండానే మరో సంస్థ అయిన కార్తికేయ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ డిపాజిటర్ల సొమ్ములు తిరిగి ఇవ్వకుండా దాటవేస్తోంది. దీంతో వారందరూ లబోదిబోమంటున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ సొసైటీకి 300 మందికి పైగానే డిపాజిటర్లు ఉన్నారు. అత్యధికంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో ఉన్నారు. కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం నగరం గ్రామంలో ఒకే సామాజికవర్గానికి చెందిన సుమారు 100 మంది డిపాజిటర్లు తాము మోసపోయామంటూ పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. నగరంతో పాటు కోనసీమలో నాలుగైదు, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, మెట్ట ప్రాంతం, తూర్పు గోదావరి జిల్లాలోని పలు మండలాలకు చెందిన వారు ఈ సొసైటీలో డిపాజిట్లు చేశారు. పదిహేనేళ్ల క్రితం కాకినాడ ప్రధాన కూడలి నూకాలమ్మ ఆలయానికి సమీపాన సహకార రంగంలో కార్తికేయ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ ఏర్పాటైంది. ఇది డిపాజిట్ల రూపంలో రూ.12 కోట్లు సేకరించింది. రూ.5 కోట్ల వరకూ రుణాలూ ఇచ్చింది.

మెచ్యూరిటీ గడువు తీరినా..

ఇక ఈ డిపాజిట్లలో రూ.10 కోట్ల డిపాజిట్ల గడువు తీరిపోయింది. డిపాజిటర్లను రేపు మాపు అని బ్యాంకు సిబ్బంది నాలుగైదు నెలలుగా తిప్పి పంపేస్తున్నారు. దీంతో బాధితులు జిల్లా సహకార అధికారులకు ఫిర్యాదు చేశారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్‌వీఎస్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యాన ప్రాథమిక విచారణ జరిగింది. సొసైటీ ఇచ్చిన రుణాల్లో రూ.4.50 కోట్లకు సంబంధించి తనఖా కింద ఎటువంటి డాక్యుమెంట్లూ లేవని తేలింది. సొసైటీ ఆడిట్ కూడా ప్రైవేటు ఆడిటర్లతో నిర్వహిస్తున్నారు. మరోవైపు.. డిపాజిటర్లు సహకార అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. కానీ, డిపాజిట్లు, రుణాలకు సంబంధించిన రికార్డుల కోసం సహకార శాఖ సమన్లు జారీచేసినా సొసైటీ నిర్వాహకుల నుంచి సహాయ నిరాకరణ ఎదురవుతోంది. దీంతో ఈ మొత్తం వ్యవహారాన్ని నిగ్గు తేల్చేందుకు సహకార శాఖ విచారణకు ఆదేశించింది.

డిపాజిట్లు సరిచూసుకోవాలి



డిపాజిటర్లు తమ సొమ్ము సొసైటీ ఖాతాలో డిపాజిట్ అయ్యిందో లేదో నిర్ధారించుకోవాలి. సొసైటీ వద్ద విచారణాధికారి అందుబాటులో ఉన్నారు. సొమ్ము డిపాజిటర్ల ఖాతాలో జమకాకుంటే చర్యలు తీసుకుంటాం.
– దుర్గాప్రసాద్, జిల్లా సహకార అధికారి, కాకినాడ

రూ.7.80 లక్షలు డిపాజిట్ చేశాం



కార్తికేయ సొసైటీలో నేను, నా భార్య కలిసి రూ.7.8 లక్షలు డిపాజిట్ చేశాం. నాలుగేళ్ల పాటు వడ్డీ ఇచ్చారు. ఏడాది నుంచి ఇవ్వడంలేదు. సమాధానం కూడా చెప్పడం లేదు. దీనిపై నగరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం.
– సజ్జాద్ హుస్సేన్, బాధితుడు, నగరం

రూ.44 లక్షలు డిపాజిట్ చేశాం



ప్రలోభాలకు గురిచేసి మాతో ఈ బ్యాంకులో డిపాజిట్ చేయించారు. నగరం నుంచి సుమారు రూ.7 కోట్లు డిపాజిట్ చేశారు. మా కుటుంబ సభ్యులు రూ.44 లక్షలు డిపాజిట్ చేశాం. బాధ్యులపై చర్యలు తీసుకుని, మా సొమ్ములు మాకు ఇప్పించాలి.
– అన్వర్ తాహిర్ హుస్సేన్, బాధితుడు, నగరం

తెలంగాణ

గూడ్స్ రైలు కింద నుంచి దాటబోతూ..

- రైలు కదలడంతో గాయాలు.. తప్పిన ప్రాణాపాయం

ఎర్రుపాలెం: రైల్వేస్టేషన్‌లో ఆగిన గూడ్స్ కింద నుంచి ప్లాట్‌ఫాం దాటాలనే యత్నంలో.. రైలు కదలడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలివి... ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాల గ్రామానికి చెందిన ఆకుల పెద్దబాబు (58) తన కుటుంబసభ్యులతో కలిసి ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం రైల్వే స్టేషన్‌కు శుక్రవారం వచ్చారు. టికెట్ తీసుకోవడం కోసం మరో ప్లాట్‌ఫాంపై ఉన్న కౌంటర్ వద్దకు వెళ్లేందుకు ఆయన ఆగిన గూడ్స్ రైలు కింద నుంచి దాటే యత్నం చేశాడు. ఈక్రమంలో అకస్మాత్తుగా గూడ్స్ కదలడంతో ప్రయాణికులు అరుస్తూ.. కింద పడుకోవాలని సూచించగా పెద్దబాబు అలాగే చేశారు. అనంతరం ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ రైలును ఆపేశాడు. స్టేషన్‌లో ఉన్న వారు పెదబాబును బయటకు లాగగా ప్రాణాపాయం తప్పినప్పటికీ.. ఆయన ఎడమ చేతికి తీవ్రగాయాలు కావడంతో విజయవాడ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ఘటను వీడియో తీసిన పలువురు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయగా వైరల్ అయింది.



గూడ్స్ కింద పడుకున్న పెద్దబాబు

గజ గజా.. పులి పంజా



గడిచిన రెండేళ్లలో ఏనుగులు, పులుల దాడుల్లో వందలాది మంది మృతి

- మహారాష్ట్ర, ఒడిశాలో అత్యధిక మరణాలు
- కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ గణాంకాల వెల్లడి

సాక్షి, అమరావతి: గత రెండేళ్లలో దేశవ్యాప్తంగా పులుల దాడుల్లో 163 మంది మృతి చెందారు. 2021లో 57 మంది మరణించగా 2022లో 105 మంది ప్రాణాలు కోల్పోయినట్లు కేంద్ర అటవీ శాఖ వెల్లడించింది. అత్యధికంగా మహారాష్ట్రలో 116 మంది మృత్యువాత పడ్డారు. ఇక ఏనుగుల దాడుల్లో మూడేళ్లలో 1,581 మంది చనిపోయారు. అత్యధికంగా ఒడిశాలో 322 మంది, జార్ఖండ్‌లో 291 మంది, పశ్చిమ బెంగాల్‌లో 240 మంది గజరాజుల క్రోధాగ్నికి బలయ్యారు.

- 2018 గణాంకాల ప్రకారం దేశంలో పులులు సంఖ్య 2,967 కాగా 2017 అంచనాల ప్రకారం ఏనుగుల సంఖ్య 29,964 అని కేంద్ర అటవీ శాఖ తెలిపింది.
- ఏనుగుల సంచారాన్ని పర్యవేక్షించడం తోపాటు నీటి వనరుల సంరక్షణ, చెట్లు నాటడం, స్థానిక ప్రజలను హెచ్చరించడం లాంటి చర్యలను అటవీశాఖ చేపడుతోంది. ఏనుగుల ఆవాసాలను ‘ఎలిఫెంట్ రిజర్వ్’ ప్రాంతంగా ప్రకటించి జాగ్రత్తలు తీసుకుంటోంది.
- ఏనుగుల దాడిలో మరణించిన వారి కుటుంబాలకు ఇచ్చే పరిహారాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు ప్రభుత్వం పెంచింది.

2021, 2022లో పులుల దాడుల్లో మృతులు

రాష్ట్రం	మృతుల సంఖ్య
బిహార్	6
కర్ణాటక	2
మధ్యప్రదేశ్	1
మహారాష్ట్ర	116
తమిళనాడు	3
ఉత్తరప్రదేశ్	25
ఉత్తరాఖండ్	4
పశ్చిమ బెంగాల్	6



2019-20 నుంచి 2021-22 వరకు ఏనుగుల దాడుల్లో మృతులు

రాష్ట్రం	మృతుల సంఖ్య
ఆంధ్రప్రదేశ్	10
అరుణాచల్‌ప్రదేశ్	2
అస్సాం	229
ఛత్తీస్‌గఢ్	183
జార్ఖండ్	291
కర్ణాటక	69
కేరళ	57
మహారాష్ట్ర	1
మేఘాలయ	13
ఒడిశా	322
తమిళనాడు	152
త్రిపుర	5
ఉత్తరప్రదేశ్	7
పశ్చిమ బెంగాల్	240

2017 అంచనా ప్రకారం ఏనుగుల సంఖ్య

రాష్ట్రం	ఏనుగుల సంఖ్య	రాష్ట్రం	ఏనుగుల సంఖ్య
అరుణాచల్‌ప్రదేశ్	1,614	మధ్యప్రదేశ్	7
అస్సాం	5,719	పశ్చిమ బెంగాల్ (సౌత్ రీజన్)	194
మేఘాలయ	1,764	ఉత్తరాఖండ్	1,839
త్రిపుర	102	ఉత్తరప్రదేశ్	232
నాగాలాండ్	466	హరియాణ	7
పశ్చిమబెంగాల్ (నార్త్ రీజన్)	488	హిమాచల్‌ప్రదేశ్	7
మణిపూర్	9	కర్ణాటక	6,049
మిజోరాం	7	కేరళ	5,706
ఒడిశా	1,976	మహారాష్ట్ర	6
జార్ఖండ్	679	ఆంధ్రప్రదేశ్	65
ఛత్తీస్‌గఢ్	247	అండమాన్ నికోబార్	25
బిహార్	25	తమిళనాడు	2,761

తెలంగాణ

ఇక తిరుపతికి ఎనిమిదిన్నర గంటల్లోనే..

- వారంలో అందుబాటులోకి ‘వందే భారత్’
- సికింద్రాబాద్‌లో ఉదయం 6కి బయలుదేరి మధ్యాహ్నం రెండున్నరకల్లా తిరుపతికి
- 8న ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- నల్లగొండ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరులో ఆగనున్న రైలు



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి తిరుపతి రైలు ప్రయాణాలకు పడుతున్న 12 గంటల సమయాన్ని ఎనిమిదిన్నర గంటలకు కుదిస్తూ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ దూసుకొస్తోంది. ఈ నెల 8న సికింద్రాబాద్‌లో ప్రధాని మోదీ ఈ రైలును జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఇప్పటికే సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య ఓ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సంక్రాంతి రోజున ప్రారంభమై విజయవంతంగా సేవలందిస్తుండగా ఇప్పుడు దక్షిణమధ్య రైల్వేకు రెండో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి రాబోతోంది. మొదటి రైలును ప్రధాని స్వయంగా వచ్చి ప్రారంభించాల్సి ఉన్నా అనివార్య కారణాలతో రాలేకపోయారు. ఇప్పుడు రెండో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించేందుకు ఆయన నగరానికి రానున్నారు. దాంతోపాటు నగరంలో ఎంఎంటీఎస్ రెండో దశకు సంబంధించి ఫలక్‌నుమా-ఉందా నగర్, సికింద్రాబాద్-మేడ్చల్ సర్వీసులను కూడా ప్రారంభించనున్నారు. అలాగే సికింద్రాబాద్ స్టేషన్ పునరాభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతోపాటు సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ మధ్య పూర్తయిన డబ్లింగ్ ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఉదయం బయలుదేరి మధ్యాహ్నానికి తిరుపతికి..

ప్రస్తుతం రాష్ట్రం నుంచి తిరుమల వెళ్లే భక్తుల కోసం 8 రైళ్లు అందుబాటులో ఉన్నాయి. వెంకటాద్రి, నారాయణాద్రి, సెవెన్‌హిల్స్, పద్మావతి, రాయలసీమ, కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లతోపా టు ఢిల్లీ-తిరుపతి మధ్య నడిచే ఏపీ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ నుంచి తిరువనంతపురం వెళ్లే శబరి ఎక్స్‌ప్రెస్‌లు తిరుమల యాత్రికులకు సేవలందిస్తున్నాయి. గతంలో కొంతకాలం డబుల్ డెక్కర్ రైలు నడిచినా ప్రయాణికుల ఆదరణ అతి తక్కువగా ఉండటంతో దాన్ని రద్దు చేశారు. ఇప్పుడు నగరం నుంచి తిరుపతికి తొమ్మిదో రైలుగా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం అవుతోంది. మిగతా రైళ్లు నగరం నుంచి తిరుపతికి వెళ్లేందుకు సగటున 12 గంటల సమయం తీసుకుంటున్నాయి. కానీ ఈ రైలు కేవలం ఎనిమిదిన్నర గంటల్లోనే గమ్యానికి చేరుకోనుండటం విశేషం. ప్రస్తుతానికి తాత్కాలికంగా రైల్వే అధికారులు పేర్కొంటున్న వేళల ప్రకారం ఉదయం 6 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌లో బయలుదేరి మధ్యాహ్నం 2:30 గంటలకల్లా తిరుపతికి చేరుకుంటుంది. ఉదయం 6 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరే కృష్ణా (ఆదిలాబాద్‌లో రాత్రి బయలుదేరి) ఎక్స్‌ప్రెస్ తిరుపతికి వెళ్లేసరికి రాత్రి పదిన్నర దాటుతోంది. ఈ నేపథ్యంలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

వేగంగా వెళ్లేందుకే ఆ మార్గం ఎంపిక..

కొత్త వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నల్లగొండ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు మీదుగా తిరుపతి వెళ్లనుంది. వందేభారత్ రైళ్ల వేగం ఎక్కువగా ఉండనున్నందున, 130 కి.మీ. వేగాన్ని తట్టుకొనేలా పటిష్టం చేసిన ట్రాక్‌నే కేటాయిస్తున్నారు. ఆ తరహా ట్రాక్ ప్రస్తుతం తిరుపతి మార్గంలో ఇదొక్కటే. దీంతో ఆ మార్గాన్ని ఎంపిక చేశారు. అయితే బీబీనగర్-నడికుడి మధ్య ఉన్నది కేవలం బ్రాంచి లైనే. అది కూడా సింగిల్ లైన్. దీన్ని 130 కి.మీ. వేగానికి పటిష్టం చేయలేదు. దాదాపు 175 కి.మీ. మేర ఉన్న ఈ మార్గంలో మాత్రం వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నెమ్మదిగా వెళ్లాల్సిందే. గుంటూరు-తెనాలి మధ్య ఉన్నది కూడా బ్రాంచి లైనే. ఈ ట్రాక్ సామర్థ్యాన్ని సైతం పెంచలేదు. అయితే ఇటీవలే సింగిల్ లైన్‌ను డబుల్ లైన్‌గా మార్చారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు గంటకు 160 కి.మీ. నుంచి 200 కి.మీ. వేగంతో ప్రయాణించగల సామర్థ్యం ఉన్నా మన ట్రాక్ పరిస్థితి, మలుపుల దృష్ట్యా సగటున గంటకు 77 కి.మీ. వేగంతోనే ఈ రైలు ప్రయాణించనుంది.

తక్కువ కోచ్‌లే..

విశాఖకు నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో 16 కోచ్‌లు ఉండగా తిరుపతి రైలులో ఆ సంఖ్య 9 లేదా 10గా ఉండనున్నట్లు సమాచారం. ఈ రైలు టికెట్ ధర ఎక్కువగా ఉండ నున్నందున అంత మొత్తాన్ని భరించలేనివారు ఇతర రైళ్లవే పే మొగ్గు చూపుతారన్న ఉద్దేశంతో తొలుత తక్కువ కోచ్‌లతోనే రైలును నడపాలని అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. రద్దీ ఎక్కువగా ఉంటే, తర్వాత కోచ్‌ల సంఖ్య పెంచనున్నట్టు సమాచారం. ఈ రైలు గుంటూరులో 5 నిమిషాలు, మిగతా చోట్ల నిమిషం చొప్పున మాత్రమే ఆగుతుంది. అ యితే ఈ నెల 8న ప్రారంభోత్సవం రోజున సాధారణ ప్రయాణికులను అనుమతించరు. ఆ రోజు సికింద్రాబాద్‌లో ఉదయం 11:30కు బయలుదేరుతుందని సమాచారం.

సికింద్రాబాద్ టు తిరుపతి			తిరుపతి టు సికింద్రాబాద్	
అరైవల్	డిపార్చర్	స్టేషన్	అరైవల్	డిపార్చర్
-	ఉ.6:00	సికింద్రాబాద్	రా.11:45	-
7:19	7:20	నల్లగొండ	10:10	10:11
9:45	9:50	గుంటూరు	7:45	7:50
11:09	11:10	ఒంగోలు	6:30	6:31
12:29	12:30	నెల్లూరు	5:20	5:21
2:30	--	తిరుపతి	--	3:15

తెలంగాణ



కార్యాలయాలకు వెళ్లేందుకే అత్యధిక శాతం టెకీల మొగ్గు
మారిన పరిస్థితుల్లో 86 శాతం మంది ఉద్యోగులది ఇదే అభిప్రాయం
కొలీగ్స్‌తో కలిసి పని చేయాలనుకుంటున్న 78% మంది
వర్క్ ఫ్రం హోంలో ‘చాయ్ బ్రేక్ బాండింగ్’ మిస్సవుతున్నామని వెల్లడి
కెరీర్ గ్రోత్ తగ్గిపోతుందనే భావనలో 63% ఉద్యోగులు
లింక్డ్ ఇన్ నివేదిక స్పష్టీకరణ

ఆఫీసుకు వచ్చేస్తాం..

సాక్షి, హైదరాబాద్: మళ్లీ ఆఫీసుల్లో ప్రత్యక్షంగా విధుల నిర్వహణకు ఉద్యోగులు సై అంటున్నారు. సహోద్యోగులతో సరదా సంభాషణలు, మాట్లాడుతూనే విధులు నిర్వర్తించడం, అంతా కలిసి కాఫీ, టీ బ్రేక్‌లు తీసుకోవడం, వీకెండ్ ఎంజాయ్‌మెంట్‌లు..ఆ మజానే వేరు అని అధికశాతం మంది అభిప్రాయపడుతున్నారు. కోవిడ్ మహమ్మారి కారణంగా ప్రత్యక్ష, పరోక్ష రూపాల్లో తలెత్తిన పరిస్థితులతో ఐటీ కంపెనీలు మూడేళ్లకు పైగా వర్క్ ఫ్రం హోం, ఇటీవలి కాలంలో హైబ్రిడ్, ఇతర పని విధానాలు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. కొన్ని కంపెనీలు ఇప్పటికీ వర్క్ ఫ్రం హోంనే కొనసాగిస్తుండగా, మూన్‌లైటింగ్ (2 లేదా అంతకు మించి ఉద్యోగాలు చేయడం) వెలుగులోకి రావడంతో కొన్ని కంపెనీలు హైబ్రిడ్ విధానాన్ని చేపట్టాయి. మరికొన్ని ఉద్యోగుల్ని పూర్తిగా ఆఫీసులకు రప్పిస్తున్నాయి. హైబ్రిడ్ విధానంలో టెకీలు 2,3 రోజులు ఆఫీసుకు వెళుతూ, మిగతా రోజుల్లో ఇంటి నుంచి పని చేస్తున్నారు. అయినప్పటికీ 86 శాతం మంది భారతీయ వృత్తి నిపుణులు, టెకీలు రెగ్యులర్‌గా ఆఫీసుకు వెళ్లడం పైనే ఆసక్తి కనబరుస్తున్నట్లు తేలింది. రోజూ ప్రత్యక్షంగా తమ తోటి ఉద్యోగుల్ని కలుసుకోవాలని, వారితో స్నేహ సంబంధాలు కొనసాగించాలని 78% కోరుకుంటున్నట్లు వెల్లడైంది. ఆఫీసులకు వెళితే మనోబలం, మానసికస్థైర్యం పెరుగుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. ‘సెన్సస్ వైడ్’అధ్యయనం ఆధారంగా ప్రొఫెషనల్ నెట్ వర్కింగ్ సైట్ లింక్డ్ ఇన్ రూపొందించిన తాజా నివేదికలో పలుఅంశాలు వెల్లడయ్యాయి.

నివేదికలో ముఖ్యాంశాలు...

- వర్క్ ప్లేసెస్‌లో ‘చాయ్ బ్రేక్ బాండింగ్’ (కలిసి టీ తాగే మంచి సమయం) మిస్సవుతున్నామన్న 72 శాతం మంది.
- వర్క్ ఫ్రం హోం విధానానికే పరిమితమైతే ‘కెరీర్ గ్రోత్’(వృత్తి పరమైన ఎదుగుదల) తగ్గిపోతుందనే భావనలో 63% ఉన్నారు.
- ఆఫీసులో గురువారం కల్లా మొత్తం పని పూర్తిచేసుకుని, ఆ రోజునే ‘న్యూ ఫ్రైడే’గా మార్చుకోవాలని, శుక్రవారం ఆఫీసుకు వెళ్లకుండా లాంగ్ వీకెండ్ గడపాలని 79 శాతం మంది కోరుకుంటున్నారు.
- శుక్రవారాల్లో మరింత ఎక్కువ సమయం కుటుంబం, మిత్రులతో గడపాలని 50 శాతం మంది భావిస్తున్నారు.
- రిమోట్ వర్కింగ్ పద్ధతి వల్ల తమ వృత్తులపై ప్రతికూల ప్రభావం పడలేదని 63 శాతం మంది పేర్కొన్నారు.
- కేవలం కొలీగ్స్‌తో సోషల్ ఇంటరాక్షన్ కోసం ఆఫీసుకు వెళ్లాలనుకుంటున్నట్లు 43 శాతం మంది చెప్పారు.
- సహోద్యోగులతో ముఖాముఖి, ఆఫీసు మీటింగ్‌లు మరింత కార్యదక్షతతో పని చేసేందుకు దోహదపడతాయని 42 శాతం మంది చెప్పారు. మంచి స్నేహ సంబంధాలు పెరుగుతాయని 41 శాతం మంది అభిప్రాయపడ్డారు.
- శని, ఆదివారాల బ్రేక్ తర్వాత మొదలయ్యే సోమవారాన్ని ‘మోస్ట్ ఫోకస్డ్ డే’గా 39% మంది పేర్కొన్నారు.

నైతిక బలం పెరుగుతుందని విశ్వసిస్తున్నారు



వృత్తి నిపుణులు, టెకీల వంటి వారు ఫ్లెక్సిబుల్ పని విధానాన్ని కోరుకుంటున్నారు. అదే సమయంలో ఆఫీసులకు రావడానికి అత్యంత ప్రాధాన్యతనివ్వడంతో పాటు టీమ్‌వర్క్ ద్వారా తమ నైతిక బలం పెరుగుతుందని విశ్వసిస్తున్నారు. చాయ్ బ్రేక్‌లు, కొలీగ్స్‌తో సరదా చర్చలు తమను చైతన్యపరచడంతో పాటు మరింత మెరుగైన ఫలితాల సాధనకు దోహదపడతాయని భావిస్తున్నారు. – నిరజిత బెనర్జీ, లింక్డ్‌ఇన్(ఇండియా) మేనేజింగ్ ఎడిటర్

పెళ్లి చేసుకున్న యువతి కాదందని..

బీబీపేట /కామారెడ్డి టౌన్ : ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతి కాదనడంతో పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో కుటుంబసభ్యులు, బంధువులు రోడ్డుపై ఆందోళన నిర్వహించారు. కామారెడ్డి జిల్లా లో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం జనగామ గ్రామానికి చెందిన దండుగుల వరప్రసాద్ (25) మండల కేంద్రంలోని ఓ యువతి ఒకరినొకరు ప్రేమించుకుని ఫిబ్రవరి 24న పెళ్లి చేసుకున్నారు. పోలీసులను ఆశ్రయించడంతో ఇరు కుటుంబాల పెద్దలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి మళ్లీ పది రోజుల తర్వాత రమ్మన్నారు. మనసు మార్చుకున్న యువతి తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన వరప్రసాద్ గతనెల 24న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. దీంతో మృతుడి బంధువులు ఆస్పత్రి ముందు రోడ్డుపై ధర్నాకు దిగడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. పోలీసులు ఆందోళనకారులను సముదాయించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. వరప్రసాద్ మృతికి ఎస్సై సాయికుమారే కారణమని, ప్రేమజంటను విడదీశాడని ఆరోపిస్తూ బీబీపేటలో పోలీసుస్టేషన్‌కు వెళ్లే దారిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వరప్రసాద్ చికిత్స పొందుతు న్న సమయంలో అమ్మాయి తల్లిదండ్రులు, ఎస్సై తీరుతోనే తాను ఆత్మహత్యాయత్నం చేశానని మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

‘కేసీఆర్ సర్కార్ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి’

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ సభ్యులపై చర్యలు తీసుకునే అధికారం రాష్ట్రపతికి మాత్రమే ఉంటుందని, వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతికి లేఖ రాసి కేసీఆర్ సర్కార్ నిరుద్యోగుల పట్ల తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి డిమాండ్ చేశారు. గతంలో ఇలాంటివి చోటుచేసుకున్నపుడు కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం ఇదేవిధంగా లేఖలు రాసిందని, తదనుగుణంగా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజ్ వ్యవహారంపై ప్రభుత్వం సిట్ వేయలేదని ప్రస్తుతం విచారణ చేస్తున్న సిట్ కేవలం పోలీసులు వేసుకున్నదేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. టీఎస్‌పీఎస్సీ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ అని, ఆ సంస్థ చైర్మన్‌ను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఇంటికి ఎందుకు పిలిపించుకున్నారని ప్రశ్నించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943